ఈనాడు

విజయవాడ 4-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 325

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 4-7-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 325
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఒక్కడే 269



- శుభ్‌మన్ భారీ ద్విశతకం
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587
- ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు

బర్మింగ్‌హామ్: ఇంగ్లిష్ వాతావరణంలో.. బౌన్స్, స్వింగ్ ఉండే పిచ్‌లపై నిలిచి సెంచరీ కొట్టడమే గొప్ప.. అలాంటిది ఒక్కడే 269 పరుగులు చేస్తే! శుభ్‌మన్ గిల్ (269; 387 బంతుల్లో 30×4, 3×6) ఆ ఘనతే సాధించాడు. చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో భారత బ్యాటింగ్ భారాన్ని భుజ స్కంధాలపై మోసి జట్టును బలమైన స్థితిలో నిలిపాడు. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మారథాన్ ఇన్నింగ్స్ ఆడిన భారత కెప్టెన్.. విదేశీ గడ్డపై అత్యధిక స్కోరు సాధించిన భారత తొలి సారథిగా రికార్డు సృష్టించాడు. అతడికి టెస్టుల్లో ఇదే తొలి ద్విశతకం. శుభ్‌మన్ డబుల్ సెంచరీతో టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోరు చేసింది.

వివరాలు ఛాంపియన్ లో..

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ గేదెల



కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి పదవికి న్యాయవాదుల కోటా నుంచి తుహిన్ కుమార్ గేదెల పేరును సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో సమావేశమైన కొలీజియం తుహిన్ కుమార్‌ను ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించాలన్న ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసినట్లు సుప్రీంకోర్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన కొలీజియం సమావేశంలో న్యాయాధికారులు, అడ్వొకేట్ల కోటా నుంచి 8 హైకోర్టులకు 36 మంది పేర్లను సిఫారసు చేసింది.

పార్వతీపురం మన్యం జిల్లా నుంచి..

తుహిన్ కుమార్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా (ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా) వీరఘట్టం మండలం కత్తుల కవిటి గ్రామానికి చెందినవారు. (మిగతా 12లో)

గత పాలకులు ఎప్పుడైనా అన్నదాతలను ఆదుకున్నారా?

- మామిడి కిలోకు అదనంగా రూ.4 ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం
- 90 శాతం రాయితీతో బిందుసేద్యం పరికరాలు ఇస్తున్నాం
- వైకాపా నేతలు రాష్ట్రానికి పెనుసవాల్‌గా మారారు
- రాజకీయాల్లో చీడపురుగుల్లా తయారయ్యారు
- కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- తెలంగాణ ప్రాజెక్టులకు తాను వ్యతిరేకం కాదని స్పష్టీకరణ



కుప్పం ప్రభుత్వాసుపత్రిలో టాటా నెర్వ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్ కుమార్, టాటా సంస్థ ప్రతినిధి గిరీష్ కృష్ణమూర్తి, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ఈనాడు – చిత్తూరు

'మాది బాధ్యత ఉన్న ప్రభుత్వం. ఏ సమస్యనూ నిర్లక్ష్యం చేయడం లేదు. అన్నింటినీ సమర్థంగా పరిష్కరిస్తున్నాం. గత పాలకులు అన్నదాతలను ఆదుకున్నారా? బిందు, తుంపర సేద్యం పరికరాల పంపిణీ ఆపేశారు. చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని మేం అదనంగా కిలోకు రూ.4 ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. రూ.250 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడుతున్నా కర్షకుల కోసం భరిస్తున్నాం. 90 శాతం రాయితీతో బిందుసేద్యం పరికరాలు ఇస్తున్నాం. ఒక్క ఏడాదిలోనే హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టుపై రూ.3,950 కోట్లు ఖర్చు చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన చిత్తూరు జిల్లా శివపురంలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా అధినేత జగన్ ఈ నెల 9న చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వచ్చి రైతులతో మాట్లాడతారన్న వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. మామిడిపై తప్పుడు ప్రచారానికి దిగారని మండిపడ్డారు. అప్పట్లో వివేకానందరెడ్డిని హత్య చేయించి (మిగతా 12లో)

కుప్పంలో డిజిటల్ నెర్వ్ కేంద్రం

ప్రారంభించిన సీఎం చంద్రబాబు

ఇది వైద్య, ఆరోగ్య రంగంలో గేమ్‌ఛేంజర్ అవుతుందని వ్యాఖ్య

మైక్రోసాఫ్ట్ - టాటా సంస్థల సహకారంతో ప్రారంభించిన డిజిటల్ నెర్వ్ కేంద్రం వైద్య, ఆరోగ్య రంగంలో గేమ్ ఛేంజర్ అవుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రోగుల వైద్య రికార్డులను ఆసుపత్రులతో అనుసంధానించి మెరుగైన వైద్యం (మిగతా 12లో)

విశాఖ.. టెక్ పతాక



రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీ రాకతో మారనున్న రూపురేఖలు

- సాగర తీరానికి దిగ్గజ సంస్థలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ రాక
- రాబోయే 6 నెలల్లో 15 సంస్థలు వచ్చే అవకాశం
- చిన్నా పెద్దా కలిపి విశాఖలో ఇప్పటికే 150 ఐటీ కంపెనీలు

ఈనాడు – అమరావతి

అమరావతిలో ఏర్పాటు కాబోతున్న క్వాంటమ్ వ్యాలీ.. విశాఖ నగర గమనాన్నే మార్చబోతోంది. వచ్చే ఏడాది జనవరిలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభమవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ప్రధానంగా విశాఖ, విజయవాడ నగరాలు సాంకేతికంగా అభివృద్ధి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు. క్వాంటమ్ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే ఇంజినీర్లకు శిక్షణ కేంద్రంగా విశాఖ మారనుంది. బ్యాక్ఎండ్ సాఫ్ట్‌వేర్ తయారీ వంటి కార్యకలాపాలు పెరుగుతాయి. కొన్నేళ్ల తర్వాత అందుబాటులోకి వచ్చే క్వాంటమ్ టెక్నాలజీ కోసం ఇప్పటి నుంచే పనిచేయాలి. క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ తయారు చేసే పనిని సంస్థలు ఇప్పటి నుంచే మొదలుపెడతాయి. డేటా సెంటర్, దానికి సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లు.. సాఫ్ట్‌వేర్ తయారీ సంస్థలు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తాయని నిపుణుల అంచనా. ఇప్పటికే విశాఖలో (మిగతా 12లో)

గూగుల్

విశాఖలో కృత్రిమ మేధ (ఏఐ) డేటా సెంటర్, క్లౌడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థకు ప్రభుత్వం మధురవాడలో 80 ఎకరాలు కేటాయించింది. సుమారు 10 వేల మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ సర్టిఫికేషన్, మెంటార్‌షిప్ ద్వారా అంకుర సంస్థలకు మద్దతు, క్లౌడ్ క్రెడిట్స్, వైద్య రంగంలో ఏఐ ఆధారంగా పరిష్కారాలు చూపేందుకు అంగీకరించింది.

టీసీఎస్

విశాఖలో ఐటీ క్యాంపస్ ఏర్పాటు కోసం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ.1,370 కోట్లు పెట్టుబడి పెట్టి 12 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇందుకోసం ఐటీ హిల్-3లో 22 ఎకరాలను 99 పైసలకు ప్రభుత్వం కేటాయించింది. సొంత భవనాలు నిర్మించే వరకు కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మధురవాడ ఐటీ హిల్-2లో భవనాన్ని టీసీఎస్‌కు సబ్ లీజుకు ఇచ్చేందుకూ అనుమతించింది.

కాగ్నిజెంట్

కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సీటీఎస్) రూ.1,583 కోట్ల పెట్టుబడితో విశాఖలో అత్యాధునిక క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా సుమారు 8 వేల మందికి ఉపాధి లభించనుంది. ఆ సంస్థకు మధురవాడ దగ్గర 22.19 ఎకరాలను 99 పైసలకు ప్రభుత్వం కేటాయించింది. 2029 జూన్ నాటికి మొదటి దశ క్యాంపస్ నిర్మాణాన్ని కాగ్నిజెంట్ పూర్తి చేయనుంది.

ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్

విశాఖలో డేటా సెంటర్, ఐటీ ఆఫీస్ స్పేస్ ఏర్పాటుకు రూ.5,278 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో ఈ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 2,500 మందికి ఉపాధి కల్పించనుంది. ఈ సంస్థకు ప్రభుత్వం కాపులుప్పాడ దగ్గర 56.5 ఎకరాలను ఎకరా రూ.50 లక్షల చొప్పున.. ఐటీ హిల్-3లో 3.5 ఎకరాలను ఎకరా రూ.కోటి చొప్పున కేటాయించింది.

కొంప ముంచే కొవ్వు ఉప్పెన!

లావుగా ఉన్నా.. జబ్బులేమీ లేవు కాబట్టి ఫర్వాలేదు అనుకుంటారు కొందరు.

చూడ్డానికి సన్నగానే ఉన్నా... నడుము చుట్టూ కొవ్వుతో ఉంటారు మరికొందరు.



...నిజానికి ఇవి రెండూ ఉదాసీనంగా ఉండాల్సిన విషయాలు కావని చెబుతున్నారు వైద్య నిపుణులు. లావుగా, సన్నగా ఉండడం కాదు... శరీరంలో కొవ్వు మోతాదు ఎంతన్నది ప్రధానమైన అంశమని వివరిస్తున్నారు. అధికంగా ఉన్న కొవ్వు శరీరంలో ఉన్నట్టుండి ఉప్పెన సృష్టిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై లాన్సెట్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన అధ్యయన పత్రం సరికొత్త వివరాలను వెలుగులోకి తెచ్చింది. మరి ఈ కొవ్వు ఉప్పెనకు అడ్డుకట్ట వేయాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలి..?

- ప్రత్యేక కథనం 2లో

ఒక్కొక్కరి అంతు తేలుస్తా!

- సిట్ కార్యాలయం ఎదుటే ఇల్లు తీసుకుని.. మీ లెక్కలు చూస్తా
- దర్యాప్తు అధికారులకు చెవిరెడ్డి బెదిరింపులు
- విచారణలో సమాధానాలు చెప్పకుండా కేకలు
- దురుసు ప్రవర్తనంతా సీసీ కెమెరాల్లో రికార్డు
- ముగిసిన మూడు రోజుల కస్టడీ
- 200కు పైగా ప్రశ్నలడిగినా ఒక్కదానికీ జవాబివ్వని చెవిరెడ్డి



విచారణ అనంతరం చెవిరెడ్డిని కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: 'సిట్‌లో ఎవరెవరు పనిచేస్తున్నారో.. మీ చరిత్రలేంటో నాకు అన్నీ తెలుసు. మీ అందరి అంతు తేలుస్తా' అంటూ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సిట్ అధికారులను బెదిరించినట్లు సమాచారం. 'త్వరలోనే జైలు నుంచి బయటకొస్తా. సిట్ కార్యాలయం ఎదుటే అద్దెకు ఇల్లు తీసుకుంటా. ఇక్కడే ఉండి, మీ లెక్కలు చూస్తా' అంటూ హెచ్చరించినట్లు తెలిసింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి మూడు రోజుల సిట్ కస్టడీ గురువారం సాయంత్రంతో ముగిసింది. దర్యాప్తు బృందాలు మూడు రోజుల్లో 200కు పైగా ప్రశ్నలు అడగ్గా.. ఆయన ఏ ఒక్కదానికీ సరైన సమాధానమివ్వలేదు. పైగా దర్యాప్తు అధికారులను బెదిరించి, హెచ్చరించినట్లుగా సమాచారం. విచారణకు సహకరించకుండా పెద్దపెద్దగా కేకలు వేసినట్లు, దర్యాప్తు అధికారులను శాపనార్థాలు పెట్టినట్లు తెలిసింది. ఆయన దురుసు ప్రవర్తనంతా సీసీ కెమెరాల్లో రికార్డైంది. ఈ ఫుటేజ్‌ను సిట్ అధికారులు న్యాయస్థానానికి సమర్పించనున్నారు.

మీ కస్టడీలో మేం లేం.. మా కస్టడీలోనే మీరున్నారు

సిట్ అధికారులు ఎంత ఓపిగ్గా ప్రశ్నించినా.. 'మీరడిగిన దానికి నేను సమాధానం చెప్పను. నేను చెప్పేదే మీరు రాసుకోండి' అంటూ చెవిరెడ్డి రంకెలు వేశారు. ఆయన విచారణకు సహకరించకపోవటంతో ఓ దశలో సిట్ అధికారులూ తీవ్రంగానే స్పందించినట్లు సమాచారం. 'మీరడిగిన దానికి సమాధానం (మిగతా 12లో)

జైల్లో చెవిరెడ్డి రంకెలు

సెల్ తలుపును తన్నుతూ తీవ్ర ఆగ్రహం 12లో

తన అనుచరులను గుంటూరు జైలుకు తరలించడంపై చిందులు

సహనం కోల్పోయి విపరీతంగా ప్రవర్తిస్తున్న వైకాపా నేత

విద్యుత్తునూ నిల్వ చేసుకోవచ్చు!



తొలిదశలో రాష్ట్రంలో మూడుచోట్ల బ్యాటరీ విద్యుత్ స్టోరేజ్ ప్రాజెక్టులు

బిడ్డింగ్ ప్రక్రియ పూర్తి ● పీక్ డిమాండ్ వేళల్లో అందుబాటులోకి విద్యుత్

- సూర్య కాంతితో విద్యుత్ ఉత్పత్తి చేయడం అంటే.. మొదట్లో అదెలా సాధ్యం? అనే సందేహం ఉండేది. ఇప్పుడు మన ఇంటి పైనే సౌర ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నాం.
- గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే 'విండ్ మిల్స్' ఏర్పాటు చేసిన కొత్తలో ఎంత పెద్ద ఫ్యాన్‌లో అని ఆశ్చర్యంగా అనిపించేది. ఆ సాంకేతికత ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో ఒక భాగంగా మారింది.
- ఇప్పుడు సరికొత్త సాంకేతికత ప్రజలకు పరిచయం కాబోతోంది. విద్యుత్‌ను నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకునేందుకు వీలుగా 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం' (బెస్) సాంకేతికత రాష్ట్ర ప్రజలకు పరిచయం కాబోతోంది. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఇదొక మైలురాయిగా మారనుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. మన రాష్ట్రంలో 2,000 మెగావాట్ల 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం' (బెస్) ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది. వీటికి వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్)ను కేంద్రం అందిస్తుంది. ఈ ప్రాజెక్టులను సమన్వయం చేసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ)కు అప్పగించింది. తొలి విడత వెయ్యి మెగావాట్ల (రెండు సైకిల్స్‌లో) బెస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఎన్‌హెచ్‌పీసీ టెండర్లు పిలిచింది. ఈ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు పెద్ద సంస్థలు పోటీ పడటమే కాకుండా.. తక్కువ ధరను కోట్ చేయడం గమనార్హం. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు, కర్నూలు జిల్లా గని, చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రాజెక్టులు ఏర్పాటు (మిగతా 12లో)

ఇదీ సంగతి!



ప్రతీసారి ఏం చెబుతారు సార్.. అందుకే ఇలా మార్చా!

నిద్రలో ఎగిరిపోకుండా ఉండటమే

పెద్ద సవాల్




అంతరిక్షం నుంచి భూమిని చూడటం అద్భుతం

ఇష్టమైన ఆహారం వెంట తెచ్చుకున్నాం

ఐఎస్ఎస్ నుంచి విద్యార్థులతో శుభాంశు

లఖ్‌నవూ, తిరువనంతపురం: అంతరిక్ష యాత్రలంటే అందరికీ ఆసక్తే. ఇక పిల్లలకైతే చెప్పేదేముంది! వ్యోమగాములు తినే ఆహారమేంటి? గురుత్వాకర్షణ లేని ప్రాంతంలో ఎలా నిద్రిస్తారు? ఒకవేళ ఎవరైనా అనారోగ్యానికి గురైతే పరిస్థితి ఏమిటి? రోదసిలో అడుగుపెట్టగానే ఏమనిపిస్తుంది?.. ఇలాంటి ఎన్నో ప్రశ్నలు వారి మదిని తొలిచేస్తుంటాయి. ఇలాంటివాటికి అంతరిక్షం నుంచే మనదేశ వ్యోమగామి శుభాంశు శుక్లా ఓపిగ్గా సమాధానాలు చెప్పేసరికి వారంతా ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఇటీవల అంతరిక్ష యాత్రకు వెళ్లి ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న శుక్లాతో గురువారం వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడేందుకు లఖ్‌నవూ, తిరువనంతపురం విద్యార్థుల్లో కొందరికి అవకాశం లభించింది. ఇస్రో కార్యక్రమాల్లో ఒకటైన 'విద్యార్థులతో మాటామంతీ' కార్యక్రమం దీనికి వేదిక అయింది. అంతరిక్షంలో మీరెలా నిద్రిస్తారని ఓ విద్యార్థి ప్రశ్నించాడు. "అబ్బో.. నిజానికి అది భలే తమాషాగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ గచ్చు, పైకప్పు అనే తేడా ఉండదు. మీరొకవేళ ఐఎస్ఎస్‌ను సందర్శిస్తే ఒకరు గోడపై, మరొకరు సీలింగుకు అతుక్కుని పడుకోవడాన్ని చూడవచ్చు! (మిగతా 12లో)

తుంగభద్ర పరవళ్లు



తుంగభద్ర పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి 36 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో గురువారం తుంగభద్ర డ్యాం 20 గేట్లను రెండున్నర అడుగులు పైకెత్తి 58,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 78.01 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో ఉన్న తుంగా జలాశయం కూడా నిండు కుండలా ఉండటంతో గేట్లను పైకెత్తి 34,990 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తుంగభద్రకు వరద పోటెత్తింది.

– న్యూస్‌టుడే, హొసపేటె

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


విద్యాసాగర్, రమణలను సత్కరిస్తున్న ఉద్యోగులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలపై సర్కారు దృష్టి పెట్టాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవోభవన్‌లో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస నూతన ఛైర్మన్‌గా ఎ.విద్యాసాగర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా డి.వి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో విద్యాసాగర్ మాట్లాడారు. వైకాపా హయాంలో జీతాల విషయంలో ఇబ్బందులు పడేవారమని, కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే చెల్లిస్తోందన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల బకాయిల చెల్లింపు, నూతన పీఆర్సీ, పెండింగ్ డీఏల మంజూరు, సరెండర్ లీవ్‌లు, పింఛన్ల విధానంలో మార్పులు తదితర సమస్యలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం విద్యాసాగర్, రమణలను ఉద్యోగులు సత్కరించారు.

'అన్నదాతా సుఖీభవ'కు అర్హత సాధించకపోతే అర్జీ ఇవ్వొచ్చు

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హత సాధించని రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకుడు, వ్యవసాయ అధికారిని సంప్రదించి ఫిర్యాదు చేయొచ్చని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. రైతు సేవా కేంద్రంలో అర్జీ అందిస్తే అక్కడ సిబ్బంది పోర్టల్‌లో నమోదు చేస్తారు. అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించి ఇప్పటికే అర్హుల ఎంపిక పూర్తయింది. వారి వివరాలను పోర్టల్‌లో ఉంచారు. రైతులు ఆధార్ నంబరు నమోదు చేసి అర్హులో కాదో తెలుసుకోవచ్చు. అనర్హులైతే.. 155251 నంబరుకు ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని ఢిల్లీరావు వివరించారు.

సాగర్‌కు పెరుగుతున్న వరద నీరు

520 అడుగులకు చేరిన నీటిమట్టం



నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండటంతో జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శ్రీశైలం విద్యుత్తు కేంద్రం ద్వారా జలాశయానికి 51,373 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా గురువారం 520.10 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 312.0450 కాగా 149.4580 టీఎంసీల వద్ద ఉంది. గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఆగస్టు మొదటివారంలో సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసే అవకాశముంది.

కొంపముంచే... కొవ్వు ఉప్పెన!



స్థూలకాయం గురించి ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చేలా 'ది లాన్సెట్ కమిషన్' సరికొత్త శాస్త్రీయ నిర్వచనాన్ని, చికిత్సా విధానాలను ప్రతిపాదించింది. ప్రపంచవ్యాప్తంగా 58 మంది నిపుణులతో కూడిన కమిషన్ ఒబెసిటీని.. ప్రీ క్లినికల్, క్లినికల్ ఒబెసిటీలుగా విభజించింది. వివిధ వైద్య రంగాల నిపుణులతో పాటు, స్థూలకాయంతో జీవిస్తున్న వ్యక్తుల అనుభవాలను కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. బీఎంఐ 23గా ఉన్నప్పుడే జాగ్రత్తపడితే తీవ్రమైన అనారోగ్యాలకు గురికాకుండా చూసుకోవచ్చని పేర్కొంది. దీనికి సంబంధించిన అధ్యయన పత్రాన్ని 'లాన్సెట్ డయాబెటిస్ ఎండోక్రైనాలజీ'లో ప్రచురించారు.

కొవ్వు పరీక్ష ఎందుకంత ముఖ్యం?

- అధిక బరువు వల్ల అనారోగ్య సమస్యల బారినపడే ముప్పు ఉందనేది ఎక్కువమందికి తెలుసు. అయితే ఊబకాయం లేకున్నా శరీరంలో కొవ్వు శాతం ఎక్కువ ఉంటే హైబీపీ, షుగర్‌లతో పాటు గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్ర జబ్బులు కూడా ఉన్నట్టుండి విరుచుకుపడే ప్రమాదం ఉంది.
- మన దేశంలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 25 కంటే ఎక్కువగా ఉన్న వారిని ఊబకాయులుగా పరిగణిస్తారు. అయితే 25 కంటే తక్కువ బీఎంఐ ఉన్న భారతీయుల్లోనూ సమస్యలు ఎక్కువగానే ఉన్నట్లు గుర్తించారు.
- వీరి శరీరంలో కొవ్వు నిల్వల మోతాదు అధికంగా ఉండడమే దీనికి కారణమని తేల్చారు. అందుకే కేవలం బీఎంఐపై ఆధారపడకుండా శరీరంలో కొవ్వు శాతం ఎంత ఉందనేది పరీక్షించుకోవడం చాలా ముఖ్యమని తాజా లాన్సెట్ అధ్యయన పత్రంలో పేర్కొన్నారు.

కండరాల వ్యాయామంతో చెక్...



- 'బాడీ కంపోజిషన్ అనాలసిస్' పరీక్షతో శరీరంలో కండరాలు, కొవ్వు, ఎముకలు, నీటి నిష్పత్తులు తెలుస్తాయి. ఈసీజీ, ఈఈజీ మాదిరిగా స్వల్పమోతాదు ఎలక్ట్రో విధానంలో చేసే ఈ పరీక్షతో జీవక్రియ ఎలాగుందనేది అర్థమవుతుంది.
- కండరాల మోతాదు ఎక్కువుంటే బేసల్ మెటబాలిక్ రేట్ (బీఎంఆర్) అధికంగా ఉంటుంది. కొవ్వు అధికంగా ఉంటే బీఎంఆర్ తక్కువగా ఉంటుంది.
- జీవక్రియ సరిగ్గా లేనప్పుడు ఎక్కువ కేలరీలను తీసుకుంటే అవి కాస్తా.. కొవ్వుగా మారిపోయి ఊబకాయానికి దారితీస్తాయి.
- చాలామంది రోజులో ఒక గంట నడిస్తే సరిపోతుందనుకుంటారు. కానీ జీవక్రియ మెరుగవ్వడానికి, కండరాల వృద్ధికి కొన్ని బరువులెత్తే వ్యాయామాలు చేయాల్సిందే.
- బరువు నియంత్రణలో ఉండడానికి ఆహారంలో కేలరీల నియంత్రణ చాలా ముఖ్యం. ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవాలి. కొవ్వు మోతాదు మధ్యస్థంగా ఉండాలి. కార్బొహైడ్రేట్స్ తక్కువగా తీసుకోవాలి.

–డాక్టర్ ఎస్తర్ సాతియారాజ్, సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్, హెచ్‌సీజీ హాస్పిటల్స్(బెంగళూరు)



–ఈనాడు, హైదరాబాద్

నడుము చుట్టూ... పెనుముప్పు






- ఆసుపత్రుల్లో హెల్త్ చెకప్‌లు చేస్తుంటారు. బరువు ఎక్కువగా ఉన్నప్పుడు.. బీఎంఐ ఒక్కటే చూస్తారు. కానీ బీఎంఐతో పాటు.. శరీరంలో కొవ్వును, మెటబాలిక్ రేటును కూడా లెక్కించాలని లాన్సెట్ పరిశోధన స్పష్టం చేస్తోంది.
- నడుము చుట్టూ కొవ్వు చేరడమనేది భారతీయుల్లో అతి పెద్ద సమస్య. శరీరం అంతా చూడ్డానికి బాగానే ఉంటుంది. కానీ పొట్ట మాత్రం ముందుకు పొడుచుకొచ్చినట్లు ఉంటుంది. ఇలా కొవ్వు పేరుకుపోయిన వారిలో ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు, మధుమేహం వంటి జీవక్రియా లోపాలు తలెత్తే అవకాశం ఉంది. వీరికి కచ్చితంగా బాడీ ఫ్యాట్‌ను లెక్కించాలి.
- బీఎంఐ ఒక్కదాన్ని పరిగణనలోకి తీసుకుంటే కొవ్వు గురించి... అవయవాల పనితీరు తెలియదు. కాలేయం, క్లోమం, గుండె ఎలా పనిచేస్తున్నాయనేది బీఎంఐ ద్వారా తెలిసే అవకాశమే లేదు.
- ప్రీ క్లినికల్ ఒబెసిటీ ఉన్నవారు.. ముందస్తు ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టాలి. శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, కంటి నిండా నిద్ర, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంపై దృష్టిపెట్టాలి.
- క్లినికల్ ఒబెసిటీ ఉన్నవారు.. హైబీపీ, షుగర్‌లను నియంత్రించుకోవాలి. తద్వారా అవయవాల పనితీరును మెరుగుపర్చుకొని.. తీవ్రమైన జబ్బుల బారినపడకుండా జాగ్రత్తపడొచ్చు.

– డా. రాకేశ్ కలపాల, సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్స్

లాన్సెట్ తాజా నివేదిక ప్రకారం...

ప్రి క్లినికల్ ఒబెసిటీ: బీఎంఐ 23 కంటే ఎక్కువగా ఉంటుంది. శరీరంలో అవయవాల మధ్య కొవ్వు ఎక్కువగా ఉంటుంది. కానీ అనారోగ్య లక్షణాలు, సంకేతాలేమీ ఉండవు. సాధారణ ఆరోగ్యవంతులుగానే ఉంటారు. ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు, మధుమేహం, నిద్రలో గురక వంటి వాటి బారిన ఇంకా పడరు. అయితే వీరు భవిష్యత్‌లో జీవనశైలి రుగ్మతలతో పాటు.. గుండెపోటు, పక్షవాతం ముప్పు అధికంగా ఉంటుంది.

క్లినికల్ ఒబెసిటీ: బీఎంఐ 23 కంటే ఎక్కువగా ఉంటుంది. బాడీ ఫ్యాట్, ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు, మధుమేహం, గురక, శ్వాస ఇబ్బందులు, కీళ్ల నొప్పులు వంటి ఇబ్బందుల్లో కొన్ని గానీ.. అన్నీ గానీ ఉంటాయి. శరీరంలో అవయవాల పనితీరుపై దుష్ప్రభావం పడుతుంది.



శరీరంలో ఉన్నకొవ్వును ఒక్కసారి విశ్లేషిస్తే...

చర్మం కింద ఉన్న కొవ్వును 'సబ్‌క్యూటనియస్ ఫ్యాట్' అంటారు.

అవయవాల చుట్టూ ఉండే కొవ్వును 'విజరల్ ఫ్యాట్' అంటారు.

శరీరంలో నిల్వ ఉన్న కొవ్వు ఏ ఇద్దరు వ్యక్తుల్లోనూ ఒకే రకమైన ప్రభావాన్ని చూపకపోవచ్చు.

ఇద్దరు వ్యక్తుల బరువు ఒక్కటే అయినా.. బీఎంఐ ఇద్దరికీ సమానంగా ఉన్నా.. ఎవరికైతే శరీరంలో కొవ్వు మోతాదు ఎక్కువగా ఉంటుందో, వారిని ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉంటుంది.

చదువే ప్రధానం.. విధ్వంసాలకు వెళ్లొద్దు

• విదేశీ విద్యార్థులకు అమెరికా షరతు

ఇంటర్నెట్ డెస్క్: దాదాపు నెల రోజుల సస్పెన్షను తర్వాత విదేశీ విద్యార్థుల చదువుకు జూన్ 18 నుంచి వీసాల దరఖాస్తులను అందుబాటులోకి తీసుకొచ్చిన అమెరికా విదేశాంగ శాఖ అభ్యర్థులకు కొన్ని కీలక సూచనలు చేసింది. ఈ మేరకు ఆ శాఖ ప్రతినిధి మిగ్నాన్ హాస్టన్ ఓ ప్రకటన చేశారు. "విద్యార్థి వీసాలకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి. ఏ అవసరాన్నికైతే మీరు దరఖాస్తు చేశారో దానికే ఆ వీసాను వాడుకోవాలి. ఇక్కడికి వచ్చి చదువును వదిలేయడం.. క్యాంపస్‌లను ధ్వంసం చేయడం వంటివి చేయకూడదు. మాప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకొని తీసుకొంటుంది. వలస చట్టాల ఆధారంగా ఈ పాలసీలను నిర్ణయిస్తాం. ఇదంతా కేవలం మా పౌరులను రక్షించడానికే కాదు. మీతోపాటు చదువుకొనే ఇతర విద్యార్థులను కాపాడటానికి కూడా అవసరం" అని హాస్టన్ తేల్చి చెప్పారు. సోషల్ మీడియా వెట్టింగు ప్రక్రియ కోసం విద్యార్థి వీసాలను కొన్నాళ్లు నిలిపేసిన విషయం తెలిసిందే. కొత్త దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైళ్లు అన్నింటిలో 'పబ్లిక్ వ్యూ' ఆప్షన్‌ను కచ్చితంగా యాక్టివేట్ చేయాలని అమెరికా సూచించింది. దీనిని పాటించకపోతే దరఖాస్తు తిరస్కరిస్తామని.. అలాంటివారు తర్వాత కూడా అమెరికాకు వచ్చే అవకాశం ఉండదని తేల్చి చెప్పింది. మరోవైపు.. విద్యార్థి వీసాలకూ పరిమితకాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ చేసిన ప్రతిపాదనలతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. ఎఫ్-1, జె-1 వీసాలపై అమెరికాలో ఉంటున్నవారి మీద దీని ప్రభావం పడనుంది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	37.7	25.8
నెల్లూరు	36.4	26.6
ఒంగోలు	36.0	26.5
కడప	34.0	26.0
కర్నూలు	33.5	23.6
తాడేపల్లిగూడెం	33.3	27.1
విజయవాడ	32.8	25.4
అనంతపురం	32.6	22.2
గుంటూరు	32.0	26.0
విజయనగరం	32.0	24.0
నరసాపురం	31.5	26.0
విశాఖపట్నం	30.2	24.8

గ్రహం అనుగ్రహం

4–7–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
నవమి: సా. 4-25 తదుపరి దశమి
చిత్త: సా. 5-30 తదుపరి స్వాతి
వర్జ్యం: రా. 11-42 నుంచి 1-28 వరకు
అమృత ఘడియలు: ఉ. 10-28 నుంచి 12-14 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-09 నుంచి 9-01 వరకు
తిరిగి మ. 12-30 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.33; సూర్యాస్తమయం: సా.6.35

5న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30 వరకు మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.ఎస్.వి.హిమబిందు తెలిపారు. ఇందులో భాగంగా జులైలో పరిష్కరించదగిన కేసులను గుర్తించి, వివిధ రంగాల వారికి దీనిపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. "మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు, న్యాయవాదులకు ఆయా కేసులు అప్పగించి, పరిష్కారమైన వాటిని కోర్టులో రాజీమార్గంలో తీర్పు ఇస్తాం. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నాం. అన్ని న్యాయస్థానాలు, హైకోర్టు, విశాఖపట్నంలోని డెట్ రికవరీ ట్రైబ్యునల్‌లోనూ పెండింగ్ పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నాం. వివాహ వివాదాలు, ఆస్తి గొడవలు, సివిల్ తగాదాలు, చెక్కు బౌన్స్, వాహన ప్రమాదాల బీమా, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవచ్చు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, 13 డీఎల్ఎస్ఏలు, 147 ఎంఎల్ఎస్ఏల ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు 1,15,071 ఉన్నట్లు గుర్తించాం. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే ఇరుపక్షాలకూ మేలు జరుగుతుంది" అని తెలిపారు.

మూడు నగరాల్లో భారీ పేలుళ్లకు కుట్ర



అబూబకర్ సిద్దిఖీ



మహమ్మద్ అలీ



పోలీసుల సోదాల్లో లభ్యమైన పేలుడు పదార్థాలు, కత్తులు తదితరాలు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే-రాయచోటి: 'అన్నమయ్య జిల్లా రాయచోటిలో పట్టుబడిన అబూబకర్ సిద్దిఖీ, మహమ్మద్ మన్సూర్ అలీలు కరుడుగట్టిన ఉగ్రవాదులు. దేశంలోని మూడు ప్రధాన నగరాలతో పాటు రైలుమార్గాలను పేల్చడానికి పన్నాగం పన్నారు. వారి ఇళ్లలో మూడు నగరాలు, రైల్వే నెట్‌వర్క్ చిత్రపటాలు లభ్యమయ్యాయి. ఈ ఇద్దరూ తమిళనాడులో వరుస బాంబు పేలుళ్లలో నిందితులుగా ఉన్నారు' అని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించారు. రాయచోటిలో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడితో కలిసి ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఐజీ ఆ వివరాలు...

ఆ ఇద్దరూ మోస్ట్ వాంటెడ్

'సిద్దిఖీ, మన్సూర్ అలీలను మూడు రోజుల క్రితం ఐబీ అధికారులు అరెస్టు చేసి చెన్నై తీసుకెళ్లారు. ఐబీ అధికారులు అరెస్టు చేశాక అన్నమయ్య జిల్లా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారి ఇళ్లలో సోదాలు చేసి పేలుడు పదార్థాలు, బకెట్, సూట్‌కేసు బాంబులు స్వాధీనం చేసుకున్నారు. సూట్‌కేసు బాంబులను రాయచోటి డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఆక్టోపస్ బృందం పోలీసులు నిర్వీర్యం చేశారు.

సోదరులిద్దరిపై ఎన్నో కేసులు

ఉగ్రవాదులిద్దరినీ సోదరులుగా అనుమానిస్తున్నాం. వారికి 'అల్ ఉమా' అనే తీవ్రవాద సంస్థతో సంబంధాలున్నాయి. ఐసిస్, అల్ ఉమా ఒకే రకమైన భావజాలం కలిగి ఉంటాయి. వీరు 2011లో భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ రథయాత్ర సందర్భంగా మదురైలో బాంబులు పేల్చడానికి కుట్ర పన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిర్వీర్యం చేశారు. 1995లో చెన్నైలోని హిందూమున్నాని కార్యాలయంపై బాంబు దాడి కేసులోనూ ఈ ఇద్దరూ నిందితులు. 1999లో చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూర్, కేరళ ప్రాంతాల్లో వరుసగా ఏడుచోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడిన ఘటనలో ప్రధాన నిందితులు. తర్వాత రాయచోటి వచ్చి మకాం పెట్టారు. ఇక్కడ ఉంటూనే 2013లో బెంగళూరు మల్లేశ్వరం భాజపా కార్యాలయంపై బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు.

ఇరవై ఏళ్లుగా రాయచోటిలోనే మకాం

'ఉగ్రవాదులు 20 ఏళ్లుగా రాయచోటిలో మకాం వేశారు. ఐదేళ్ల క్రితం అబూబకర్ సిద్దిఖీ రాయచోటి యువతిని పెళ్లి చేసుకున్నాడు. పదేళ్ల కిందట మహమ్మద్ అలీ గాలివీడు యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా చీరల వ్యాపారం చేశారు. నిందితుల ఇళ్లలో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. వీటితో 50-60 బాంబులు తయారుచేయొచ్చు. యాభై ఐఈడీలు తయారు చేసే సామగ్రి దొరికాయి. ప్రస్తుతం తమిళనాడు జైలులో ఉన్న నిందితులను కస్టడీకి తీసుకుని విచారించడానికి సన్నాహాలు చేస్తున్నాం. భవిష్యత్తులో భారీ విధ్వంసం చోటుచేసుకోకుండా భగ్నం చేశాం. ఉగ్రవాదులిద్దరిదీ తమిళనాడు రాష్ట్రం. రాయచోటి పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. అబూబకర్ సిద్దిఖీ అలియాస్ అమానుల్లా, ఆయన భార్య సైరాబానుతో పాటు షేక్ మన్సూర్ అలీ, ఆయన భార్య షమీంపై ఉపా యాక్ట్, పేలుడు పదార్థాల చట్టం, ఆర్మ్‌డ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఉగ్రవాదుల భార్యలను అరెస్టు చేసి రాయచోటి కోర్టులో హాజరుపర్చాం. న్యాయస్థానం ఇరువురికి 14 రోజుల రిమాండ్ విధించింది' అని డీఐజీ కోయ ప్రవీణ్ వివరించారు.

పెద్దల ఆశీర్వాదం తీసుకున్న మాధవ్





మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి మొక్క అందజేస్తున్న మాధవ్ ● మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాధవ్



తల్లి రాధకు పాదాభివందనం చేస్తూ..

ఈనాడు, అమరావతి: భాజపా ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పీవీఎన్ మాధవ్ గురువారం హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి.విద్యాసాగర్‌రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోనే ఉన్న తల్లి రాధను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తండ్రి దివంగత పీవీ చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ చిత్రాలను మాధవ్ ఎక్స్‌లో పంచుకున్నారు.

కృష్ణా, రాయలసీమకు పట్టిసీమ వరప్రదాయిని

- నీటిని విడుదల చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు



ఇటుకలకోట సమీపంలో డెలివరీ సిస్టమ్ వద్ద జలహారతి ఇస్తున్న మంత్రి నిమ్మల

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం కృష్ణా డెల్టాకు, రాయలసీమకు వరప్రదాయిని అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల నుంచి నీటి విడుదలను మంత్రి గురువారం ప్రారంభించారు. తర్వాత తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేశారు. అనంతరం ఇటుకలకోట సమీపంలో పట్టిసీమ కుడి కాలువపై నిర్మించిన డెలివరీ సిస్టమ్ నుంచి బయటకు వస్తున్న గోదావరి నీటికి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. 'పట్టిసీమతో 2014-19 మధ్య 263 టీఎంసీలు కృష్ణాకు తరలించాం. ఇది శ్రీశైలం నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 428 టీఎంసీలు వచ్చాయి. ఇది నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే అధికం. వైకాపా హయాంలో నిర్వహణ గాలికొదిలేయడంతో 450 ఎత్తిపోతల పథకాలు మూలన పడ్డాయి. ఓఅండ్ఆర్ఎం నిధులు రూ.700 కోట్లు తీసుకొచ్చి యుద్ధప్రాతిపదికన వాటికి మరమ్మతులు చేయించాం' అని మంత్రి తెలిపారు.

డయాఫ్రంవాల్ 365 మీటర్లు పూర్తి చేశాం..

'చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఆయన లక్ష్యానికి అనుగుణంగా 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తాం. దెబ్బతిన్న డయాఫ్రంవాల్ స్థానంలో కొత్త నిర్మాణం జనవరిలో ప్రారంభించి ఇప్పటి వరకు 360 మీటర్ల మేర పూర్తి చేశాం. గ్యాప్-1లో ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు ప్రారంభించాం, గ్యాప్-2లో నవంబరు నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వర్షాకాలంలో డయాఫ్రంవాల్ నిర్మాణానికి ఆటంకం లేకుండా ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేసేలా బట్రస్ డ్యాం నిర్మించడంతో పాటు నీటిని ఎత్తిపోసేందుకు పంపులు సిద్ధం చేశాం' అని మంత్రి వివరించారు. అనంతరం మంత్రి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పుష్కర ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేసేందుకు వెళ్తూ ఎగువ కాఫర్ డ్యాం, బట్రస్ డ్యాం, డయాఫ్రంవాల్ నిర్మాణాలను పరిశీలించారు. పోలవరం, గోపాలపురం, రాజానగరం ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, బత్తుల బలరామకృష్ణ, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రశాంత జీవితానికి మూడు సూత్రాలు

1. మీ జీవితానికి సంబంధం లేని విషయాల గురించి ఆలోచించకుండా ఉండటాన్ని సాధన చేయండి. అప్పుడే పనికొచ్చే విషయాల మీద పూర్తి ఏకాగ్రత పెట్టగలరు.
2. వాస్తవ సమస్యల కన్నా మనం ఊహించుకొనే సమస్యలతోనే ఎక్కువగా ఆందోళనకు గురవుతాం. భవిష్యత్తులో జరుగుతాయో లేవో తెలియని విషయాలను ఊహించుకోవడం మానండి.
3. మీ దగ్గర లేని వాటి గురించి ఫిర్యాదులు చేయడం ఆపేయండి. ఉన్న వాటి విలువను గుర్తించడం నేర్చుకోండి.

– లకోవ్, బిజినెస్ గ్రోత్ ఎక్స్‌పర్ట్



కొండ ఎక్కుతున్న సిబ్బంది



గ్రామస్థులకు పరీక్షలు చేస్తూ...

వానలో తడుస్తూ.. రాళ్లపై పాకుతూ..

- గిరిజన గ్రామానికి వెళ్లి సిబ్బంది వైద్య సేవలు

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని ఎగువ కాశాయివలసకు చెందిన ఆశా కార్యకర్త శ్యామలకు బుధవారం ఆరోగ్యం బాగోలేకపోవడంతో డోలీలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వైద్యశాఖ అప్రమత్తమై గ్రామంలో శిబిరం నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించింది. గ్రామానికి చేరేందుకు రహదారి లేకపోవడంతో దిగువ కాశాయివలస మీదుగా 5 కి.మీ. మేర కొండ ప్రాంతంలో నడిచి ఆరోగ్య పర్యవేక్షకుడు సతీశ్, సహాయకుడు మిన్నారావు, ఏఎన్ఎం ఆరుద్ర గురువారం ఎగువ కాశాయివలస వెళ్లారు. అక్కడ 68 మంది ఉండగా 14 మందికి పరీక్షలు చేశారు. ఎవరికీ సమస్యలు లేవని నిర్ధారించారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

విద్యుదాఘాతంతో తెదేపా కార్యకర్త మృతి

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్న మంత్రి లోకేశ్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా నాయుడుపేట చంద్రబాబునగర్‌లో గురువారం ఉదయం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సందర్భంగా సన్నాహక ఏర్పాట్ల సమయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఇక్కడ ఓ ఆలయం వద్ద తెదేపా కార్యకర్త కందుకూరి మునీశ్వర్(37) షామియానా వేసే పనులు చేపట్టారు. ఇనుప కడ్డీకి విద్యుత్తు తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మునీశ్వర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు తుమ్మూరులో నివాసముంటున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం.. విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. తక్షణ సాయంగా ఎమ్మెల్యే రూ.50వేలు అందించారు. తెదేపా నేత కొండేపాటి గంగాప్రసాద్ రూ.2 లక్షలు ఇస్తామని ప్రకటించారు.

విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరిస్తే దేశవ్యాప్త సమ్మె చేపట్టేందుకు వెనుకాడబోమని విద్యుత్తు ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ కన్వీనర్ సుదీప్‌దత్త హెచ్చరించారు. యూపీలో ప్రైవేటీకరించేందుకు కేంద్రం సిద్ధమవుతోందని, దీనిని వ్యతిరేకించాలని కోరారు.

డానిష్ ఫైబర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం

రాష్ట్రంలో తొలిసారి నంద్యాల జిల్లాలో శ్రీకారం

ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే–నంద్యాల పట్టణం: భారీ వర్షాలకు, ఎక్కువ లోడుతో రాకపోకలు సాగించే వాహనాల కారణంగా రోడ్లు త్వరగా దెబ్బతింటాయి. దీనికి విరుగుడుగా డానిష్ ఫైబర్ టెక్నాలజీతో ఎక్కువ కాలం మన్నే రోడ్లు నిర్మించేందుకు రహదారులు, భవనాల శాఖ శ్రీకారం చుడుతోంది. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో తొలిసారి నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోని ముదిగేడు-సంజామల మధ్య ఈ కొత్త సాంకేతికతతో శుక్రవారం రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. డానిష్ అస్ఫాల్ట్ రీ-ఇన్ఫోర్సింగ్ టెక్నాలజీగా పేర్కొనే ఈ విధానాన్ని డెన్మార్క్‌లో అభివృద్ధి చేశారు. వివిధ దేశాల్లో చేపట్టిన ఈ రోడ్ల ప్రాజెక్టులు విజయవంతం కావడంతో.. మన రాష్ట్రంలోనూ నిర్మించనున్నారు. ఈ పద్ధతిలో తారు మాత్రమే కాకుండా అరమిడ్, పాలియోలెఫిన్ అనే ఫైబర్లు కలిపి బిటమిన్ తయారు చేస్తారు. వాటితో నిర్మాణమైన రోడ్డు దృఢంగా ఉండి, వర్షపునీటిని నిరోధిస్తుంది. దీంతో రోడ్డుకు పగుళ్లు రావు. త్వరగా గుంతలు పడవు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు కూడా ఈ రోడ్లు తట్టుకోగలవని ఇంజినీర్లు చెబుతున్నారు. రహదారుల మన్నిక కూడా 50 శాతం పెరుగుతుందని పేర్కొంటున్నారు.

ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం

కాలపరిమితి ఎత్తివేయడంపై సీఎంకు మెప్మా ఆర్పీల కృతజ్ఞతలు

ఈనాడు, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని రిసోర్స్ పర్సన్ల(ఆర్పీ)కు సంబంధించి మూడేళ్ల కాలపరిమితి నిబంధన తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆర్పీలు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని ప్రకటించారు. గురువారం విజయవాడలో మంత్రి నారాయణను కలిసి హర్షం వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల సభ్యులను సమన్వయం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్పీలు మూడేళ్ల వరకే పని చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీన్ని ఎత్తివేయాలన్న విజ్ఞప్తిపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ఈనాడు

ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు...

గురుబ్రహ్మ, గురుర్విష్ణు అంటూ ఉపాధ్యాయులను దైవస్వరూపులుగా భావించే సంస్కృతి మనది. మట్టి ముద్దల్లాంటి చిన్నారులను విజ్ఞానవంతులుగా మలచి వారి భవిష్యత్తుకు ఒక దారి చూపించాల్సిన పవిత్ర బాధ్యతను నిర్వర్తించేది కాబట్టే ఉపాధ్యాయ వృత్తి అంటే అంత గౌరవం. నిజానికి, భిన్న సామర్థ్యాలు కలిగిన పిల్లలుండే తరగతిలో ప్రతిఒక్కరికీ అర్థమయ్యేలా నేర్పుగా పాఠాలతో పాటు జీవిత విలువలనూ బోధించడం ఆషామాషీ విషయమేమీ కాదు. ఈ విషయంలో ఫిన్లాండ్, జపాన్, సింగపూర్ వంటివి మెరికల్లాంటి గురువులను తయారుచేసుకుంటూ, వారి ద్వారా తమ భావిపౌరులను మెరుగ్గా తీర్చిదిద్దుకుంటున్నాయి. వాటి అడుగుల్లో నడుస్తూ స్థానికంగా విద్యాబోధనలో నాణ్యతను పెంచాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయులను ఆయా దేశాలకు పంపి అక్కడి ఉత్తమ పద్ధతులను వారు ఆకళింపుజేసుకునేలా చేయాలని నిశ్చయించింది. దిల్లీ, గుజరాత్, పంజాబ్ వంటివి ఇప్పటికే ఈ బాటలో సాగుతున్నాయి. ఈ చొరవ హర్షణీయమే కానీ, నవతరానికి నిరంతరం సరైన విద్య అందాలంటే- దేశీయంగా ఉపాధ్యాయ శిక్షణను మొత్తంగా సంస్కరించడంపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి!

మన విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాల్సి ఉందని ఏనాడో చెప్పిన కొఠారీ కమిషన్- ఒత్తిడి లేని చదువుల దిశగా కీలక సూచనలు చేసింది. చిట్టి బుర్రలపై అనవసర భారాన్ని తగ్గిస్తూనే అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని యశ్‌పాల్ కమిటీ సూచించింది. నూతన జాతీయ విద్యావిధానం ఒకడుగు ముందుకేసి విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మక నైపుణ్యాలు పెంచి వారిని భావి ఆవిష్కర్తలుగా మలచాలని పిలుపిచ్చింది. ఇందుకోసం ఉపాధ్యాయ శిక్షణపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయా కమిటీలూ విధానాలూ స్పష్టంగా సిఫార్సు చేశాయి. కానీ, దేశీయంగా ఎక్కువ శాతం ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు సంపాదన యావలో పడి నిబద్ధతకు నీళ్లొదులుతున్నాయి. అసలు క్లాసులు చెప్పకుండానే సర్టిఫికెట్లు ప్రదానం చేసే చేతులు దులుపుకొంటున్నవీ ఉన్నాయి. అలాంటి అక్రమాలను నివారించడంలో యంత్రాంగం వైఫల్యం- విద్యావ్యవస్థను, అంతిమంగా దేశ ప్రగతిని తీరని చేటు చేస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవితకోసం పరితపించే ఉపాధ్యాయులే జాతి సౌభాగ్యాన్ని ఇనుమడింపజేయగలరు. అలాంటి గురువుల కోసం ఎంపిక దశ నుంచే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, కాలానుగుణంగా వారి నైపుణ్యాలకు సానపెడుతూ ఉండటమొక్కటే కీలకమా- బూజుపట్టిన బండ చదువులను వదిలించుకోవడం అంతే ప్రధానం!

ప్రఖ్యాత విద్యావేత్త గిజుభాయ్ బధేకా- ప్రాథమిక స్థాయినుంచే బోధనలో సరికొత్త ప్రయోగాలు చేస్తూ అద్భుత ఫలితాలు సాధించారు. ఆయన ఉద్ఘాటించినట్లు, కేవలం పుస్తకాల్లో ఉన్న అక్షరాలను బుర్రల్లోకి కుక్కేది చదువు కాదు. అన్నీ తెలుసుకోవాలి, కొత్తవి నేర్చుకోవాలనే కోరిక పిల్లల్లో సహజంగా ఉంటుంది. దాన్ని ప్రోత్సహిస్తూ, వారికి చక్కని దిశానిర్దేశం చేసేదే నిజమైన విద్య అవుతుంది. దాని సాయంతోనే మానవ మేధ వేయి రేకుల పద్మంలా వికసిస్తుంది. వ్యక్తి ఉన్నతికి, దేశ అభ్యున్నతికి అది ఆలంబనగా నిలుస్తుంది. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకున్నాయి కాబట్టే అమెరికా, ఆస్ట్రేలియా, ఫిన్లాండ్ లాంటి దేశాలు ఇంటి వాతావరణాన్ని బడిలో కల్పించి చదువులను ఇష్టంగా మారుస్తున్నాయి. గ్రంథాలయాల ద్వారా చదివే అలవాటును పిల్లలకు అలవరుస్తూ- ఆటపాటలూ కథల ద్వారా పాఠ్యాంశాలను విడమరుస్తున్నాయి. మన విద్యావ్యవస్థనూ అలా మలచుకోగలిగితేనే- దేశం తలరాతను మార్చే శక్తి తరగతి గదులకు సిద్ధిస్తుంది!



మలివయసులో ఏదీ భరోసా?

సీనియర్ సిటిజన్ల సంరక్షణపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన సమయమిది. ప్రస్తుతం భారతదేశ జనాభాలో 60 ఏళ్లు పైబడినవారు 11-14శాతం కాగా, 2050కల్లా వారు 20శాతానికి చేరనున్నారు. అంటే వృద్ధుల జనాభా 30-34 కోట్లుగా ఉండనుంది. ఈ లెక్కన భారతదేశం మున్ముందు ప్రపంచంలోకెల్లా అతిపెద్ద వృద్ధ జనాభాకు చిరునామా కానుంది. వేగంగా పట్టణీకరణ, మహిళలు విద్యావంతులై వృత్తి ఉద్యోగాల్లో పెద్దయెత్తున ప్రవేశించడం, కుటుంబ నియంత్రణ మార్గాలు విరివిగా అందుబాటులోకి రావడం, పిల్లల్ని కనడం వాయిదా వేయడం వంటి కారణాల వల్ల దేశంలో జననాలు తగ్గిపోతున్నాయి. దేశంలో సామాజిక-ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి అన్ని వర్గాల వారికీ గతంలోకన్నా మెరుగైన వైద్య వసతులు లభిస్తున్నాయి. దాంతో సగటు ఆయుర్దాయంతో పాటు వృద్ధుల జనాభా కూడా పెరుగుతోంది.

ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక ప్రకారం, 2024లో దేశ జనాభా 146 కోట్ల పైమాటే. కానీ, సంపూర్ణ సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్) మాత్రం 1.9కి పడిపోయింది. పట్టణాల్లో అది మరీ తక్కువగా 1.6గా ఉంది. దేశంలో జననాలూ మరణాల మధ్య సమతుల్యత ఏర్పడి, జనాభా స్థిరంగా కొనసాగాలంటే టీఎఫ్ఆర్ 2.1గా ఉండాలి. మరోవైపు, పెరుగుతున్న వృద్ధ జనాభాకు తగినట్లుగా సామాజిక వసతులను మెరుగుపరచుకోవాల్సి ఉంది.



జాతీయ కృషి అవసరం

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన దృష్ట్యా వృద్ధుల ఆలనాపాలనా చూసుకోవడానికి ఇప్పటి నుంచే ప్రభుత్వం తగిన విధానాలు రూపొందించి అమలుచేయాలి. వృద్ధులకు కావాల్సిన వస్తుసేవలను అందించాలి. సంరక్షణ వసతులను నెలకొల్పాలి. వృద్ధులకు ప్రత్యేక వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయడం ముఖ్యం. ఇప్పటివరకు వృద్ధుల సంరక్షణకు సంఘటిత రంగంలో పూర్తిస్థాయి బందోబస్తు లేకపోవడం వల్లనే కుటుంబ సభ్యులు, ముఖ్యంగా మహిళలే వారి ఆలనాపాలనా చూసుకోవాల్సి వస్తోంది. నేటి స్త్రీలు వృత్తి ఉద్యోగాల్లో చేరుతున్నారు కాబట్టి, సంఘటిత, అసంఘటిత రంగాలు రెండింటిలో వృద్ధుల సంరక్షణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది.

దేశమంతటిలోకీ వృద్ధుల జనాభా ఎక్కువగా ఉన్న కేరళలో వారి సంరక్షణకూ మెరుగైన ఏర్పాట్లు ఉన్నాయి. వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లు, ఇంటి దగ్గరే ప్రాథమిక వైద్య వసతుల కల్పనతోపాటు ప్రత్యేక చికిత్సాలయాలు, వైద్య సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. అయితే, వృద్ధుల సంరక్షణలో నిమగ్నమైనవారు కొంతకాలం తరవాత ఒత్తిడి వల్ల ఆ విధుల నుంచి వైదొలగుతున్నారు. వృద్ధుల్లో మానసిక సమస్యలూ ఎక్కువే. మధుమేహం, హృద్రోగం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు వారిని ఎక్కువగా పీడిస్తున్నాయి. ఈ సమస్యలన్నింటినీ నిభాయించే యంత్రాంగాన్ని నెలకొల్పడం ఒక్క రాష్ట్రం వల్ల కాదు. జాతీయస్థాయి కృషి తప్పనిసరి. బెంగళూరు వంటి నగరాల్లో వృద్ధుల కోసం గేటెడ్ కమ్యూనిటీలు, ప్రత్యేక అపార్ట్‌మెంట్లు, విల్లాలు నిర్మిస్తున్నారు. కొన్ని సంస్థలు నిర్మించిన గృహాలు, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో వృద్ధులకు ప్రత్యేకంగా సంరక్షణ సేవలు, ఆస్పత్రులతో అనుసంధానం, నలుగురితో కాలక్షేపానికి ఏర్పాట్లు చేశారు. అయితే ఇలాంటి వసతులు కేవలం ఉన్నతాదాయ వర్గాలకే తప్ప మిగతావారికి అందుబాటులో ఉండవు. మిగతా చోట్లా వృద్ధులకు ఇటువంటి ప్రత్యేక వసతులు అవసరం.

ఆర్థిక భద్రత కరవు

పాశ్చాత్య సంపన్న దేశాల్లో మాదిరి భారతదేశంలో వృద్ధులకు తగిన పింఛన్లు, ఇతర విధాలుగా ఆర్థిక భరోసా ఉండదు. జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్), అటల్ పెన్షన్ యోజన వంటివి కొంతమందికే పరిమితమవుతున్నాయి. దేశ జనాభాలో 85శాతం శ్రామికులు అసంఘటిత రంగంలోనే ఉండటంవల్ల వృద్ధాప్యంలో వారికి ఆర్థిక భరోసా లభించడం లేదు. వారిని ఆదుకునే స్తోమత కుటుంబ సభ్యులకూ ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్నివర్గాల వృద్ధులకూ ముందునుంచే ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే ఏర్పాట్లు జరగాలి. వృద్ధాప్యం కోసం పొదుపు చేసుకోవాలనే జాగరూకతను అందరిలో పెంచాలి.

చాలామంది వృద్ధుల్లో మానసిక సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువ. కాబట్టి, వారి కోసం ప్రత్యేక ఆరోగ్య వసతులు, పునరావాస ఏర్పాట్లు అవసరం. ప్రస్తుతం దేశంలో మాతా శిశు సంక్షేమంపై శ్రద్ధ పెడుతున్నట్లుగానే పండుటాకుల పట్ల జాగ్రత్త వహించాలి. వృద్ధుల సమస్యలకు చికిత్స చేయగల నిపుణుల సంఖ్యతో పాటు ప్రత్యేక ఆస్పత్రులు, వెల్‌నెస్ సెంటర్లను పెంచాలి. వృద్ధులకు ప్రత్యేక ఆరోగ్య బీమా కల్పించి, క్లెయిములను పేచీ లేకుండా పరిష్కరించాలి. ఈ అంశాలన్నీ ప్రభుత్వ విధానాల్లో అంతర్భాగం కావాలి. జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ విధానమంటూ ఒకటి ఉన్నా, అదేమీ పకడ్బందీగా అమలు కావడం లేదు.

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో...

దేశంలో వృద్ధుల కోసం ప్రత్యేక గృహాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం, కమ్యూనిటీ సెంటర్ల ఏర్పాటు, ప్రత్యేక రవాణా, డిజిటల్ సాధనాలను విరివిగా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. 2030కల్లా భారతదేశంలో వృద్ధుల సంరక్షణ మార్కెట్ 300శాతం పెరిగి 770 కోట్ల డాలర్లకు చేరనుంది. కాబట్టి, ఈ రంగంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. సీనియర్ పౌరుల హక్కులు, వసతుల కోసం చట్టపరమైన ఏర్పాట్లూ ఉండాలి. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంరక్షణ, సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి. వృద్ధుల సంరక్షణకు అంకితమైన సంస్థలకు సబ్సిడీలు, పన్ను రాయితీలు ఇవ్వాలి. దేశంలో పెరుగుతున్న వృద్ధ జనాభాను దృష్టిలో ఉంచుకుని వారి కోసం సంరక్షకుల బలగాన్ని ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవడం ముఖ్యం. వారికి తగిన శిక్షణ సౌకర్యాలనూ కల్పించాలి. సీనియర్ పౌరులకు గృహ వసతి, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక భద్రత, సామాజిక మద్దతుకు భరోసానిచ్చే సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేయాలి.

– పూల దేవేంద్ర, పరిశోధకులు, 'సెస్'

'జీవితం ఒకసారే లభిస్తుంది. అందులో యవ్వనం అతి చిన్నది. అందుకే లోకం తిరిగి చూడు' అని అర్థం వచ్చేలా ఒక ఫకీరు పాట పాడాడు. ఆ పాట విన్న ఒక బాలుడు ఇంట్లో కాలు నిలవక దేశం మీద పడ్డాడు. కాలినడకన వేల మైళ్లు తిరిగాడు. ప్రకృతి అందాలను ఆస్వాదించాడు, ప్రపంచంలోని వైవిధ్యాన్ని అధ్యయనం చేశాడు.

అతడిది సహజంగానే చురుకైన బుద్ధి. ఏ ప్రాంతం వెళ్తే ఆ ప్రాంత భాష నేర్చుకున్నాడు. ముప్పయికి పైగా భాషలు, యాసల మీద పట్టు సాధించాడు. కొన్ని భాషలకు వ్యాకరణం రాశాడు. కొన్నిటికి నిఘంటువులు కూర్చాడు. బౌద్ధ పిటకాలను ఆపోసన పట్టి త్రిపిటకాచార్యుడు అనిపించుకున్నాడు. సంస్కృతం నేర్చుకుని కొంతకాలం హిందూ

లోకం తిరిగి చూడు




మత వ్యాప్తికి కృషి చేశాడు. పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం అతడికి మహా ఇష్టం. ఆ జిజ్ఞాస వల్లే పట్టు వదలకుండా శతాబ్దాలుగా మూలనపడిన పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, అనువదించి ప్రపంచానికి పరిచయం చేశాడు.

ప్రసిద్ధ నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేసినప్పుడు అందులోని కొన్ని విలువైన గ్రంథాలను బౌద్ధభిక్షువులు టిబెట్ ఆరామాల్లో దాచిపెట్టారు. ఆ విషయం తెలిసి దారి సరిగా లేకపోయినా కంచరగాడిదల మీద టిబెట్ దాకా వెళ్లి వచ్చాడు. శాసనాలు, రాతిఫలకాలు, రాతప్రతులు, వర్ణచిత్రాలు సేకరించడం అతడికి ఇష్టం. అరుదైన గ్రంథాలు కొన్నాడు. ఆ సంపదను ఎవరికీ అమ్మడానికి ఇష్టపడలేదు. పరిశోధకులకు మాత్రం ఫొటోలు తీయించి ఇచ్చాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. అక్కడ నుంచే 'ఈ సమాజ దుష్టత్వం పతనం కాక తప్పదు' లాంటి పుస్తకాలు రాశాడు. కులమత విభేదాలు, మూఢ నమ్మకాలు, అన్యాయాలను గట్టిగా నిరసించాడు. బాల్యంలో చదువు అర్ధాంతరంగా ఆగిపోయినా... మతం, తత్వం, భాష, సైన్సు, సామాజిక శాస్త్రం వంటి అనేక విషయాల మీద లోతుగా పరిశోధించాడు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా విస్తృతంగా రచనలు చేసి అత్యంత ప్రజ్ఞాశాలిగా ప్రపంచ కీర్తి సాధించిన ఆ మేధావే- రాహుల్ సాంకృత్యాయన్.

ప్రపంచంలో సర్వ శ్రేష్ఠమైంది లోకసంచారం... అనేవారు రాహుల్. ఓల్గా సే గంగా తక్, లోకసంచారి, దివోదాసు, ఫర్ గాటెన్ ట్రావెలర్ వంటి ఎన్నో గ్రంథాల రచనకు 70 ఏళ్ల జీవితంలో సగానికి పైగా ఆయన గడిపిన సంచార జీవన అనుభవాలే ప్రధాన వనరు. రాహుల్ సాంకృత్యాయన్ యాత్రాసాహిత్యం మనసు పెట్టి చదివితే లోకసంచారం మీద ఉన్న అపోహలు తొలగిపోతాయి. ఆలోచనా పరిధి విస్తరిస్తుంది. మనిషిని మనిషిగా గుర్తించటానికి, మనుగడను సార్థకం చేసుకోవడానికి ఏకాంత ప్రయాణం ఎంత దోహదపడుతుందో అవగతమవుతుంది. జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని తపించేవారికి సాంకృత్యాయన్ జీవితం ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం.

– అభయ్



అభివృద్ధికి అతి పెద్ద అవరోధం అవినీతి. దానికి అవకాశం ఇచ్చామంటే సమాజంలో సమానావకాశాలకు గండి కొడుతుంది. మహిళలు, భూమిలేని నిరుపేదలు, గిరిజనులపై శ్రద్ధ పెట్టి అందరికీ సమానావకాశాలు కల్పించాలి.

– గుల్జారీలాల్ నందా

కావాల్సింది... సంకల్పం!

వాల్మీకి రామాయణాన్ని ముందర పెట్టుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు. 'నేనింతటి పవిత్రమైన చరిత్ర రాశాను. ఇది ప్రజల్లోకి వెళ్లి సార్థకం కావాలంటే ప్రచారం అవసరం. ఆ పని ఎవరు చేయగలరు?' అనుకుంటూ ఉండగా లవకుశులు పరిగెత్తుకుంటూ వచ్చారు. 'గురువుగారూ మీరేదో ఆలోచిస్తున్నట్లున్నారే!' అన్నారు. వాల్మీకి, 'లవకుశులారా! నేను రాసిన రామచరిత్రను జనాల్లోకి తీసుకెళ్లడానికి తగినవారు ఎవరా అని యోచిస్తున్నాను' అన్నాడు. లవకుశులు చేతులు కట్టుకుని, 'ఈ సేవకు మా జీవితాన్నే అంకితం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మీరు ఆజ్ఞాపించండి, మేం ప్రచారం చేస్తాం' అన్నారు.

'భగవంతుడి గురించి ప్రచారం చేయడానికి బిడియమెందుకు? ఆలస్యం చేయకుండా, త్యాగభావంతో వెళ్లండి' అన్నాడు వాల్మీకి. లవకుశులు కాషాయవస్త్రాలను ధరించి, రుద్రాక్షలను కంకణాలుగా చుట్టుకుని, తంబుర చేత పట్టుకుని బయలుదేరారు. 'రామకథను వినరయ్యా!' అని గ్రామాలలో తిరుగుతూ ప్రచారం చేశారు.



అంతర్యామి

అదే ఈ రోజుల్లో అయితే- కొంతమందిది విచిత్రమైన జీవితం. రెండు చేతులూ జోడించి నమస్కారం చేయడానికి ఇబ్బంది పడతారు. భజన, సంకీర్తనలప్పుడు తలలు దించుకుని పోతుంటారు. ఇంట్లో నొసట విభూతి పెట్టుకుంటారు, బయటికి వస్తూనే తుడిచేసుకుంటారు. ఏ తప్పూ చేయడం లేదు కదా! భగవన్నామస్మరణకు ఎందుకు సిగ్గుపడాలి? మనం బలహీనులం కాదు. 'న్యాయమాత్మా బలహీనేన లభ్య' బలహీనులు ఏ చిన్న కార్యాన్నీ సాధించలేరు. సేవకి బలం కన్నా సంకల్పం ఉండాలి.

మనిషి దుర్మార్గంలోనూ, దురాలోచనలోనూ ముందంజ వేస్తున్నాడు, పవిత్రమైన దివ్యజీవితానికి వెనకడుగు వేస్తున్నాడు. ఇదే పెద్ద బలహీనత. దైవానికి సేవకులమైతే మనకే గౌరవం. అందుకు ఉదాహరణ హనుమ. శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు... హనుమంతుడు. సీతాన్వేషణ నిమిత్తమై మారుతి అశోకవనంలో ప్రవేశించినప్పుడు ఏదో వింత జీవి వచ్చిందని అందరూ బయలుదేరారు చూడటానికి, లంకలోని రాక్షసులు ఏనాడూ వానరుడి ముఖం చూసి ఎరుగరు. 'ఎవరు నువ్వు?' అని ప్రశ్నించారు. 'అయ్యా! నేను శ్రీరామచంద్రుడి దాసుణ్ని' అన్నాడు హనుమ. దైవానికి దాసులనుకుంటే మనకే గౌరవం కానీ ఇంకొకరికి కాదు. దుష్కర్మలకు, దురాలోచనలకు, విషయభోగాలకు దాసులయ్యే బదులు దైవానికి దాసులు కావడంలో తప్పేంటి?

అయితే దైవాన్ని ఏ రీతిగా ప్రార్థించాలి? అని కొంతమందికి సందేహం. 'నేనే దైవ'మైనప్పుడు, ఇంక మళ్లీ దైవాన్ని ప్రార్థించడమేంటి అన్నది మరి కొందరి ప్రశ్న! అయితే 'నేనే దైవ'మనే సత్యంలోని లోతును పరిపూర్ణంగా గుర్తించేంతవరకు సత్కర్మలను ఆచరించాలి. ప్రతి కర్మను భగవంతుడికి అర్పిస్తున్నామనే భావంతో చేయాలి. ఏది చేసినా అది భగవత్కర్మగా భావించాలి. మొదట్లో ఇది కొంత శ్రమనిపించవచ్చు, కొన్ని బాధలు కలుగవచ్చు. కానీ క్రమేణా అదే సాధనగా రూపొందుతుంది. భగవద్గీత చెప్పినట్లుగా అభ్యాసం అత్యవసరం. మనం చేసే పనులన్నీ అభ్యాసంతోనే అలవడినట్లు సేవకు, భగవచ్చింతనకు కూడా అభ్యాసం కావాలి. విద్యను, శక్తి సామర్థ్యాలను దైవానికి ప్రీతి కలిగేలా వినియోగించాలి.

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

వేగంగా న్యాయం

కుటుంబ, ఆస్తి తగాదాలు, శ్రామిక, ఆర్థిక కార్యకలాపాల వివాదాలను మధ్యవర్తిత్వంతో వేగంగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేశారు. కోర్టుకు వెళ్లక ముందే ప్రీ లిటిగేషన్ స్థాయిలో లేదా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను ఉభయ పక్షాలు వాటిలో చక్కబెట్టుకోవచ్చు. ఈ నేపథ్యంలో గడిచిన నాలుగేళ్లలో జాతీయ లోక్ అదాలత్‌లలో 24.45 కోట్ల కేసులు పరిష్కారమయ్యాయి. ఆయా సంవత్సరాల్లో అవి ఎన్నంటే... (కోట్లలో)



2021	1.27
2022	4.19
2023	8.53
2024	10.45

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

చైనా తోడుగా పాక్ పన్నాగాలు

ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా పోరాడాలని షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) నిబంధనావళిలో మొదటి అధికరణ నిర్దేశిస్తోంది. ఎస్‌సీవో పరిధిలోని ప్రాంతాల్లో ఉగ్రవాదంపై పోరుకు ప్రాంతీయ ఉగ్రవాద నిరోధ వ్యవస్థను 2002లోనే ఏర్పాటు చేశారు. అయినా పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవలి సదస్సులో పన్నెత్తు మాట అనకపోవడం ఎస్‌సీఓ సంస్థాపక సూత్రాలను మంటగలపడమే అవుతుందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు తేల్చి చెప్పారు. ఎస్‌సీవో సభ్యదేశాల్లో భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్‌లకు అణ్వస్త్రాలు ఉన్నాయి. శాంతి సామరస్యాలను కాపాడటానికి ఈ దేశాలు మరింత బాధ్యత వహించాలి. ఉగ్రవాదుల చేతికి జనహనన ఆయుధాలు చిక్కకుండా జాగరూకత పాటించాలి. అయినా పహల్గాం దాడి వెనక పాక్ హస్తం ఉండటం ఎస్‌సీవో ఆశయాలకే విరుద్ధం. అందుకే భారత్ ఉగ్రవాద అంశాన్ని ప్రస్ఫుటంగా లేవనెత్తింది.



ఇటీవల చైనాలోని చింగ్‌డావ్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) రక్షణ మంత్రుల సభ సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి భారత్ నిరాకరించింది. పహల్గాంలో పాక్ ప్రేరిత ఉగ్రవాదుల దాడిని ఆ ప్రకటన ఖండించకపోవడమే దానికి కారణం. ఉగ్రవాదాన్ని నిరోధించడంపై చైనా ద్వంద్వ వైఖరులను ఈ సమావేశం బట్టబయలు చేసింది. పాకిస్థాన్‌ను అదెంతగా వెనకేసుకొస్తోందో కూడా చూపించింది.


డ్రాగన్ సైంధవ పాత్ర

ఎస్‌సీవో ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించకపోతే పాకిస్థాన్ దాన్ని అలుసుగా తీసుకుని ముష్కరులను మరింత ఎగదోస్తుంది. దీన్ని నిరోధించడానికి ఎస్‌సీవోతోపాటు అంతర్జాతీయ సంస్థల నుంచి నిరంతరం ఒత్తిడి పెంచాలని దిల్లీ భావిస్తోంది. సంయుక్త ప్రకటన ఉగ్రవాదాన్ని ఖండించకపోయినా భారత్ దానిపై సంతకం చేస్తే పాక్, చైనాలకు అలుసు ఇచ్చినట్లవుతుంది. ఇతర విషయాల్లోనూ రాజీపడేలా మనపై ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని నివారించడానికే ఎస్‌సీవోలో ఉగ్రవాదంపై ఇండియా రాజీలేని వైఖరి అవలంబించింది. చైనాకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పహల్గాం దాడిని ఎస్‌సీవో సంయుక్త ప్రకటన ఖండించేలా చర్యలు తీసుకుని ఉండేది. ఆ పని చేయలేదు. పైగా బలూచిస్థాన్ సమస్య గురించి సంయుక్త ప్రకటన ప్రస్తావించడం పాక్, చైనా కుమ్మక్కవడాన్ని బయటపెడుతోంది. మొత్తానికి అంతర్జాతీయ వేదికలపై చైనా-పాకిస్థాన్ కొమ్ముకాస్తూనే ఉంటుందని మరోసారి రుజువైంది. భారత్ విషయంలో అయితే చైనా నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరిస్తాయని తేలిపోయింది.

భారత్ అగ్రశక్తిగా ఎదగడం చైనాకు సుతరామూ ఇష్టంలేదు. అందుకే పాక్ శిఖండిని మనపైకి ఉసిగొల్పుతూ ఉంటుంది. ఉగ్రవాదంపై భారత్ ఆందోళన, నిరసనలు, విధానాలు ఎస్‌సీవోతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థల అజెండాలో చేరకుండా చైనా సైంధవుడిలా అడ్డుపడుతూనే ఉంటుంది. ఈ పరిస్థితిలో ఎస్‌సీవో నుంచి ఇండియా వైదొలగాలా అనే ప్రశ్న తలెత్తుతుంది. దానికి 'వద్దు' అనే జవాబివ్వాలి. ఇండియా ఎస్‌సీవోలో సభ్యదేశం కాకుంటే, ఆ సంస్థ భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి ఉండేది. ఇండియా ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు తీసుకుని ఉండేది. పైగా ఎస్‌సీవోలో ఆర్థికంగా బలీయమైన దేశాల్లో భారత్ కూడా ఒకటి కాబట్టి చైనా, పాక్ మినహా ఇతర సభ్యదేశాలు మనతో వాణిజ్య, ఆర్థిక పొత్తులకు ప్రాధాన్యమిస్తూనే ఉంటాయి. ఎస్‌సీవోలో మధ్యాసియా దేశాలు ముఖ్యమైన భాగస్వాములు కాబట్టి వాటితో ఆర్థిక బంధాన్ని పటిష్ఠం చేసుకోవాలని దిల్లీ లక్షిస్తోంది. ఇరాన్‌లోని చాబహార్ రేవు నుంచి అఫ్గానిస్థాన్ మీదుగా మధ్యాసియాకు రవాణా మార్గాన్ని ఏర్పరచుకోవడం ద్వారా అక్కడి అమూల్య ఖనిజ వనరులను భారత్ దిగుమతి చేసుకోవడం వీలవుతుంది.

జేబు సంస్థగా మార్చుకోవాలని...

చింగ్‌డావ్‌లో పాక్, చైనాలు ప్రదర్శించిన వికట క్రీడ ఎంతోకాలం సాగకపోవచ్చు. కొద్ది నెలల్లో ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల సమావేశం జరగనుంది. అందులో ప్రాంతీయ భద్రత గురించి మళ్లీ ప్రస్తావన వస్తుంది. అక్కడ మరోసారి పాకిస్థాన్, చైనాల ద్వంద్వ క్రీడను ఎండగట్టడానికి ఇండియా తప్పక ప్రయత్నిస్తుంది. ఎస్‌సీవోను తన జేబు సంస్థగా మార్చుకోవాలని చైనా పన్నాగం పన్నుతోంది. దాన్ని భారత్, రష్యాలు సాగనివ్వవు. ఏకాభిప్రాయంపై ఆధారపడి నిర్ణయాలు తీసుకోవాలని పట్టుబడతాయి. మొన్నటి ఎస్‌సీవో సంయుక్త ప్రకటన పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావించకపోయినా, జులై ఒకటిన సమావేశమైన క్వాడ్ విదేశాంగ మంత్రులు దాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారు. ఈ దాడికి కారకులను కఠినంగా శిక్షించాలని సూచించారు. క్వాడ్‌లో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలు సభ్యదేశాలు. చైనా, పాక్‌ల లాలూచీ ఎస్‌సీవో ఐక్యతకు మంచిది కాదని ఇతర సభ్యదేశాలు గ్రహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



సంజయ్ పులిపాక
చైర్‌పర్సన్,
పాలిటియా రీసెర్చ్ ఫౌండేషన్

కొండలు ఎక్కేస్తున్నాడు!

హాయ్ ఫ్రెండ్స్! కాస్త ఎక్కువ దూరం నడవమంటేనే మావల్ల కాదంటాం. అదీ కొద్దిగా రాళ్లున్న రోడ్డు మీదైతే అసలు నడిచే ప్రసక్తే లేదనేస్తాం. కానీ మనలాంటి ఓ అబ్బాయి ఏకంగా కొండలూ, పర్వతాలూ ఎక్కేస్తున్నాడు. తన వివరాలేంటో తెలుసుకుందామా!

హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన అద్విక్ భమ్మర్కర్‌కు ఏడేళ్లు. రెండో తరగతి చదువుతున్నాడు. అమ్మానాన్నలు సారిక, ఉమేశ్ వైద్యులు. ఆటలన్నా, కొత్త విషయాలు నేర్చుకోవడమన్నా అద్విక్‌కి చాలా ఇష్టమట. వాళ్ల నాన్నతో కలిసి 3కి.మీ, 5కి.మీ మారథాన్‌లకు ఆసక్తిగా వెళ్లేవాడు. ఎప్పటికైనా స్కైడైవింగ్ చేస్తాను, రాక్‌క్లైంబింగ్ చేస్తానని



హాయ్! బుజ్జీ!!

చెబుతుండేవాడట. తన ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు రాక్‌క్లైంబింగ్, రాపెల్లింగ్ శిక్షణలో చేర్పించారు. కొన్ని రోజుల్లోనే తమిళనాడులోని 155 అడుగుల ఎత్తున్న మలైపట్టు కొండను, కళ్లకు గంతలు కట్టుకుని నాలుగు నిమిషాల 48 సెకన్లలో ఎక్కేశాడు. దాంతో 'నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించాడు. బేసిక్ రాక్ క్లైంబింగ్ కోర్సు పూర్తి చేసి అందులో సర్టిఫికెట్, మెడల్ కూడా అందుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఎవరెస్ట్ బేస్ క్యాంపు ట్రెక్కింగ్ కోసం అద్విక్‌ని సిఫారసు చేయనున్నట్లు కోచ్ చెబుతున్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాడు. అద్విక్‌కి జిమ్నాస్టిక్స్‌లోనూ ప్రావీణ్యం ఉంది. అయిదేళ్ల వయసు నుంచే అందులో శిక్షణ తీసుకుంటున్నాడు. 'మొదట్లో కొండలు ఎక్కుతుంటే భయంగా అనిపించింది.. కానీ అలవాటయ్యాక చాలా సరదాగా అనిపిస్తోంది' అని చెబుతున్నాడీ నేస్తం.

– చింతలపాటి రామాంజనేయులు

ఒకే అక్షరం!

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరంతోనే రెండోది ప్రారంభమవుతుంది. అవేంటో రాయండి చూద్దాం.

1. పరుగు కాదు □□క□□ ఒక ఆట
2. ఆహ్వానానికి ఇచ్చేది □□క□ దీనితో రాస్తారు
3. కూతురు □□క□□ ఒక పువ్వు
4. ముందు కాదు □□క□□ కుండ
5. ఒక పక్షి □□క□□ లోటు

వదిలేస్తే ముప్పేగా.. తరలిస్తే తప్పనుగా!

కేదారేశ్వరపేట మార్కెట్‌తో సింగ్‌నగర్ వంతెనపై భారం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే


సింగ్‌నగర్ వంతెనపై నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ

విజయవాడలోని కీలకమైన సింగ్‌నగర్ వంతెన కట్టి 30 ఏళ్లవుతోంది. దీని సామర్థ్యం తగ్గుతున్న ఈ సమయంలో సాధారణ వాహనాలతో పాటు కేదారేశ్వరపేట మార్కెట్‌కు నిత్యం వచ్చే వందల వాహనాలు భారీ లోడ్‌తో రాకపోకలు సాగిస్తుండడం ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. వందల టన్నుల సరకు తీసుకుని వచ్చే కంటైనర్ల దెబ్బకు సింగ్‌నగర్ వంతెన నుంచి.. మార్కెట్ వరకూ తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. గతంలోనూ ఇలాగే ఈ భారీ వాహనాల దెబ్బకు సమస్యలు పెరిగిపోవడంతో వాహనదారులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు స్పందించి భారీ వాహనాలు రాకుండా రహదారిపై గడ్డర్లను పాతారు. కానీ అప్పటి వైకాపా పాలకుల మద్దతుతో గడ్డర్లను కోసేసి మరీ కొందరు పక్కన పడేశారు.

☛ కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను ఇక్కడి నుంచి నున్నకు తరలించాలంటూ అటు వ్యాపారులతో పాటు, స్థానికులు, వాహనదారులు ఏళ్ల తరబడి కోరుతున్నారు. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీలో భారీ కంటైనర్ వాహనాలు రావడంతో ఎదురయ్యే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం ఉద్యోగాలు, విద్యా సంస్థలకు ఈ మార్గంలోనే వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కేదారేశ్వరపేటలో రహదారి మొత్తాన్ని ఆక్రమించి పండ్ల వ్యాపారులు దుకాణాలు, తోపుడు బండ్లు పెట్టేశారు. ఈ దుకాణాలన్నీ కొందరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నగరానికి ట్రాఫిక్ అవస్థలు లేకుండా 23 ఎకరాల్లో నున్నలో పండ్ల మార్కెట్‌ను విశాలంగా ఏర్పాటు చేశారు. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. బైపాస్ పక్కనే ఈ మార్కెట్ ఉండడంతో.. నేరుగా వచ్చి మార్కెట్‌లోకి ఎంత పెద్ద వాహనాలైనా వెళ్లిపోవచ్చు. విశాలమైన రహదారులు, పార్కింగ్ సదుపాయం కూడా నున్న మార్కెట్‌లో ఉంది. అయినా కేవలం ఓ పది మంది స్వార్థం కోసం మార్కెట్‌ను ఇక్కడి నుంచి వెళ్లకుండా ఏళ్ల తరబడి అడ్డుకుంటున్నారు.


పండ్ల మార్కెట్‌కు వస్తున్న భారీ కంటైనర్

ఇంకెన్నాళ్లు ఇక్కడే ఉంచుతారు..

సింగ్‌నగర్ వంతెన మీదుగా మార్కెట్‌లోకి 50 నుంచి 60 టన్నుల వరకు భారీ కంటైనర్ లారీలు వస్తున్నాయి. ఈ దెబ్బకు ఏక్షణంలోనైనా సింగ్‌నగర్ వంతెనకు ప్రమాదం తప్పని పరిస్థితి ఉందనే ఆందోళన చాలాకాలంగా ఉంది. రోజుకు కనీసం 200 వాహనాలకు పైగా కేదారేశ్వరపేట మార్కెట్‌కే వస్తుంటాయి. ఇది మధ్య, పశ్చిమ రెండు నియోజకవర్గాలు కలిసే ప్రాంతం కావడంతో.. ఆసుపత్రులు, కళాశాలలతో పాటు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకూ ఇదే ప్రధాన మార్గం. మార్కెట్‌ను దాటి వెళ్లడమంటే.. పద్మవ్యూహాన్ని ఛేదించడమే అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ భారీ వాహనాలు నగరంలోకి వస్తుండడంతో ప్రమాదాలు సైతం పెరిగాయి. ఇటీవల ఓ చిరు వ్యాపారి వీటి చక్రాల కిందపడి చనిపోవడంతో కేసు నమోదైంది. కనీసం ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి.. మార్కెట్‌ను నున్నకు తరలించే ప్రయత్నం చేస్తే అన్ని వర్గాలకూ ఊరట లభిస్తుంది.



పది రోజుల కిందట రాత్రివేళ లారీ ఢీకొట్టడంతో వారధి రక్షణ గోడ కొంతమేర ధ్వంసమైంది. నిత్యం వందల వాహనాలు తిరిగే ఈ వంతెనపై దెబ్బతిన్న గోడను త్వరితగతిన బాగు చేయాలి. కానీ పోలీసులు స్టాపర్లు పెట్టి వదిలేశారు. రక్షణ గోడను త్వరగా బాగు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

దొంగ బిల్లులు.. దర్జాగా చెల్లు..!

-ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో నాయకుల అండతో సిబ్బంది, అధికారులు చేసిన అడ్డగోలు వ్యవహారాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. జి.కొండూరు మండలం ఉపాధి పనుల్లో రూ.3కోట్లు ఉపాధి హామీ నిధులు దోచేశారు. ఒకే పనికి రెండు బిల్లులు పెట్టేసి ఉద్యోగులను ఉపాధి శ్రామికులుగా చూపించిన.. పనులు చేయకుండానే చేసినట్లు మాయ చేసినా పట్టించుకున్న నాథుడు లేడు. కళ్ల ముందే బిల్లులు చేసేశారు.

వైకాపా పాలనలో రూ.3 కోట్లు స్వాహా

☛ జి.కొండూరు మండలంలో 2024-25లో ఏప్రిల్-జూన్ వరకు కాలువల్లో పూడిక తీత పనులు జరిగాయి. వీటిల్లో ఓ కాలువ పని చేయించిన క్షేత్ర సహాయకుడికి బిల్లులు పెట్టారు. అదే పనికి మరో క్షేత్ర సహాయకుడు బిల్లులు పెట్టారు. అధికారులు పరిశీలించి బిల్లులు చెల్లించాల్సి ఉన్నా ఇద్దరికీ డబ్బులు ఇచ్చేశారు. దీంతో ఒక పనికి రెండు బిల్లులు ఇచ్చినట్టయింది. ఇదే తరహాలో దాదాపు 20 కాలువలకు అడ్డగోలుగా బిల్లులు చేశారు. ఇలా రూ.58లక్షలు మింగేశారు.

☛ మండలంలోని చాలా ప్రాంతాల్లో క్షేత్రసహాయకులు ఉద్యోగులనే ఉపాధి శ్రామికులుగా చూపించారు. విధులకు వెళ్లే ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులకు హాజరు వేసి వేతనాలు రప్పించేశారు. వారికి కాస్తో కూస్తో ముట్టజెప్పి ఐదేళ్లలో రూ.లక్షల్లో దండుకున్నారు.

మూడు నెలల్లో సర్దేశారు..

మండలంలో దాదాపు 25వేల జాబ్‌కార్డులు ఉండగా వేతనాలకు రూ.15.21 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌గా రూ.5.1కోట్లు కేటాయించారు. మార్చి నుంచి జూన్ వరకు దాదాపు 80 శాతం ఉపాధి పనులు జరుగుతాయి. మట్టి పనులు, కాలువలు, చెరువుల్లో పూడికతీత, పంట కుంటలు తవ్వడం, డొంక రహదారుల నిర్మాణాలు చేపడతారు. గతేడాది ఈ సమయంలో సరిగ్గా ఎన్నికల ముందు కావడం.. ప్రభుత్వం మారే అవకాశాలు ఉండడంతో మండలంలోని కొందరు వైకాపా నాయకులు, క్షేత్రసహాయకులు, కొందరు అధికారులు కుమ్మక్కై మళ్లీ అవకాశం రాదని నిధులు దోచేశారు.

రెండు మూడు రెట్లు అధికంగా..

క్షేత్ర స్థాయిలో చేసిన పనుల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా రికార్డుల్లో నమోదు చేశారు. ఉదాహరణకు ఒక కాలువలో 20 మీటర్లు



పూడిక తీసి 100 మీటర్లు చేసినట్లు నమోదు చేశారు. చెరువుల్లో పూడికలు, డొంక దారుల నిర్మాణంలోనూ చేసిన పనికి బిల్లులకు పొంతన లేదు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు చేయకుండానే చేసినట్లు చూపించి మాయ చేశారు. ఇలా మండలంలో దాదాపు 80శాతం పైగా పనుల్లో ఇదే తంతు. అధికారులకు విషయం తెలిసినా పరిశీలించకుండా వాటాలు తీసుకుని బిల్లులు చేసేశారు. గతేడాది రూ.3కోట్లు అక్రమాలు జరిగినట్లు తేలింది. తాజాగా జరిగిన సామాజిక తనిఖీల్లో అక్రమాలు తెలుసుకున్న అధికారులు విస్తుపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రాము తెలిపారు.

వయసు 24.. నేరాలు 40

కరుడుగట్టిన అంతర్ జిల్లా నేరస్థుడి పట్టివేత


స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : బాల్యం నుంచే దొంగతనాలు మొదలెట్టాడు. 24 ఏళ్ల వయసుకే 40 నేరాలు చేశాడు. పలు జిల్లాల పోలీసులను ఉరుకులు పెట్టించాడు. ఎవరికీ చిక్కకుండా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. చివరికి చిన్న క్లూతో దొరికిపోయాడు. అతడి నుంచి 60 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ ఏసీపీ దామోదర్ తెలిపారు. గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ఉయ్యాల రాజేష్ (24) కుటుంబం విజయవాడ, వాంబేకాలనీలో ఉంటోంది. అతడు 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్నప్పుడే దొంగతనాలు చేయడంతో మూడు సార్లు బాలుర పరిశీలనా గృహంలో ఉంచారు. బయటకు వచ్చినా తీరు మారలేదు. కూలి పనులు చేస్తూ.. చోరీలు చేసేవాడు. 2024, సెప్టెంబరులో మధురానగర్‌లో ఒక తమిళ కుటుంబం ఇంట్లో రూ.11 లక్షలు దోచాడు. జైలుకు వెళ్లి జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడు.

నడిచే వెళతాడు... రాజేష్‌కు బండి నడపడం రాదు. ఎంత దూరమైనా నడిచే వెళతాడు. రాత్రి వేళ బి.ఆర్.టి.ఎస్.రోడ్డు, ఫుట్‌పాత్‌లపై పడుకుంటాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో లేచి నడుచుకుంటూ వెళతాడు. రైల్వేలైను వెంబడి, కాలువ గట్ల వెంట వెళుతూ.. తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుంటాడు. పెద్ద పెద్ద గోడలను 5 సెకన్లలోనే ఎక్కేస్తాడు. ఇలా మధురానగర్‌లో 5 నేరాలు చేసి 94 గ్రాముల బంగారం చోరీ చేశాడు. పటమట, రాజోలు, నూజివీడు, నర్సాపురం, నాయుడుపేటల్లో మొత్తం 12 నేరాలు చేశాడు. దోచిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస నేరాలు జరుగుతుండటంతో నిఘా పెంచారు. నేరస్థలంలో కొన్ని వేలిముద్రలు దొరికాయి. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయాలతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. పేర్లు నమోదు చేసుకునే సమయంలో ఓ యువకుడు పారిపోయాడు. అతడి పేరు రాజేష్ అని తెలిసింది. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి విచారించారు. సీసీ కెమెరా ఫుటేజీలను జల్లెడ పట్టారు. మాచవరం స్టేషన్ పరిధిలో ఒక చోట కనిపించి, అంతలోనే మాయమయ్యాడు. ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి.. రెడ్ హ్యాండెడ్‌గా అతడిని పట్టుకున్నారు. విజయవాడ పరిధిలోని 6 కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఇతర సిబ్బందిని ఏసీపీ దామోదర్ అభినందించారు.

అడుగులోతు గుంతే.. అడగకుంటే అంతే!


కానూరు గ్రామానికి సమీపంలో..


పెట్రోలు బంకు సమీపంలో..

విజయవాడ బందరు రోడ్డు నుంచి కానూరుకు వెళ్లే ప్రధాన రహదారి మృత్యు మార్గంగా మారింది. అడుగు లోతుండే గుంతలు రహదారిపై చాలా ప్రాంతాల్లో ఉన్నాయి. కొద్దిరోజుల కిందట తాతినేని కత్యారావు అనే 30 ఏళ్ల మర్చంట్ నేవీ ఉద్యోగి తెల్లవారుజామునే ఈ రహదారిపై వెళ్తుండగా ఆర్‌సీఎం చర్చి సెంటర్ ఎదురుగా ఉన్న భారీ గుంతలో ద్విచక్ర వాహనం పడి అదుపు తప్పింది. ఆయన రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరుసటిరోజు చనిపోయారు. ఈ ఘటన జరిగిన తర్వాత కూడా అధికారుల్లో చలనం లేదు. కామయ్యతోపు నుంచి కానూరు వరకూ వెళ్లే ఈ రహదారిపై ఉండే గుంతల్లో నిత్యం ద్విచక్ర వాహనాలు పడి అనేక మంది ప్రమాదాల బారినపడుతూనే ఉన్నారు. ఆ గుంతలను పూడ్చినా.. చాలావరకూ ప్రమాదాలను అరికట్టొచ్చు. అయినా మరమ్మతులు కూడా చేయకుండా నెలల తరబడి అలాగే వదిలేశారు.

– న్యూస్‌టుడే, కానూరు

నన్ను బయటకు తీసుకువస్తే
రెట్టింపు డబ్బులు ఇస్తా..

పటమట, న్యూస్‌టుడే: అద్విక ట్రేడింగ్ కంపెనీ ఎండీ ఆదిత్య ఇంకా ఏజెంట్లను మభ్య పెడుతూనే ఉన్నాడు. గురువారం విచారణ సందర్భంగా ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలిశారు. మమ్మల్ని ఎందుకు మోసం చేశావనీ.. మమ్మల్ని నమ్మి పెట్టుబడి పెట్టిన వారంతా.. మా ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని ఏజెంట్లు అందరూ ఆదిత్యను ప్రశ్నించారు. తనని ఈ కేసు నుంచి బయటకు తీసుకువస్తే... తాను రాగానే అందరి డబ్బులు తిరిగి ఇచ్చేస్తాననీ, తనను తక్కువ అంచనా వేయకండని ఆదిత్య వారితో చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం తన దగ్గర డబ్బు అంతా బ్లాక్ అయిందనీ.. అందరూ కలిసి డబ్బులు వేసుకుని తనను బయటకు తేవాలని తెలిపాడు. బయటకు రాగానే డబ్బులు ఇవ్వడంతోపాటు ఇప్పుడు జరిగిన వ్యాపారం కంటే రెట్టింపు వ్యాపారం ఇస్తానని వారితో తెలపడంతో ఏజెంట్లు అందరూ షాక్ అయ్యారు. మరోవైపు ఏజెంట్లతో ఎంత నగదు కట్టించారనే వివరాలన్నీ సేకరించారు. దీంతో వారి ద్వారా చెల్లించిన వారి సంఖ్య దాదాపు కొలిక్కి వచ్చింది. అయితే కొంతమంది పెట్టుబడిదారులు నేరుగా ఆదిత్యకు నగదు చెల్లించారు. వారి వివరాలు తెలియరాలేదు. గురువారం మరో నలుగురు ఫిర్యాదు చేశారు. దీంతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినవారి సంఖ్య 100 దాటింది.

ఏజెంట్లతో అద్విక ఎండీ ఆదిత్య

కౌలు రైతులకు చేయూత

వడివడిగా సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ

కౌలు రైతులకు ఆర్థిక భరోసా, ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు ముందంజలో ఉన్నారు. నిబంధనలు కఠినతరంగా ఉన్నా రెండు నెలల్లోనే దాదాపు 48 శాతం వరకు కార్డులు అందించారు. ఆగస్టులోగా పూర్తి స్థాయిలో పంపిణీ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.


ఇప్పటికే 60వేల మందికి పైగా.. గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.17లక్షల కౌలు రైతులకే సీసీఆర్‌సీలు కార్డు ఇచ్చారు. ఈ సారి లక్ష్యం 1.26లక్షలకు పెంచారు. ఇప్పటి వరకు 60వేలకు పైగా జారీ చేశారు. కార్డుల పంపిణీలో చాలా జిల్లాల్లో 30 శాతం కూడా పూర్తికాలేదు. కార్డుల పంపిణీలో రాష్ట్రంలోనే రెండు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు ఖరీఫ్‌లో రుణ లక్ష్యం భారీగా పెంచారు. రూ.900 కోట్ల వరకు ఇస్తున్నారు. దీంతో ఎక్కువ మందికి కౌలు రుణ సాయంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందనున్నాయి.

అవగాహనతో మార్పు.. నిబంధనల ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలంటే భూయజమాని తాను భూమి సదరు రైతుకు కౌలుకు ఇచ్చినట్లు సాగుహక్కు అంగీకార పత్రం ఇవ్వాలి. దీనికి ప్రారంభంలో భూమిపై తాము హక్కులు కోల్పోతామన్న అపోహతో అంగీకార పత్రం ఇచ్చేవారు కాదు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గ్రామాల్లో సభలు నిర్వహించి చాలా వరకు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో చాలా మంది రైతులు అంగీకరిస్తున్నారు.

ఇంకా మారాలి.. ఇంకా చాలా ప్రాంతాల్లో రైతులు అంగీకారం తెలపడం లేదు. కౌలు రైతుకు పత్రం ఇస్తే ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము, రాయితీలు, రుణాలు, నష్టపరిహారాలు ఇలా అన్నీ కౌలు రైతుకు వెళ్లిపోతాయన్న ఉద్దేశంతో అంగీకార పత్రం ఇవ్వకుండా ప్రయోజనాలన్నీ వారే పొందుతున్నారు. దీంతో పెట్టుబడి పెట్టిన కౌలు రైతు నష్టాలతో ఉసూరుమంటున్నారు. యజమాని అంగీకారంతో ప్రమేయం లేకుండా తాము సాగు చేస్తున్న పొలాలకు సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చే విధానంపై దృష్టి సారించాలని కౌలు రైతులు కోరుతున్నారు. – ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో గత 2 నెలల కార్డులు..

జిల్లా	లక్ష్యం	పంపిణీ
కృష్ణా	70,000	34,540
ఎన్టీఆర్	56,000	26,278
మొత్తం	1,26,000	60,818



కాలువలకు 5,938 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు గురువారం 5,938 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

పట్టిసీమ నీటి విడుదల: పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడి కాలువలోకి గోదావరి జలాలను విడుదల చేశారు. గురువారం విడుదల చేసిన ఈ నీరు.. ప్రకాశం బ్యారేజీకి చేరడానికి సుమారు 5 రోజులు పడుతుంది.

భావితరాల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి భరోసా


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

కంచికచర్ల, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో రాష్ట్ర అభివృద్ధి పడకేసిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. కంచికచర్ల మోడల్ కాలనీలో గురువారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుతూ.. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛను పెంచి పేదలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. పాఠశాలలు ప్రారంభమైన రోజునే 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థులకు నగదు సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గించామన్నారు. మరోవైపు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ.. భావితరాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తున్నారన్నారు. కాలనీలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరగా, త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, తెదేపా మండల అధ్యక్షుడు కోగంటి బాబు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడలోని జిల్లా స్పోర్ట్సు అథారిటీ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ ఆర్‌కే సింగ్‌తో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద ఈ ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు 13 జిల్లాలతో పాటు యానాం ప్రాంతానికి చెందిన 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ ద్వారా సుమారు 10 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

జాతీయ లోక్‌అదాలత్ రేపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో ఈ నెల 5న శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎ.సత్యానంద్ తెలిపారు. సివిల్, రోడ్డు ప్రమాద కేసులు, ఫ్యామిలీ కోర్టు విషయాలు, వాణిజ్య వివాదాలు, రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారు. దీని నిమిత్తం 13 న్యాయమూర్తులతో 13 బెంచిలను ఏర్పాటు చేశారు. ప్రతి బెంచిలో న్యాయమూర్తితో పాటు ఒక న్యాయవాది, ఒక సోషల్ వర్కర్ ఉంటారు. వీరు ఆయా కేసులను విచారించి పరిష్కరిస్తారు.

పన్ను కట్టాలని వీళ్లు.. కట్టేది లేదని వాళ్లు

న్యూస్‌టుడే, విజయవాడ నగరపాలక సంస్థ

నగరపాలక సంస్థ, దుర్గగుడి మధ్య వివాదం

విజయవాడ దుర్గగుడి, నగరపాలక సంస్థ మధ్య ఆస్తిపన్ను వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. దుర్గగుడి నుంచి తమకు రూ. కోట్లలో ఆస్తిపన్ను బకాయిలు రావాలని, కానీ అటునుంచి ఎలాంటి స్పందనా ఉండడం లేదంటూ నగరపాలక సంస్థ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో దుర్గగుడికి రెండు ఆస్తులు న్నాయి. వాటిపై ఈ ఏడాది మార్చి వరకు రూ.2.33 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఏప్రిల్ 2025 నుంచి కూడా ఆస్తి పన్ను బకాయి చెల్లించాలి. మధ్య నియోజకవర్గం లోనూ మరో మూడు విలువైన ఆస్తులున్నాయి. వాటిపైనా ఇప్పటివరకూ రూ.1.94 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటిని వెంటనే చెల్లించాలంటూ ఆలయ ఈవో, నగరపాలిక అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతున్నాయి. హిందూ ధార్మిక సంస్థలకు మినహాయింపు ఉండగా ఈ పన్నులు ఎలా వేస్తారంటూ దేవస్థానం అధికారులంటున్నారు. పైగా.. న్యాయస్థానాల తీర్పుల మేరకు.. తాము చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చి చెబుతుండగా.. అదేం కుదరదు చెల్లించాల్సిందేనని వీళ్లు పట్టుబడుతున్నారు. తాజాగా నగరపాలక సంస్థ కౌన్సిల్ లోనూ దీనిపై చర్చ జరిగింది. ✧ 2017-25 మధ్య కాలంలో మాకు రూ.4.27 కోట్ల బకాయిలు ఆలయం నుంచి వివిధ పన్నుల కింద రావాలని నగరపాలిక అధికారులు తాజాగా జాబితా విడుదల చేశారు. ఏటా దసరా, భవానీ దీక్షల వేడుకల వేళ పెద్దఎత్తున భక్తులు వస్తుండడంతో వారికి సదుపాయాల కల్పనలో నగరపాలక సంస్థ కూడా భాగస్వామ్యమవుతోంది. చెప్పుల స్టాండ్లు, క్లోక్‌రూంలు నిర్వహిస్తారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేందుకు ఒప్పంద సిబ్బందిని గుత్తేదారుల ద్వారా తీసుకుంటారు. దీనికోసం ఏటా రూ.లక్షల్లో నగరపాలక సంస్థకు వ్యయం అవుతోందని, దేవస్థానం నుంచి తమకు అవి చెల్లించడం లేదని పేర్కొంటున్నారు.

గతంలోనూ గగ్గోలు..

గతంలోనూ ఇలాగే బకాయిలు పేరుకుపోయాయంటూ గగ్గోలు పెట్టడంతో జిల్లా అధికారులు ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాల్సి వచ్చింది. 2024 దసరా ఉత్సవాలకు నగరపాలక సంస్థ రూ.14.85 లక్షలు వెచ్చించగా.. ఆ మొత్తాన్ని దేవస్థానం చెల్లించింది. 2024 భవానీ దీక్షల విరమణ సందర్భంగా వెచ్చించిన రూ.5.38 లక్షలు మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదని నగరపాలిక అధికారులంటున్నారు. మరోవైపు దుర్గగుడి అధికారులు మాత్రం.. దసరాను అధికారికంగా రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించాక, ఆయా ప్రభుత్వ విభాగాలు వారి సొంత నిధులతోనే ఏర్పాట్లు చేయాల్సి ఉండగా.. ఎవరికి వారు బిల్లులు పెట్టి తమ నుంచి వసూళ్లు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

చెల్లించాల్సిందే

– జి.సృజన, డీసీఆర్

కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయిలను చెల్లించాలంటూ తాజాగా ఈవో దృష్టికి తీసుకెళ్లాం. గతంలో సక్రమంగానే చెల్లించేవారు. ఇప్పుడు మాత్రం న్యాయస్థానం తీర్పు ఉందంటూ చెల్లించడం లేదు. మా నిబంధనల ప్రకారం ఎలాంటి మినహాయింపు లేదు. వారూ బకాయిలు చెల్లించాల్సిందే.

సస్యరక్షణ.. యాజమాన్య పద్ధతులతో మేలు

ఫోన్‌ఇన్‌లో ఘంటసాల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత

ఘంటసాల, న్యూస్‌టుడే

రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్ఎస్) ప్రధాన శాస్త్రవేత్త వి. సత్యప్రియలలిత అన్నారు. ఇటీవల నిర్వహించిన 'ఈనాడు.. మీతోడు' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా రైతుల నుంచి విశేష స్పందన లభించింది. శాస్త్రవేత్త రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తెగుళ్ల, సేద్య విభాగాల శాస్త్రవేత్తలు కె.లహరి, జె.పద్మావతి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు



రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త సత్యప్రియలలిత, నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు లహరి, పద్మావతి

వరిలో తుంగ నివారణ

వరి వెదజల్లే పద్ధతిలో తుంగ నివారణకు విత్తిన 15-20 రోజులకు లేదా కలుపు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఎకరానికి 800 మి.లీ. బెంటజోన్ 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పుల్లవిరుపు, కణుపుల గడ్డి నివారణకు విత్తిన 15-20 రోజులకు ఫినాక్సీప్రాప్ ఇథైల్ 7 శాతం ద్రావకం ఎకరానికి 200-250 మి.లీ. 200లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎరువుల యాజమాన్యంనకు.. నత్రజని మొదటిసారి విత్తిన 15 రోజులకు, రెండోసారి పిలక దశలో, మూడో సారి చిరు పొట్ట దశలో వేసుకోవాలి. ఏ సాగులోనైనా భాస్వరం ఎరువును ఆఖరి దుక్కి లేదా దమ్ములో వేయాలి. పొటాష్ ఆఖరి దుక్కిలో సగం, మిగిలిన సగ భాగం చిరుపొట్ట దశలో వేయాలి. నత్రజని ఎరువులు మాగాణి వరి కంటే వెద పద్ధతిలో దాదాపు 25 శాతం ఎక్కువ వేసుకోవాలి.

ఇనుప, జింకు ధాతు లోపాలు...

వరిలో ఇనుప ధాతు లోపం నివారణకు 20 గ్రా. అన్నబేధి, 2 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లోపం ఎక్కువ ఉంటే 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింకు లోప నివారణకు వరి పండించే భూముల్లో ప్రతి 3 పైర్లకు ఒకసారి ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింక్

చౌడు భూముల యాజమాన్యం

పచ్చిరొట్ట ఎరువైన జీలుగను కలియదున్నడం లేదా పశువుల ఎరువు ఎకరానికి 1.2 టన్నులు వేయడం లేదా వరిగడ్డి కలియదున్నుకోవాలి. పొటాష్ ఎరువును వేసుకోవాలి. జింకులోప నివారణకు.. లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్, ఉడికిన 15 నుంచి 20 రోజులకు 5 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. నారును ఒత్తుగా నాటుకోవడం, చౌడును తట్టుకునే ఎంసీఎం-100, ఎంసీఎం-103, ఎంసీఎం-125, ఎంటీయూ -1061, ఎంటీయూ 1293 రకాలు సాగు చేసుకోవాలి.

సల్ఫేట్ వేయాలి. భాస్వరం, జింకు సల్ఫేట్ ఎరువులు వేసేటప్పుడు వాటి మధ్య కనీసం 2-3 రోజుల వ్యవధి ఉండాలి. పైరుపై తుప్పు మచ్చలు కనబడి మొక్క గిడసబారినప్పుడు జింకు లోపంగా పరిగణించి లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మినుములో బంగారు తీగ సమస్య

తొలకరిలో పొలంలోని బంగారు తీగను పూత రాక ముందు దున్నాలి. లేదా పారాక్వాట్ మందుతో నివారించాలి. పైరు విత్తిన వెంటనే ఎకరానికి 1.5 లీ. పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకాన్ని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లిన వెంటనే, 200 లీ. నీటిని పిచికారీ చేస్తే 60 నుంచి 70 శాతం వరకు బంగారు తీగను నిర్మూలించవచ్చు. పైరు విత్తిన 20 రోజులకు ఇమాజితాపిర్ 10 శాతం ద్రావకం ఎకరానికి 200 మి.లీ., 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి పెరిగితే మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను సాగు చేసుకోవాలి.

నారుమడి బాగుండాలంటే...

వరి నారుమడిలో ఊద నిర్మూలనకు విత్తిన 14 రోజులకు సైహాలోఫాప్ పి బ్యూటైల్ 10 శాతం ద్రావకం 400 మి.లీ.... 200 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. అన్ని రకాల కలుపు జాతుల నివారణకు బిస్‌పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 80 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సేంద్రియ సాగులో ఎరువుల వినియోగం

పచ్చిరొట్ట పెంచి కలియదున్నినప్పుడు బాగా చివికిన పశువుల ఎరువును ఎకరానికి 4 టన్నులు ఊడ్పు ముందు వేయాలి. అజోస్పైరిల్లమ్, పీఎస్‌బీ మనియఫూర్‌బీ 2 కిలోలు ఎకరానికి 100 కిలోల పశువుల ఎరువుతో కలిపి నాట్ల సమయంలో వేసుకోవాలి. 200 కిలోల వేపచెక్కను దుబ్బుచేసే అంకురం దశలో వేయాలి. ఎకరానికి ద్రవ జీవామృతం 200 లీ. నేలలో కలిసేలా 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పిలక దశలో వేసుకోవాలి. 30 రోజుల వ్యవధిలో పంచగవ్య 3 శాతం, లేదా 5 శాతం ఆవు మూత్రం పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు..

ముందుగా పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలి. కాండం కుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి కాండం మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.



మొక్కజొన్నలో కలుపు తొలగింపు

విత్తిన 2-3 రోజుల్లోపు అట్రజిన్ కలుపు మందు ఎకరానికి 1200 గ్రా. 200 లీ.నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. 15-18 రోజులకు గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి 115 మి.లీ. టెంబోట్రియాన్‌ను 400 గ్రా. అట్రజిన్‌తో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాకు కలుపు నివారణకు 2.4 డీసోడియం సాల్ట్ ఎకరానికి 500 గ్రా. 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తుంగ ఎక్కువగా ఉంటే హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ 40 గ్రా. ఎకరానికి 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సన్న, అధిక దిగుబడినిచ్చే వరి రకాలు

బీపీటీ 5204కి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి కలిగిన రకాలు ఎంటీయూ -1224 (పంట కాలం 135-140 రోజులు), ఎంసీఎం -103 (పంట కాలం 140 రోజులు). అధిక దిగుబడినిచ్చే వరి రకాలు ఖరీఫ్‌లో ఎంటీయూ -1318 (పంట కాలం 150 రోజులు), ఎంటీయూ - 1262 (పంట కాలం 155 రోజులు), దాళ్వాలో ఎంటీయూ - 1121 (పంట కాలం 121-125 రోజులు), ఎంటీయూ -1153 (పంట కాలం 120 రోజులు), ఎంటీయూ -1293 (పంట కాలం 120 రోజులు)

మినుములో కాండం గజ్జి తెగులు

వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి. కిలో విత్తనానికి మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. 2 కిలోల ట్రైకోడెర్మాను 80 కిలోల మాగిన పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండితో కలిపి విత్తుకునే సమయంలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయడం వల్ల నేల నుంచి సంక్రమించే అన్ని రకాల శిలీంధ్ర తెగుళ్ల నుంచి రక్షణ కలుగుతుంది. తెగులు సోకిన ప్రాంతం నుంచి వ్యాధి చెందకుండా జాగ్రత్త పడాలి. హెక్సాకొనజోల్ 2 మి.లీ. ద్రావణం లీటరు నీటికి కలిపి తెగులు సోకిన ప్రాంతంలో నేల తడిసేలా పిచికారీ చేయాలి.

మేము సైతం... వీవీఐపీ బందోబస్తుకు..

తొలిసారిగా వీవీఐపీ ట్రాఫిక్ డైరెక్షన్‌కు మహిళా కానిస్టేబుల్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

వీవీఐపీ బందోబస్తు అంటే కత్తిమీద సామే. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఎక్కడికక్కడ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారు. ఇక వీవీఐపీ కాన్వాయ్ వస్తుంటే పైలట్ వాహనం నుంచి వీవీఐపీ వాహనం వరకు డ్రైవర్లందరికీ సరైన సమయంలో రూట్ డైరెక్షన్ ఇవ్వాలి. మరో వైపు వీవీఐపీకి సెల్యూట్ చేయాలి. ఇవన్నీ పురుష కానిస్టేబుళ్లే చేస్తుంటారు. ఈ పనులను మేము సైతం సులువుగా చేసేస్తామంటున్నారు విజయవాడ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుళ్లు. విజయవాడ నగరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్‌కు ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి తొలిసారిగా రూట్ డైరెక్షన్‌తో పాటు వీవీఐపీ సెల్యూట్ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో మహిళా సాధికారత పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సారి ప్రముఖ వ్యక్తుల వద్ద పురుష కానిస్టేబుల్ స్థానంలో వీవీఐపీ రూట్ సెల్యూట్‌కు మహిళా కానిస్టేబుల్‌ను తొలిసారిగా ఉపయోగించారు. కృష్ణా పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయం నుంచి తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్డు మార్గంలో ఉండవల్లిలోని తన నివాసానికి వెళుతున్నారు. ఈ సమయంలో ప్రకాశం బ్యారేజీ వద్ద కానిస్టేబుల్ శ్రీదేవి వీవీఐపీ సెల్యూట్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. విజయవాడ మహిళాశక్తిని చాటి చెప్పింది.



వీవీఐపీ సెల్యూట్ చేస్తున్న కానిస్టేబుల్ శ్రీదేవి

రాష్ట్రంలో డబుల్ కాదు.. నాలుగు ఇంజిన్ల సర్కార్ నడుస్తోంది

మంత్రి కొలుసు పార్థసారథి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ కాదని.. నాలుగు ఇంజిన్ల సర్కారు అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్, భాజపా.. నాలుగు ఇంజిన్లు అని వివరించారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుల-2025కు సంబంధించిన గోడపత్రికను విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురువారం ఆవిష్కరించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని, ప్రభుత్వంతో రూ.9.50 లక్షల కోట్ల ఎంవోయూ కుదుర్చుకున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.6.30 లక్షల కోట్లతో తమ సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలియజేశారు. ఆయా సంస్థలు 2027, 2028లో ఉత్పత్తులు విడుదల చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానాల ద్వారా పరిశ్రమలు నెలకొల్పేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకాస కోఛైర్మన్‌గా పాము శ్రీనివాసరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఐకాస కోఛైర్మన్‌గా ఏపీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.ఎస్. శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేసింది.



ఐకాస ఛైర్మన్ విద్యాసాగర్‌తో శ్రీనివాసరావు

ఏడాదిన్నరగా.. ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నాం

విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థుల ఆందోళన

ఈనాడు, అమరావతి: విదేశాల్లో వైద్య విద్యను చదివిన తర్వాత నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్‌ను సైతం పూర్తి చేసినా తమకు రిజిస్ట్రేషన్లు చేసి, శాశ్వత గుర్తింపు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలంటూ.. విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులు గురువారం ఆందోళన చేపట్టారు. తాము గత ఏడాదిన్నర నుంచి ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు ఇప్పటికైనా న్యాయం చేయాలని.. విశ్వవిద్యాలయం గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. రష్యా, ఫిలిప్పైన్స్, కజకిస్థాన్, నేపాల్, ఉక్రెయిన్ వంటి దేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన 1536 మంది విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారిందని, తమ ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. తాము విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి, ఆ తర్వాత ఏపీఎంసీ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఏడాది ఇంటర్న్‌షిప్‌ను కూడా పూర్తిచేసినా శాశ్వత రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో గత ఏడాదిన్నరగా ఇళ్లకే పరిమితమైపోయామని వాపోయారు. విద్యార్థులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం లోపలికి వెళ్లే వాహనాలను అడ్డుకుంటూ ఆందోళనను ఉద్ధృతం చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి విద్యార్థి సంఘాల నేతలను వాహనాల్లో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు.

ఎత్తిపోతల పునరుద్ధరణకు శ్రీకారం!

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వేదాద్రి-కంచల ఎత్తిపోతల మరమ్మతులను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం అర్ధరాత్రి వరకు పర్యవేక్షించారు. వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతలను పునరుద్ధరించే నిమిత్తం 12 గంటల పాటు తెదేపా నాయకులతో కలిసి ఆయా పనులను పర్యవేక్షించారు. ఎత్తిపోతలకు సంబంధించి తుప్పుపట్టిన యంత్ర పరికరాలు, పైపులను క్రేన్ సాయంతో బయటకు తీయించి.. శుభ్రం చేయించారు. 2019 నుంచి విద్యుత్తు బకాయిలు రూ.21 కోట్లు ఉన్నాయి. వాటిని మినహాయించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ఐడీసీ ఎస్ఈని ఉమామహేశ్వరరావు కోరారు. గురువారం ఉదయం నుంచి కంపచెట్లతో మూసుకుపోయిన ఎత్తిపోతల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఐడీసీ ఇంజినీర్లను పిలిపించి ఎత్తిపోతలకు సంబంధించి నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయించడానికి సిద్ధం చేస్తున్నారు. మాజీ మంత్రి ఉమా పట్టుదలగా దగ్గరుండి, ఎత్తిపోతల మరమ్మతులకు శ్రీకారం చుట్టడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నెస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘం అధ్యక్షుడు మన్నెం శ్రీనివాసరావు, తెదేపా నాయకులు ఉమ్మనేని విక్రం, కొల్లూరు నాగేశ్వరరావు, పెమ్మసాని అశోక్ పనులను పర్యవేక్షించారు.



వేదాద్రి ఎత్తిపోతల పనులు పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు

(కిలో ఒక్కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -95 రిటైల్ ధర 117 చికెన్ విత్ స్కిన్ - 170, చికెన్ స్కిన్‌లెస్ - 193.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 102, 110, 121 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

తీసుకున్న నగలెన్నో చెప్పు

బంగారంతో ఉడాయించిన వ్యాపారిని విచారిస్తున్న పోలీసులు

విద్యాధరపురం: పాతబస్తీలో కొనుగోలుదారులకు ఆభరణాలు చూపించి తెస్తానని చెప్పి ఉడాయించిన వ్యాపారి ఏనుగుల వినోద్‌ను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని గురువారం విచారించారు. పాతబస్తీ శివాలయం వీధిలో వేణుగోపాల్ బంగారు ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వినోద్ వచ్చి వేణుగోపాల్ వద్ద రూ.50లక్షల విలువైన 655 గ్రాముల ఆభరణాలు తీసుకెళ్లారు. వాటిని తిరిగి ఇవ్వకుండా దుకాణం మూసి వెళ్లడంతో వేణుగోపాల్ పోలీసులను ఆశ్రయించారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్న విషయం తెలుసుకున్న వినోద్ న్యాయవాది సహాయంతో వన్‌టౌన్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఎంత మంది నుంచి బంగారం తీసుకున్నారు, ఆ నగలు ఏమిచేశారు, ఎక్కడ దాచారు తదితర అంశాలపై పోలీసులు విచారించారు. నిందితుడి ఫోన్ నంబర్లు, తిరిగిన ప్రదేశాలు, ఇతర అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

రౌడీషీటర్ వీరంగం

పటమట, న్యూస్‌టుడే: ఓ ఇంటిని ఖాళీ చేయించేందుకు పెనమలూరుకు చెందిన రౌడీషీటర్ కొక్కిలగడ్డ జాన్‌బాబు వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచార్య ఎంజీ నగర్‌లో కృష్ణారావుకు చెందిన నివాసంలో కోట సామ్రాజ్యం నాలుగేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. ఇల్లు ఖాళీ చేసే విషయంలో వారి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో రౌడీషీటర్ జాన్‌బాబు.. 10 మంది అనుచరులు కలిసి సామ్రాజ్యం అద్దెకు ఉంటున్న ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. ఇంట్లో వస్తువులన్నీ ధ్వంసం చేసి కొన్ని వస్తువులు బయట పడేశారు. సామ్రాజ్యం పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంతో టాస్క్ పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతానికి కేసు నమోదు కాలేదు.

వెంటపడుతున్నాడని.. మట్టుబెట్టారు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే ఆక్రోశం ఒకరి హత్యకు దారితీసింది. ఎ.కొండూరు మండలం కొత్త రేపూడి సమీపంలోని ఓ మామిడి తోటలో రెడ్డిగూడెం మండలం పాత మద్దులపర్వ గ్రామస్థుడైన తాపీ మేస్త్రీ కోట రామారావు(రాము) హత్యకు గురైన సంగతి తెల్సిందే. ఇందులో ఏ1, ఏ2 నిందితులైన ఎ.కొండూరు మండలం తూర్పు మాధవరానికి చెందిన ఆదూరి చార్లెస్, రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామస్థురాలు బత్తుల కుమారిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో హత్యకు గల కారణాలను సీఐ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గిరిబాబు, పక్కన ఏసీపీ ప్రసాదరావు, ఎస్సై కృష్ణ, వెనుక నిందితులు

ముందస్తు పథకం ప్రకారమే

చార్లెస్‌కు..కుమారికి ఎప్పటినుంచో వివాహేతర సంబంధం ఉంది. తాపీ మేస్త్రీ అయిన రాముకు కూలీ పనుల వద్ద కుమారితో పరిచయం ఏర్పడింది. దీంతో తన కోరిక తీర్చాలని గత కొన్ని నెలలుగా రాము ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. ఈ విషయం చార్లెస్‌కు తెలిసింది. ఇద్దరు కలిసి రాముని హతమార్చి తమకు అడ్డు తొలగించుకోవాలని పథకం వేశారు. ఆ మేరకు గత జూన్ 26న రామును తీసుకుని కుమారి కొత్తరేపూడిలోని చింతరెడ్డి రఘుపతిరెడ్డికి చెందిన మామిడి తోటకు చేరుకుంది. ముందస్తు పథకం మేరకు వారిద్దరు ఏకాంతంగా ఉండగా చార్లెస్ కర్రతో రాము తలపై బలంగా కొట్టాడు..అతను చనిపోయాడని నిర్ధారించుకున్న నిందితులిద్దరూ తమకేమీ తెలియనట్లు వెళ్లిపోయారు. 29వ తేదీ ఉదయం మామిడి తోటలో మృతదేహం వెలుగు చూడగా పోలీసులు విచారణ చేపట్టారు. అదే సమయంలో గత నెల 26వ నుంచి అదృశ్యమైన రాము కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా..మామిడి తోటలో మృతదేహం ఉందని అందిన సమాచారంతో అక్కడకు చేరుకుని అతడిదేనని గుర్తించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై 29వ తేదీన ఎ.కొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు దర్యాప్తులో వివాహేతర సంబంధం ఉన్న చార్లెస్, కుమారి అతడిని హతమార్చినట్లు తేలింది. నిందితులను తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించడంతో నూజివీడు ఉపకారాగారానికి తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలవరం-బనకచర్లపై బహిరంగ చర్చకు సిద్ధం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, గాంధీనగర్: 'పోలవరం-బనకచర్ల పథకం అత్యంత లోపభూయిష్టమైంది. అవాంఛనీయమైంది కావడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన "ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు'ను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తిరుగు తపాలాలో వెనక్కి పంపింది. ఈ పరిణామం మాకు ఆశ్చర్యం కలిగించలేదు' అని ఆలోచనపరుల వేదిక సభ్యులు అక్కినేని భవానీప్రసాద్, టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ అంశంపై వారు గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు.



మాట్లాడుతున్న భవానీప్రసాద్. పక్కన లక్ష్మీనారాయణ

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి..'ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ఏబీ వెంకటేశ్వరరావు, కంభంపాటి పాపారావుతో కలిపి పత్రికా సమావేశంలో వివరించాం. దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నవారు స్వేచ్ఛగా హేతుబద్ధంగా వ్యక్తపరచవచ్చు. కానీ తెదేపా అధికారిక యూట్యూబ్ ఛానల్ చైతన్యరథం ఒక చర్చను నిర్వహించి ఏబీ వెంకటేశ్వరరావును లక్ష్యంగా చేసుకుని కించపరుస్తూ మాట్లాడి వారి స్థాయిని, నైజాన్ని, దిగజారుడుతనాన్ని బయటపెట్టుకున్నారు' ఆ ఛానల్ నిర్వాహకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. మేం వ్యక్తం చేసిన అభిప్రాయాలపై బహిరంగ చర్చకు సిద్ధం. రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న పెండింగ్ ప్రాజెక్టులైన తెలుగుగంగ, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణం కూడా రాజకీయ సంకల్పంతో పోలవరం పూర్తి చేస్తున్నట్లు చేపట్టాలి. రెండేళ్లలో నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులు తక్షణం చేయాలని కోరుతున్నాం' అని తెలిపారు.

తగ్గుతున్న వానల తీవ్రత

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో వానల తీవ్రత తగ్గుతోంది. గురువారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 14.8 మి.మీ., గంపలగూడెం 6.4, విస్సన్నపేట 4.4, ఎ.కొండూరు 3.6, మైలవరం 2.4, వీరులపాడు 2.2, ఇబ్రహీంపట్నం 2, రెడ్డిగూడెం 1.4, కంచికచర్ల, చందర్లపాడు 1, జగ్గయ్యపేట, నందిగామ 0.8, వత్సవాయి, పెనుగంచిప్రోలు 0.6 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. జి.కొండూరు, విజయవాడ గ్రామీణ మండలాలు, విజయవాడ నగరంలో వర్ష ఛాయలు లేవు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9985095965

? బృందావనం కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదని పలు మార్లు పురపాలిక సిబ్బందికి ఫిర్యాదు చేశాం. రాత్రి సమయాల్లో పిల్లలు ట్యూషన్లకు వెళ్లి వస్తున్నారు. ఆ సమయాల్లో పాముల బెడదతో ఇబ్బందిగా ఉంది. **-శ్రీరాములు, స్థానికులు**

✔ రెండు రోజుల కిందట సమస్యను పరిష్కరించాం. మరోసారి సిబ్బందిని పంపి సమస్యను గుర్తించి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం. **-వాసు, వీధి దీపాల పర్యవేక్షకుడు**

? తుమ్మలపాలెం వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. కొన్ని రోజుల నుంచి పంచాయతీ సిబ్బంది వీటిని తొలగించడం లేదు. **- సాంబశివరావు, స్థానికుడు**

✔ పరిశీలించి సిబ్బందిని పంపి తొలగింపజేస్తాం. కార్యదర్శి ప్రసాద్. **-న్యూస్‌టుడే, కొండపల్లి, ఇబ్రహీంపట్నం(గ్రామీణం)**

? గొల్లపూడి కోయపేటలో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. చెత్త, వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోతున్నాయి.

-భార్గవ్, కోయపేట

✔ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం

-కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, గొల్లపూడి

స్పందనకు వందనం

వెల్లటూరులోని ప్రధాన కచ్చా కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు న్యూస్‌టుడే దృష్టికి తీసుకుని రాగా సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన మంగళవారం ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్యదర్శి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు** ✤ **స్థా**నిక పంచాయతీలోని చిన ఆంజనేయ స్వామి గుడికి వెళ్లే రహదారిలోని డ్రెయినేజీలో మురుగునీటి పారుదల సమస్యపై స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తెలియజేయగా గురువారం సిబ్బందితో శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం** ✤ పట్టణంలోని 11వ వార్డులోని డ్రెయినేజీలో పూడికతో మురుగు నీరు పారుదల లేక అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక లేకుండా తొలగింపజేశారు. ✤ పట్టణంలోని 18వ వార్డులో రేగు చెట్టు కూడలిలోని డ్రెయినేజీలో పూడిక ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలుపగా ఆయన స్పందించి పూడికను తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, తిరువూరు

ఎత్తిపోతల పథకం నూతన కమిటీ ఎన్నిక

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరులో గురువారం రాత్రి చెరుకు వెంకటరెడ్డి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకు నరసారెడ్డి(బాబు), ఉపాధ్యక్షుడిగా వజ్రాల ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గూడెల్లి రాఘవరావు, మరో 10 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎత్తిపోతల పథకంలో ఆయకట్టు 382 ఎకరాలు ఉందని, సాగునీరు సజావుగా అందేలా కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో బోగినేని రాజగోపాలరావు, పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా పని చేసిన కె.రాజమణి సాధారణ బదిలీలో వెళ్తూ బడికి అవసరమైన కంప్యూటర్‌ను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.జీ.వి.రామకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ సయ్యద్ అక్బర్‌పాషా, విద్యాసాగర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాపై బెదిరింపులు ఆపాలి

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై బెదిరింపులు ఆపాలని కోరుతూ గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సదరు కార్మికులు ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని గత నెల రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికే కొన్ని పురపాలికల్లో సమ్మె చేస్తుండగా, ఈ నెల 10 తర్వాత మరికొన్ని నగర పంచాయతీల్లో సమ్మె చేస్తారని తెలిసి ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.బాజీ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కట్లేరుపై వంతెన నిర్మాణానికి పాలనామోదం

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరుపై హైలెవెల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి రూ.30 కోట్లు మంజూరుకు పరిపాలనా ఆమోదం లభించిందని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. తిరువూరులోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయింపు దస్త్రం ఆర్థికశాఖ వద్దకు చేరిందన్నారు. అక్కడి నుంచి నిధుల కేటాయింపును త్వరలో ప్రకటిస్తారని, సెప్టెంబరు లోపు టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ ఏడాది అక్టోబరులో కట్లేరుపై పైవంతెన నిర్మాణ పనులు ప్రారంభమై వచ్చే ఏడాది వేసవి నాటికి పూర్తవుతుందన్నారు.

వాగుల నిండా.. వ్యర్థాల కొండ

★ డంపింగ్ సమస్యతో పూడుతున్న వాగులు

★ జలప్రవాహానికి అవాంతరాలు ఏర్పడతాయని ఆందోళన

మైలవరం, న్యూస్‌టుడే

రోజు రోజుకీ పేరుకుంటున్న వ్యర్థాలు వాగుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మేజర్ పంచాయతీ మైలవరంలో ప్రత్యేక డంపింగ్‌యార్డు లేక సేకరించిన చెత్త తరలింపునకు నానా తిప్పలు పడుతుంటే, సంపద తయారీ కేంద్రం సామర్థ్యం ఒక రోజు సేకరణకే సరిపోతోంది. వాగుల అభివృద్ధి పనులు జరుగుతున్న వేళ పేరుకున్న గుట్టలు బయటపడుతుంటే అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



పూరగుట్ట వాగులో పేరుకున్న చెత్త..

మైలవరంలో ఇలా..	
పంచాయతీలో వార్డులు	20
చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లు	5
రోజు సేకరిస్తున్న వ్యర్థాలు 15 నుంచి 20 టన్నులు	
ఎరువు తయారీకి వినియోగం నెలకు మూణ్నాలుగు టన్నులు	
వాగుల్లోకి తరలుతున్నది వందల టన్నులు	

ప్రత్యామ్నాయం దొరక్క

నియోజకవర్గ కేంద్రంలో 25 వేల జనాభా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వచ్ఛతపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. నివాసాల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలను నిత్యం ట్రాక్టర్లు, రిక్షాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. అందులో భాగంగా పదేళ్ల కిందటి వరకు స్థానిక చిన్నచెరువు ఎదురుగా ఉన్న స్థలానికి తరలించారు. క్రమేపీ గుట్టలుగా పేరుకుని, ప్రైవేటు స్థలం కావడంతో ముందుజాగ్రత్తగా స్థానిక అభ్యంతరాలతో తిరిగి దొరక్క ఐదేళ్ల కిందట పూరగుట్ట సమీపంలో వాగు అంచునే డంపింగ్‌కేంద్రంగా మార్చేశారు. వైకుంఠధామం సమీపం వాగులో పారబోయడం ప్రారంభించారు. సగం వాగును చెత్త మింగేయడంతో ప్రత్యామ్నాయ స్థలం

మునిగిపోతాయని ఆవేదన

ఇటీవల వాగుల్లో పూడిక, పిచ్చిచెట్ల తొలగింపు పనులు చేపట్టగా ఎక్కడ చూసినా వ్యర్థాలే బయటపడుతున్నాయి. వైకుంఠధామం పక్కన ఏకంగా సగం వాగు పూడుకుపోయింది. పూరగుట్ట వాగు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. వరదల సమయంలో ప్రవాహానికి అడ్డుపడే వ్యర్థాలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

పరిపాటిగా మారింది

వ్యర్థాలతో సంపద తయారు చేయాలన్నా అందుకు పరిస్థితులు అనుకూలించడంలేదు. సంపద తయారీకేంద్రంలో నిర్మించిన పిట్లలో కేవలం రెండ్రోజుల్లో సేకరిస్తున్న చెత్తతోనే నిండిపోతోంది. దాని నుంచి వాన పాముల ఎరువు తయారీకి దాదాపు 3 నెలల సమయం పడుతుంది. ఈ లోగా వచ్చేదంతా తిరిగి వాగుల్లో పోయడమే పరిపాటిగా మారింది. వందల టన్నుల వ్యర్థాలను నిల్వ చేయగలిగిన ప్రాంతాలను ఎంపిక చేయడం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని చెబుతున్నారు.

కృష్ణా జలాల సరఫరాపై సమీక్ష

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గానికి కృష్ణా జలాల సరఫరాపై గురువారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మోహిద్దీన్, ఈఈ రామ్‌దాస్, డీఈ శంకర్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ సుధాకర్, ఈఈ స్వామినాయుడు, డీఈ కృష్ణబాబు, పురపాలిక కమిషనర్ మనోజ పాల్గొని పనుల నిర్వహణపై చర్చించారు. అనంతరం మండలంలోని జి.కొత్తూరుకు చెందిన బంకా రాంబాబుకు కిడ్నీ శస్త్రచికిత్సకు రూ.లక్ష, పట్టణంలోని పాత తిరువూరుకు చెందిన బి.చరితసాయి అనే బాలికకు చెవి శస్త్రచికిత్స నిమిత్తం రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీలను ఎమ్మెల్యే అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తన కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నియోజకవర్గ స్థాయి కార్యాచరణ ప్రణాళికపై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ ఎం.హనుమంతరావు, ఎంపీడీవో సీహెచ్.రవిబాబు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

గొల్లపూడి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 9న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. గొల్లపూడిలోని పౌరసరఫరాల శాఖ గోదాములోని ముఠాకార్మికులతో ఆయన గురువారం సమావేశమయ్యారు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుపై విచారణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని గోపాలపురం వద్ద భూ సమస్యపై రెడ్డిగూడేనికి చెందిన చిన్నం సత్యనారాయణ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం భూ రికార్డులు అండ్ సర్వే ఏసీ సెటిల్‌మెంట్ డైరెక్టర్ టి.త్రివిక్రమరావు, తిరువూరు ఆర్డీవో కె.మాధురి తనిఖీలు చేశారు. అనంతరం ముచ్చినపల్లి గ్రామంలో 225 ఫైల్ గురించి భూమిని ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, డివిజన్ సర్వేయర్ సారంగపాణి, విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మాధురి, టి.త్రివిక్రమరావు తదితరులు

స్పందించారు..గుంతలు పూడ్చారు



గోతుల్లో వెట్ మిక్స్ పోసి చదును చేస్తున్న ట్రాక్టర్

విజయవాడ- విస్సన్నపేట ఆర్‌అండ్‌బీ రహదారి..కొత్తరెడ్డిగూడెం గ్రామంలో భారీ గుంతలు పడి వర్షపు నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై జూన్ 24న 'గోతుల మయం...రక్షణ దూరం' శీర్షికన చిత్రవార్త తో పాటు తారు రోడ్డుపై గోతుల సమస్య గురించి వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు స్పందించారు. ఆయా గుంతలను చిప్స్‌తో పూడ్చించి సమస్య తాత్కాలికంగా పరిష్కరించగలిగారు. రెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, ఉపసర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు), తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డిలు పనులు పర్యవేక్షించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



ప్రచార నిర్వహిస్తున్న సచివాలయం, పురపాలిక సిబ్బంది

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ముప్పుపై అవగాహన కలిగి వాటిని నివారిద్దామని ఇబ్రహీంపట్నం సచివాలయం సిబ్బంది పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కొండపల్లి పురపాలికలోని ఇబ్రహీంపట్నంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా అవగాహన లేమితో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, బాటిల్స్, ఇతర ఉత్పత్తుల వాడకం ఎక్కువైందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వయం నిషేధం చేసుకోవడంతో పాటు ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్ కంపోస్టింగ్ గురించి తెలుసుకోవాలని ప్రధాన వీధుల్లో ప్రదర్శనలు చేశారు. అనంతరం రింగుకూడలిలో ఉన్న దిన వ్యాపారులకు జూట్, గుడ్డ సంచుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పురపాలిక పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరులో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై సచివాలయ ఉద్యోగులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని దుకాణాల వద్దకు వెళ్లి వస్తువు విక్రయాలకు, రవాణాకు ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దని సూచించారు. ప్రజలు కూడా వస్త్రంతో కుట్టించిన సంచుల వస్తు రవాణాకు వినియోగించి ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు ఎలినేని చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంసిద్ధత కార్యక్రమాల తనిఖీ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల(ఎస్ఎస్)లో అమలు చేస్తున్న సంసిద్ధత కార్యక్రమాలను మానిటరింగ్ అధికారి, డైట్ అధ్యాపకుడు ఎన్.జోజిబాబు గురువారం తనిఖీ చేసినట్లు ఎంఈవో ఎ.శ్యామ్‌సుందరరావు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, విద్యామిత్ర కిట్ల పంపిణీ, భోజన పథకం, పదో తరగతిలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాలపై ఆయన వివరాలు తీసుకున్నారు. మూడు బడుల నిర్వహణపై జోజిబాబు సంతృప్తి వ్యక్తంచేశారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శంకరరావు పాల్గొన్నారు.



ఎంఈవోతో పరిశీలన వివరాల పత్రం అందజేస్తున్న జోజిబాబు

◇ చూసి వెళ్లాలి..లేకుంటే పడిపోతారు



మండలంలోని రోలుపడిలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తోంది. రోజూ ఏదో వాహనం అందులో పడి చోదకులు గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఒకరు పడి దెబ్బలు తగలడంతో మరో వాహనంపై ఆస్పత్రికి తరలించినట్లు స్థానికుడైన మేడా విజయ్ కుమార్ తెలిపారు. గ్రామంలోని చెరువు కట్టకు (బుర్రతూము) ఎదురుగా రోడ్డుపై ఉన్న గుంత వద్ద ప్రమాదాల నివారణకు స్థానికులు పిచ్చి మొక్కలు అడ్డుగా పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చించి ప్రమాదాలు నియంత్రించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రోలుపడి(తిరువూరు)**

◇ ఆక్రమించక ముందే బాగు చేయండి



మూలపాడు వాటర్ ట్యాంకు వద్ద ఉన్న పాత పశు చికిత్స కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని పశు పోషకులు విజ్ఞప్తిచేస్తున్నారు. గతంలో గ్రామానికి చెందిన పశువులకు ఈ భవనంలోనే చికిత్సలు అందిచేవారు. అనంతరం జాతీయ రహదారికి అటు వైపుగా ఉన్న త్రిలోచనాపురంలో పశువైద్యశాల నిర్మించడంతో అక్కడే పశువులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ భవనం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది. గ్రామంలోనే కొందరు భవనంతో పాటు స్థలాన్ని కూడా ఆక్రమించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు మరమ్మతులు నిర్వహించి కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మూలపాడు(ఇబ్రహీంపట్నం గ్రామీణం)**

◇ అధ్వానం..అటు వెళ్లలేం



కవులూరు కట్టుబడిపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. దీంతో కవులూరు గ్రామస్థులు కట్టుబడిపాలెం మీదుగా మండల కేంద్రం జి.కొండూరు చేరుకోవాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి మధ్యలో ఎన్‌సీఎల్ లైట్ వెయిట్ బ్రిక్స్ పరిశ్రమ ఉండడంతో భారీ వాహనాలు బ్రిక్స్ కోసం నిత్యం ఇటుగా ప్రయాణించడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. చినుకు పడితే గుంతల నిండా నీరు నిలిచి లోతు తెలియకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి అభివృద్ధి పై దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



కమిటీ వారికి విరాళం అందిస్తున్న దాతలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలేరు ఒడ్డున పునర్నిర్మాణంలో ఉన్న మఠం శివాలయానికి దాతలు గురువారం విరాళం అందించారు. సన్నే నాగేశ్వరరావు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సంయుక్తంగా రూ.4,11,116 విరాళాన్ని మఠం శివాలయ కమిటీ వారికి అందించారు.

తిరుపతమ్మ ఆలయానికి ..

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ నగరం విజయనగర్ కాలనీ గుణదలకు చెందిన రావూరి సుబ్బారావు, అల్లూరమ్మ దంపతులు గురువారం తిరుపతమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కొండపల్లి: అమరవీరుల త్యాగాలకు గుర్తుగా నిర్వహించుకునే మొహర్రంను కొండపల్లి హజ్రత్ బోడేసావలి దర్గా వద్ద గురువారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. దీక్షా పరులు నిప్పుల గుండాలను పీర్లను చేతబూని దాటారు. మత పెద్దలు అల్తాఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గొర్రెలకు నట్టల మందు తాగిస్తున్న జిల్లా జేడీ హనుమంతరావు

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రారంభమవ్వగానే గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు కచ్చితంగా తాగించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ ఎం.హనుమంతరావు సూచించారు. మండలంలోని రామచంద్రాపురంలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన సందర్శించి జీవాలకు నట్టల మందు తాగించారు. జులై 10 వరకు ప్రభుత్వం నిర్వహించే ఉచిత శిబిరాలను జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటక శివారెడ్డి, ఏడీఏహెచ్ డాక్టర్ కె.రామారావు, పశువైద్యాధికారి భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేల, గానుగపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని మల్లేల, గానుగపాడులో గురువారం మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు తాగించినట్లు పశువైద్యాధికారులు డి.అభిలాష్, టి.శ్వేత తెలిపారు. వీఏఎస్ ఎం.గోపాలకృష్ణ, వీఎల్వో బి.విజయ్, ఏవీహెచ్ కె.వీ.రామారావు పాల్గొన్నారు.

'కేసులతో నిర్బంధిస్తే మరింత ఉద్యమిస్తాం'

మైలవరం, న్యూస్‌టుడే: ప్రజల తరఫున పోరాడుతున్న సీపీఎం నాయకులను కేసులతో నిర్బంధిస్తే, ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందన్న సంగతిని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు సీపీఎంపై నిర్బంధం చేయలేదన్నారు. మంగళవారం నిరసన కార్యక్రమం నుంచి మండల కార్యదర్శి సుధాకర్‌ను స్టేషన్‌కు తరలించి, సాయంత్రం వరకు అక్కడే ఉంచి కేసు బనాయించారని వాపోయారు. అక్రమ కేసులు పెట్టి బెదిరించడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదని, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, కేసును తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుధాకర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

త్వరలో పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తాం

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాయనపాడు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రైల్వే, రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. రాయనపాడు వద్ద రైల్వే గేటు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఆర్వోబీ నిర్మించాలనే కొన్నేళ్లుగా ప్రతిపాదన ఉంది. శాంతినగర్ వద్ద నుంచి చెరువు కట్ట వరకు వంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కూటమి పాలనతో అందరికీ సంక్షేమం



తిరువూరు సుగాలీ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన తెదేపా నాయకులు



మైలవరం మండలం వెల్వడంలో..



కవులూరులో..



రెడ్డిగూడెంలో..



కొండపల్లిలో

న్యూస్‌టుడే బృందం: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువయ్యాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరువూరు పట్టణంలోని 9వ వార్డు సుగాలీ కాలనీలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటా కూటమి ప్రభుత్వం ఏడాదిగా అమలు చేసిన హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు.



గొల్లపూడిలో

గ్రామాల్లోని తెదేపా నాయకుల, కార్యకర్తలు కూడా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

అవీ ఇవీ

రెడ్డిగూడెం: నాగులూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఈవో పి.రమేష్‌బాబు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకుని రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

తిరువూరు: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం పి.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బదిలీయైన ఉపాధ్యాయులు ఈడే భరతకుమారి, ప్రియదర్శిని, సావిత్రి, నరేంద్ర, పద్మావతి, శారదను సత్కరించారు. సదరు ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు చేసిన కృషిని ప్రశంసించారు.

వృద్ధుడి నేత్ర దానం

కొత్తపల్లి(గంపలగూడెం): కొత్తపల్లికి చెందిన బొమ్మారెడ్డి మాధవరెడ్డి(74) మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ నేత్రాలయానికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు అతని నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించారు.

ఆస్తి కోసమే అంతమొందించాడు..?

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండంలోని చెవుటూరులో మంగళవారం ఉమ్మడి హైమావతి అనే మహిళ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు మొదటి నుంచి అనుమానిస్తున్న వ్యక్తే నిందితుడని జి.కొండూరు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో చిన్నకుమారుడు, చిన్నకుమార్తె వివాహం అనంతరం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. పెద్ద కుమార్తె వివాహం తర్వాత మూలపాడు గ్రామంలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు పరిటాల గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు కొడుకు(మనువడు)ఉమ్మడి వేణు ఆస్తి కోసం హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలిందని, ఆస్తి కోసమే ఈ అఘాయిత్యానికి చేసినట్లు నిందితుడు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఈనాడు బిజినెస్

ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూకొస్తే దమానీకి పండగే!

- చేతిలో 3.91 కోట్ల అన్‌లిస్టెడ్ షేర్లు
- ఒక్కోటి ధర రూ.2,389 ప్రకారం రూ.9,341 కోట్ల విలువ

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు వస్తే.. ప్రముఖ మదుపరి, డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీకి లాభాలపంటే!. ఎందుకంటే ఎన్ఎస్ఈలో దమానీకి 1.58% (3.91 కోట్ల షేర్లు) వాటా ఉంది. 2020 జనవరి-మార్చిలో విదేశీ పెట్టుబడిదారు నార్వెస్ట్ వెంచర్ పార్ట్‌నర్స్ నుంచి ఈ వాటాను దమానీ కొనుగోలు చేశారు. ఎన్ఎస్ఈ షేరు ఎక్స్ఛేంజీల్లో నమోదు కాలేదు. అయితే అన్‌లిస్టెడ్ షేర్ ధర ఒక్కోటి రూ.2,389 పలుకుతోంది. ఫలితంగా దమానీ దగ్గర ఉన్న ఎన్ఎస్ఈ షేర్ల నికర విలువ రూ. 9341 కోట్లు అవుతుంది. కాగా.. ఎంతో కాలంగా ఐపీఓకు వచ్చేందుకు, సెబీ అనుమతుల కోసం ఎన్ఎస్ఈ వేచి చూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కల నెరవేరుతుందని భావిస్తున్నారు. సాధారణంగా పెద్ద సంస్థలు ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేప్పుడు, ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు - ప్రస్తుత వాటాదార్లు కొంత వాటాలు విక్రయించి, ప్రయోజనం పొందుతారు. ఎన్ఎస్ఈ ఐపీఓలో దమానీ తన వాటా షేర్లను విక్రయిస్తారా? లేదంటే కొనసాగిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు. విక్రయిస్తే మాత్రం, ఆయన తన పెట్టుబడిపై గణనీయ ప్రతిఫలాన్ని పొందుతారనేది మార్కెట్ వర్గాల విశ్లేషణ.



బంగారం ఇంకా కొంటాం



- కేంద్ర బ్యాంకుల ఆసక్తి
- డాలర్ నిల్వలు తగ్గుతున్నాయ్
- సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్స్ సర్వే

ఈనాడు - హైదరాబాద్

బంగారంపై సాధారణ ప్రజలకే కాదు, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులకు మోజు తగ్గడం లేదు. కొంతకాలంగా సాధ్యమైనంత అధికంగా బంగారం నిల్వలు పెంచుకుంటున్న కేంద్ర బ్యాంకులు, మరో ఏడాది పాటు అదే బాటలో ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజాగా నిర్వహించిన 'సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్స్ సర్వే- 2025' ఈ విషయాన్ని వెల్లడించింది. వివరాలు తెలిపిన కేంద్ర బ్యాంకుల ప్రతినిధుల్లో 43% మంది.. బంగారం నిల్వలను ఇంకా పెంచుకునే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది పాటు బంగారం కొనుగోలు చేస్తామని వివరించారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక రంగానికి ఎదురవుతున్న ఇతర సవాళ్లు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాజకీయ, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకునే, బంగారం నిల్వలు పెంచుకోవాలనే నిర్ణయానికి వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 'రిజర్వ్ అసెట్'గా బంగారంతోనే భద్రత ఉంటుందనే నమ్మకంతో ఉన్నట్లు తెలిపారు. అఫిషియల్ మోనిటరీ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫోరమ్ అధ్యయనంలోనూ 32% కేంద్ర బ్యాంకులు వచ్చే రెండేళ్లలో బంగారం నిల్వలు పెంచుకోవడానికి చూస్తున్నాయి.

కొన్ని బ్యాంకులు ఇలా

✦ వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు ఈ ఏడాది మే నెలలో నికరంగా 20 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. ఏప్రిల్ కంటే ఇది అధికం. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రం కొనలేదు.

✦ నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్థాన్ ఇతర కేంద్ర బ్యాంకుల కంటే ఎక్కువగా 7 టన్నుల బంగారాన్ని సొంతం చేసుకుంది. 6 టన్నుల చొప్పున బంగారాన్ని తుర్కియే, పోలెండ్ కొనుగోలు చేశాయి.

✦ పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా, చెక్ నేషనల్ బ్యాంక్.. 2 టన్నుల చొప్పున బంగారాన్ని కొనుగోలు చేశాయి.

✦ గత నెలలో మోనిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ (ఎంఏఎస్) 5 టన్నుల బంగారాన్ని విక్రయించింది.

ఏటా 1,000 టన్నుల కంటే మించి

కొంతకాలంగా కేంద్ర బ్యాంకులు బంగారాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్నాయి. గత మూడేళ్లలో, ఏటా 1,000 టన్నులకు పైగా బంగారాన్ని ఇవి సొంతం చేసుకున్నాయి. పదేళ్ల క్రితం చూస్తే ఏటా 400- 500 టన్నులకు మించి బంగారాన్ని ఇవి కొనుగోలు చేయలేదు. వచ్చే అయిదేళ్లలో కేంద్ర బ్యాంకుల 'రిజర్వ్ అసెట్స్' లో బంగారం వాటా గణనీయంగా పెరగొచ్చు. అదే సమయంలో యూఎస్ డాలర్ నిల్వల వాటా తగ్గిపోనుంది.

ఐటీలోనే అధిక వేతనాలు

ఇండీడ్ పేమ్యాప్ సర్వే



దిల్లీ: మనదేశంలో అత్యధిక వేతనాలు చెల్లిస్తున్న రంగాల్లో ఐటీ, ఐటీ ఆధారిత సేవలు (ఐటీఈఎస్) అగ్రస్థానంలో ఉన్నట్లు ఒక సర్వే వెల్లడించింది. టెక్ రంగంలో తాజా ఉత్తీర్ణులు (ఫ్రెషర్లు) నెలకు సగటున రూ.26,800 అందుకుంటున్నారు. 5-7 ఏళ్ల అనుభవం కలిగిన వారు రూ.68,900 వేతనం పొందుతున్నారని అంతర్జాతీయ జాబ్ సెర్చ్, హైరింగ్ ప్లాట్‌ఫామ్ ఇండీడ్ నిర్వహించిన 'పేమ్యాప్' సర్వే నివేదిక వెల్లడించింది. డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) నిపుణులకు అధిక గిరాకీ కారణంగా ఐటీ రంగంలో వేతనాల వృద్ధి కొనసాగుతోందని నివేదిక స్పష్టం చేసింది. టెక్ రంగం తర్వాత వేతనాల వృద్ధి బలంగా నమోదు చేసిన రంగాల్లో తయారీ, టెలికాం ఉన్నాయి. ఈ రెండు రంగాల్లో ప్రారంభ స్థాయి వేతనాలు రూ.28,100- 28,800 మధ్య ఉన్నాయి. వీటిల్లో 5-8 ఏళ్ల అనుభవం కలిగిన నిపుణులు రూ.67,700- 68,200 వేతనాన్ని అందుకుంటున్నారు. 1311 సంస్థలు, 2531 మంది ఉద్యోగుల స్పందనల ఆధారంగా ఈ నివేదికను వెలువరించింది.

✦ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ నుంచి హెచ్ఆర్ ఇంజినీరింగ్ ఉద్యోగులకు ప్రారంభ స్థాయిలో రూ.25,000-30,500 మధ్య నెలవారీ జీతాలు లభిస్తున్నాయి. అన్ని రంగాల్లో ప్రోడక్ట్, ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులు ఎక్కువ వేతనాలు పొందుతున్నారు. 5-8 ఏళ్ల అనుభవం కలిగిన వీరికి రూ.85,500 వరకు నెలవారీ వేతనం లభిస్తోంది. ప్రస్తుత సంప్రదాయ టెక్ ఉద్యోగులకు సమానంగా యూఐ/యూఎక్స్ డిజైన్ సీనియర్ నిపుణులు రూ.65,000 వరకు అందుకుంటున్నారు.

✦ హైదరాబాద్‌లోనే వేతనాలు ఎక్కువ: వేతన వృద్ధి ఆకర్షణీయంగా ఉన్న నగరాల్లో హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్ ఉన్నాయని నివేదిక తెలిపింది. అయితే ఆయా నగరాల్లో జీవన వ్యయాలతో పోలిస్తే వచ్చే ఆదాయం సరిపోవడం లేదని 69% మంది ఉద్యోగులు చెప్పారు. దిల్లీ (95%), ముంబయి (95%), పుణె (94%), బెంగళూరు (93%)లో ఈ భావన మరింత ఎక్కువగా ఉంది. చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాలో మాత్రం వచ్చే వేతనాలతో తగిన విధంగా జీవించే పరిస్థితులు ఉన్నట్లు ఉద్యోగులు వివరించారు.

న్యూ ఆర్‌సీపీఎల్‌కు రిలయన్స్ రిటెయిల్ వినియోగదారు వ్యాపారం

దిల్లీ: వినియోగదారు వస్తువుల వ్యాపారాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన న్యూ రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (న్యూ ఆర్‌సీపీఎల్)కు రిలయన్స్ రిటెయిల్ బదిలీ చేయనుంది. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు సమర్పించిన పథకం ప్రకారం.. ఎఫ్ఎంసీజీ బ్రాండ్ వ్యాపారాన్ని రిలయన్స్ రిటెయిల్ లిమిటెడ్ (ఆర్ఆర్ఎల్) నుంచి న్యూ ఆర్‌సీపీఎల్‌కు బదిలీ చేస్తున్నారు. ఈ అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఆమోదం కోసం ఆర్ఆర్ఎల్, ఆర్ఆర్‌వీఎల్ (రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్) ఆర్‌సీపీఎల్ రుణదాతలతో 70 రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయాలని గత నెల 25న ఎన్‌సీఎల్‌టీ ముంబయి బెంచ్ కోరింది. ఆర్ఆర్‌వీఎల్ ప్రధానంగా రిలయన్స్ రిటెయిల్ వ్యాపార సరఫరా చైన్, లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌ను నిర్వహిస్తోంది. ఆర్‌సీపీఎల్ తయారీ, పంపిణీ, విక్రయాలు, ఎఫ్ఎంసీజీ విభాగంలోని బహుళ ఉత్పత్తుల మార్కెటింగ్, అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు, ఎఫ్ఎంసీజీ విభాగం రిటెయిల్ వ్యాపార సంయుక్త సంస్థల కార్యకలాపాలను నిర్వహిస్తోంది. వినియోగదారు బ్రాండ్ వ్యాపారం అభివృద్ధికి.. బ్రాండ్ నిర్మాణం, నిర్వహణ, ఉత్పత్తులపై పరిశోధన, తయారీ, పంపిణీ, మార్కెటింగ్ వంటి వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. ఆ సంస్థలు బలపడాలంటే.. భారీయెత్తున పెట్టుబడులు అవసరం కనుక, ప్రస్తుత ప్రక్రియ ద్వారా ఆకర్షించగలమని పేర్కొన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్)తో పాటు ఆర్ఆర్‌వీఎల్ పెట్టుబడిదారు కూడా కొత్త కంపెనీలోనూ ఆర్ఆర్‌వీఎల్ స్థాయిలోనే ఉంచుకుంటారని తెలిపాయి.

60 సింగపూర్ సంస్థలకు టీసీఎస్ ఏఐ సేవలు

సింగపూర్: సింగపూర్‌కు చెందిన 60 చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎస్ఎంఈ), అంకుర సంస్థలకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కృత్రిమ మేధ (ఏఐ) సేవలు అందించనుంది. ఇందుకోసం సిటీ ఆఫ్ సింగపూర్‌లో టీసీఎస్ అత్యాధునిక ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించింది. సైన్స్ పార్క్‌లోని టీసీఎస్ ఆసియా పసిఫిక్ కార్యాలయంలోనే ఈ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే 12 నెలల్లో 50 ఎస్ఎంఈలు, 10 స్టార్టప్‌లతో పాటు ఖాతాదారులు, భాగస్వాములకు ఏఐ సేవలను టీసీఎస్ అందించనుంది. ఈ ఇన్నోవేషన్ కేంద్ర కార్యకలాపాల కోసం డేటా సైన్స్, సైబర్ భద్రతా విభాగాల్లో ఉద్యోగాలకు స్థానిక యూనివర్సిటీల నుంచి 50 మంది వరకు తాజా పట్టభద్రులను నియమించే ప్రణాళికల్లో టీసీఎస్ ఉంది. ప్రస్తుతం సింగపూర్‌లో కంపెనీకి 6,600 మంది ఉద్యోగులు ఉన్నారు.

ముడిచమురు 60 డాలర్ల దిగువకు!

డిసెంబరుకు చేరొచ్చు: ఎస్ అండ్ పీ



దిల్లీ: ఈ ఏడాది డిసెంబరుకు బ్యారెల్ ముడిచమురు ధర 60 డాలర్ల దిగువకు చేరే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా వేసింది. ప్రస్తుతం 70 డాలర్ల సమీపంలో ట్రేడవుతోంది. అంతర్జాతీయంగా గిరాకీ మందకొడిగా ఉన్నా, ఉత్పత్తి పెంచాలని ఒపెక్+ దేశాలు నిర్ణయించడమే చమురు ధరల అదుపునకు కారణమని ఎస్ అండ్ పీ గ్లోబల్ కమొడిటీ ఇన్‌సైట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమాశిష్ దాస్ వెల్లడించారు. ఈ ఏడాది చివరకి బ్యారెల్ ముడిచమురు ధర 55-60 డాలర్ల శ్రేణిలో కదలాడొచ్చని అంచనా వేశారు. ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో పాటు భౌగోళిక ఉద్రిక్తతలు పెచ్చరిల్లినా.. ఒపెక్ దేశాలు ఉత్పత్తి కోత ప్రకటించినా, బ్యారెల్ చమురు ధర 70-75 డాలర్లకు చేరొచ్చని హెచ్చరించారు.

✦ ఈ ఏడాది ద్వితీయార్ధంలో భారత్‌లో చమురుకు గిరాకీ మెరుగ్గా ఉండొచ్చన్నారు. మన దేశ గిరాకీ రోజుకు 1.1- 1.2 లక్షల బ్యారెళ్ల మేర పెరగొచ్చని అంచనా వేశారు.

చమురు ధరల్లో కదలికలు ఇలా: 2022లో చమురు ధరలు క్షీణిస్తున్న నేపథ్యంలో, ఉత్పత్తి కోతను ఒపెక్+ దేశాలు ప్రారంభించాయి. నెలకు 2.2 మిలియన్ బ్యారెళ్ల మేర ఉత్పత్తి కోత విధిస్తూ అప్పట్లో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఈ ఏడాది ఏప్రిల్ ప్రారంభంలో ఒపెక్ దేశాలు నిర్ణయించాయి. ఫలితంగా బ్యారెల్ చమురు ధర 60 డాలర్ల దిగువకు చేరింది. తదుపరి ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో మళ్లీ 70 డాలర్ల వద్ద కదలాడుతోంది.

ఆర్‌కామ్ పరిణామాల ప్రభావం మాపై లేదు

రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్

దిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను 'మోసపూరితం (ఫ్రాడ్)'గా వర్గీకరించేందుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తీసుకున్న నిర్ణయంతో తమ వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలపై ఎటువంటి ప్రభావం ఉండబోదని అనిల్ అంబానీకే చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ స్పష్టం చేశాయి. తాము వేర్వేరు, స్వతంత్ర సంస్థలుగా ఉన్నామని, తమకు రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో ఎటువంటి వ్యాపార, ఆర్థిక సంబంధాలు లేవని పేర్కొన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ బోర్డులో అనిల్ అంబానీ డైరెక్టరుగా కూడా లేరని వెల్లడించాయి.

కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	575
వరంగల్	577
విజయవాడ	590
గోదావరి	570
విశాఖపట్నం	585
చిత్తూరు	633

ఆరోగ్య సంరక్షణ రంగానికి స్వతంత్ర నియంత్రణ సంస్థ?

బీమాకు ఐఆర్‌డీఏఐ, క్యాపిటల్ మార్కెట్లకు సెబీ, బ్యాంకింగ్‌కు ఆర్‌బీఐ ఉన్నట్లుగానే ఆరోగ్య సంరక్షణ రంగానికి ఒక స్వతంత్ర నియంత్రణ సంస్థ ఏర్పాటు కావొచ్చు. ఈ అంశంపై బీమా నియంత్రణాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ) కలిసి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు జీఐసీ సీఎండీ రామస్వామి నారాయణన్ తెలిపారు. ఇతర రంగాల నియంత్రణ సంస్థల తరహాలోనే ఇది కూడా పనిచేస్తుంది. ఆసుపత్రుల్లో రోగుల బీమా మొత్తాన్ని బట్టి, వైద్య సేవలకు ధరలను నిర్ణయించడంతో పాటు పలు మోసపూరిత చర్యలు బయటపడుతున్నందునే, నియంత్రణ దిశగా అడుగు వేయాల్సిన అవసరం కనిపిస్తోందని నారాయణన్ పేర్కొన్నారు. సొంతగా నగదు చెల్లించే రోగులతో పోలిస్తే, ఆరోగ్య బీమా ఉన్న రోగుల బిల్లులను మూడింతలు పెంచి చూపించిన ఆసుపత్రులూ ఉన్నాయన్నారు. దీనివల్ల బీమా కంపెనీలు ఏటా ప్రీమియం పెంచాల్సి వస్తోందని, ఇది వినియోగదార్లపై భారం మోపుతోందని వివరించారు.

2027 ఫిబ్రవరి 4-9 తేదీల్లో భారత మొబిలిటీ ఎక్స్‌పో

దిల్లీ: దేశంలో అతిపెద్ద వాహన ప్రదర్శన అయిన భారత మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2027 ఫిబ్రవరి 4-9 తేదీల్లో జరగనుందని కేంద్ర వాణిజ్య శాఖ గురువారం వెల్లడించింది. వాహన పరిశ్రమ ప్రతినిధులు, విధానకర్తలు, టెక్నాలజీ నిపుణులు సహా అన్ని వర్గాలను ఒక చోటకు చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపింది. వాహన, మొబిలిటీ రంగాల్లో తాజా పరిణామాలు, సాంకేతిక మార్పులను ప్రదర్శించడానికి ఈ ఎక్స్‌పో ఒక వేదికగా దోహదపడుతుంది. 2027 ఎక్స్‌పోలోకి కొత్త విభాగాలను తీసుకురావాలని భావిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈసారి లాజిస్టిక్స్, మల్టీమోడల్ మొబిలిటీకి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాక్టర్లు, వ్యవసాయ మొబిలిటీ సొల్యూషన్స్‌పైనా దృష్టి పెట్టనున్నారు. 2025 ఎక్స్‌పోను దిల్లీ, నోయిడాల్లోనే మూడు వేదికల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 9.8 లక్షల మందికి పైగా ప్రేక్షకులు వచ్చారు.

సంక్షిప్తంగా

✦ ఇండోగల్ఫ్ క్రాప్‌సైన్సెస్ షేర్లు గురువారం బీఎస్ఈలో నమోదయ్యాయి. ఇష్యూ ధర రూ. 111 వద్దే ఈ షేరు ట్రేడింగ్ ఆరంభమైంది. ఆ తర్వాత 1.44% పెరిగి రూ.112.60కు వెళ్లినా.. చివరకు 0.18% నష్టంతో రూ.110.80 వద్ద ముగిశాయి.

✦ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై శుభారంభం చేసిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు గురువారం కూడా లాభాలు పంచాయి. బీఎస్ఈలో 2.88% పెరిగి రూ.865.10 వద్ద ముగిశాయి.

✦ రసాయన వ్యాపార విభాగ సామర్థ్యం పెంపు, అధిక వార్షిక ఆదాయాన్ని సాధించే లక్ష్యాలతో రాబోయే కొన్నేళ్లలో రూ.750 కోట్లకు పైగా పెట్టుబడిని గోద్రేజ్ ఇండస్ట్రీస్ పెట్టనుంది.

✦ మనదేశంలో, ఒకే ప్రదేశంలో అతిపెద్ద బ్యాటరీ ఇంధన నిల్వ ప్రాజెక్టును గుజరాత్‌లో ఏర్పాటు చేసేందుకు ఇండిగ్రిడ్‌కు రూ.460 కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ తెలిపింది.

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిమిత్తం సెబీకి కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో ముసాయిదా పత్రాలను మీషో సమర్పించినట్లు తెలుస్తోంది.

✦ స్టాక్ బ్రోకర్, క్లియరింగ్ మెంబర్‌గా కార్యకలాపాలు నిర్వహించే నిమిత్తం మొబిక్విక్ సెక్యూరిటీస్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సెబీ నుంచి అనుమతులు లభించాయి.

✦ ఇండిగోను నిర్వహించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ, భారత జీ20 షెర్పా అమితాబ్ కాంత్ చేరారు.

✦ దేశంలోని 234 నగరాల్లో 730 ఎఫ్ఎం రేడియో ఛానళ్ల నిర్వహణ కోసం ఇ-వేలాన్ని ఈ నెలలో ప్రారంభిస్తామని సమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. వీటికి రిజర్వ్ ధర రూ.784.87 కోట్లుగా ఉండొచ్చని అంచనా.

ఇళ్లకు గిరాకీ తగ్గినా.. కార్యాలయ స్థలాల జోరే

హైదరాబాద్ సహా 8 నగరాలపై నైట్ ఫ్రాంక్ నివేదిక

దిల్లీ: హైదరాబాద్ సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఇళ్ల విక్రయాలు 2% తగ్గినా, కార్యాలయ స్థలాల లీజు 41% పెరిగాయని స్థిరాస్తి కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ తెలిపింది. ఈ ఏడాది తొలి 6 నెలల లావాదేవీలను, 2024 ఇదే కాలంతో పోల్చి, ఈ నివేదికను సంస్థ రూపొందించింది. దీని ప్రకారం..

✦ ఈ ఏడాది జనవరి-జూన్‌లో ఇళ్ల అమ్మకాలు 1,70,201 కి పరిమితమయ్యాయి. ఇదే సమయంలో ఇళ్ల ధరలు సగటున 2-14% పెరిగాయి. మొత్తం అమ్మకాల్లో రూ.కోటి లోపువి 51% ఉండగా, అంతకుమించి విలువైనవి 49% ఉన్నాయి.



2025 జనవరి-జూన్‌లో లావాదేవీలు ఇలా

నగరం	ఇళ్లు/ఫ్లాట్లు	వృద్ధి(%)	కార్యాలయ లీజు(మి.చ.అ)	వృద్ధి(%)
హైదరాబాద్	19,048	3	5.9	16
చెన్నై	8,935	12	5.1	68
దిల్లీ-ఎన్‌సీఆర్	26,795	−8	7.2	27.5
బెంగళూరు	26,599	−3	18.2	100
పుణె	24,329	−1	5.1	17
కోల్‌కతా	8,090	−11	1.1	60
ముంబయి	47,035	0	5.5	5
అహ్మదాబాద్	9,370	0	0.8	−51

✦ కార్యాలయ స్థలాల స్థూల లీజు 48.9 మిలియన్ చదరపు అడుగులకు పెరిగింది. ఈ సంవత్సరం (2025) మొత్తంమీద ఇది 80-90 మిలియన్ చ.అ.కు చేరొచ్చు అని సంస్థ పేర్కొంది. గతేడాది (2024) మొత్తంమీద 71.9 మిలియన్ చ.అ. లీజు నమోదైంది.

✦ మొదటి ఆరు నెలల్లో 49% గృహాలు కోటి, ఆపైన, 51% కోటిలోపు ధరలు కలిగి ఉన్నాయని నైట్ ఫ్రాంక్ డేటా వివరించింది.

ఎఫ్‌టీఏలో సంక్లిష్ట అంశాల సంగతి తర్వాత చూడొచ్చు

ముందు సహేతుక ఒప్పందం అవసరం: సీఐఐ



దిల్లీ: భారత్, అమెరికా మధ్య ఒక సమతౌల్య, సహేతుక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ముందస్తుగా కుదరాల్సిన అవసరం ఉందని సీఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్ మేమానీ అన్నారు. రాజకీయ సంఘర్షణకు దారితీసే అంశాల సంగతి తర్వాతి దశల్లో పరిశీలించొచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఉన్న వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు జులై 9లోగా ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. 'కొన్ని రంగాలు.. ముఖ్యంగా వ్యవసాయ రంగ సవాళ్లను వాణిజ్య శాఖ సరిగ్గా అర్థం చేసుకుందన్న విశ్వాసం ఉంద'ని రాజీవ్ పేర్కొన్నారు. చైనా అరుదైన భూఅయస్కాంతాల(రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) ఎగుమతులపై షరతులను విధించడం, భారత వాహన రంగంతో పాటు ఎలక్ట్రానిక్స్ వంటి ఇతర రంగాలకూ ఆందోళనకర అంశమేనని రాజీవ్ తెలిపారు..

వృద్ధిరేటు 6.4 - 6.7%


అంతర్జాతీయంగా అనిశ్చితి పరిస్థితులున్నా, మనదేశం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4-6.7% వృద్ధిరేటు నమోదు చేయొచ్చని సీఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్ మెమాని తెలిపారు. దేశీయంగా గిరాకీ పెరిగే అవకాశాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు.

స్పైస్‌జెట్ సర్వీసులు పెరుగుతున్నాయ్

విమానాలు ఉన్నా.. ఇంజిన్ల మరమ్మతు కారణంగా సర్వీసులు తగ్గించుకుంటున్న స్పైస్‌జెట్‌కు ఉపశమనం కలుగుతోంది. అంతర్జాతీయ మరమ్మతు, నిర్వహణ (ఎమ్ఆర్ఓ) సంస్థ స్టాండర్డ్‌ఏరో నుంచి మరమ్మతు పూర్తయిన 2 ఇంజిన్లు చేరినట్లు స్పైస్‌జెట్ గురువారం తెలిపింది. సీఎఫ్ఎమ్ లీప్-1బీ ఇంజిన్‌ను స్టాండర్డ్‌ఏరోకు చెందిన హ్యూస్టన్ ప్లాంటులో మరమ్మతు చేయగా, క్యూ400 ఇంజిన్‌ను సింగపూర్‌లో సర్వీసింగ్ చేయించారు. బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో ఈ ఇంజిన్లు వినియోగిస్తారు. మొత్తం 17 ఇంజిన్లను నిర్వహణ నిమిత్తం స్పైస్‌జెట్ పంపింది. 2 ఇంజిన్లు అందగా, మరికొద్ది నెలల్లో మిగతావి కూడా అందుబాటులోకి వస్తాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆఖర్లో అమ్మకాలు

ఆర్థిక, లోహ రంగాల షేర్లు డీలా



సెన్సెక్స్ ▼170 83239 | నిఫ్టీ ▼48 25405

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.1,481.19 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.1,333.06 కోట్లు

సమీక్ష

దేశీయ సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోలేకపోయాయి. చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లో ముగిశాయి. ఆర్థిక, లోహ రంగాల షేర్లు డీలా పడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పెరిగి 85.55 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 0.32% నష్టంతో 68.88 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.55,000 కోట్లు తగ్గి రూ.460.26 లక్షల కోట్ల (5.38 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఉదయం సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,409.69 తో పోలిస్తే) 130 పాయింట్ల లాభంతో 83,540.74 వద్ద ఆరంభమైంది. ఆ వెంటనే నష్టాల్లోకి జారినా, మళ్లీ పుంజుకుని మధ్యాహ్నం వరకు లాభాల్లోనే కదలాడింది. మళ్లీ ఆఖరి గంటలో అమ్మకాలు కారణంగా లాభాలన్నీ ఆవిరై, 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 48 పాయింట్లు కోల్పోయి 25,405.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,587.50 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,384.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది.

18 కంపెనీల షేర్లకు నష్టాలు: సెన్సెక్స్ 30 కంపెనీల్లో 12 షేర్లు లాభాల్లో ముగియగా.. 18 షేర్లు నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.91%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.38%, బజాజ్ ఫైనాన్స్ 1.3%, అదానీ పోర్ట్స్ 0.85%, టైటన్ 0.76% ఎస్‌బీఐ 0.75% తగ్గాయి. మారుతీ సుజుకీ 1.01%, ఇన్ఫోసిస్ 0.51%, ఏషియన్ పెయింట్స్ 0.44%, ఎన్‌టీపీసీ 0.36%, ఎటెర్నల్ 0.35% పెరిగాయి.

✦ బీఎస్ఈ రంగాల సూచీల్లో సేవలు 1.08%, లోహ 0.77%, స్థిరాస్తి 0.61%, టెలికమ్యూనికేషన్ 0.55%, బ్యాంకెక్స్ 0.48% నష్టపోయాయి. ఆరోగ్య సంరక్షణ, కన్జ్యూమర్ డ్యూరబుల్, చమురు- గ్యాస్ రంగాలు రాణించాయి.

నైకాలో 2.1% వాటా విక్రయం

దిల్లీ: ఫ్యాషన్ ఉత్పత్తుల సంస్థ నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఇ-కామర్స్ వెంచర్స్‌లో 2.1% వాటా (6 కోట్ల షేర్ల)ను రూ.1,213 కోట్లకు హరిందర్‌పాల్ సింగ్ బంగా, ఆయన భార్య ఇంద్రా బంగా విక్రయించారు. ఈ నేపథ్యంలో నైకా షేర్లు బీఎస్ఈలో 4% నష్టపోయి రూ. 203.50 వద్ద ముగిశాయి. హాంకాంగ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కారావెల్ గ్రూపునకు హరిందర్‌పాల్ సీఈఓ. 2021లో నైకా పబ్లిక్ ఇష్యూకు వచ్చినప్పటి నుంచీ ఈ సంస్థలో హరిందర్‌పాల్ వాటాదారుగా ఉన్నారు. నైకాలో ఆయన వాటా 4.97% నుంచి 2.87 శాతానికి పరిమితమైంది.

దేశంలోకి ఫేస్‌జిమ్ ఉత్పత్తులు



దిల్లీ: ఫేషియల్ ఫిట్‌నెస్, చర్మ సంరక్షణ ఉత్పత్తులను విక్రయించే బ్రిటన్ సంస్థ ఫేస్‌జిమ్‌లో స్వల్ప వాటాను రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ కొనుగోలు చేసింది. తన సౌందర్య రిటెయిల్ విభాగమైన టిరా ద్వారా ఈ లావాదేవీ నిర్వహించినట్లు రిలయన్స్ తెలిపింది. ఎంత మొత్తానికి వాటా కొనుగోలు చేసిందో వెల్లడించలేదు. అధిక వృద్ధి ఉన్న సౌందర్య, వెల్‌నెస్ విభాగంలో కార్యకలాపాలను విస్తరించే లక్ష్యంతో ఈ పెట్టుబడులను పెట్టినట్లు కంపెనీ తెలిపింది. ఫేస్‌జిమ్ ఉత్పత్తులను మనదేశంలోనూ విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

10 నెలల గరిష్ఠానికి సేవల రంగ వృద్ధి



దిల్లీ: దేశీయ సేవల రంగ కార్యకలాపాలు పుంజుకున్నాయి. ఈ రంగ వృద్ధి 10 నెలల గరిష్ఠానికి చేరింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ వ్యాపార కార్యకలాపాల సూచీ మేలో 58.8 పాయింట్లుగా ఉండగా, జూన్‌లో 60.4 పాయింట్లకు పెరిగింది. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 50 పాయింట్ల పైన ఉంటే వృద్ధిగా, దిగువన నమోదైతే క్షీణతగా పరిగణిస్తారు. కొత్త వ్యాపార ఆర్డర్లు రావడం, అంతర్జాతీయ విక్రయాలు బలంగా పెరగడం, ఉద్యోగాల సృష్టి, సానుకూల గిరాకీ ధోరణులు, విక్రయాల్లో కొనసాగుతున్న పెరుగుదల వంటివి సేవల రంగం వృద్ధికి దోహదం చేశాయి. .

రూ.1.3 లక్షల కోట్లకు పంచదార పరిశ్రమ

కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి



దిల్లీ: భారతీయ పంచదార పరిశ్రమ రూ.1.3 లక్షల కోట్ల స్థాయికి చేరిందని కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ నిర్వహించిన 'కోఆపరేటివ్ షుగర్ ఇండస్ట్రీ కాన్‌క్లేవ్ 2025 - నేషనల్ ఎఫిషియెన్సీ అవార్డ్ సెరెమోనీ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

✦ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల వల్ల దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి గత 11 ఏళ్లలో 4 రెట్లు పెరిగి వార్షికంగా 1,810 కోట్ల లీటర్ల స్థాయికి చేరిందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పెట్రోలులో ఇథనాల్ బ్లెండింగ్ 2013లో 1.53% కాగా, ప్రస్తుతం 19 శాతానికి చేరిందని తెలిపారు.

హెచ్ఎంఏ నూతన అధ్యక్షుడిగా అల్వాల దేవేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) నూతన అధ్యక్షుడిగా అల్వాల దేవేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి ఆయన అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఆయన ఈరైడ్ ఈమొబిలిటీ అనే కంపెనీ వ్యవస్థాపకుడు. హెచ్ఎంఏ ఉపాధ్యక్షుడిగా శరత్ చంద్ర మారోజు, కార్యదర్శిగా వాసుదేవన్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా చేతన జైన్, వి.శ్రీనివాసరావు, శంకర వెంకట కృష్ణ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఇద్దరూ పేదింటి అమ్మాయిలే. కానీ జీవితాల్ని చదివారు. నాన్నల నుంచి స్ఫూర్తిని పొందారు. వాళ్ల కష్టానికి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అద్భుతాలు సృష్టించారు... అడపా స్ఫూర్తి, చిట్టోజు స్వర్ణ. ఈ భద్రాద్రి జిల్లా అమ్మాయిల సృజనాత్మక ప్రయాణమిది..!

అమ్మాయిలు... ఆవిష్కరించారు!

నాన్న ఇంజిన్లకు మరమ్మతులు చేస్తుంటే ఆసక్తిగా చూసేది **అడపా స్ఫూర్తి**. తోచిన సాయమూ చేసేది. దానికితోడు అన్నయ్య చదివేదీ ఎలక్ట్రికల్ విద్యే. వాళ్లిద్దరినీ చూసి, ఎలక్ట్రికల్ ఇంజినీర్ అవ్వాలనుకుంది స్ఫూర్తి. ఈమెది మణుగూరు. నాన్న ప్రవీణ్ కుమార్, అమ్మ ప్రీతి. పదో తరగతి తరవాత తన కల దిశగానే అడుగులేద్దామనుకుంది స్ఫూర్తి. కానీ ఇంటర్‌లో బైపీసీలో చేర్చారు. అది నచ్చక ఐటీఐ కళాశాలలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సులో చేరింది. యూట్యూబ్‌లో హోమ్‌మేడ్ వాహనాల తయారీ చూసి తనూ బ్యాటరీల సాయంతో నడిచే వాహనాన్ని తయారుచేయాలనుకుంది. కానీ దానికి తగ్గ ఆర్థిక స్థితి ఇంట్లో లేదు. దీంతో ఆ ఖర్చు భరించలేమన్నారట. నిరాశ పడలేదామె. కొత్తగా ఆలోచించింది. తండ్రి మెకానిక్ షెడ్‌లో నిరుపయోగంగా ఉన్న ఇనుప సామగ్రిని వాహనం తయారీకి ఉపయోగించాలనుకుంది. ముందు డిజైనింగ్ సిద్ధం చేసుకుని అందుకు అవసరమైన బ్యాటరీలు, ఐరన్ షీట్లు, టైర్లు, ఎలక్ట్రికల్ సామగ్రిని సమకూర్చుకుంది. కానీ తను అనుకున్నట్లుగా రాలేదు.



స్ఫూర్తి

దీంతో మరో డిజైన్ సిద్ధం చేసుకుని తిరిగి ప్రయత్నించింది. రెండు నెలల్లోనే ఇద్దరు ప్రయాణించేలా ఎలక్ట్రికల్ వాహనాన్ని తయారుచేసింది. దానికి 'ఎకో వారియర్' అని పేరు పెట్టింది. ఇది రెండున్నర గంటల ఛార్జింగ్‌తో 40 కి.మీ. ప్రయాణిస్తుంది. దానిలో నాన్నతో కలిసి ప్రయాణించడమే కాదు, కళాశాలకీ తీసుకెళ్లింది. దాన్ని చూసిన అధ్యాపకులు, ప్రిన్సిపల్ ఆమె ప్రయత్నాన్ని అభినందించారు కూడా. 'నా ఈవీ తయారీకి రూ.40 వేలు ఖర్చయ్యింది. కోరుకుంటే ఎవరికైనా రూ.80వేలతో రెండు నెలల్లో చేసివ్వగలను. ఈ ప్రయత్నం నా ఆత్మవిశ్వాసం పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన సంస్థను ఏర్పాటుచేయడం, తక్కువ ధరకే ఈవీలను అందించడం నా లక్ష్యాలు' అంటోంది స్ఫూర్తి.

– బేతం కిరణ్, మణుగూరు




స్వర్ణ

తరతరాలుగా కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబం. దానికి తను చదువుకున్న విద్యను జోడించాలనుకుంది **చిట్టోజు స్వర్ణ**. ఈమెది ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం. నాన్న మోహనాచారి వడ్రంగి, అమ్మ నిర్మల. ముగ్గురు కూతుళ్లలో చిన్నది స్వర్ణ. అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. వడ్రంగి పనులతో కుటుంబాన్ని నడిపిస్తోన్న తండ్రికి సాయంగా నిలవాలనుకుంది. ప్రభుత్వ కొలువులకు ప్రయత్నిస్తే కొద్దిలో చేజారాయి. అప్పుడే సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఉపయోగపడేలా కల్టివేటర్లను తయారుచేయాలనుకుంది. ఆలోచనను నాన్నతో పంచుకుంటే ఆయనా ప్రోత్సహించారు. దీంతో పరిశోధన చేసి, వ్యవసాయానికి పనికొచ్చే కల్టివేటర్లను తయారుచేసింది. ఎవరి సాయమూ లేకుండా ఒక్కరే వినియోగించేలా వీటిని తీర్చిదిద్దింది. కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో మొక్కజొన్న, మిరప, వేరుశనగ రైతులకు ఇవి ప్రయోజనకరంగా మారాయి. ఈ సంగతులన్నీ యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది స్వర్ణ. దీంతో తెలుగు రాష్ట్రాలే కాదు, కర్ణాటక, మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాల నుంచీ ఆర్డర్లు మొదలయ్యాయి. 'మార్కెట్లో పేరొందిన 7 హెచ్‌పీ మోటార్ల ధర రూ.40 వేల వరకూ ఉంటుంది. నేను సింగిల్‌వీల్ కల్టివేటర్‌ని రూ.26 వేలు, డబుల్ వీల్ వాటిని రూ.28 వేలకే అందిస్తున్నా. అలాగని నాణ్యతలో రాజీపడలేదు. సొంత పెట్టుబడితో మొదలుపెట్టా. ఇప్పుడు 60 కల్టివేటర్ల వరకూ తయారుచేస్తున్నా. కుటుంబ పరిస్థితుల రీత్యా తాజాగా రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తే నేను రాణిస్తూనే మరికొందరికీ ఉపాధి కల్పిస్తా'నంటోంది స్వర్ణ.

– కసువోజుల రాజు, ఇల్లెందు

చక్కగా ఓ ట్రిప్ వేద్దాం..!

రోజువారీ జీవనశైలితో అలసిపోని... పని తెచ్చే ఒత్తిడీ, ఆందోళనలతో విసిగిపోని మహిళలు ఉంటారా? ఉండరు అంటే అతిశయోక్తే. అందుకే 'మనసు, మెదడు సహకరించనప్పుడు చక్కగా మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్లి రండి. మానసిక సమస్యలన్నీ మటుమాయం' అని చెబుతున్నారు నిపుణులు. అంతేనా, ఇలా మనసుకు నచ్చిన చోటుకి వెళ్లడం వల్ల జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుందట. మహిళల్లో కాగ్నిటివ్ సామర్థ్యాలు పెరగడానికీ ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నాయి కొన్ని అధ్యయనాలు. ఎలాగంటే... మనసు, మెదడు ప్రశాంతంగా ఉంటేనే చుట్టూ ఉన్న విషయాల్ని త్వరగా గ్రహించగలమట. ఒక్కసారి ఆలోచించండి. మొన్న ఏ కూర తిన్నావు అని అడిగితే... వెంటనే సమాధానం చెప్పలేం. అలాంటిది గతేడాది వెళ్లిన పర్యటక ప్రాంతం గురించి గుక్క తిప్పుకోకుండా చెబుతుంటాం. దాని అందాల్ని అడుగడుగునా వర్ణిస్తుంటాం. అదీ పర్యటకానికి ఉండే శక్తి. అంటే ఆహ్లాదంగా ఉన్న చోట... మనసూ స్థిమితంగా ఉంటుంది. దాని ప్రభావం అభిజ్ఞా నైపుణ్యాల మీదా పడుతుంది. ఇవే చెబుతున్నాయి అధ్యయనాలు కూడా. మరి ఇంకెందుకు ఆలస్యం... సమయం లేదు, చాలా పని ఉంది, ఇప్పుడు కాదులే తర్వాత అంటూ వాయిదాలు వేయకండి. వీలుచేసుకుని చక్కగా ఓ ట్రిప్ వేసి, మెదడుకు సాంత్వన కలిగించేయండి మరి.



మార్పుకోసం...

పుస్తకాల ఏటీఎమ్!


ధాత్రిరెడ్డి

మూడక్షరాల పుస్తకం... అపార జ్ఞాన సంపదకు భాండాగారం. చారిత్రక ఆధారాల్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలోనే కాదు... మనిషి వ్యక్తిత్వాన్ని మార్చగల శక్తీ పుస్తకానికి ఉందంటారు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి. అందుకే, ఈతరంలో తగ్గుతున్న పఠనాసక్తిని తిరిగి పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా సొంత డబ్బుతో 'ఏలూరు బుక్ నూక్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అది విజయవంతం కావడంతో త్వరలోనే మరో 100 ప్రదేశాలకు విస్తరించనున్నారు. 'పుస్తకాలు చదవాలనే ఆసక్తి ఉన్నా... అందరికీ లైబ్రరీకి వెళ్లే తీరిక ఉండదు. అందుకే, రోడ్డువారన వెళ్తూనే కాసేపు ఆగి పుస్తకాలు చదివేలా నగరంలో బుక్ బాక్స్‌లను ఏర్పాటుచేశాం. 'భద్రత లేకుండా బహిరంగంగా పుస్తకాలు పెడితే ఉంటాయా? అసలు ఎవరు చదువుతారు?' అన్నారు కొందరు. అదీ నిజమే! ఎంతని కాపలా కాస్తాం. ప్రజలు మనది అనుకోవాలి.



నిజానికి పుస్తకాలు పెట్టిన తొలి రోజు రాత్రే కొందరు వాటిని మాయం చేశారు. బాధనిపించినా వెనక్కి తగ్గలేదు. తిరిగి మరికొన్ని కొత్త బుక్స్ పెట్టాం. దాతలు ముందుకు రావడంతో మరికొన్ని చోట్ల ఏర్పాటుచేశాం. ఇందులో కథలు, స్ఫూర్తి పుస్తకాలతోపాటు అకడమిక్, కాంపిటీటివ్ బుక్స్ కూడా ఉన్నాయి. ఇప్పుడు విద్యార్థులు, బాటసారులు... ఇలా చాలామందే వాటిని ఉపయోగించుకుంటున్నారు. ప్రజల సలహాతో ప్రస్తుతం ఇది 'ఎనీ టైమ్ బుక్' కార్యక్రమంగా మారింది. త్వరలోనే జిల్లాలోని మరో 100 ప్రదేశాల్లో వీటిని ఏర్పాటుచేయనున్నాం' అంటారు ధాత్రిరెడ్డి.

– కాకర్ల వాసుదేవరావు, ఏలూరు

నోస్టాల్జియా ట్రెండ్!

గోరింట... అందమైన జ్ఞాపకం!



'రామచక్కని సీతకు అరచేత గోరింట...', 'గోరింట పూచింది కొమ్మా లేకుండా...' ఈ పాటలు వింటేనే... మనసు గోరింటాకు మీదకు మళ్లుతుందే... అలాంటిది ఈ కాలంలో రుబ్బిన గోరింటాకు ఎవరైనా ఇస్తే.. ఎన్నో జ్ఞాపకాలు..!

ఎర్రగా పండే గోరింటాకు అంటే అమ్మాయిలకు ఎంతిష్టమో. ఏ పనిచేస్తున్నా ఆ రంగు తెచ్చిన అరచేతి అందాన్నీ ఆ వాసననీ పదే పదే మురిపెంగా చూసుకుంటే కలిగే ఆనందం మరెందులోనూ ఉండదేమో. ఎప్పుడెప్పుడు పండుతుందాని కొద్దిగా తీసి చూసుకునే ఆరాటం, నాదే బాగా పండిందని గొప్పలు పోవడం, త్వరగా రంగు పోకుండా కొబ్బరినూనె రాయడం, ఓ నాలుగైదు రోజుల వరకూ చేతులకి అంతగా సబ్బు రుద్దని అమాయక బాల్యం...



చల్లని పచ్చని గోరింటాకు పెట్టాక కదలకుండా కూర్చోవడం పిల్ల మేకానికి కష్టమైనా ఇష్టమే. రెండు కాళ్లకూ రెండు చేతులకీ పెట్టించేసుకుని 'అమ్మా ఆకలి' అనో దురద... ఇక్కడ... అక్కడ'నో పిలుస్తుంటే మురిపెంగా విసుక్కుంటూనే అమ్మ చేయడం... అన్నీ గుర్తే.

పండుగొచ్చినా వేడుకొచ్చినా అరచేత గోరింట పండాల్సిందే. నిజం చెప్పాలంటే గోరింట పెట్టుకోవడమే ఓ పండుగ. ఎర్రదనం కాస్త తగ్గగానే పెరట్లో ఉన్న చెట్టు నుంచో లేదా పక్కింట్లో నుంచో ఆకు కోసుకొచ్చి అది రుబ్బి పెట్టేవరకూ అమ్మను విసిగించిందీ, ఎప్పుడూ చుక్కలేనా అంటూ డిజైన్లకోసం బంతాకులు, చామంతాకులు తెచ్చిందీ... ఎన్ని జ్ఞాపకాలో!

ఇక, ఆషాడం వచ్చిందంటే చాలు... గోరింటాకు చెట్టుకు ఒక్క ఆకు మిగిలిస్తే ఒట్టు. రుబ్బిన గోరింటాకును మనం పెట్టుకోవడమే కాదు, చుట్టుపక్కలా పంచేవాళ్లం. పెద్దవాళ్లు సైతం రెండోచేతికి పక్కింటి వాళ్లతో పెట్టించుకోవడం, వాళ్లకు వీళ్లు పెట్టడం... సత్సంబంధాల్ని పరిమళిస్తూ, ప్రేమానురాగాల్ని పండించే గోరింట పండుగొస్తే లోగిళ్లన్నీ సందడే సందడి!

కాలం అన్నీ మరిపిస్తుంది. ఇష్టాల్నీ మార్చేస్తుంది. ఆకును రుబ్బి పెట్టుకోవడం తగ్గింది. బిజీ జీవితం తెచ్చిన రెడీమేడ్ మెహందీ కోన్‌లతోనే అమ్మాయిలకు గోరింట పండుగ. చేతి నిండుగా ఎంత అందమైన డిజైన్లు నింపినా గోరింటాకుతో వచ్చిన ఎర్రటి అందం... ఈ డిజైన్లకెక్కడిదీ!

అందుకే అమ్మాయిలైనా అమ్మలైనా అమ్మమ్మలైనా... వృత్తి ఉద్యోగాల్లో ఊపిరి సలపకున్నా సంప్రదాయ రీతిలో గోరింటాకుని పెట్టుకుని చూడండి. ఎంత అందంగా ఉంటుందో మరెంత ఆనందాన్ని అందిస్తుందో. దాంతో ఒత్తిడి, ఆందోళనలు తగ్గడమే కాదు, ఆనాటి జ్ఞాపకాలన్నీ ఒక్కటొక్కటిగా కళ్ల ముందు కదలాడవూ... వయసు మీదపడే కొద్దీ కావాల్సినవీ ఇవే కదా. మరిచిపోయిన జ్ఞాపకాల్ని అప్పుడప్పుడూ అయినా తట్టిలేపితే ఆల్జీమర్స్‌కి దూరంగా ఉండొచ్చంటున్నారు పరిశోధకులు. అందునా... చిన్న చిన్న ఆనందాలే ఆరోగ్య సోపానాలు అంటోందీ తరం. అందుకే నోస్టాల్జియాలో భాగంగా గోరింటాకు మళ్లీ ట్రెండవుతోంది.

పైగా ఆషాడం... వానల ఆరంభ కాలం. తేమ వల్ల తలెత్తే చర్మ, గోళ్ల సమస్యల్నీ దురదల్నీ ఫంగల్ ఇన్ఫెక్షన్లనీ వాత దోషాన్నీ హరించి, నరాలకు సాంత్వన కలిగించే సౌందర్యమే గోరింటాకు అని ఆయుర్వేదమూ అంటోంది. మరింకెందుకు ఆలస్యం..!

స్క్రీన్ సమయం తగ్గితేనే మేలు...

చిన్నప్పటి నుంచీ స్క్రీన్‌లకు తక్కువగా, శారీరక శ్రమకు ఎక్కువగా సమయం కేటాయించే పిల్లలు మానసికంగా దృఢంగా ఉంటారట. ఫిన్‌లాండ్ నిర్వహించిన పానిక్ (ఫిజికల్ యాక్టివిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ చిల్డ్రన్) అధ్యయనంలో ఈ విషయం వెల్లడయ్యింది. ఇందుకోసం దాదాపు 500 మంది చిన్నారులను సుమారు 8 సంవత్సరాలపాటు పర్యవేక్షించారు. వారి ఆహారపు అలవాట్లు, స్క్రీన్ టైమ్, శారీరక శ్రమ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. కంప్యూటర్లు, మొబైల్, ఎలక్ట్రిక్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉండి, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేసినవారు 15ఏళ్లు వచ్చిన తర్వాత మానసికంగా బలంగా ఉన్నట్లు తేలింది. అధిక సమయం స్క్రీన్‌లపైన గడిపిన పిల్లల్లో ఒంటరితనం, ఆందోళన, కుంగుబాటు ఎక్కువయ్యాయని గుర్తించింది. అన్నం తినట్లేదనో, విసిగిస్తున్నారనో పిల్లల చేతికి ఫోన్ ఇవ్వడం, టీవీ ఆన్‌చేసి చూడమనడంతో తెలియకుండానే మనం వారి ఆరోగ్యానికి చేటు చేస్తున్నామని హెచ్చరిస్తోందీ సర్వే. అలాకాకుండా ఉండాలంటే... సైక్లింగ్, వాకింగ్, జాగింగ్ వంటివి అలవరిస్తే శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటారని చెబుతోంది.

మీకు తెలుసా?

మహిళలు రోజులో 20శాతం సమయం వేతనం లేని సంరక్షణ బాధ్యతల్లో గడుపుతున్నారని తాజా టైమ్ యూజ్ సర్వే చెబుతోంది. అదే మగవాళ్లు వీటికి కేటాయించే సమయం 2.6శాతం మాత్రమేనట.

కలలకి వయసు అడ్డంకి కాదని..!

నలుగురూ నడిచే బాటలో వెళ్తే ప్రత్యేకత ఏముంటుంది... కష్టమైన దారుల్ని ఎంచుకుంటేనే కదా మనల్ని మనం నిరూపించుకోగలిగేది... ఈ తత్వమే మాజీ నేవీ కమాండర్ గౌరీ మిశ్రాను ట్రాక్ సైక్లింగ్ వైపు నడిపించింది. దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతల్ని తెచ్చి పెట్టింది. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం అందుకునేలా చేసింది. ఆమె ఎవరో తెలియాలంటే...


గౌరి

గౌరీది ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్. ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నారు. చిన్నప్పట్నుంచీ సైక్లింగ్ అంటే ఇష్టం ఈమెకు. అదే పెరిగి, పెద్దయ్యాక పని ఒత్తిడికి పరిష్కారంగానూ మారిందట. మహిళలకు భద్రతా దళాల్లో అవకాశాలు వస్తున్న తొలి రోజుల్లోనే, ఆమె నౌకాదళంలో చేరి అందరి మెప్పునూ పొందారు. 'అప్పట్లో గణతంత్ర దినోత్సవం నాడు రాజ్‌పథ్‌పై పరేడ్ చేసి, రాష్ట్రపతికి సెల్యూట్ చేసిన సమూహంలో నేను ఒక్కదాన్నే మహిళను. అది మొదలు నౌకాదళంలో లింగవివక్షతను దూరం చేయడానికి నా వంతు కృషి చేశా. కానీ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసి వచ్చేశా' అనే గౌరి మళ్లీ సైక్లింగ్ వైపు వెళ్లింది తన కొడుకు రియాన్ కారణంగానేనట. 'నా కొడుకు తనకు ఎనిమిదేళ్లప్పుడు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ నేర్చుకుంటానమ్మా అని అడిగాడు. అప్పటికి వాటిపై అంత అవగాహన లేదు నాకు. వాటిల్లో వాడిని ప్రోత్సహించే కంటే... నాకు తెలిసిన సైక్లింగ్ అయితే దగ్గరుండి నేర్పించొచ్చు కదా అనిపించింది. పైగా అప్పుడే నా భర్తకు ప్రమాదంలో గాయాలు కావడంతో నడవడం కూడా కష్టమయింది. దాంతో ఒత్తిడి ఎక్కువైంది. దాన్నుంచి బయట పడటానికీ దీన్నే సాధనంగా ఉపయోగించుకున్నా. క్రమేణా బాబుకీ దీనిపై ఇష్టం పెరిగింది. అలా ఇద్దరం కలిసి ప్రపంచ రికార్డులెన్నో సాధించాం' అంటారు గౌరి.

అంతర్జాతీయ వేదికపై...

స్పోర్ట్స్‌లో మహిళా భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో 'పెడల్ ఫర్ ప్లానెట్' క్యాంపెయిన్‌ను నిర్వహించారు గౌరి. పర్యావరణాన్ని కాపాడాలనేదీ దీని వెనకున్న మరో లక్ష్యం. ఈ క్రమంలోనే ట్రాక్ సైక్లింగ్ గురించి తెలుసుకున్నారట. 'మేమున్న ప్రాంతంలో దీనికోసం కనీస పరిజ్ఞానం, వనరులు ఏమీ లేవు. అలా అని వదిలేయాలి అనిపించలేదు. వీడియోల్లో చూసి రియాన్‌కి దీన్ని నేర్పించడం మొదలుపెట్టా. వాడితోపాటు నేనూ నేర్చుకున్నా. అలా ఏడాదిలోనే ట్రాక్ సైక్లింగ్‌లో దేశవిదేశాల్లో రికార్డులు ఎన్నో సాధించాం. దానిలో భాగంగానే ఇటీవల తైవాన్‌లో జరిగిన 'ద వరల్డ్ మాస్టర్స్ గేమ్స్‌లో పాల్గొని మూడు పతకాలు గెలుచుకున్నా. ఒలింపిక్స్ తర్వాత అంత ఆదరణ సంపాదించుకున్న ఆటలు ఇవే' అనే గౌరీ 40 ఏళ్ల వయసులోనూ ఫిట్ అండ్ ఫైన్‌గా ఉంటూ తోటి మహిళలనూ ఆటల్లో ప్రోత్సహిస్తున్నారు. ఆసక్తి ఉన్న వాళ్లకి శిక్షణ కూడా ఇస్తున్నారు.

> 20 ఏళ్ల కిందట నా వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఎలా సాధ్యమవుతుందంటే... కుటుంబ సభ్యుల మద్దతు, పిల్లల్ని చూసుకోవడానికి అత్తయ్య ఉండటం, పనివాళ్లు అని చెప్పేదాన్ని. ఈరోజు అనేక సాంకేతిక పరికరాలు వచ్చాయి. పిల్లల పరీక్ష సంసిద్ధతకి, ఫుడ్ ఆర్డర్ చేయడానికి, పార్టీని నిర్వహించడానికి... సాయపడే ఆప్స్ ఉన్నాయి. ఈ డిజిటల్ పరికరాలు మహిళల పనుల్ని వేగంగా, తేలిగ్గా చేసుకునేలా మార్చాయి. వీటితో ఆదా చేసుకున్న సమయాన్ని మహిళలు కెరియర్ కోసం వినియోగించుకోవాలి.
>
> – ప్రతివా మహాపాత్ర, వీపీ, ఎండీ, అడోబ్ ఇండియా



బంగారం - వెండి

3న ముగింపు



	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	99,770	91,450	1,10,339
విజయవాడ	97,560	91,050	1,09,900
ప్రొద్దుటూరు	97,700	89,930	1,08,000
రాజమహేంద్రవరం	99,330	91,050	1,21,000
విశాఖపట్నం	98,970	91,050	1,12,000
తమిళనాడు	-----	91,050	1,21,000

ఫ్యాషన్‌లో... తడిసిపోండి!



అలా అలా నాలుగు చినుకుల్లో సరదాగా తడవడాన్ని ఇష్టపడని అమ్మాయుండదు. అయితే ఎప్పుడో సరదాకి అంతే! అస్తమానూ తడి తగిలితే మనకీ చిరాకే! అలాగని ఇల్లు కదలకుండా కూర్చుంటామంటే పనులు ఆగుతాయా? కాలేజీ, ఆఫీసు, పిల్లలను స్కూలుకు పంపడానికీ... ఇలా ఎన్నో కారణాలకి అడుగు బయటపెట్టక తప్పదు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఇలాంటప్పుడు గొడుగు కంటే రెయిన్ కోటే సౌలభ్యం అనిపిస్తుంది. గాలికి ఎగిరిపోతుందన్న బెంగ ఉండదు, జల్లులకు దుస్తులు తడిచే బాధ అంతకన్నా ఉండదు. పైగా హ్యాండ్ బ్యాగ్, చేతిలో ఏమైనా లగేజీ ఉన్నా సురక్షితంగా తీసుకెళ్లొచ్చు. బైకు మీదా దూసుకెళ్లొచ్చు. అంతా సరే కానీ... మరీ చిన్నపిల్లలు స్కూలుకి వేసుకెళ్తున్నట్లు ఉంటుంది. ఇప్పుడేం వేసుకుంటాం... ఈ రెయిన్‌కోట్లు అంటారా? ఇది తయారీదారులూ ఆలోచించినట్టున్నారు. అందుకే అమ్మాయిలకు ప్రత్యేకంగా, స్టైలిష్‌గా రెయిన్ కోట్లను ఇలా తీసుకొస్తున్నారు. అచ్చంగా స్టైలిష్ కుర్తీనే వేసుకున్నట్టు లేదూ? వాటర్ ప్రూఫ్ టెక్నాలజీతో కొత్త రకం వస్త్రాలను వీటికోసం వినియోగిస్తున్నారు. పైగా బరువూ తక్కువేనట. అంటే వీటిని వేసుకోవడమూ తేలిక. ఫ్యాషన్‌కి ఏమాత్రం అంతరాయం కాదు... ఇంకా చినుకు మీద పడకుండా ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఇంతకన్నా మనకి మాత్రం ఏం కావాలి చెప్పండి? ఒకటి తెచ్చుకోండి. చినుకుల్లో ఫ్యాషన్‌లో తడిసిపోవచ్చు... ఏమంటారు?



ఫ్యాషన్ ఫ్యాషన్

బావను చేసుకోవాల్సిందేనా?

ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నా. అక్క ఈమధ్యే పాప పుట్టాక చనిపోయింది. దీంతో బావకిచ్చి నన్ను పెళ్లి చేయాలనుకుంటున్నారు. వేరే ఎవరైనా అయితే పాపను సరిగా చూసుకోలేరు అంటున్నారు. నేను ససేమిరా అంటే మీ అక్క నిన్ను అమ్మలా చూసుకుంది. తన కూతురుని వదిలేస్తే ఆమె ఆత్మ శాంతించదు అంటున్నారు. అక్కకీ నాకు ఏడేళ్లు తేడా. పెళ్లి తప్ప నాకు వేరే మార్గం లేదా?

– ఓ సోదరి

చాలా సందిగ్ధ పరిస్థితి నీది. నీ బాధ నాకు అర్థమైంది. నువ్వే ఇంకా సంపూర్ణమైన వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోలేదు. చదువు పూర్తవలేదు. మానసిక పరిపక్వత పెంచుకునే దశలోనే ఉన్నావు. అలాంటి నీకు ఇంత పెద్ద బాధ్యత ఇవ్వాలనుకోవడం చాలా తప్పు. అక్క నిన్ను తల్లిలా చూసుకుని ఉండొచ్చు. అంత మాత్రాన నువ్వు తన పిల్లలకు అమ్మ అవ్వాలన్న నియమం ఏమీలేదు. నీకు అవకాశం ఉన్నంతవరకు తన పాప పట్ల ప్రేమగా ఉండటం, మంచి అలవాట్లు నేర్పడం వంటివి చేయడం ద్వారా కూడా మీ అక్కకి కృతజ్ఞతను చూపించవచ్చు. ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులతో నిర్భయంగా మనసు విప్పి మాట్లాడు. నీకు 18 సంవత్సరాలు లేకపోతే పెళ్లి చేయడం చట్టరీత్యా నేరం కూడా. ఒకవేళ ఉన్నా అయిష్టంగా చేసుకోవాల్సిన అవసరమూ లేదు. ఈ విషయాలన్నీ పెద్దవాళ్లకి అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చెయ్యి. అవసరమైతే ఇంకెవరి సాయమైనా తీసుకుని, వాళ్లతో మాట్లాడించు. తప్పని పరిస్థితులు ఎదురైతే ఈ విషయంలో సాయం చేసే ఎన్‌జీఓలు ఉన్నాయి. వాటి సాయంతోనైనా పెళ్లిని ఆపే ప్రయత్నం చేయవచ్చు. కాబట్టి, గిల్టీగా ఫీలవ్వాల్సిన పనిలేదు. ఇష్టంలేని జీవితంలోకి ప్రవేశించాల్సిన అవసరం అంతకన్నా లేదు. మనసు స్థిమితపరచుకుని, అనువైన పరిష్కారాన్ని ఎంచుకో.

బట్టీ కొట్టమంటున్నారు!

పది వరకూ సీబీఎస్ఈ సిలబస్. ఇంటర్‌లో స్టేట్ సిలబస్‌కి మారా. అంతకుముందు అర్థం చేసుకున్నది పరీక్షలో రాసేవాళ్లం. ఇప్పుడు కాలేజీలో బట్టీ కొట్టమని నేరుగా చెబుతున్నారు. అప్పుడే మార్కులేస్తారట. ఇలాగైతే సబ్జెక్టు అర్థం కాదు కదా? ముందుముందు నా పరిస్థితేంటి అని భయమేస్తోంది.

– ఓ సోదరి

మన విద్యా వ్యవస్థ మారనంత వరకూ నీలాంటి పిల్లలకు ఈ సందిగ్ధత తప్పదు. పాఠం అర్థం చేసుకుని సొంత పదాలతో రాయడమే సరైన పద్ధతి. కానీ, మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను బట్టీ కొట్టమంటున్నారు. ఈ పద్ధతితో కొంత వరకే ఉపయోగముంటుంది. పోటీ, ప్రవేశపరీక్షలకు ఇది పనికిరాదు. కాబట్టే, చాలామంది ర్యాంకర్లూ ఐఐటీ ల్లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో స్థానం పొందలేకపోతున్నారు. బట్టీకొట్టే క్రమంలో లాజికల్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్ కొరవడటమే కారణం. అందుకని నువ్వు పాఠాన్ని అర్థం చేసుకోవడానికే ప్రయత్నం చెయ్యి. సంవత్సరాలు వంటివంటావా... అలాంటివాటికి మాత్రం గుర్తుపెట్టుకునే టెక్నిక్‌లను ప్రయత్నించు. ఇప్పుడు సర్లేమని ప్రయత్నించినా... ఇంటర్ తరవాత అసలు నీకే బట్టీ కొట్టడం ఏమాత్రం సాయపడదు కూడా.

అమరావతి ఓఆర్ఆర్ వెడల్పు.. 140 మీటర్లు

- 70 మీటర్లకు బదులు.. ఈ మార్పునకు కేంద్రం పచ్చజెండా
- గుంటూరు వరకు వినుకొండ-గుంటూరు హైవే విస్తరణ
- మూలపేట నుంచి విశాఖకు గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే
- విశాఖలో ఒకే ప్రాజెక్టుగా మెట్రో, హైవే
- మార్చిలో గడ్కరీ, చంద్రబాబు భేటీ నిర్ణయాలు అధికారికంగా వెల్లడి

ఈనాడు, అమరావతి: అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డును 140 మీటర్ల వెడల్పుతో చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జెండా ఊపింది. గతంలో 70 మీటర్ల వెడల్పుతో 189 కి.మీ. ఓఆర్ఆర్ నిర్మాణానికి అంగీకారం తెలపగా, ఇది సరిపోదంటూ సీఎం చంద్రబాబు కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. దేశంలోనే మోడల్ నగరంగా అమరావతిని నిర్మిస్తుండటం, ఓఆర్ఆర్‌పై 50 ఏళ్లలో పెరిగే వాహనరద్దీని దృష్టిలో పెట్టుకొని 150 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ ఉండాలని చంద్రబాబు పట్టుబట్టారు. దీంతో 140 మీటర్ల వెడల్పునకు కేంద్రం సమ్మతించింది. విజయవాడ తూర్పు బైపాస్ సాధ్యం కాదని గతంలో కేంద్రం పేర్కొన్నందున.. దాని స్థానంలో ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేసేలా రెండు చోట్ల లింక్‌రోడ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఓఆర్ఆర్‌తో పాటు రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు, కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మార్చి 5న దిల్లీలో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని మినిట్స్ రూపంలో పేర్కొంటూ అధికారికంగా వివరాలు గురువారం ఇక్కడి అధికారులకు వచ్చాయి.

భూసేకరణకు రాష్ట్రం రూ.వెయ్యి కోట్లు

ఓఆర్ఆర్‌కు 70 మీటర్ల వెడల్పు చాలంటూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ గత డిసెంబరులో నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదనంగా 70 మీటర్ల వెడల్పునకు అయ్యే భూసేకరణ వ్యయంలో రూ.వెయ్యి కోట్లు రాష్ట్రం వెచ్చించేందుకు చంద్రబాబు అంగీకరించారు. చంద్రబాబు, గడ్కరీ సమావేశం మార్చిలో జరిగినా.. అందులో తీసుకున్న నిర్ణయాల వివరాలు అధికారికంగా రాకపోవడంతో కొంత సందిగ్ధత నెలకొంది. దీంతో ఇక్కడి ఎన్‌హెచ్ఏఐ అధికారులు.. 70 మీటర్ల వెడల్పుతోనే ఓఆర్ఆర్‌కు ఐదు జిల్లాల్లో భూసేకరణను ఇటీవల ఆరంభించారు. తాజాగా 140 మీటర్ల వెడల్పుతో ప్రాజెక్టు ఖరారు చేస్తూ నిర్ణయం రావడంతో దానికి అనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు.

రెండు అనుసంధాన రోడ్లు

విజయవాడ పశ్చిమవైపు బైపాస్ నిర్మాణం తుదిదశలో ఉండగా, ఇప్పుడు తూర్పు వైపు నాలుగు వరుసలతో బైపాస్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ తూర్పు బైపాస్.. అమరావతి ఓఆర్ఆర్‌కు సమాంతరంగా కొంత దూరంలోనే ఉండటంతో, తూర్పు బైపాస్ వద్దని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి ప్రత్యామ్నాయంగా చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్-16పై కాజ వద్ద ముగిసే విజయవాడ పశ్చిమ బైపాస్ నుంచి.. తెనాలి సమీపంలో ఓఆర్ఆర్ వరకు 17.5 కి.మీ. మేర లింక్‌రోడ్డు నిర్మాణానికి అంగీకారం తెలిపింది. గుంటూరు శివారులోని బుడంపాడు వద్ద ఎన్‌హెచ్-16 నుంచి నారాకోడూరు సమీపంలో ఓఆర్ఆర్ వరకు 5.2 కి.మీ. మేర మరో లింక్‌రోడ్డు నిర్మాణానికీ కేంద్రం పచ్చజెండా ఊపింది.

బైపాస్‌లో నాలుగు చోట్ల వంతెనలు

గొల్లపూడి నుంచి రాజధాని ప్రాంతం మీదుగా కాజ వరకు ఉన్న విజయవాడ వెస్ట్ బైపాస్‌లో నాలుగు రహదారుల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్‌రోడ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపారు. తొలుత వెస్ట్ బైపాస్ పూర్తిచేసిన తర్వాత దశలవారీగా వీటిని నిర్మిస్తారు.

గుంటూరు వరకు హైవే విస్తరణ

అనంతపురం నుంచి గుంటూరు వరకు ఉన్న హైవే-544డి లో వినుకొండ నుంచి గుంటూరు వరకు నాలుగు వరుసలుగా విస్తరణకు మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ గత డిసెంబరులో ఆమోదం తెలిపింది. వినుకొండ నుంచి గుంటూరులోని చెన్నై-కోల్‌కతా హైవే వరకు 109.65 కి.మీ. ఉండగా, అంతవరకు విస్తరించకుండా.. ఔటర్ రింగ్ క్రాస్ అయ్యేచోటు వరకు 84.80 కి.మీ. మేరకే విస్తరణకు ఆమోదం తెలిపారు. ఈ అంశాన్నీ సీఎం చంద్రబాబు గడ్కరీ వద్ద ప్రస్తావించారు. గుంటూరు వరకు ఎన్‌హెచ్-544డి ని విస్తరించాలని కోరారు. దీంతో గుంటూరు వరకు మిగిలిన 24.85 కి.మీ. దూరాన్నీ నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం అంగీకరించింది.

విశాఖలో 12 జంక్షన్ల మీదుగా ఎలివేటెడ్ కారిడార్లు

◆ శ్రీకాకుళం జిల్లా మూలపేట నుంచి విశాఖపట్నం వరకు గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవే నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయనున్నారు. తీరానికి దగ్గరగా ఉండేలా దీనిపై అధ్యయనం చేయనున్నారు.

◆ విశాఖ మీదుగా వెళ్లే పాత చెన్నై-కోల్‌కతా హైవేలో లంకెలపాలెం నుంచి మధురవాడ కార్‌షెడ్ జంక్షన్ వరకు మొత్తం 12 జంక్షన్లు ఉండగా.. వీటివద్ద వంతెనల నిర్మాణానికి తొలుత ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించింది. సీఎం చంద్రబాబు సూచనతో ఒకటి నుంచి ఎనిమిదో జంక్షన్ వరకు 15 కి.మీ. మేర ఒక ఎలివేటెడ్ వంతెన, తర్వాత 3 జంక్షన్లకు కలిపి 8 కి.మీ. మేర మరో ఎలివేటెడ్ వంతెన, 12వ జంక్షన్‌లో ప్రత్యేకంగా ఓ వంతెన నిర్మాణానికి అంగీకరించారు. వీటిలో 10 జంక్షన్ల మీదుగా మెట్రోరైలు ప్రాజెక్టు వెళ్తుండటంతో.. ఎన్‌హెచ్ఏ వంతెన, దానిపైన మెట్రోరైలు వంతెన కలిపి నాగ్‌పుర్ తరహాలో ఒకే ప్రాజెక్టుగా చేపట్టనున్నారు.

◆ హైదరాబాద్ నుంచి విజయవాడలోని గొల్లపూడి వరకు 226 కి.మీ. మేర హైవేని ఆరు/ఎనిమిది వరుసలుగా విస్తరించడం, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న హైవేని ఆరు వరుసలుగా విస్తరించడానికి డీపీఆర్‌లు త్వరగా ఖరారుచేయాలని ఆదేశించారు.

◆ కుప్పం నుంచి తమిళనాడులోని హోసూరు మధ్య 56 కి.మీ. నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి 9 నెలల్లో డీపీఆర్ సిద్ధం చేస్తారు.

◆ కాకినాడ పోర్టుకు దక్షిణవైపు నుంచి కత్తిపూడి-ఒంగోలు హైవేకి అనుసంధానం చేసేలా డీపీఆర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు.

◆ చెన్నై-కోల్‌కతా హైవేలో నెల్లూరు వద్ద 17.16 కి.మీ. బైపాస్ నిర్మించగా, దానిపై టోల్‌ప్లాజా ఏర్పాటుకు 2015 నుంచి ఎన్‌హెచ్ఏఐ ప్రయత్నిస్తోంది. దీనిపై ప్రజలు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో నగర పరిధి దాటిన తర్వాత మరెక్కడైనా హైవేపై టోల్‌ప్లాజా ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని గడ్కరీ సూచించారు.

చంద్రబాబుపై నమ్మకంతో భూములిస్తాం

- రాజధాని విస్తరణకు గ్రామసభల్లో రైతుల స్పష్టీకరణ
- భూములివ్వబోమంటూ వైకాపా నేతల లేఖ

అమరావతి, తాడికొండ, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి విస్తరణకు ప్రభుత్వం చేపట్టిన రెండో విడత భూసమీకరణకు రైతులు సానుకూలంగా స్పందించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పాములపాడు, బేజాత్‌పురం, రావెల గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో రాజధాని అభివృద్ధికి భూములు ఇస్తామని చెప్పారు. ఈ మూడు గ్రామాల్లో 11,110 ఎకరాలను సమీకరించాల్సి ఉంది. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన భూసమీకరణ మార్గదర్శకాల ప్రకారం రైతులకు కల్పించే ప్రయోజనాలను వివరించారు. వారి సందేహాలను నమోదు చేసుకున్నారు. రాజధానిలో తమకు ప్లాట్లు ఇస్తే భూములివ్వడానికి అభ్యంతరం లేదని పాములపాడులో రైతులు చెప్పారు. 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. బేజాత్‌పురంలో రైతులు మాట్లాడుతూ.. భూములివ్వడానికి అభ్యంతరం లేదని, అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఇచ్చే రూ.30 వేల కౌలు చాలదని, వారిని ఆదుకోవాలని సూచించారు. భూములిచ్చిన వెంటనే తమకు ప్లాట్లు కేటాయించాలని రావెల గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఇద్దరు రైతులు తమతోపాటు బంధువులకు చెందిన 100 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.



రావెల గ్రామసభలో అభిప్రాయాలు తెలియజేస్తున్న రైతు

బేజాత్‌పురం గ్రామసభలో గందరగోళం

బేజాత్‌పురం గ్రామసభలో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. మేం భూములివ్వబోమని మీరాసాహెబ్ అనే రైతు చెప్పారు. మీ అభిప్రాయం చెప్పకుండా అందరి తరఫున ఎలా మాట్లాడతారంటూ కొందరు రైతులు ఆయన్ను ప్రశ్నించారు. మీరాసాహెబ్ అభిప్రాయం చెప్పనివ్వరా అంటూ మరికొందరు అడ్డు తగిలారు. ఇరువర్గాల వాదనకు దిగడంతో తోపులాటకు దారితీసింది. పోలీసులు, అధికారులు వారిని సర్దిచెప్పారు.

భూసమీకరణకు వ్యతిరేకంగా వైకాపా

రైతులను రెచ్చగొట్టేలా వైకాపా నాయకులు వ్యవహరిస్తున్నారు. రావెల గ్రామసభలో కొంతమంది ఆ పార్టీ నేతలు.. భూసమీకరణను అంగీకరించబోమంటూ ఎమ్మెల్యేకు లేఖ ఇచ్చారు. అందులో ఉన్న గ్రామసభలో చదివి వినిపించారు. మీరు ఇవ్వకపోయినా.. ఇచ్చేవారు ఉన్నారని వారి కోసం గ్రామసభ నిర్వహిస్తామని ఆయన చెప్పడంతో వైకాపా నేతలు వెళ్లిపోయారు.

గ్రామసభలో రైతుల అభిప్రాయాలు

◆ భూసమీకరణకు గ్రామస్థులందరం సహకరిస్తాం.

◆ వ్యవసాయం, కులవృత్తుల వారికి రాజధానిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం కల్పించాలి.

◆ అమరావతిని రాజధానిగా నోటిఫై చేయాలి.

◆ ప్రభుత్వం రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించాలి.

◆ సీఆర్డీఏ కమిటీలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీకి స్థానం కల్పించాలి. దీనివల్ల ప్రజలు వారిని నేరుగా సమస్యలు చెప్పుకొనే వీలుంటుంది.

◆ 2014లో రాజధాని రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ చేశారు. ఇప్పుడు రూ.3 లక్షలు చేయాలి.

◆ మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి ఇచ్చే ప్లాట్లలో 40 అడుగుల రోడ్డు సదుపాయం కల్పించాలి. ఎకరాకు 1,500 గజాల చొప్పున ఇవ్వాలి.

◆ రోడ్డు వెంట ఉన్న విలువైన భూములకు జరీబు ప్యాకేజీ ఇవ్వాలి.

మెగా డీఎస్సీ ప్రాథమిక 'కీ' విడుదల

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ', రెస్పాన్స్ షీట్లను గురువారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. జూన్ 6 నుంచి జూన్ 28 వరకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన 'కీ'ని విడుదల చేశామని, ఇందులో పీజీటీ కామర్స్, ఆంగ్లం, హిందీ, భౌతికశాస్త్రం, సంస్కృతం, సాంఘిక శాస్త్రం, తెలుగు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఆంగ్లం, భౌతికశాస్త్రం పరీక్షల 'కీ'లు ఉన్నాయని వెల్లడించారు. అలాగే ఎస్జీటీ జనరల్, స్పెషల్ పోస్టులు, టీజీటీలో ఆంగ్లం, హిందీ, భౌతికశాస్త్రం, తెలుగు, ఆంగ్ల భాష ప్రావీణ్య పరీక్ష, స్పెషల్ పీఈటీ, జనరల్ పీఈటీకి సంబంధించిన అన్ని మాధ్యమాల ప్రాథమిక 'కీ', రెస్పాన్స్ షీట్లూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 11లోపు ఆన్‌లైన్‌లో పంపించాలని సూచించారు. జూన్ 29 నుంచి జులై 2 వరకు జరిగిన పరీక్షల ప్రాథమిక 'కీ'ని త్వరలో విడుదల చేస్తామని పేర్కొన్నారు.



తల్లిదండ్రులూ.. ఇది గమనించారా?

90వ దశకంలో పిల్లలు తోటివారితో ఆడుకుంటూ ఆరుబయటే గడిపేవారు. దీనివల్ల వారిలో శారీరక దృఢత్వంతో పాటు సామాజిక బంధాలు, ప్రకృతితో అనుబంధం పెరిగేవి. కానీ ఇప్పటి పిల్లలు గంటల తరబడి వీడియో గేమ్స్ ఆడుతూ స్క్రీన్లకు అతుక్కుపోతున్నారు. దీనివల్ల వారిలో శారీరక చురుకుదనం లోపించడమే కాదు, ఆందోళన, కుంగుబాటు పెరుగుతున్నాయి. వాస్తవిక ప్రపంచంలోని అనుభూతులకు వారు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు సంకల్పిస్తేనే ఈ పరిస్థితి మారుతుంది.

– టైలర్ టాడ్, ఫిట్‌నెస్ కోచ్

గుంటూరు జిల్లాలో నేచురోపతి పరిశోధన కేంద్రం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో రూ.94 కోట్లతో కేంద్ర యోగా, సహజ చికిత్స పరిశోధన సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) పాటు 100 పడకల ఆసుపత్రి, సిబ్బంది గృహ సముదాయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 15 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును చేపట్టబోతోందని ఆయన గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందుకు 100% ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఈ కేంద్రంలో నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు లభిస్తాయని, మిగతావారికి చౌకధరల్లో సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో 100-150 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

రైలు మార్గాల్లో కొత్త సరిహద్దులు!

- విజయవాడకు కొండపల్లి-మోటమర్రి సెక్షన్
- రైల్వే డివిజన్ల హద్దుల్లో మార్పులు చేర్పులకు ప్రతిపాదన



ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఆరింట మూడు డివిజన్లు విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుకానున్న దక్షిణ కోస్తా జోన్‌కు వెళ్లనున్న నేపథ్యంలో పలు డివిజన్ల సరిహద్దుల్లో మార్పులుచేర్పులు జరిగే అవకాశం ఉంది. రైల్వేబోర్డుకు పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో డివిజన్ల హద్దులు మార్చాలంటూ ప్రతిపాదనలు వెళ్లాయి. అవి ఆమోదం పొందితే కొన్ని డివిజన్ల సరిహద్దులు మారుతాయి. ప్రస్తుతం ద.మ.రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్.. ఆరు డివిజన్లు ఉన్నాయి. పునర్విభజన తర్వాత సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు ద.మ.రైల్వేలో మిగులుతాయి. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఏపీలో విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా జోన్‌లోకి వెళతాయి. ఇందులో సికింద్రాబాద్, గుంతకల్, విజయవాడ, గుంటూరు డివిజన్ల సరిహద్దుల్లో మార్పులకు ప్రతిపాదనలు వెళ్లాయి.

★ కర్ణాటకలోని రాయచూరు, మహారాష్ట్రలోని వాడి మధ్య ఉన్న సెక్షన్ ప్రస్తుతం గుంతకల్ పరిధిలో ఉంది. దీన్ని సికింద్రాబాద్‌లో కలపాలని ప్రతిపాదించారు. వాడి నుంచి సికింద్రాబాద్, శోలాపుర్, రాయచూరు మూడు మార్గాలున్నాయి. వాడి.. మూడు జోన్లకు ఇంటర్‌ఛేంజ్ పాయింట్. సికింద్రాబాద్ నుంచి నడిపే రైళ్లకు ఇబ్బంది లేకుండా ప్రతిపాదించారు.

★ తెలంగాణలోని మోటమర్రి, ఏపీలోని కొండపల్లి సెక్షన్ ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌లో ఉండగా.. విజయవాడలో కలపాలని ప్రతిపాదించారు. సుమారు 50 కిమీ దూరం. కొండపల్లిలో పవర్ ప్లాంట్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదించారు. ఇవి కార్యరూపం దాలిస్తే సికింద్రాబాద్ డివిజన్‌లోకి కొత్తగా 240 కిమీ రైల్వే ట్రాక్ చేరుతుంది. మరోవైపు 50 కిమీ ట్రాక్ పోతుంది. గుంతకల్ డివిజన్ పరిధిలో 100 కిమీ తగ్గుతుంది.

★ సరకు రవాణా, ప్రయాణికుల రైళ్లను నడపడంలో, వేగం పెంచడంలో, అదనంగా నడపడంలో జోన్ల మధ్య సమన్వయం, అంగీకారం కీలకం. ఈ సాంకేతిక సమస్యలు పెరగకుండా చూసేందుకే ఈ మార్పులు ప్రతిపాదించినట్లు రైల్వేవర్గాల సమాచారం.

ప్రస్తుత జోన్ స్వరూపం

ద.మ.రైల్వే ఆరు డివిజన్లతో ఆరు రాష్ట్రాల పరిధిలో ఉంది. 6,609 కిమీ పరిధిలో ఉంది.

రాష్ట్రం	ట్రాక్ కి.మీ.	శాతం
ఆంధ్రప్రదేశ్	3028.15	45.18
తెలంగాణ	2014.61	30.48
మహారాష్ట్ర	1102.69	16.68
కర్ణాటక	387.16	5.86
మధ్యప్రదేశ్	70.18	1.06
తమిళనాడు	6.86	0.74

డివిజన్ల వారీగా ప్రస్తుత పరిస్థితి

డివిజన్	ట్రాక్ కి.మీ.
సికింద్రాబాద్	2684.12
హైదరాబాద్	921.76
నాందేడ్	1067.66
విజయవాడ	2228.35
గుంతకల్	2364.72
గుంటూరు	960.02

నేడు నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో.. తొలిసారి ప్రయాణికుల రైలు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో తొలిసారి ప్రయాణికుల రైలు శుక్రవారం పట్టాలెక్కనుంది. న్యూపిడుగురాళ్ల-శావల్యాపురం మధ్య 46 కి.మీ. దూరం నూతన రైలు మార్గాన్ని నిర్మించారు. పిడుగురాళ్లను, శావల్యాపురాన్ని ఇది అనుసంధానిస్తుంది. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు 2020 జూన్ 30న అనుమతి మంజూరైనా ఇప్పటిదాకా సరకుల రైళ్లే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. వారానికోసారి ప్రయాణికుల రైలును నడిపేందుకు ఇటీవల ఉన్నతాధికారుల నుంచి అనుమతి మంజూరైంది. నెమలిపురి, రొంపిచర్ల స్టేషన్లలో టికెట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి బయలుదేరే ప్రత్యేక రైలు నడికుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ, మార్కాపురం, దొనకొండ, కంభం, నంద్యాల మీదుగా తిరుపతి చేరుకుంటుంది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ బోగీలు 14కి పెంపు

ఈనాడు, హైదరాబాద్: ఆదిలాబాద్-తిరుపతిల మధ్య రాకపోకలు సాగించే కృష్ణా ఎక్స్‌ప్రెస్ (నెం.17405, 17406)లో స్లీపర్ బోగీల సంఖ్య పెరగనుంది. సెకండ్ క్లాస్ ఛైర్‌కార్ బోగీలు తగ్గనున్నాయి. రెండు విడతల్లో ఈ మార్పు జరగనుంది. ఈ రైల్లో ప్రస్తుతం త్రీటైర్ ఏసీ నాలుగు, స్లీపర్ నాలుగు, సెకండ్ క్లాస్ ఛైర్ కార్ 10, జనరల్ సెకండ్ క్లాస్ నాలుగు బోగీలున్నాయి. జులై 6 నుంచి త్రీటైర్ ఏసీ మూడు, సెకండ్ క్లాస్ ఛైర్‌కార్ ఆరు బోగీలకు తగ్గి..స్లీపర్ బోగీలు ఎనిమిదికి పెరగనున్నాయి. ఈ నిర్ణయం సెప్టెంబరు 1 వరకు అమల్లో ఉంటుంది. సెప్టెంబరు 2వ తేదీ నుంచి జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు నాలుగుకు తగ్గుతాయి. స్లీపర్ బోగీలు 14కు పెరగనున్నాయి. ఆదిలాబాద్-హెచ్ఎస్ నాందేడ్‌ల మధ్య తిరిగే రైల్లో (నెం. 17409/17410) కూడా ఇదే తరహాలో మార్పులు జరగనున్నాయి. ఈ మేరకు ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

902 ఎకరాలు.. 239 కి.మీ. మేర డబ్లింగ్ పనులు

ఈనాడు, నల్గొండ: గుంటూరు నుంచి బీబీనగర్ వరకు రైల్వేట్రాక్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంలో భాగంగా డబ్లింగ్ పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం రూ.2,853 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో గూడూరు (యాదాద్రి భువనగిరి జిల్లా) నుంచి నల్లపాడు(గుంటూరు) వరకు 239 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనుల కోసం భూసేకరణ చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

జగన్‌తో వంశీ భేటీ



జగన్‌తో వంశీ దంపతులు

ఈనాడు, అమరావతి, హనుమాన్ జంక్షన్–న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్‌తో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ భేటీ అయ్యారు. బుధవారం జైలు నుంచి విడుదలైన వంశీ.. తన భార్యతో సహా గురువారం తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లి ఆయన్ను కలిసి మాట్లాడారు. తనపై 11 కేసులు నమోదు చేసి, 140 రోజుల పాటు జైల్లో పెట్టారని, బెయిల్ రాకుండా అడ్డుకునే ప్రయత్నమూ చేశారని జగన్‌కు వంశీ వివరించారు. కష్టకాలంలో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వివరాలను జగన్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. తర్వాత గన్నవరం చేరుకున్న వంశీ.. గన్నవరం, ఆత్కూరు పోలీస్ స్టేషన్లలో తనపై నమోదైన వివిధ కేసులకు సంబంధించి ఎస్‌హెచ్ఓలు, న్యాయమూర్తి ఎదుట హాజరై.. కోర్టులు విధించిన షరతుల మేరకు పూచీకత్తులు సమర్పించారు. అనంతరం ఎ.సీతారాంపురంలోని నివాసానికి చేరుకున్నారు. అంతకుముందు వంశీని మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లు కలిశారు.

బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: జగన్ మళ్లీ బెంగళూరుకు వెళ్లారు. సోమవారం రాత్రి బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన.. గురువారం నెల్లూరు వెళ్లి, అక్కడి జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలవాలని నిర్ణయించారు. నెల్లూరు పర్యటన రద్దవడంతో గురువారం బెంగళూరుకు బయల్దేరి వెళ్లారు.

కరేడు భూముల జోలికొస్తే ఊరుకోం: షర్మిల

ఈనాడు, అమరావతి: సోలార్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కరేడు గ్రామ రైతులు చేస్తున్న ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. ఆ భూముల జోలికొస్తే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజాభిప్రాయం సేకరించకుండా భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండోసోల్ సోలార్ కంపెనీకి 8,458 ఎకరాలు ధారాదత్తం చేస్తామనడం ద్రోహం. గ్రామసభలు నిర్వహించి రైతుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలి' అని వెల్లడించారు.

ఛాంపియన్


3 ఇంగ్లాండ్‌లో ద్విశతకాలు చేసిన భారత ఆటగాళ్లలో గిల్ స్థానం. సునీల్ గావస్కర్ (221; 1979లో), ద్రవిడ్ (217, 2002లో) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

3 ఆరో వికెట్ అంత కంటే దిగువ స్థానాల్లో నమోదైన 200 పరుగుల భాగస్వామ్యాల్లో రవీంద్ర జడేజా భాగమైన ఇన్నింగ్స్‌లు. గిల్‌క్రిస్ట్ (6), వాట్లింగ్ (5), ధోని (4) అతడికంటే ముందున్నారు.

5 టెస్టులు, వన్డేల్లో ద్విశతకాలు చేసిన బ్యాటర్ల సంఖ్య. సచిన్, సెహ్వాగ్, రోహిత్, క్రిస్ గేల్ ముందున్నారు.

గిల్ డబుల్ జిగేల్

- కెప్టెన్ భారీ ద్విశతకం
- భారత్ 587
- రెండో టెస్టులో పైచేయి
- ఇంగ్లాండ్ 77/3



శుభ్‌మన్ గిల్ **269** 387 బంతుల్లో 30×4, 3×6

లీడ్స్‌లో బాగా ఆడినా కీలక సమయాల్లో తడబడి మ్యాచ్‌ను చేజార్చుకున్న టీమ్‌ఇండియా.. ఈసారి పట్టువీడకుండా సాగుతోంది. సిరీస్ సమం చేసేందుకు అద్భుత అవకాశాన్ని సృష్టించుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదరహో!

పరుగుల వరద పారిస్తూ, రికార్డుల మోత మోగిస్తూ గిల్ చిరస్మరణీయ ద్విశతకం సాధించిన వేళ.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు సాధించింది. తొలి రోజు గట్టి పునాది వేసుకున్న భారత్‌ను గిల్ అదిరే ఆటతో రెండో రోజూ ముందుండి నడిపించాడు. విలువైన భాగస్వామ్యాలతో మ్యాచ్‌ను శాసించే స్థితికి తీసుకెళ్లాడు. బౌలర్లూ రాణించడంతో భారత్ రెండో రోజును సంతృప్తిగా ముగించింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన ఆకాశ్‌దీప్, సిరాజ్.. ఇంగ్లాండ్ బజ్‌బాల్ ఆటను సాగనివ్వలేదు. 77కే 3 వికెట్లు పడగొట్టిన మన బౌలర్లు మూడో రోజు ఎలా బౌలింగ్ చేస్తారన్నదే మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది.

బర్మింగ్‌హామ్

కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (269; 387 బంతుల్లో 30×4, 3×6) అద్భుత డబుల్ సెంచరీతో రెండో టెస్టులో టీమ్‌ఇండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. పట్టుబిగించేందుకు ప్రయత్నిస్తోంది. గిల్‌తో పాటు జడేజా (89; 137 బంతుల్లో 10×4, 1×6), వాషింగ్టన్ సుందర్ (42; 103 బంతుల్లో 3×4, 1×6) పోరాడడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 310/5తో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన జట్టుకు గిల్ వెన్నెముకలా నిలిచాడు. అనంతరం బంతితోనూ భారత్ సత్తా చాటింది. ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 77 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. బ్రూక్ (30), రూట్ (18) క్రీజులో ఉన్నారు. ఆకాశ్‌దీప్ (2/36), సిరాజ్ (1/21) ఆ జట్టును దెబ్బతీశారు. అయితే బ్యాటింగ్‌కు మరీ కష్టంగా ఏమీ లేని పిచ్‌పై.. మ్యాచ్ గెలవడానికి అవసరమైన 20 వికెట్లు పడగొట్టడం అనుభవం లేని భారత బౌలింగ్ దాడికి పెద్ద సవాలే.

కెప్టెన్ నిలిచాడు: 211/5. తొలి రోజు ఓ దశలో భారత్ స్కోరిది. తొలి టెస్టు అనుభవం నేపథ్యంలో జట్టు కుప్పకూలేందుకు అవకాశం లేదని కొట్టిపారేయలేని పరిస్థితి. ఆ రోజు ఆఖరుకు 310/5. టీమ్‌ఇండియా కోలుకుని, మెరుగైన స్థితిలో నిలిచినా భారీ స్కోరుకు గ్యారెంటీ ఏమీ లేదు. కానీ కెప్టెన్ గిల్ అద్వితీయమైన ఇన్నింగ్స్‌తో జట్టును నిలబెట్టాడు. అదిరే బ్యాటింగ్‌తో భారీ స్కోరును అందించాడు. తొలి టెస్టులోలా ఆధిక్యాన్ని చేజారనివ్వలేదు. జడేజా (ఓవర్‌నైట్ 41), వాషింగ్టన్ సుందర్‌లు అతడికి అందించిన సహకారం అమూల్యం. ఓవర్‌నైట్ స్కోరు 310/5తో భారత్ ఇన్నింగ్స్‌ను కొనసాగించగా.. గిల్ (ఓవర్‌నైట్ 114), జడేజా పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ బ్యాటర్లపై ఇంగ్లాండ్ షార్ట్ బాల్ వ్యూహం పనిచేయలేదు. గిల్, జడేజా చాలా వరకు అలవోకగా పరుగులు రాబట్టారు. ఏమాత్రం అవకాశం చిక్కినా బంతిని బౌండరీ దాటించారు. గిల్ 263 బంతుల్లో 150 పూర్తి చేసుకున్నాడు. బ్యాటర్లు స్పిన్నర్ బషీర్‌నూ వదల్లేదు. అతడు వేసిన ఓ ఓవర్లో లాంగాన్ మీదుగా జడేజా, స్లాగ్ స్వీప్‌తో డీప్ స్క్వేర్ లెగ్‌లో గిల్ సిక్స్‌లు బాదారు. గిల్ సిక్స్‌తో ఇద్దరి భాగస్వామ్యం రెండొందలు దాటింది. జడేజా సెంచరీ పూర్తి చేసేలా కనిపించాడు. కానీ టంగ్ షార్ట్ బాల్‌కు దొరికిపోయాడు. మొత్తం మీద తొలి సెషన్లో భారత్ 25 ఓవర్లలో 109 పరుగులు రాబట్టింది. సుందర్ రూపంలో మరో మంచి భాగస్వామి దొరకడంతో లంచ్ తర్వాత కూడా గిల్ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. బషీర్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన అతడు.. టంగ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో ద్విశతకానికి చేరువయ్యాడు. మరోవైపు టంగ్ షార్ట్ బంతులతో సుందర్‌ను పరీక్షించాడు. కానీ చివరికి సుందర్ బ్యాట్ ఝుళిపించాడు. అతడి ఓవర్లో ఫోర్, సిక్స్ దంచేశాడు. 199 వద్ద కాసేపు ఆగిన గిల్.. చివరికి టంగ్ బౌలింగ్‌లో సింగిల్‌తో డబుల్ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత కూడా అతడు బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌ను కొనసాగించాడు. బషీర్ బౌలింగ్‌లో ఓ చూడచక్కని రివర్స్ స్వీప్ బంతిని బౌండరీ దాటించిన అతడు.. బ్రూక్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 4 సాధించాడు. ఆ తర్వాత కూడా అదే జోరుతో బ్యాటింగ్ చేశాడు. గిల్ 348 బంతుల్లో 250 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. టీ విరామానికి కాసేపటి ముందు సుందర్ ఔటయ్యాడు. విరామానికి భారత్ స్కోరు 564/7. రెండో సెషన్లో భారత్ 145 పరుగులు రాబట్టడం విశేషం. అయితే టీ తర్వాత భారత్ ఇన్నింగ్స్ ఎంతో సేపు సాగలేదు. అంతసేపు అద్భుతంగా ఆడిన గిల్.. టంగ్ బౌలింగ్‌లో పోప్ చేతికి తేలికగా చిక్కి నిరాశగా వెనుదిరిగాడు. కానీ పెవిలియన్‌కు వస్తుండగా ప్రేక్షకులు చప్పట్లు చరుస్తూ తనను అభినందించడాన్ని అతడు ఎప్పటికీ మరిచిపోలేడు. టెయిలెండర్లను ఔట్ చేయడానికి ఇంగ్లాండ్ బౌలర్లు పెద్దగా సమయం తీసుకోలేదు. గిల్.. జడేజాతో ఆరో వికెట్‌కు 203, సుందర్‌తో ఏడో వికెట్‌కు 144 పరుగులు జోడించాడు.

విజృంభించిన ఆకాశ్‌దీప్: బుమ్రా గైర్హాజరీలో బంతితో భారత్‌కు ఆకాశ్‌దీప్ అద్భుత ఆరంభాన్నిచ్చాడు. బజ్‌బాల్ ఆటతో చెలరేగుదామనుకున్న ఇంగ్లాండ్‌కు మొదట్లోనే చెక్ పెట్టాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో వరుస బంతుల్లో డకెట్ (0), పోప్ (0)ను ఔట్ చేసి ప్రత్యర్థికి షాకిచ్చాడు ఆకాశ్‌దీప్. మూడో స్లిప్‌లో గిల్ అందుకున్న ఓ కళ్లు చెదిరే క్యాచ్‌కు డకెట్ నిష్క్రమించగా.. పోప్ ఎడ్జ్‌తో రాహుల్ చిక్కాడు. రాహుల్ రెండో ప్రయత్నంలో క్యాచ్‌ను అందుకున్నాడు. కాసేపటి తర్వాత క్రాలీ (19) ఇన్నింగ్స్‌కు సిరాజ్ తెరదించాడు. ఇంగ్లాండ్ 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడగా.. రూట్, బ్రూక్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు.



ఆకాశ్‌దీప్ 2/36

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; గిల్ (సి) పోప్ (బి) టంగ్ 269; రిషభ్ పంత్ (సి) క్రాలీ (బి) బషీర్ 25; నితీశ్ కుమార్‌రెడ్డి (బి) వోక్స్ 1; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 89; సుందర్ (బి) రూట్ 42; ఆకాశ్‌దీప్ (సి) డకెట్ (బి) బషీర్ 6; సిరాజ్ (స్టంప్డ్) స్మిత్ (బి) బషీర్ 8; ప్రసిద్ధ్ కృష్ణ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 22 **మొత్తం:** (151 ఓవర్లలో ఆలౌట్) **587; వికెట్ల పతనం:** 1-15, 2-95, 3-161, 4-208, 5-211, 6-414, 7-558, 8-574, 9-574; **బౌలింగ్:** వోక్స్ 25-6-81-2; కార్స్ 24-3-83-1; జోష్ టంగ్ 28-2-119-2; స్టోక్స్ 19-0-74-1; బషీర్ 45-2-167-3; రూట్ 5-0-20-1; బ్రూక్ 5-0-31-0.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) నాయర్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; రూట్ బ్యాటింగ్ 18; బ్రూక్ బ్యాటింగ్ 30; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (20 ఓవర్లలో 3 వికెట్లకు) **77**; **వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 7-1-36-2; సిరాజ్ 7-2-21-1; ప్రసిద్ధ్ కృష్ణ 3-0-11-0; నితీశ్ కుమార్‌రెడ్డి 1-0-1-0; జడేజా 2-1-4-0

ఈ సిరీస్ ఆరంభానికి ముందు నా బ్యాటింగ్‌లో కొన్ని అంశాలపై ఎక్కువగా శ్రమించాను. టెస్టు క్రికెట్లో రాణించేందుకు అవి ఎంతో ముఖ్యమని భావించాను. ఆ శ్రమకు తగిన ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో మా ఫీల్డింగ్ కూడా మెరుగైంది. తొలి టెస్టులో క్యాచ్‌లు జారవిడవకుంటే ఫలితం కచ్చితంగా భిన్నంగా ఉండేది.
- శుభ్‌మన్ గిల్

సారథి ముందుండి..

ఈనాడు క్రీడావిభాగం

అతణ్ని కెప్టెన్‌గా ప్రకటించినప్పుడు కొందరు పెదవి విరిచారు. కొందరు విమర్శించారు. అతడికి ఆ స్థాయి ఉందా అని ప్రశ్నించారు. తమ వాదనకు మద్దతుగా వాళ్ల గణాంకాలను ముందు పడేశారు. నిజమే బాధ్యతలు అందుకోవడానికి ముందు అతడి టెస్టు గణాంకాలు గొప్పగా లేవు. ప్రస్తుత సిరీస్‌కు ముందు 32 టెస్టుల్లో 35.05 సగటుతో 1893 పరుగులు మాత్రమే చేశాడు. ఇంగ్లాండ్‌లోనైతే ఆరు టెస్టుల్లో 14.67 సగటుతో 88 పరుగులు మాత్రమే సాధించాడు. కానీ ప్రశాంతంగా తన పని మీదే దృష్టి పెట్టిన శుభ్‌మన్ గిల్‌కు.. తన విమర్శకులకు గట్టి జవాబివ్వడానికి ఎంతో సమయం పట్టలేదు. సెలక్షన్ కమిటీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకున్న అతడు.. కేవలం మూడు ఇన్నింగ్స్‌లతోనే తనను సందేహించిన వాళ్లే ఔరా అనిపించేలా చేశాడు. రికార్డుల మోత మోగిస్తూ ఇప్పటికే 424 పరుగులతో లెక్కలన్నీ సరిచేశాడు. 'జట్టును ముందుండి నడిపిస్తా' అని సిరీస్ ప్రారంభానికి ముందు తాను చేసిన వ్యాఖ్యలు ఊరికే చేసినవి కాదని.. అవి అచంచల విశ్వాసం నుంచి వచ్చినవని చాటాడు.

తొలి టెస్టులో సూపర్ సెంచరీ సాధించినా.. జట్టు కొద్దిలో ఓడిపోవడంతో ఎడ్జ్‌బాస్టన్‌లో మరింత పట్టుదలను ప్రదర్శించాడు గిల్. సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టు భారాన్ని తన భుజస్కంధాలపై మోశాడు. ఎంత సాధికారికంగా ఆడాడో! ఒక్కటంటే ఒక్క పేలవ షాట్ లేదు. అత్యంత విలువైన భాగస్వామ్యాలతో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించిన గిల్, తొలి రోజే సెంచరీ సాధించినా.. సంతృప్తి చెందకుండా, పని పూర్తయిందని భావించకుండా రెండో రోజు మరింత బాధ్యతాయుతంగా ఆడాడు. ఉదయం మబ్బుపట్టిన వాతావరణంలో కొత్త బంతితో దాడికి దిగిన ఇంగ్లిష్ పేస్ బౌలర్లను అతడు ఎదుర్కొన్న తీరు అద్భుతం. సంప్రదాయ క్రికెట్ ఆడిన గిల్ అదే సమయంలో నిర్భీతినీ ప్రదర్శించాడు. కొత్త బంతిని గౌరవించిన అతడు ఎన్నో బంతులను ఆడకుండా వదిలేశాడు. ఆరంభంలో ఒత్తిడిని తట్టుకుని నిలిచాడు. క్రీజులో నిలదొక్కుకున్నాక పూర్తి భిన్నంగా కనిపించాడు. పూర్తి నియంత్రణతో, సాధికారిక షాట్లతో అలరించాడు. క్రమశిక్షణతో కూడిన అతడి స్ట్రోక్ ప్లే‌ను చూసి తీరాల్సిందే. తనదైన కవర్‌డ్రైవ్స్‌తో పాటు ముచ్చటైన లేట్ కట్స్, పుల్స్, అప్పుడప్పుడు లాఫ్టెడ్ షాట్లతో అలరించాడు. క్రమం తప్పకుండా స్ట్రైక్‌రొటేట్ చేస్తూ, బంతి ఏమాత్రం గతి తప్పినా శిక్షిస్తూ సాగిపోయిన గిల్.. బౌలర్లను ఏ దశలోనూ నిలదొక్కుకోనివ్వలేదు. పేసర్లతో పాటు స్పిన్నర్లనూ సమర్థంగా ఎదుర్కొన్నాడు. పరుగులు చేయడం ఇంత తేలికా అన్నట్లు ఆడాడు.

అత్యంత నాణ్యమైన, అచ్చమైన టెస్టు ఇన్నింగ్స్ ఇది. అతడేమీ విరుచుకుపడలేదు.. కానీ అలవోకగా పరుగులు రాబట్టాడు. అతడి ఆటలో తొందర లేదు.. పరుగుల ఆకలి మాత్రమే ఉంది. సహనానికి దూకుడును జోడించి సెషన్ల వారిగా ఇన్నింగ్స్‌ను నిర్మించిన గిల్.. ముందు జడేజా, ఆ తర్వాత సుందర్‌లతో విలువైన భాగస్వామ్యాలతో జట్టుకు భారీ స్కోరును అందించాడు. ఇంగ్లాండ్ బౌలర్లు అతణ్ని కాస్తయినా ఇబ్బంది పెట్టలేకపోయారు. జట్టును ముందుండి నడిపించిన అతడు.. కఠిన పరిస్థితుల్లో ఎలా ఆడాలో, ఎలా పాతుకుపోవాలో, రిస్క్ చేయకుండా ఎలా ఆధిపత్యాన్ని ప్రదర్శించాలో సహచరులకు చూపించాడు. గిల్ ఆట ఇలాగే కొనసాగితే ఆటగాడిగా అతడు శిఖరానికి చేరడమే కాదు.. జట్టునూ తీసుకెళ్లగలడు. అన్నట్లు.. ఈ విషయం తెలుసా! గిల్ టెస్టు సగటు 40 దాటింది.

గిల్ స్కోరు. విదేశాల్లో ఓ భారత బ్యాటర్‌కు ఇది మూడో అత్యధిక స్కోరు. సెహ్వాగ్ (309, పాక్‌పై ముల్తాన్‌లో), ద్రవిడ్ (270, పాక్‌పై రావల్పిండి)లో ముందున్నారు. **269**

రికార్డుల మోత

రెండో టెస్టు రెండో రోజూ అలవోకగా పరుగుల వేట సాగించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఆ క్రమంలో టెస్టుల్లో తొలిసారి ద్విశతకాన్ని అందుకున్నాడు. ఇంగ్లాండ్‌లో టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత, ఆసియా కెప్టెన్‌గా అతడు రికార్డు సృష్టించాడు. శ్రీలంక బ్యాటర్ దిల్షాన్ 2011లో లార్డ్స్‌లో సాధించిన 193 పరుగులే ఇప్పటివరకు ఇంగ్లాండ్‌లో ఓ ఆసియా కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 114తో గురువారం ఇన్నింగ్స్ కొనసాగించిన గిల్.. జోష్ టంగ్ బౌలింగ్‌లో సింగిల్‌తో 200 పూర్తి చేశాడు. ఈ మైలురాయిని అందుకోవడానికి అతడు 311 బంతులు ఆడాడు. ద్విశతకం సాధించిన భారత కెప్టెన్‌గా అతడు పటౌడీ, సునీల్ గావస్కర్, సచిన్ తెందుల్కర్, ధోని, కోహ్లీల సరసన నిలిచాడు. కోహ్లి కెప్టెన్‌గా రికార్డు స్థాయిలో ఏడు డబుల్ సెంచరీలు సాధించాడు. సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో అత్యధిక స్కోరు సాధించిన భారత కెప్టెన్‌గా కూడా గిల్ నిలిచాడు. అజహరుద్దీన్ (179)ను అతడు అధిగమించాడు. అంతే కాదు.. విదేశాల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత కెప్టెన్‌గానూ గిల్ ఘనత సాధించాడు. కోహ్లి (200; 2016లో వెస్టిండీస్‌పై) రికార్డును తుడిచిపెట్టాడు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్



శ్రీకాంత్

కాల్గరి: భారత బ్యాడ్మింటన్ స్టార్ కిదాంబి శ్రీకాంత్ కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. రెండో రౌండ్లో 21-19, 21-12తో వాంగ్ పో వీ (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ఒక దశలో 5-11తో వెనకబడిన శ్రీకాంత్ 18-18తో ప్రత్యర్థిని అందుకున్నాడు. ఆ తర్వాత నాలుగు పాయింట్లలో మూడు గెలిచి తొలి గేమ్ నెగ్గాడు. రెండో గేమ్‌లోనూ ప్రత్యర్థి ఆధిక్యం సాధించినా వెంటనే పుంజుకున్న శ్రీకాంత్ వేగంగా గేమ్‌ను ముగించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

జకోవిచ్ జోరు

- మూడో రౌండ్లో ప్రవేశం
- ఆండ్రీవా, క్రెజికోవా ముందంజ

వింబుల్డన్



జకోవిచ్

లండన్

కెరీర్లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ (సెర్బియా) మరో అడుగు ముందుకేశాడు. వింబుల్డన్ తొలి రౌండ్లో కష్టపడి గెలిచిన ఈ ఆరో సీడ్ ఆటగాడు.. రెండో రౌండ్లో అలవోకగా నెగ్గాడు. గురువారం పురుషుల సింగిల్స్‌లో జకోవిచ్ 6-3, 6-2, 6-0తో డానియల్ ఇవాన్స్ (బ్రిటన్)ను వరుస సెట్లలో ఓడించాడు. తొలి రెండు సెట్లలో కాస్త పోరాడిన ఇవాన్స్.. మూడో సెట్లో జకోవిచ్ ధాటికి పూర్తిగా తేలిపోయాడు. మ్యాచ్‌లో ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నొవాక్.. తేలిగ్గా మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. వింబుల్డన్‌లో నొవాక్‌కు ఇది 99వ విజయం. దిమిత్రోవ్ (బల్గేరియా), డిమినార్ (ఆస్ట్రేలియా), మిన్సిచ్ (చెక్) ముందంజ వేశారు. 19వ సీడ్ దిమిత్రోవ్ 7-5, 4-6, 7-5, 7-5తో మౌటెట్ (ఫ్రాన్స్)పై.. పదకొండో సీడ్ డిమినార్ 4-6, 6-2, 6-4, 6-0తో కజాక్స్ (ఫ్రాన్స్)పై గెలిచారు. 15వ సీడ్ మిన్సిచ్ 6-4, 3-6, 6-4, 7-6 (7-4)తో గిరాన్ (అమెరికా)పై విజయం సాధించాడు. డేవిడోవిచ్ (స్పెయిన్), స్ట్రాఫ్ (జర్మనీ), కెమనోవిచ్ (సెర్బియా), రెండర్‌నిచ్ (ఫ్రాన్స్), కొబాలి (ఇటలీ), మునార్ (స్పెయిన్) రెండో రౌండ్ దాటారు.

ఆండ్రీవా దూకుడు: రష్యా అమ్మాయి మిరా ఆండ్రీవా మూడో రౌండ్లోకి ప్రవేశించింది. గురువారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో ఏడో సీడ్ ఆండ్రీవా 6-1, 7-6 (7-4)తో లూసియా బ్రొంజెటి (ఇటలీ)ని ఓడించింది. ఈ పోరులో ఆండ్రీవా ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. తొలి సెట్లో కేవలం ఒక్క గేమ్ మాత్రమే చేజార్చుకుని సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్లో ఆరంభంలో లూసియా అదరగొట్టింది. ఆరో గేమ్‌లో ఆండ్రీవా సర్వీస్ బ్రేక్ చేసి ఆపై 5-2తో సెట్ గెలిచే అవకాశాన్ని సంపాదించింది. ఈ దశలో పుంజుకున్న ఆండ్రీవా.. 5-5తో స్కోరు సమం చేసింది. అదే జోరుతో సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. టైబ్రేకర్‌లో సత్తా చాటి సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ క్రెజికోవా (చెక్) మూడో రౌండ్ చేరింది. రెండో రౌండ్లో ఆమె 6-4, 3-6, 6-2తో డాల్‌హైడ్ (అమెరికా)ను ఓడించింది. నాలుగోసీడ్ జెస్మిన్ పాలిని (ఇటలీ) 6-4, 4-6, 4-6తో రఖిమోవా (రష్యా) చేతిలో కంగుతింది. పదోసీడ్ ఎమా నవారో (అమెరికా) కూడా ముందంజ వేసింది. ఆమె 6-1, 6-2తో కుదెర్‌మెతోవా (రష్యా)ను ఓడించింది. 11వ సీడ్ రిబకినా (కజకిస్థాన్) 18వ సీడ్ అలెగ్జాండ్రోవా (రష్యా) మూడో రౌండ్ చేరారు. రిబకినా 6-3, 6-1తో సకారి (గ్రీస్)పై.. అలెగ్జాండ్రోవా 6-4, 6-0తో లెమెన్స్ (నెదర్లాండ్స్)పై నెగ్గారు. బాప్టిస్ట్ (అమెరికా), కాక్సీసియారెటో (ఇటలీ), కొలిన్స్ (అమెరికా), సన్‌మెజ్ (తుర్కియె) రెండో రౌండ్ అధిగమించారు.



ఆండ్రీవా

రెండో రౌండ్లో బాలాజీ జంట: పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ రెండో రౌండ్ చేరాడు. తొలి రౌండ్లో బాలాజీ-మిగుయెల్ రేయెస్ (మెక్సికో) జంట 6-4, 6-4తో లెర్నర్ తియాన్-అలెగ్జాండర్ కొవసెవిచ్ (అమెరికా) జోడీని ఓడించింది. ఇప్పటికే యుకి బాంబ్రి, రిత్విక్ బొల్లిపల్లి జంటలు కూడా రెండో రౌండ్ చేరాయి.

భారత్‌కు మరో 2 పతకాలు ఖాయం

అస్తానా (కజకిస్థాన్): ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. హితేష్ గులియా, సాక్షి సెమీఫైనల్లో ప్రవేశించారు. 70 కేజీల విభాగంలో హితేష్ 5-0తో అల్మాజ్ ఒరోజ్‌బెకోవ్ (కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. మహిళల 54 కేజీల్లో సాక్షి.. తతియానా రెజినా (బ్రెజిల్)ను ఓడించింది. మీనాక్షి (48 కేజీ), పూజ రాణి (80 కేజీ), సంజు (60 కేజీ) కూడా ఇప్పటికే సెమీస్ చేరి పతకాలు ఖరారు చేశారు. అనామిక (51 కేజీ) క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది.

కార్ల్‌సన్‌పై గుకేశ్ మళ్లీ..



గుకేశ్

జాగ్రెబ్: ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ మరోసారి ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించాడు. క్రొయేషియాలో జరుగుతున్న గ్రాండ్ చెస్ టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగం ఆరో రౌండ్లో కార్ల్‌సన్‌పై గుకేశ్ పైచేయి సాధించాడు. ఈ టోర్నీలో గుకేశ్‌ను బలహీన ఆటగాడిగా అభివర్ణించిన కార్ల్‌సన్‌పై భారత ఆటగాడు విజయం సాధించడం విశేషం. అంతకుముందు అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్), ఫాబియానో కరువానా (అమెరికా)లపై భారత స్టార్ విజయం సాధించాడు. ఆరు రౌండ్లు ముగిసేసరికి గుకేశ్ 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. డుడా (పోలెండ్, 8) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. గత నెల నార్వే చెస్ టోర్నీలోనూ కార్ల్‌సన్‌ను గుకేశ్ ఓడించాడు.

భారత్ రానున్న పాకిస్థాన్ హాకీ జట్లు

దిల్లీ: ఆసియా కప్, జూనియర్ ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు పాకిస్థాన్ జట్లకు మార్గం సుగమమైంది. భారత్‌లో జరిగే రెండు టోర్నీల్లో పాక్ జట్లు పాల్గొనేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి లభించింది. బహుళ జట్లు పాల్గొనే ఈవెంట్లకు అనుమతి నిరాకరిస్తే ఒలింపిక్ నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుందన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆసియా కప్ జరగనుంది. నవంబరు 28 నుంచి డిసెంబరు 10 వరకు చెన్నై, మధురై జూనియర్ ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వనున్నాయి. "బహుళ దేశాలు బరిలో దిగే టోర్నీలో ఏ జట్టును మేం వ్యతిరేకించడం లేదు. పాక్‌ను ఆపేందుకు ప్రయత్నిస్తే అది ఒలింపిక్ నియమావళి ఉల్లంఘనగా పరిగణిస్తారు. అదే విధంగా పాక్ పాల్గొనే ఏదైనా బహుళ దేశాల ఈవెంట్లో మేం కూడా బరిలో దిగుతాం. కానీ ద్వైపాక్షిక సంబంధాలు భిన్నం. ఆ విషయంలో ఎలాంటి సడలింపులు లేవు" అని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరులో జరిగే ఆసియా కప్ (క్రికెట్)లో పాక్‌తో భారత్ తలపడేందుకు అనుమతి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "ఈ విషయంపై మంత్రిత్వ శాఖను బీసీసీఐ ఇంకా సంప్రదించలేదు. వాళ్లు మా దగ్గరికి వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటాం" అని తెలిపాయి.

ఆస్ట్రేలియా 197/5



జోసెఫ్

సెయింట్ జార్జెస్: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో తొలి రోజు ఆస్ట్రేలియా తడబడింది. కడపటి వార్తలందే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 45 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది. ఓపెనర్లు కొన్‌స్టాస్ (25), ఖవాజా (16) మొదటి వికెట్‌కు 47 పరుగులు చేశారు. తర్వాత ఆసీస్ క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 47/0 నుంచి 110/5తో కష్టాల్లో పడింది. కేరీ (45), వెబ్‌స్టర్ (38) క్రీజులో ఉన్నారు. అల్జారి జోసెఫ్ రెండు వికెట్లు.. జేడెన్ సీల్స్, షమర్ జోసెఫ్, అండర్సన్ ఫిలిప్ ఒక్కో వికెట్ తీసి ప్రత్యర్థిని దెబ్బ తీశారు.

సిరీస్ కొట్టేయాలని..

- ఉత్సాహంగా భారత మహిళలు
- ఇంగ్లాండ్‌తో మూడో టీ20 నేడు

రాత్రి 11.05 నుంచి

లండన్: ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న భారత మహిళల జట్టు అరుదైన ఘనతపై గురిపెట్టింది. ఇంగ్లాండ్‌పై తొలిసారి సిరీస్ సాధించే అవకాశం హర్మన్‌ప్రీత్ బృందం ముందుంది. శుక్రవారమే మూడో టీ20. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా రెండింట్లో నెగ్గిన భారత్ 2-0 ఆధిక్యంలో ఉంది. 2006లో డెర్బీలో జరిగిన ఏకైక మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై గెలిచిన భారత్.. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఇంటా, బయటా ఆ జట్టుపై టీ20 సిరీస్ నెగ్గలేదు. ఇటు బ్యాటింగ్.. అటు బౌలింగ్‌లో మంచి ఫామ్‌లో ఉన్న భారత్‌కు ఇంగ్లాండ్‌పై సిరీస్ గెలిచేందుకు ఇదో సువర్ణావకాశం. గాయం కారణంగా ఇంగ్లాండ్ కెప్టెన్ స్కైవర్ బ్రంట్ శుక్రవారం మ్యాచ్‌కు దూరమవడం భారత్‌కు మరో సానుకూలాంశం. బ్రంట్ గైర్హాజరీలో టామీ బ్యూమాంట్ జట్టుకు సారథ్యం వహించనుంది.



హర్మన్‌ప్రీత్

గత పాలకులు ఎప్పుడైనా అన్నదాతలను ఆదుకున్నారా?



(మొదటి పేజీ తరువాయి)

ఆ నెపాన్ని తనపై నెట్టారని.. ఏమీ చేయలేని వాళ్లే శవ రాజకీయాలు చేస్తారని ధ్వజమెత్తారు. గతంలో పరిశ్రమల నుంచి బలవంతంగా కమీషన్లు కొట్టేసిన వాళ్లు, వాటాలు తీసుకున్న వ్యక్తులు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే 60 శాతం మామిడి కొనుగోలు చేశామని తెలిపారు. సీఎం చంద్రబాబు చిత్తూరు జిల్లా కుప్పంలో రెండోరోజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మామిడి రైతులు, అధికారులతో ఆయన మాట్లాడారు.

మామూలు రౌడీలైతే.. కుక్కను కొట్టినట్లు కొట్టి లోపలేస్తాం

'కరడుగట్టిన నేరస్థులు, ఆర్థిక ఉగ్రవాదులు కూడా చేయని అవినీతిని గత పాలకులు చేశారు. వాళ్ల పార్టీ కార్యకర్త సింగయ్య కారు కింద పడితే కంప చెట్లలో పడేసి వెళ్లిపోయారు. ఆయన భార్యను పిలిపించి బెదిరించి రాజకీయం చేస్తున్నారు. మానవత్వం ఉన్న ఎవరైనా అలాంటి సమయంలో వాహనం ఆపి ఆసుపత్రికి తీసుకెళతారు. నేను ఎన్నోసార్లు పర్యటనలకు వెళ్లిన సందర్భంలో దారిలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిస్తే నా కాన్వాయ్‌లోని అంబులెన్స్ ఇచ్చి వైద్యశాలకు పంపా. జగన్ మాత్రం కారు ఆపకుండా పోయారు. మానవత్వం ఉందా? వీరు మనుషులా? నీతిమాలిన వ్యక్తులు, నేరచరిత్ర ఉన్న వ్యక్తులు రాజకీయాల్లోకి వచ్చారు. మామూలు రౌడీలైతే ఇలా వదిలేస్తామా? రెండు నిమిషాల్లో కుక్కను కొట్టినట్లు కొట్టి లోపలేస్తాం. ఇన్ని అరాచకాలు చేయడం మంచిది కాదు. వీరు రాష్ట్రానికి పెనుసవాల్‌గా, రాజకీయాలకు చీడపురుగుల్లా మారారు. ఇలాంటి వ్యక్తుల విషయంలో చట్టం తన పని చేసుకుని వెళుతుంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వైకాపా కార్యకర్తలనూ దివ్యాంగులుగా చూపి పింఛన్లు మంజూరు చేశారు. అనర్హులను తొలగిస్తుంటే ప్రభుత్వంపై దుష్ప్రచారానికి దిగుతున్నారు. ఇలాంటి ఫేక్ ఫెలోలతో నేను రాజకీయం చేయను' అని వ్యాఖ్యానించారు.

మీకు మాట్లాడే హక్కు ఉందా?

'ఐదేళ్లలో రాష్ట్ర ఆదాయం, వనరులను కొల్లగొట్టిన మీకు పేదల గురించి మాట్లాడే హక్కు ఉందా? చిల్లిగవ్వ ఖర్చు పెట్టని వాళ్లు.. పీ 4 కార్యక్రమంలో పేదలను ఆదుకునేందుకు ముందుకొస్తున్న మార్గదర్శులను విమర్శిస్తారా? ఇలాంటివాళ్లతో నేను రాజకీయాలు చేయాలా? పీపీపీ విధానంతో రోడ్లు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, కళాశాలలు వచ్చాయి' అని సీఎం తెలిపారు.

బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు

గోదావరితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ ఎలాంటి నష్టం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సముద్రంలోకి ఏటా వృథాగా పోయే 2,000 టీఎంసీలలో 200 టీఎంసీలు వినియోగించుకుంటామని తెలిపారు. ఎగువ రాష్ట్రాలు సైతం వీటిని వాడుకున్నా అభ్యంతరం లేదని తెలిపారు. తెలంగాణ కట్టిన, కట్టే ప్రాజెక్టులకు తానెప్పుడూ వ్యతిరేకించలేదని, వ్యతిరేకించనని అన్నారు.

కుప్పంలో డిజిటల్ నెర్వ్ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారానే వైద్యుల అపాయింట్‌మెంట్, మారుమూల ఉన్నా దేశవిదేశాల్లోని నిపుణుల సలహాలు తీసుకోవడానికి ఇది దోహదం చేస్తుందన్నారు. కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో గురువారం ఆయన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి డిజిటల్ నెర్వ్ కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్యులు, రోగులు, సమన్వయకర్తలతో వర్చువల్‌గా మాట్లాడారు. రెండోదశలో చిత్తూరు జిల్లావ్యాప్తంగా, ఆ తర్వాత రాష్ట్రం మొత్తం ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని సీఎం తెలిపారు. సాంకేతికత వినియోగించడంతో వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవచ్చన్నారు. తద్వారా ప్రభుత్వం, ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ.19,000 కోట్లు కేటాయిస్తున్నామని. భవిష్యత్తులో 25% తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

■ డిజిటల్ నెర్వ్ కేంద్రం వైద్యరంగంలో విప్లవాత్మక ముందడుగని ఎక్స్ వేదికగా చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్రంలో తొలిసారిగా కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా 13 పీహెచ్‌సీలు, 92 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేశారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా ఈ కేంద్రం సేవలందించనుంది. దేశంలోనే అత్యధికంగా సిజేరియన్లు జరిగే తొలి మూడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉంది.. సహజ ప్రసవాలు జరిగేలా వైద్యులు చూడాలి. ప్రజలకు ఔషధాలతో 50 శాతం వ్యాధినే తగ్గించవచ్చు.. మరో 50 శాతం నమ్మకంతో తగ్గించవచ్చు" అని వివరించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడిని పండించాలి

- రైతులకు సీఎం చంద్రబాబు సూచన

ఈనాడు, చిత్తూరు: మామిడి పంటలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా అత్యుత్తమ విధానాలను అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లి.. అంతర్జాతీయ ప్రమాణాలతో మామిడిని పండించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా మన ఉత్పత్తులు అమ్ముడుపోవాలంటే ఇదే అత్యుత్తమ మార్గమన్నారు. గురువారం సాయంత్రం ఆయన మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యజమానులు, అధికారులతో సమీక్షించారు. యాజమాన్యాలు కిలో మామిడికి రూ.8 ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. మామిడి గుజ్జుపై ప్రస్తుతమున్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించేలా కేంద్రంతో మాట్లాడుతున్నానని సీఎం అన్నారు. ప్రస్తుతం బయటి మార్కెట్ నుంచి ఆర్డర్లు రావడం లేదని పరిశ్రమల ప్రతినిధులు వాపోయారు. అన్ లోడింగ్‌కు 3- 4 రోజుల సమయం పడుతోందన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు జ్యూస్ అందించేలా చొరవ చూపాలని సీఎంను కోరగా పరిశీలిస్తానని ఆయన తెలిపారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని.. వారి మాయలో పడొద్దని రైతులకు హితవు పలికారు.

■ సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో తెదేపా అధినేత చంద్రబాబు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. 'ప్రజలకు దగ్గరైనవారే నాకు దగ్గరవుతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. చెడ్డపేరుంటే నమస్కారం పెట్టి పక్కన పెట్టేస్తాను. కుప్పంలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సూత్రాన్ని అనుసరిస్తాను. కార్యకర్తల కోసం లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడతాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం ఆయన శాంతిపురం మండలం తుమ్మిశి నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరారు.





పట్టుబడిన గంజాయి చాక్లెట్లు చూపుతున్న ఈగల్ విభాగ ఐజీ రవికృష్ణ, పక్కన ఎస్పీ నగేష్, విజయవాడ అడ్మిన్ డీసీపీ సరిత తదితరులు ★ గంజాయి చాక్లెట్లు

ఒడిశా, బిహార్ నుంచి గంజాయి చాక్లెట్లు

- రైళ్లలో తరలిస్తుండగా పట్టివేత
- ఒడిశా నుంచి రాష్ట్రం మీదుగా వెళ్లే రైళ్లలో 'ఈగల్' తనిఖీలు

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, ఏలూరు నేర వార్తలు: ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా వివిధ రాష్ట్రాలకు వెళ్లే రైళ్లలో తరలిస్తున్న గంజాయిని పట్టుకునేందుకు ఈగల్ విభాగం "ఆపరేషన్ ఈగల్" కార్యక్రమం చేపట్టింది. జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులతో కలిసి గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు రైళ్లల్లో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయి. వీటిని బిహార్, ఒడిశాల నుంచి తీసుకొస్తున్నట్లుగా గుర్తించారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో, తెనాలి రైల్వేస్టేషన్‌లో జసీదీహ్-తాంబరం వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల్లో తనిఖీలు చేయగా.. మొత్తం 4 ప్యాకెట్ల గంజాయి చాక్లెట్లు దొరికాయి. వీటిని చెన్నైకి తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. విజయనగరం రైల్వేస్టేషన్‌లో రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టగా ఇద్దరి వద్ద మొత్తం 15 కిలోల గంజాయిని తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. 26 జిల్లాల పరిధిలో మొత్తం 400 మంది సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

రాష్ట్రంలో గంజాయి సాగును అరికట్టాం: రవికృష్ణ

తనిఖీల సందర్భంగా విజయవాడ, ఏలూరు రైల్వేస్టేషన్లలో ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం గంజాయి సాగును పూర్తిగా అరికట్టామన్నారు. "ఏజెన్సీ రైతులు ఇతర పంటలు వేసుకునేందుకు 23 రకాల విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసింది. దీని వల్ల 10 వేల మందికిపైగా లబ్ధి పొందారు. ప్రస్తుతం ఒడిశా నుంచి గంజాయి వస్తోంది. దీన్ని అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 12 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఈ ఏడాది ఇప్పటివరకు 21 వేల కిలోల గంజాయిని పట్టుకున్నాం. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయిని పూర్తిగా అరికట్టాం. రవాణా చేస్తున్న వారి ఆస్తులనూ జప్తు చేస్తున్నాం. ఇప్పటివరకు రూ.7 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశాం' అని వెల్లడించారు. ఇక నిరంతరం సోదాలు కొనసాగుతాయని రవికృష్ణ చెప్పారు.



ఏలూరు నుంచి విజయవాడ రైలులో ప్రయాణిస్తూ తనిఖీలు చేస్తున్న రవికృష్ణ, పోలీసులు

విశాఖ.. టెక్ పతాక

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ ఎకోసిస్టం ఉండటం వల్ల వేగంగా అభివృద్ధికి అవకాశం ఉంది.

విశాఖలో టెక్ పరుగులు

రాబోయే 6 నెలల్లో మరో 15 ప్రముఖ ఐటీ సంస్థలు విశాఖలో అడుగు పెట్టబోతున్నాయని సమాచారం. ఆయా సంస్థలతో సంప్రదింపులు కొలిక్కివచ్చాయని ఒక ఉన్నతాధికారి తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), గూగుల్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖలో కొద్ది నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించబోతున్నాయి. ఐటీ సేవలందించే సంస్థలతో పాటు వాటికి ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించే సంస్థలకూ ప్రాధాన్యమివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఏడాది వ్యవధిలో రూ.8,230 కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే అదనంగా సుమారు 22,500 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే విశాఖలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్ర, డబ్ల్యూఎన్ఎస్, పాత్ర, కాండుయెంట్, ఫ్లూయెంట్ గ్రిడ్, ఏసీఎన్, మిరాకిల్, టెక్ సర్వే, ప్రో విజిల్ వంటి 15 పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఒక్కో కంపెనీ కనిష్ఠంగా 700 మందికి.. గరిష్ఠంగా 5 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇవికాక సుమారు 120 నుంచి 140 చిన్న కంపెనీలు ఉన్నాయి. మొత్తంగా 35 వేల మందికి ప్రస్తుతం ఉపాధి లభిస్తోందని అంచనా.

ఏటా 2.5 లక్షల మంది పట్టభద్రులు

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఏటా సుమారు 2.5 లక్షల మంది పట్టభద్రులై బయటికి వస్తున్నారు. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక వేల మంది హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, పుణె, చెన్నై వంటి నగరాలకు వెళ్లిపోయారు. ఐటీ సంస్థలను విశాఖ తీసుకొచ్చే కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో సొంత రాష్ట్రంలో ఉపాధి దొరుకుతుందన్న ఆశలు వారిలో చిగురిస్తున్నాయి.

వివిధ సంస్థలతో సంప్రదింపులు కొలిక్కి

– భాస్కర్ కాటమనేని, ఐటీ శాఖ కార్యదర్శి

ప్రముఖ ఐటీ సంస్థలను రాష్ట్రానికి తీసుకువచ్చేలా జరుపుతున్న సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. రాబోయే 6 నెలల్లో మరిన్ని కంపెనీలు విశాఖకు రాబోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ ఉన్న దృష్ట్యా ప్రస్తుతానికి వాటి పేర్లు వెల్లడించలేం.

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ గేదెల

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు సరోజినినాయుడు, కృష్ణమూర్తినాయుడు. తుహిన్ కుమార్ విశాఖపట్నంలో పాఠశాల విద్య, అక్కడే కృష్ణా కళాశాలలో ఇంటర్ చదివారు. ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఐదేళ్ల ఎల్ఎల్‌బీ డిగ్రీ అందుకున్నారు. 1994 మార్చి 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2000-04 మధ్య హైకోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2010-14 మధ్య గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తరఫున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు. 2016-17లో హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు అన్ని విభాగాలకు సంబంధించిన కేసులు వాదించిన అపార అనుభవం ఉంది.

తెలంగాణ హైకోర్టుకు నలుగురు

తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తుల నియామకానికి సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. న్యాయవాదుల కోటా నుంచి గౌస్ మీరా మొహిసుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. గౌస్ మీరా మొహిసుద్దీన్ హైదరాబాద్ బాలానగర్‌లో 1969 జులై 15న జన్మించారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్‌గా పనిచేశారు. మొహిసుద్దీన్ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ లా కాలేజీలో అయిదేళ్ల న్యాయ కోర్సు, ఉస్మానియాలో ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.

4 వర్సిటీలకు సెర్చ్ కమిటీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నాలుగు విశ్వవిద్యాలయాల ఉపకులపతుల ఎంపికకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య నాగార్జున, ద్రవిడ, జేఎన్‌టీయూ-గురజాడ, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలకు ముగ్గురు సభ్యుల చొప్పున ఈ సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేశారు. సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపిస్తుంది.

ఒక్కొక్కరి అంతు తేలుస్తా!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పటానికి మీ కస్టడీలో మేం లేం. మా కస్టడీలోనే మీరున్నారనే సంగతి మరిచిపోవద్దు. మద్యం కుంభకోణంలో మీ ప్రమేయంపై అన్ని సాంకేతిక ఆధారాలూ ఉన్నాయి. గట్టిగా కేకలు వేసి దబాయించిన మాత్రాన మీరు తప్పించుకోలేరు' అంటూ సిట్ అధికారులు కాస్త గట్టిగా మాట్లాడటంతో చెవిరెడ్డి వెనక్కి తగ్గినట్లు తెలిసింది.

కాగితాలపై సంతకాలు పెట్టకుండా చించేసి..

■ మద్యం ముడుపుల సొమ్మును గత సార్వత్రిక ఎన్నికల్లో ఎవరెవరికి అందజేశారు? ఎవరి ఆదేశాల మేరకు ఈ సొత్తు పంపిణీ చేశారు? అని ప్రశ్నించగా తానెప్పుడూ మద్యం సొమ్ము ముట్టనే లేదని చెవిరెడ్డి పాత పాటే పాడారు. 'రాజ్ కసిరెడ్డి, ఆయన అనుచరగణం మీకు అందజేసింది మద్యం ముడుపుల సొమ్మే కదా' అని అడగ్గా.. సమాధానం చెప్పకుండా తనను అక్రమంగా ఈ కేసులో ఇరికించారంటూ కేకలు వేశారు.

■ 'మద్యం ముడుపుల సొమ్ము తరలింపునకు మీ ఆదేశాలతోనే తుడా వాహనాలు పంపించారు కదా' అని ప్రశ్నించగా.. అవేవీ తనకు తెలియదన్నారు. తుడా వాహనాల గురించి అప్పటి తుడా వీసీ అండ్ ఎండీగా పనిచేసిన అధికారులను కాకుండా తనను ఎందుకు అడుగుతున్నారని ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం.

■ విచారణలో వెల్లడించిన అంశాలకు సంబంధించి అధికారులు వాంగ్మూలాలు సిద్ధం చేయగా, చెవిరెడ్డి వాటిపై సంతకాలు పెట్టకుండా చించేసినట్లు సమాచారం.

తప్పించుకునే ఎత్తుగడలు

సిట్ విచారణ కొనసాగుతున్నంతసేపు చెవిరెడ్డి ఆహారం తినకుండా, నీళ్లు తాగకుండా ఉన్నారు. నీరసిస్తే విచారణ ఆపేస్తారనే ఎత్తుగడతోనే ఆయన ఇలా వ్యవహరించారని సిట్ వర్గాలు చెబుతున్నాయి. సిట్ అధికారులు చెవిరెడ్డి తరఫు న్యాయవాది దృష్టికి ఈ విషయాలన్నీ తీసుకెళ్లారు. ఇష్టపూర్వకంగానే ఆహారం తీసుకోవట్లేదంటూ ఆయనతో లిఖితపూర్వక వాంగ్మూలం తీసుకున్నారు.

జైల్లో చెవిరెడ్డి రంకెలు

మద్యం కుంభకోణం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి. . విజయవాడ జిల్లా జైల్లో రంకెలు వేస్తూ చిందులు తొక్కారు. ఇదే కేసులో అరెస్టైన, చెవిరెడ్డి అనుచరులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలకు బుధవారం రాత్రి ఏసీబీ కోర్టు న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఆయన ఆదేశాల మేరకు వారిని గుంటూరు జైలుకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న చెవిరెడ్డి.. తానున్న సెల్‌లోని తలుపును కాలితో తన్నుతూ, పెద్ద పెద్దగా కేకలు వేస్తూ విపరీతంగా ప్రవర్తించారు. ఇద్దరినీ వేరే జైలుకు తరలించడం ఏంటి? అక్కడికి ఎలా తరలిస్తారు? అంటూ అరిచారు. తన మనుషులను ఈ కారాగారానికి తీసుకురాలేదన్న ఆక్రోశంతోనే ఇలా ప్రవర్తించినట్లు తెలిసింది.

అరెస్ట్ చేసినప్పటి నుంచి ఇదే తీరు

చెవిరెడ్డి భాస్కరరెడ్డి గత నెలలో అరెస్టయ్యారు. అప్పటి నుంచి తరచూ ఇదే రీతిలో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అరెస్టయిన రోజు వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పుడు బస్సు దిగుతున్నప్పుడు కూడా ఇలాగే చిందులు తొక్కారు. న్యాయాధికారి రిమాండ్ విధించిన తర్వాత జైలుకు తరలించే సమయంలోనూ కోర్టు ప్రాంగణంలోనే పెద్దఎత్తున నినాదాలు చేశారు. మూడు రోజుల కస్టడీలో భాగంగా తొలి రోజు చెవిరెడ్డిని తీసుకెళ్లేందుకు సిట్ అధికారులు కారాగారానికి వెళ్లగా వారిపైనా అరిచారు.



సారూ.. మేమూ చదువుకుంటాం!

ఓ సారూ.. మాకూ చదువు చెబుతారా అని భిక్షాటన చేసుకునే ఇద్దరు బాలురు ప్రభుత్వాధికారిని అభ్యర్థించిన వైనం ఇది. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ నగరంలోని వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణాన్ని గురువారం సందర్శించారు. ఇదే సమయంలో అనాథలైన ఏడేళ్ల చిన్నారులు పెంచలయ్య, వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చారు. చేతులు కట్టుకుని దీనంగా నిలబడిన వారిద్దరినీ కమిషనర్ ఏమి కావాలని ప్రశ్నించారు. 'మాలాంటి వాళ్లకు కూడా ఇక్కడ చదువు చెప్తారని చెబుతుంటే ఇక్కడికి వచ్చాం సారూ.. మమ్మల్ని కూడా చేర్చుకోండి' అంటూ ప్రాధేయపడ్డారు. వారి మాటలకు చలించిన కమిషనర్.. 'మీలాంటి వారి కోసమే మంత్రి నారాయణ ఈ పాఠశాలను ఏర్పాటు చేసింది. మీకు తెలిసిన పెద్దవారిని తీసుకొచ్చి, పాఠశాలలో చేరండి' అంటూ తన ఫోన్ నంబరును పిల్లల చేతికి ఇచ్చి పంపించారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నిద్రలో ఎగిరిపోకుండా ఉండటమే పెద్ద సవాల్

(మొదటి పేజీ తరువాయి)

గురుత్వాకర్షణ లేకపోవడం వల్ల పైకి తేలిపోతుంటాం. మనల్ని మనం సీలింగుకు కట్టేసుకోవచ్చు. నిద్రించిన చోట నుంచి మరోచోటకు ఎగిరిపోకుండా చూసుకోవడమే సవాల్. దానికోసమే స్లీపింగ్ బ్యాగులతో కట్టేసుకుంటాం" అని శుక్లా ఆసక్తికరంగా చెప్పారు.

తీరిక దొరకదు

అనారోగ్యం తలెత్తితే కోలుకునేందుకు అవసరమైన మందులన్నీ తాము వెంట తీసుకువెళ్తామని శుక్లా తెలిపారు. తమకు ఖాళీ సమయమంటూ దొరకదని, ఒకవేళ దొరికితే మాత్రం ఏదో ఒక ఆటలాడుతుంటామని చెప్పారు. బయటకు చూడటం, ముఖ్యంగా భూగోళాన్ని వీక్షించడం అద్భుతంగా ఉంటుందని, దానికోసమే ప్రతి ఒక్కరం తాపత్రయపడుతుంటామని వివరించారు. గురుత్వాకర్షణ లేకపోవడం మన శరీరాలకు పెనుసవాల్ అనీ, ఐఎస్ఎస్‌కు చేరిన రోజుకంటే ఇప్పుడు తన పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని చెప్పారు. 'తిరిగి భూమికి చేరుకోగానే గురుత్వాకర్షణకు అలవాటు పడటం మరో సవాల్. దాని కోసం చాలా సన్నద్ధత అవసరమవుతుంది. మేం తెచ్చుకునే ఆహారంలో దాదాపు అంతా ముందుగా ప్యాక్ చేసిందే. వాటిలో తగిన పోషక విలువలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. మాకు ప్రేరణను, ఉల్లాసాన్ని ఇచ్చేవాటిలో ఆహారం ఒకటి. చాలారకాల ఆహారం మాకు అందుబాటులో ఉంటుంది. మేం ఇష్టపడేవాటినే ప్యాక్ చేస్తారు' అని శుక్లా చెప్పారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఐఎస్ఎస్ నుంచే మాట్లాడుతుంటామని తెలిపారు. భూమ్మీద ఉన్నప్పుడు గురుత్వాకర్షణ వల్ల మన శరీరంపై బరువు ఉంటుందని, నిలబడినా, నడిచినా, కూర్చొన్నా కండరాలను వాడుతుంటామని చెప్పారు. అంతరిక్షంలో ఇదేమీ ఉండదు కాబట్టి కండరాల్లో సమస్య రాకుండా కసరత్తులు చేయడం ఎంతో ముఖ్యమని వివరించారు. తమ వద్ద ఉండే సైకిల్‌ను, వ్యాయామ యంత్రాన్ని వాడుకుని ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంటామంటూ అదెలా ఉంటుందో ప్రదర్శించారు. అంతరిక్షంలో అటూ ఇటూ ఎలా కదులుతారో, బంతితో ఎలా ఆడుకోవచ్చో ప్రత్యక్షంగా చూపించారు. విద్యార్థులంతా ఎంతో సంబరపడిపోయారు.

విద్యుత్తునూ నిల్వ చేసుకోవచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పగటి వేళల్లో సౌర, పవన ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్ వల్ల డిస్కంల దగ్గర రోజూ సుమారు 1,500 మెగావాట్ల మిగులు విద్యుత్ ఉంటోంది. దీన్ని బెస్ ప్రాజెక్టులకు పంపి.. అక్కడ నిల్వ చేసి అవసరమైనప్పుడు వెంటనే గ్రిడ్‌కు కనెక్ట్ చేసే అవకాశం ఉంటుంది. ఇలా గ్రిడ్ బేస్‌లోడ్ నిర్వహణకు బెస్ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని చెబుతున్నారు.

తక్కువ మొత్తానికి బిడ్‌లు

వివిధ రాష్ట్రాల్లో బెస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు నిర్వహించిన టెండర్లతో పోలిస్తే.. మన దగ్గర ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు తక్కువ ధరను గుత్తేదారులు కోట్ చేయడం గమనార్హం.

■ వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో రెండు సైకిల్స్ కలిపి 450 మెగావాట్ల ప్రాజెక్టును పటేల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ దక్కించుకుంది. ఆ సంస్థ మెగావాట్‌కు.. నెలకు రూ.2.08 లక్షల చొప్పున బిడ్‌లో కోట్ చేసింది.

■ కర్నూలు జిల్లా గనిలో ఏర్పాటు చేసే 450 మెగావాట్ల ప్రాజెక్టును ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్ లిమిటెడ్ దక్కించుకుంది. ఆ సంస్థ మెగావాట్‌కు.. నెలకు రూ.2.22 లక్షల చొప్పున బిడ్ దాఖలు చేసింది.

■ చిత్తూరు జిల్లా కుప్పంలో 100 మెగావాట్ల బెస్ ప్రాజెక్టునూ ఏసీఎంఈ సంస్థ దక్కించుకుంది. మెగావాట్‌కు.. నెలకు రూ.2.10 లక్షల చొప్పున బిడ్‌లో కోట్ చేసింది.

■ దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు నిర్వహించిన టెండర్లలో మెగావాట్‌కు రూ.2.16 లక్షలు కనిష్ఠంగా ఉంది. రాష్ట్రంలో రెండుచోట్ల ఏర్పాటు చేసే బెస్ ప్రాజెక్టులకు తక్కువ ధరకే బిడ్‌లు దాఖలయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలపై ఛార్జీల భారం తగ్గే వీలు!

ఉదయం, సాయంత్రం పీక్ డిమాండ్ సమయంలో విద్యుత్ ఎక్స్ఛేంజీల నుంచి యూనిట్ రూ.10 చొప్పున డిస్కంలు కొంటున్నాయి. దీని వల్ల ఏటా రూ.వెయ్యి కోట్లకు తగ్గకుండా ట్రూఅప్ ఛార్జీల భారం ప్రజలపై పడుతోంది. బెస్ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే.. పీక్ డిమాండ్ సమయంలో అధిక ధరకు విద్యుత్ కొనాల్సిన అవసరం ఉండదు. దీంతో పాటు పగటి వేళల్లో అదనంగా ఉన్న సౌర, పవన విద్యుత్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఆ మేరకు ప్రజలపై పరోక్షంగా విద్యుత్ ఛార్జీల భారం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

అమెరికాలో కుక్క కాటు.. రూ.15.73 లక్షల పరిహారం

సూర్యాపేట జిల్లా వాసికి పదిహేనేళ్ల తర్వాత అందిన మొత్తం



కిశోర్ వెలమకన్ని

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం శోభనాద్రిగూడేనికి చెందిన కిశోర్ వెలమకన్నికి అమెరికాలో 15 ఏళ్ల తరువాత న్యాయం లభించింది. ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన ఆయన.. 2010లో రోడ్‌ఐలాండ్‌లో అద్దె ఇంటికోసం కార్లా అనే ఆమె ఇంటికి వెళ్లగా.. వారి పెంపుడు కుక్క కిశోర్‌పై దాడి చేసి కరిచింది. దీంతో వైద్య ఖర్చులకు 600 డాలర్లు ఇస్తానని కార్లా హామీ ఇచ్చింది. అనంతరం ఆ మొత్తం ఇవ్వకుండా దుర్భాషలాడింది. దీంతో కిశోర్ వాషింగ్టన్ డీసీలో కోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం ఆయనకు అనుకూలంగా అదే ఏడాది కోర్టు తీర్పు వెలువరించింది. వైద్య ఖర్చులు, న్యాయ ఖర్చులు, పరిహారం, వడ్డీ కలిపి 10,359 డాలర్లు బాధితుడికి ఇవ్వాలని ఆదేశించింది. ప్రత్యర్థి కార్లా ఐపీ పెట్టడంతో పరిహారం రాలేదు. ఇటీవల ఆమె తన ఇంటిని విక్రయించగా.. కోర్టు ఆదేశాల మేరకు కొనుగోలుదారు నుంచి ఆ పరిహారం మొత్తం వడ్డీతో కలిపి 29,092.91 డాలర్లు వచ్చాయన్నారు. లాయర్ ఫీజులు, ఇతర ఖర్చులు పోనూ తన ఖాతాలో 18,429.83 డాలర్లు (రూ.15.73 లక్షలు) గత నెల 25న జమయ్యాయని కిశోర్ గురువారం వెల్లడించారు. ప్రస్తుతం తాను కెనడాలో నివాసం ఉంటున్నానని తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు

ఈనాడు, అమరావతి, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులను అందించనున్నారు. ఆగస్టు 30న తొలి అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ఛాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. అవార్డులకు సంబంధించిన బ్రోచర్, లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో ఏర్పాటుచేశారు. 15 విభాగాల్లో విజయవంతమైన వారికి అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 30లోపు ఆయా రంగాల వారీగా పారిశ్రామికవేత్తలు https://apchambers.in/business-awards-2025/ వెబ్‌సైట్‌లో నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు.

షికాగోలోని రెస్టారెంట్‌లో కాల్పులు.. నలుగురి మృతి



అమెరికాలోని షికాగోలో కాల్పులు జరిగిన ప్రాంతంలో దర్యాప్తు అధికారులు

షికాగో: అమెరికాలోని షికాగోలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గురువారం పోలీసులు తెలిపారు. షికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో ఉన్న ఓ రెస్టారెంట్ దగ్గర ఆల్బమ్ రిలీజ్ పార్టీ జరుగుతోంది. అదే సమయంలో అక్కడ లాంజ్‌లో ఉన్న వారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపి పారిపోయాడు. మొత్తం 13 మంది మహిళలు, ఐదుగురు పురుషులపై కాల్పులు జరిపాడు.

మధుమేహ నివారణకు జీవనశైలి మార్పులే మేలు

జ్ఞాన నేత్రం

దిల్లీ: మధుమేహానికి పూర్వం ఉండే ప్రీ డయాబెటిస్ స్థితిలో ఉన్నవారు వ్యాధి నివారణ ఔషధమైన మెట్‌ఫార్మిన్ వాడటం కన్నా. ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధించవచ్చని ఒక అధ్యయనంలో తేలింది. అమెరికాలో డయాబెటిస్ నివారణ కార్యక్రమం కింద 1996లో ఈ అధ్యయనాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా 22 రాష్ట్రాల్లోని 30 వైద్యసంస్థల్లో 3,234 మంది ప్రీ డయాబెటిస్ రోగుల పరిస్థితిని విశ్లేషించారు. పూర్తిస్థాయి మధుమేహం బారినపడే ముప్పును మేలిమి జీవనశైలి మార్పులు 24 శాతం మేర తగ్గిస్తాయని పరిశోధకులు కనుగొన్నారు. మెట్‌ఫార్మిన్ ఔషధం మాత్రం ఆ ముప్పును 17 శాతం మాత్రమే తగ్గించినట్లు గుర్తించారు. 'ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ' జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.

రెండు ఇంజిన్లూ ఒకేసారి విఫలం

న్యూయార్క్ టైమ్స్ కథనం



న్యూయార్క్: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి కారణం రెండు ఇంజిన్లూ ఒకేసారి విఫలం కావడమేనని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పరిశోధనాత్మక కథనం స్పష్టం చేసింది. 'అహ్మదాబాద్ విమానాశ్రయం రన్‌వే నుంచి పైకి ఎగరడానికి విమానంలో ఎటువంటి సమస్యలూ లేవు. అయితే గాల్లోకి ఎగిరిన వెంటనే రెండు ఇంజిన్లూ ఒకేసారి విఫలమై ప్రమాదం జరిగింది' అని వెల్లడించింది. రెండు ఇంజిన్లలో ఒకటే విఫలమైనప్పుడు విమానం ఒకవైపునకు ఒరిగిపోతుంది. ఈ విమానం కూలడానికి ముందు ఒకవైపునకు ఒరిగిపోలేదు. కూలడానికి పూర్వం తీసిన వీడియోలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది.

మేనమామ నచ్చాడని.. కిరాయి రౌడీలతో భర్త హత్య

ఔరంగాబాద్ (బిహార్): మేనమామను పెళ్లి చేసుకోవాలన్న ఆశతో అందుకు అడ్డుగా ఉన్న భర్తను ఓ యువతి కిరాయి రౌడీల సాయంతో హత్య చేయించిన ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. ఔరంగాబాద్ జిల్లా నబీనగర్ పోలీస్‌స్టేషను పరిధిలోని బర్వాన్ గ్రామానికి చెందిన ప్రియాంశు (25)తో గుంజాదేవికి 45 రోజుల కిందట వివాహం జరిగింది. గుంజాదేవికి



హతుడు ప్రియాంశు.. గుంజాదేవి, జీవన్‌సింగ్

ఆమె మేనమామ జీవన్‌సింగ్ (55)తో వివాహేతర సంబంధం ఉంది. మామనే పెళ్లి చేసుకుంటానని ఆమె ఇంట్లో చెప్పగా.. కుటుంబసభ్యులు ససేమిరా అంటూ బలవంతంగా ప్రియాంశుతో వివాహం జరిపించారు. జూన్ 25న ప్రియాంశు తన సోదరి ఇంటికి వెళ్లి తిరిగివచ్చే సమయంలో గుంజాదేవి.. ముందుగా మాట్లాడుకున్న ఇద్దరు కిరాయిరౌడీలకు సమాచారం పంపింది. వారు ప్రియాంశును తుపాకీతో కాల్చి చంపారు. విచారణలో గుంజాదేవి, జీవన్‌సింగ్ ఫోన్ల కాల్ రికార్డులను పరిశీలించిన పోలీసులు కుట్రను ఛేదించారు. నిందితురాలిని, షూటర్లను అరెస్టు చేశారు. జీవన్‌సింగ్ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు.

అంతర్జాతీయ ప్రగతికి భారత్ ఊతం

- ఘనా పార్లమెంటులో ప్రధాని మోదీ వ్యాఖ్య



ఘనా దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'ను ప్రధాని మోదీకి అందిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహామా

అక్రా: అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రజాస్వామ్య స్థిరత్వం ఆశాకిరణంలా ప్రకాశిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రగతి పథంలో భారత్ పరుగు ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అంతర్జాతీయ వృద్ధికి ఊతమిస్తోందన్నారు. ఆఫ్రికా దేశమైన ఘనాలో పర్యటించిన మోదీ.. ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి గురువారం ప్రసంగించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను ప్రపంచ శక్తికి మూలస్తంభంలా ఆయన అభివర్ణించారు. అంతర్జాతీయ పరిపాలనా వ్యవస్థల్లో ప్రభావవంతమైన సంస్కరణల ఆవశ్యకతను నొక్కిచెప్పారు. మరోవైపు- ద్వైపాక్షిక బంధాన్ని 'సమగ్ర భాగస్వామ్యం' స్థాయికి ఉన్నతీకరించుకోవాలని భారత్, ఘనా తాజాగా నిర్ణయించుకున్నాయి. ప్రధాని మోదీకి ఘనా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'ను ప్రదానం చేసింది. దాన్ని ఇరు దేశాల మధ్య చిరకాల స్నేహానికి అంకితమిస్తున్నట్లు మోదీ ప్రకటించారు.

సంస్కరణలు అత్యావశ్యకం

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారతేనని మోదీ గుర్తుచేశారు. రాజకీయ, పరిపాలనాపరమైన స్థిరత్వాన్ని పునాదిగా చేసుకొని దిల్లీ త్వరలోనే ప్రపంచంలోకెల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే అంతర్జాతీయ వృద్ధిలో భారత్ వాటా దాదాపు 16%గా ఉందన్నారు. ప్రపంచం ప్రస్తుతం పర్యావరణ మార్పులు, మహమ్మారులు, ఉగ్రవాదం, సైబర్ దాడుల వంటి కొత్త, సంక్లిష్ట సంక్షోభాలను ఎదుర్కొంటోందని మోదీ పేర్కొన్నారు. గత శతాబ్దంలో ఏర్పాటుచేసుకున్న అంతర్జాతీయ సంస్థలు/వ్యవస్థలను.. ఈ కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా సంస్కరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దక్షిణార్ధ గోళ (గ్లోబల్ సౌత్) వాణికి ప్రాధాన్యమివ్వకపోతే అంతర్జాతీయ ప్రగతి సాధ్యం కాదని స్పష్టం చేశారు. భారత్ 'జీ20' అధ్యక్ష పీఠంపై ఉన్నప్పుడు 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే విజన్‌తో పని చేసిందన్నారు. అప్పుడే ఆఫ్రికా 'జీ20'లో శాశ్వత సభ్యత్వం దక్కిందని గుర్తుచేశారు. ఆఫ్రికా అభివృద్ధి ప్రయాణంలో భారత్ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. మరింత సుస్థిర, సౌభాగ్యవంతమైన ప్రపంచం ఆవతరణ దిశలో బలమైన భారత్ తనవంతు పాత్ర పోషిస్తుందని ప్రధాని వ్యాఖ్యానించారు.

అనాస కంటే తియ్యని స్నేహం

ఘనాలో బాగా ప్రాచుర్యం పొందిన షుగర్ లోఫ్ అనాసపండు కంటే భారత్-ఘనా స్నేహం తియ్యనైనదని మోదీ వ్యాఖ్యానించారు. ఇరు దేశాలూ స్వేచ్ఛ, ఐకమత్యం, గౌరవాలను మూలాలుగా చేసుకొని నిలబడ్డాయని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ ఎంతో పరివర్తన చెందిందని చెప్పారు. శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రను కూడా తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఘనా-భారత్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ సొసైటీ ఏర్పాటును ఆయన స్వాగతించారు. ఆఫ్రికాను దిల్లీ ఎప్పుడూ గుండెల్లో దాచుకుంటుందని వ్యాఖ్యానించారు. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి.

జస్టిస్ వర్మ తొలగింపునకు ప్రతిపక్ష నేతల అంగీకారం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి



దిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను పదవి నుంచి తప్పించేలా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్ష పార్టీలన్నీ అంగీకారం తెలిపాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం వెల్లడించారు. అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాలా, లోక్‌సభలోనా అనే విషయంపై నిర్ణయం తీసుకున్నాక ఆయా పార్టీల సభ్యుల నుంచి సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టాలంటే కనీసం 100 మంది ఎంపీలు, రాజ్యసభలో అయితే కనీసం 50 మంది సభ్యుల సంతకాలు అవసరమవుతాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి.. రాజ్యసభలో లేదా లోక్‌సభలో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాక.. విచారణ జరపడానికి ఛైర్మన్ లేదా స్పీకర్ ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తారు. దిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో కాలిపోయిన కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన విషయం తెలిసిందే.

సోషల్ మీడియాకు దూరమైతే మంచిదే!

- మెరుగుపడిన మానసిక స్థితి
- స్టాన్‌ఫర్డ్ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలపై అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు అధ్యయనం నిర్వహించారు. కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు హంట్ అల్కాట్, మాథ్యూ గెంట్జ్‌కోలు ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్‌కు చెందిన పరిశోధకులూ ఇందులో పాల్గొన్నారు. 'ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల నుంచి వైదొలగడంవల్ల యూజర్లపై పడే భావోద్వేగ ప్రభావం' అన్న శీర్షికతో నిర్వహించిన అధ్యయనంలో 35వేల మంది పాల్గొన్నారు. అధ్యయనంలో భాగంగా వీరు 2020లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఆరు వారాల ముందు 'ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం'లను డీయాక్టివేట్ చేసుకున్నారు. ఒక వారంపాటు సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నందుకు ప్రతి ఒక్కరికీ 25 డాలర్లు, ఆరు వారాలపాటు జోలికి వెళ్లకుండా ఉన్నవారికి 150 డాలర్లు చెల్లించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉన్నవారి మానసిక స్థితి (మూడ్) మెరుగుపడిందని పరిశోధకులు గుర్తించారు.

రూ.లక్ష కోట్లతో రక్షణ కొనుగోళ్లు

దిల్లీ: దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.1.05 లక్షల కోట్ల వ్యయమయ్యే ప్రాజెక్టుల కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ) కీలక సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇటీవల పాక్‌తో సైనిక ఘర్షణ నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కొనుగోళ్లను దేశీయంగానే చేయనున్నారు. నౌకలకు నష్టం కలిగించడానికి శత్రుదేశాలు సముద్రంలో అమర్చే మందుపాతరల్ని గుర్తించి నిర్వీర్యం చేయగల సామర్థ్యం ఉండే నౌకలు (ఎంసీఎంవీలు) ఇంతవరకు మన నౌకాదళంలో లేవు. గత 15 ఏళ్ల కాలంలో వీటి సమీకరణకు జరిగిన మూడు ప్రయత్నాలు విఫలమయ్యాయి. దక్షిణ కొరియా సంస్థతో ఏడేళ్ల క్రితం జరిగిన చర్చలు వివిధ కారణాలతో ఫలించలేదు. యుద్ధ సమయాల్లో నౌకాశ్రయాలను, వాణిజ్య నౌకల్ని కాపాడుకునేందుకు ఇవి అవసరం. తాజా నిర్ణయంతో ఎంసీఎంవీలు మన దేశంలోనే తయారవుతాయి. త్రివిధ దళాల సంబంధిత సమీకృత ఉమ్మడి యాజమాన్య వ్యవస్థను సిద్ధం చేయడానికి, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థల కొనుగోలుకు, భూ ఉపరితలం నుంచి గాలిలోకి పంపే క్షిపణుల సమీకరణకు డీఏసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. యుద్ధక్షేత్రాల్లో ఇరుక్కుపోయే ట్యాంకులు వంటివాటిని వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన వాహనాల కొనుగోలుకూ ఇలాంటి ఆమోదమే తెలిపింది.

వైఫల్యానికి నిర్వచనం ఇదీ..



వైఫల్యమనేది విజయానికి వ్యతిరేకం కాదు. విజయం కోసం చేసే ప్రయత్నాల్లో అదో కీలక అంతర్భాగం. విలువైన పాఠాలు నేర్పించే గురువు అది. దాన్ని స్వీకరించండి. దాన్నుంచి నేర్చుకోండి. దాని ద్వారా ఎదగండి.

– అనుష్కా సోహం బఖ్వాల్, వ్యాపారవేత్త

ఆ కేసుల్లో బీమా పరిహారం చెల్లించక్కర్లేదు

- నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: దుందుడుకు, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో సొంత ప్రాణాలకు ముప్పుతెచ్చుకునే వ్యక్తుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఇటువంటి ఘటనల్లో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత బీమా కంపెనీలపై ఉండదని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం స్పష్టం చేసింది. మితిమీరిన వేగంతో కారు నడుపుతూ ఓ వ్యక్తి మృతి చెందగా... అతని భార్య, కుమారుడు, తల్లిదండ్రులు రూ.80 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. వీరి అభ్యర్థనను ట్రైబ్యునల్ తిరస్కరించింది. వాహనం నడిపిన వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారని, అధిక వేగంవల్లే ప్రమాదం జరిగిందని పేర్కొంటూ కర్ణాటక హైకోర్టు గత ఏడాది నవంబరులో పిటిషన్‌ను కొట్టివేయడంతో వారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి సుప్రీం ధర్మాసనం నిరాకరించింది.

బిగ్ బిల్లుకు 'సభ' ఆమోదం

వాషింగ్టన్: ట్రంప్ కలల బిల్లు అయిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. గురువారం సుదీర్ఘ చర్చ అనంతరం జరిగిన ఓటింగులో బిల్లు ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 218, వ్యతిరేకంగా 214 ఓట్లు వచ్చాయి. బిల్లును ఇద్దరు రిపబ్లికన్లు వ్యతిరేకించారు. అంతకుముందు ఈ బిల్లుకు సెనెట్‌లో ఆమోదం లభించింది. ట్రంప్ సంతకం తర్వాత చట్టంగా మారనుంది. పన్నుల్లో కోతలు, వ్యయ నియంత్రణ లక్ష్యంగా ఈ బిల్లును ట్రంప్ తీసుకొచ్చారు. బిల్లును వ్యతిరేకిస్తూ.. సభ మైనారిటీ నేత హకీం జెఫ్రీస్.. 8 గంటల 32 నిమిషాలపాటు మాట్లాడారు.



సమావేశంలో పాల్గొన్న వైకాపా ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తుమ్మల లోకేశ్వరరెడ్డి

ఇకపై ఎన్నికలను బ్యాలట్ విధానంలోనే నిర్వహించాలి

ఈసీకి వైకాపా ప్రతినిధుల వినతి

ఈనాడు, దిల్లీ: ఈవీఎంల పనితీరుపై అనుమానాలున్నందున జాతీయ స్థాయిలో జరిగే అన్ని ఎన్నికలనూ బ్యాలట్ పేపర్ విధానంలోనే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)ను కోరినట్లు వైకాపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకోవడానికి పార్టీలతో నిర్వహిస్తున్న చర్చల్లో భాగంగా ఈసీ ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు గురువారం ఈసీ ప్రధాన కార్యాలయంలో వైకాపా, సమాజ్‌వాదీ పార్టీ నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. వైకాపా తరఫున ఆ పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ నాయకుడు తుమ్మల లోకేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఓటర్ల జాబితా పెరుగుదల, ఈవీఎం సాంకేతికతలో లోపాలు, పోలింగ్ సరళిపై ఫిర్యాదు చేశారు.

పైరసీ 'జేబు' దొంగ

- ఒకేఒక్కడు.. 65 సినిమాల పైరసీ
- హెచ్‌డీ కెమెరాతో హైదరాబాద్‌లోని థియేటర్లలో చిత్రీకరణ
- టెలిగ్రామ్‌లో మాఫియాకు 300-400 డాలర్లకు విక్రయం
- నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



నిందితుడు కిరణ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, నారాయణగూడ: తెలుగు సినిమా పైరసీ రాకెట్ గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. సినిమా విడుదలైన రోజే థియేటర్‌కు ప్రేక్షకుడిలా వెళ్లి హెచ్‌డీ క్వాలిటీలో రికార్డు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఇతడొక్కడే ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి 65 సినిమాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇటీవల హిట్ 3, సింగిల్ చిత్రాలు విడుదలైన రోజే హెచ్‌డీ ప్రింట్లు బయటకురావడానికి ఇతడే కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత గురువారం ఒక ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. ఏపీలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జాన కిరణ్‌కుమార్(29) హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లోని ఓ పైరసీ గ్రూపు లింకును చూసిన కిరణ్ దాని నిర్వాహకుల్ని ప్రోటాన్ మెయిల్ ద్వారా సంప్రదించాడు. సినిమాలు పైరసీ చేసి పంపించేలా వారితో ఒప్పందం చేసుకున్నాడు. అప్పటి నుంచి సినిమా విడుదల రోజే థియేటర్‌కు వెళ్తున్న నిందితుడు.. చొక్కా జేబులో హెచ్‌డీ కెమెరా పెట్టుకుని రికార్డు చేసేవాడు. తరువాత ఆ వీడియోను టెలిగ్రామ్ ద్వారా పైరసీ వెబ్‌సైట్లకు పంపేవాడు. ఒక్కో సినిమాకు 300 నుంచి 400 డాలర్ల చొప్పున క్రిప్టో కరెన్సీ రూపంలో తీసుకునేవాడు. జెబ్‌పే, కాయిన్ డీసీఎక్స్ వంటి వేదికల ద్వారా క్రిప్టో కరెన్సీని రూపాయల్లోకి మార్చుకునేవాడు.

వాటర్ మార్క్ ద్వారా గుర్తించి..

ఇటీవల కొన్ని చిత్రాలు విడుదలైన రోజు నుంచే హెచ్‌డీ వెర్షన్ ఆన్‌లైన్‌లో ఉండటాన్ని గుర్తించిన నిర్మాణ సంస్థలు, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) యాంటీ వీడియో పైరసీ సెల్(ఏవీపీసీ)కు ఫిర్యాదు చేశాయి. సాధారణంగా సినిమా ప్రదర్శితమయ్యేప్పుడు మధ్యమధ్యలో తెరపై ఒక వాటర్‌మార్క్ వచ్చి వెళ్తుంది. ఇది ప్రేక్షకులు గుర్తించలేరు. ఎవరైనా సినిమా రికార్డు చేస్తే ఎక్కడి నుంచి చేశారో దీని ద్వారా కనిపెట్టగలరు. ఇదే కోవలో ఏవీపీసీ కొన్ని పైరసీ కాపీలను విశ్లేషించగా.. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ థియేటర్‌లో రికార్డు చేసినట్లు తేలింది. ఈ మేరకు ఏవీపీసీ ప్రతినిధి యర్ర మణీంద్ర బాబు మే 5న ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేశ్ బృందం సదరు థియేటర్లకు వెళ్లి ఆరా తీసింది. పైరసీ వీడియో ఉన్న తీరును బట్టి ఏ వైపు నుంచి రికార్డింగ్ చేసి ఉంటారని ఒక అంచనాకు వచ్చారు. అనంతరం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌ల ఆధారంగా తొలుత నలుగురిని గుర్తించారు. అందులో కిరణ్‌కుమార్ పైరసీకి పాల్పడినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిందితుడు గత ఏడాదిన్నర కాలంలోనే 40కి పైగా సినిమాలను పైరసీ చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. అతన్ని విచారిస్తే పైరసీ ముఠాలు మరిన్ని బయటపడే అవకాశముందని పోలీసులు తెలిపారు.

నకిలీ నెయ్యి కేసులో నిందితులకు బెయిల్

ఈనాడు, అమరావతి: తితిదే లడ్డూ ప్రసాదం తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడా (ఏ5)కు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి బెయిలు మంజూరు చేశారు. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి ఎప్పుడు కోరితే అప్పుడు విచారణకు హాజరుకావాలని తేల్చిచెప్పారు. తితిదేకి లడ్డూ ప్రసాదం తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంపై గతేడాది తమపై నమోదైన కేసులో బెయిలు మంజూరు చేయాలని కోరుతూ పొమిల్ జైన్, విపిన్ జైన్, చావడాలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, శ్రీరామ్ వాదనలు వినిపించారు. సీబీఐ తరఫు న్యాయవాది పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదించారు. ఇటీవల జరిగిన విచారణలో వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేసిన న్యాయమూర్తి.. గురువారం వారికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో తనను ట్రోల్ చేస్తున్నారని, నకిలీ నెయ్యి సరఫరా కేసులో నిందితులకు ప్రస్తుతం బెయిలిచ్చిన నేపథ్యంలో ఇది కూడా ట్రోలర్లకు మరో అంశం అవుతుందని ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ విషయంపైనా తనను ట్రోల్ చేస్తారని ఆయన అన్నారు.

కాకాణి వ్యాజ్యాలపై విచారణ 8కి వాయిదా

- ఎస్సీ, ఎస్టీ కేసులో ఫిర్యాదుదారుకు నోటీసు ఇవ్వాలన్న పీపీ
- ఈ బెంచ్ ముందు విచారణ జరగకుండా పీపీ చూస్తున్నారన్న కాకాణి తరఫు న్యాయవాది
- 'సారీ స్టేట్ ఆఫ్ ఎఫైర్స్' అని వ్యాఖ్యానించిన జస్టిస్ శ్రీనివాసరెడ్డి
- తోపుదుర్తి వ్యాజ్యంపై విచారణ సైతం వాయిదా



ఈనాడు, అమరావతి: క్వార్ట్జ్ ఖనిజం అక్రమ తవ్వకాలు, అభ్యంతరం తెలిపిన గిరిజనులను కులం పేరుతో దూషించిన వ్యవహారంపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు నమోదుచేసిన కేసులో బెయిల్ కోసం మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధనరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు మరో రెండు వ్యాజ్యాలపై హైకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు జరిగిన విచారణలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదవ్వడంతో బెయిల్ పిటిషన్‌పై విచారణకు ముందు గిరిజనుడైన ఫిర్యాదిదారుకు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని పీపీ మెండ లక్ష్మీనారాయణ న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. విచారణను మంగళ లేదా బుధవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఫిర్యాదిదారుకు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మరో కేసులో పిటిషనర్‌ను మేజిస్ట్రేట్ యాంత్రికంగా రిమాండ్‌కు పంపించారన్నారు. ప్రస్తుత బెంచ్ తమ పిటిషన్లను విచారించకుండా పీపీ చూస్తున్నారని, ఈ నేపథ్యంలో వాయిదా కోరుతున్నారన్నారు. న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ.. ప్రస్తుత పరిస్థితులు అలా ఉన్నాయని, 'సారీ స్టేట్ ఆఫ్ ఎఫైర్స్' (ఇది దురదృష్టకర పరిస్థితి) అని వ్యాఖ్యానించారు. కాకాణి వ్యాజ్యాలను మంగళవారానికి వాయిదా వేశారు. వెంటనే శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టేయాలని వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వేసిన వ్యాజ్యం విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించేందుకు సిద్ధపడుతుండగా న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ప్రస్తుత పిటిషన్‌ను సైతం మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

పెద్దిరెడ్డి బుగ్గమఠం భూముల ఆక్రమణపై తాజాగా విచారణ జరపండి


- దేవాదాయశాఖ అధికారులకు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 3.88 ఎకరాల బుగ్గమఠం భూమిని ఆక్రమించిన వ్యవహారంపై తాజాగా విచారణ జరపాలని దేవాదాయశాఖ అధికారులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. దస్త్రాలను వారం రోజుల్లో పెద్దిరెడ్డికి ఇవ్వాలని, తర్వాత వివరణ తీసుకుని, నాలుగు వారాల్లో విచారణ పూర్తిచేయాలని స్పష్టంచేసింది. అంతకుముందు విచారణ జరిపిన మఠం ఈఓ/అసిస్టెంట్ కమిషనర్‌తో కాకుండా మరో అధికారితో విచారణ జరిపించాలని పెద్దిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థిస్తున్న నేపథ్యంలో మరో అధికారితో విచారణ జరిపించాలని ఆదేశించింది. 3.88 ఎకరాలను ఖాళీచేయాలంటూ మఠం ఈఓ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసింది. తాజాగా విచారణ జరిపాక.. ప్రతికూల ప్రభావం చూపేలా ఉత్తర్వులుంటే వాటిపై పెద్దిరెడ్డి అప్పీలు వేసుకోవడానికి వెసులుబాటు ఇచ్చింది. ఆ ఉత్తర్వుల ఆధారంగా మూడు వారాలపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ బుగ్గమఠానికి చెందిన 3.88 ఎకరాల భూమిని ఖాళీచేయాలని, అందులో నిర్మాణాలను తొలగించాలంటూ మఠం ఈఓ/అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే దేవాదాయ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలుచేస్తూ పెద్దిరెడ్డి ధర్మాసనం ముందు అప్పీలు వేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తమ వాదనలు వినకుండా, కోరిన దస్త్రాలు ఇవ్వకుండా మఠం ఈఓ ఉత్తర్వులిచ్చారని, వాటిని రద్దుచేయాలని కోరారు.

మఠం భూములను పెద్దిరెడ్డి ఆక్రమించారు: ఏజీ

రాష్ట్రప్రభుత్వం, మఠం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మఠం భూములను ఆక్రమించారు. 3.88 ఎకరాల విషయంలో ఆయన వద్ద ఎలాంటి దస్త్రాలు లేవు. మఠం వద్ద ఉన్న దస్త్రాలను మీరే ఇవ్వాలంటూ వ్యవహారాన్ని జటిలం చేస్తున్నారు. అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. దస్త్రాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు' అని తెలిపారు.



గిరిజనులకు మామిడి పండ్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది ★ పవన్‌కల్యాణ్ పంపిన మామిడి పండ్లతో చిన్నారులు

పవన్ సారు... పండ్లు పంపారు!

- సంతోషంలో గిరిజనులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన తోటలో పండిన మామిడి పండ్లను గిరిజనులకు పంపి వారిలో ఆనందాన్ని నింపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో మే నెలలో అడవితల్లి బాట కార్యక్రమానికి పవన్ హాజరయ్యారు. పోతంగి పంచాయతీ పీవీటీజీ గ్రామం పెదపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెదపాడు గిరిజనులందరికీ పాదరక్షలు పంపారు. తాజాగా గురువారం కురిడి గ్రామంలోని సుమారు 100 గిరిజన కుటుంబాలకు... తన తోటలో సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను రెండు బొలేరో వాహనాల్లో పంపి సిబ్బంది చేత పంపిణీ చేయించారు.

ఏఆర్ డెయిరీ ఎండీ బెయిల్ పిటిషన్ కొట్టేసిన ఏసీబీ కోర్టు

ఈనాడు, తిరుపతి: తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడైన తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ ఎండీ రాజురాజశేఖరన్ (ఏ2) బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టు కొట్టేసింది. నెయ్యి కల్తీ జరిగిందని తెలిసినా వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావడా సహకారంతో ల్యాబ్ నివేదికను తారుమారు చేసి తిరుమలకు పంపారని సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదనలు వినిపించారు. దీంతో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సరస్వతి.. రాజురాజశేఖరన్ బెయిల్ పిటిషన్‌ను గురువారం డిస్మిస్ చేశారు. నిందితుడు బెయిల్ కోసం ఇప్పటికే రెండుసార్లు దరఖాస్తు చేసినా చుక్కెదురైంది. ఇది మూడోసారి.

జగన్‌కు జడ్ ప్లస్ భద్రత కల్పిస్తున్నాం

- హైకోర్టుకు నివేదించిన ఏజీ

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. ఆయన నెల్లూరు పర్యటనను వాయిదా వేసుకున్న నేపథ్యంలో హెలిప్యాడ్‌కు అనుమతివ్వాలంటూ వైకాపా వేసిన ప్రస్తుత వ్యాజ్యం నిరర్థకమవుతుందని తెలిపారు. భద్రత విషయమై జగన్ ఇప్పటికే హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారని, వాటిలో ఉపశమనం లభించకపోవడంతో వైకాపా ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఈ పిటిషన్ వేశారన్నారు. జడ్ ప్లస్ కేటగిరీ మార్గదర్శకాలపై దాఖలైన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జగన్ నెల్లూరు పర్యటన విషయంలో అధికారులు సూచించిన హెలిప్యాడ్ పొదల మధ్య ఉందన్నారు. వాటిని శుభ్రం చేయాలంటే మూడు రోజులు పడుతుందని తెలిపారు. జగన్‌కు భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వివరించారు.

మెడికల్ కాలేజీల తనిఖీల్లో ముడుపుల బాగోతం!

- లంచాలతో అధికారులను కొనేసి అక్రమాలు
- దేశవ్యాప్తంగా 36 మందిపై సీబీఐ కేసులు
- ఏపీలో ముగ్గురు, తెలంగాణలో ఇద్దరిపై కేసు
- నిందితుల్లో వైకాపా నేత బి. హరిప్రసాద్

ఈనాడు, హైదరాబాద్, అమరావతి – న్యూస్‌టుడే, కదిరి: డమ్మీ బోధకులు.. నకిలీ రోగులతో అక్రమాలకు పాల్పడుతూ అనుమతులు తెచ్చుకుంటున్న వైద్య కళాశాలలపై సీబీఐ కొరడా ఝుళిపించింది. వైద్య కళాశాలల తనిఖీలప్పుడు తమకు అనుకూలంగా నివేదికలు తెప్పించుకునేలా ప్రభుత్వ ఉద్యోగులతో కుమ్మక్కయ్యారనే విషయమై దేశవ్యాప్తంగా సీబీఐ 36 మందిపై కేసు నమోదు చేసింది. అందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఐదుగురు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బి.హరిప్రసాద్ (శ్రీ సత్యసాయి జిల్లా కదిరి), డాక్టర్ కృష్ణకిశోర్ (విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం), వెంకట్ (విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాల డైరెక్టర్); తెలంగాణలో.. జోసెఫ్ కొమ్మారెడ్డి (వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్), డాక్టర్ అంకం రాంబాబు (హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ) తదితరులపై జూన్ 30న దిల్లీ సీబీఐ కేసు నమోదు చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ; జాతీయ మెడికల్ కమిషన్‌ల ఉద్యోగులు.. దేశవ్యాప్తంగా పలువురు దళారులు, వివిధ వైద్య కళాశాలలకు చెందిన ప్రతినిధులతో కుమ్మక్కై అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

వైకాపా నేత ఇంట్లో తనిఖీలు

కదిరికి చెందిన వైకాపా నేత డాక్టర్ బి.హరిప్రసాద్ తాను వైద్య కళాశాలలకు కన్సల్టెంట్‌నని ప్రచారం చేసుకునేవారు. ఆయనకు డాక్టర్ అంకం రాంబాబు, డాక్టర్ కృష్ణకిశోర్‌లు సహాయకులుగా ఉండేవారు. ఎన్ఎంసీ తనిఖీల సమయంలో కళాశాలలకు డమ్మీ బోధకులను, ఇతరత్రా వసతులు సమకూర్చేవారు. జాతీయ మెడికల్ కమిషన్ అధికారులను మభ్యపెట్టి అనుమతులు ఇప్పించేవారు. విశాఖపట్నంలోని గాయత్రి వైద్య కళాశాల డైరెక్టర్ వెంకట్ నుంచి డాక్టర్ కృష్ణకిశోర్ రూ.50 లక్షలు తీసుకున్నారు. డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ అంకం రాంబాబు కలిసి వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అవసరమైన అనుమతులు తెప్పిస్తామని ఆ సంస్థ ట్రస్టీ జోసెఫ్ కొమ్మారెడ్డి వద్ద రూ.66 లక్షలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న దర్యాప్తులో భాగంగా సీబీఐ తెలుగు రాష్ట్రాల నిందితులనూ విచారించనుంది. వైకాపా నేత డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఇంట్లో రెండు రోజులపాటు తనిఖీలు జరిగాయి. ఆయన గురువారం దిల్లీలో సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యారు.

బాధిత మనస్తత్వాన్ని వీడండి

బాధిత మనస్తత్వంతో ఆలోచించేవారి లక్షణాలివీ:

1. కష్టాలు, సమస్యలు వచ్చిన ప్రతిసారీ నాకే ఎందుకిలా జరుగుతోందని బాధపడుతుంటారు.
2. స్నేహితులందరూ స్వార్థపరులని, వారు తనకు ఏమాత్రం సాయం చేయడం లేదని భావిస్తుంటారు.
3. తల్లిదండ్రులు తన బాగు గురించి పట్టించుకోలేదని, వారి వల్లే తన జీవితం ఇలా తయారైందని అనుకుంటుంటారు.

ఈ మనస్తత్వాన్ని వీడనంతవరకూ జీవితాన్ని మార్చుకోవాలన్న ఆలోచన కూడా రాదు.

– ఇజ్రాయెల్ మొంటనో, పర్సనల్ డెవలప్‌మెంట్ కోచ్

7 నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 7 నుంచి చేపట్టనున్నట్లు సెట్ కన్వీనర్ గణేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. మొదట ఈ నెల 17 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని భావించినా.. తెలంగాణలో ఇప్పటికే కౌన్సెలింగ్ మొదలైనందున వారితో పాటే ఇక్కడా పూర్తి చేసేందుకు షెడ్యూల్‌ను మార్పు చేశారు. ఆ మేరకు ఈ నెల 5న ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ప్రకటన విడుదల చేస్తారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు 7-16 వరకు అవకాశం కల్పించారు. బ్రాంచీలు, కళాశాలల ఎంపికకు వెబ్‌ఐచ్ఛికాల నమోదు 10-18 వరకు ఉంటుంది. 19న ఐచ్ఛికాల మార్పు, 22న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 23 నుంచి 26 లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 4 నుంచి తరగతులు మొదలవుతాయి.

సామాజిక న్యాయమే లక్ష్యంగా విజయవాడలో సెప్టెంబరు 15న ర్యాలీ: కేంద్ర మంత్రి రాందాస్ అఠావలే

పటమట, న్యూస్‌టుడే: సామాజిక న్యాయమే లక్ష్యంగా విజయవాడలో సెప్టెంబరు 15న అన్ని కులాలు, మతాలు, వర్గాలతో కలిసి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కేంద్ర సామాజిక, న్యాయశాఖ మంత్రి, ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అఠావలే తెలిపారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. విజయవాడ పటమటలోని ఆర్‌పీఐ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, అంబేడ్కర్ సిద్ధాంతాలను సమాజంలో విస్తరింపజేయడం, సామాజిక న్యాయం లక్ష్యాలుగా ఆర్‌పీఐ పని చేస్తోందన్నారు. అనంతరం విజయవాడ ఇన్‌కం ట్యాక్స్ కాలనీలోని ఏర్పాటు చేసిన ఆర్‌పీఐ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘పారా మెడికల్’ పదం వాడొద్దు

‘అలైడ్ అండ్ హెల్త్‌కేర్’ పదమే ఇక ప్రామాణికం

ఈనాడు, అమరావతి: ఆరోగ్యరంగంలో దశాబ్దాలుగా వినిపించే ‘పారా మెడికల్’ అనే పదాన్ని ఇక వాడొద్దని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. నేషనల్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్ల చట్టం- 2021 ప్రకారం ఇకపై అన్ని ప్రభుత్వ, విద్య, ఆరోగ్య సంబంధిత వ్యవస్థల్లో ‘అలైడ్ అండ్ హెల్త్‌కేర్ (ఆరోగ్య సంరక్షణ సహాయకులు) అనే పదాన్ని అధికారికంగా వాడాలని కేంద్ర ఆరోగ్య- కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.


‘ఈ-పంట తప్పుగా నమోదు చేస్తే.. తీవ్రంగా పరిగణిస్తాం’

ఈనాడు, అమరావతి: ఈ-పంట డిజిటల్ సర్వేలో తప్పుగా పంటలు నమోదు చేసినా.. విస్తీర్ణం, సాగు రకాల్లో తేడాలొచ్చినా తీవ్రంగా పరిగణిస్తామని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు. 2025 ఖరీఫ్ డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన గురువారం విడుదల చేశారు. సాగుకు యోగ్యం కాని వ్యవసాయేతర భూములు, ప్రభుత్వ భూముల్ని తొలగించి.. సాగుకు అనుకూలమైన వాటి వివరాలనే ఎన్ఐసీ ఆధ్వర్యంలో జరిగే డిజిటల్ క్రాప్ సర్వేకు అనుసంధానించామని పేర్కొన్నారు. ఈకేవైసీ తప్పనిసరి కాదని వివరించారు.

మార్గదర్శకాలు.. https://epaper.eenadu.net లో

EENADU Vol: 51, Issue: 325 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

వారసత్వం.. ఎంతో ప్రత్యేకం!



- దలైలామా ఎంపిక ఆసక్తికరం
- 90వ ఏట అడుగుపెడుతున్న ప్రస్తుత దలైలామా

టిబెట్ ఆధ్యాత్మిక గురువు టెంజిన్ గ్యాట్సో (14వ దలైలామా).. ఎట్టకేలకు తన వారసత్వం కొనసాగుతుందని ప్రకటించారు. చైనా ఒత్తిడితో ఒకానొక సమయంలో తానే చివరి దలైలామా కావచ్చని చెప్పిన ఆయన.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది టిబెటన్ల నుంచి అభ్యర్థనలు వస్తుండటంతో మనసు మార్చుకున్నారు. భవిష్యత్తులో కచ్చితంగా వారసులుంటారని, వారు అమ్మాయైనా, అబ్బాయైనా కావొచ్చని తెలిపారు. రెండేళ్ల వయసులోనే దలైలామాగా మారిన ఆయన.. ఈ జులై 6న 90వ ఏట అడుగుపెట్టనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తాజా ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో అసలు దలైలామా ఎవరు.. ఆయనను ఎలా ఎన్నుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

'సముద్రమంతటి జ్ఞాని'

దలైలామా అంటే 'మహా సముద్రమంతటి జ్ఞాని' అని అర్థం. ఈ పదాన్ని దలై (మహా సముద్రం) అనే మంగోలియా పదం నుంచి, లామా (గురువు) అనే టిబెట్ పదం నుంచి తీసుకున్నారు. దలైలామాల చరిత్ర ఇప్పటిది కాదు. 600 ఏళ్ల క్రితం నాటిది. వీరిది వజ్రయాన బౌద్ధమతం. నలంద బౌద్ధమతాన్ని అనుసరించే వారు దలైలామాకు అధిక ప్రాధాన్యమిస్తారు. దలైలామా హోదాలో ఉండేవారు భౌతికంగా అంతరించరని, వారికి పునర్జన్మ ఉంటుందని నమ్ముతారు. క్రీ.శ. 755-791 కాలంలో తొలిసారిగా రాజు ట్రిసోంగ్ డెట్సెన్ (క్రీ.శ.755-791) బౌద్ధాన్ని తన రాజ్య అధికార మతంగా ప్రకటించారు. ఆనాటి నుంచి టిబెట్‌లో పలు గురువుల ప్రస్థానం ప్రారంభమైంది. అనంతరం నియింగ్మా, సక్యా, కాగ్యూ, గెలుగ్పా వంటి బౌద్ధ పాఠశాలలు వెలిశాయి. 13వ శతాబ్దంలో లామాలు (గురువు) పునర్జన్మ పొందుతారన్న సంప్రదాయం కాగ్యూ పాఠశాలలో ప్రారంభమైంది. ఆ తర్వాత 14వ శతాబ్దంలో ఏర్పడిన 'గెలుక్పా' ఈ సంప్రదాయాన్ని అందిపుచ్చుకుంది. ఇక్కడే దలైలామాల వ్యవస్థ ప్రారంభమైందని చెప్పవచ్చు. 1391లో గెందున్ ద్రుప తొలి దలైలామాగా అవిర్భవించారు. 1474 వరకు ఆయన ఆధ్యాత్మిక గురువుగా ప్రజలకు సేవలందించారు. ఆయన తర్వాత గెదున్ గ్యాట్సోకు అవకాశం లభించింది. ఆయన వీరిద్దరిని చనిపోయిన తర్వాత దలైలామాలుగా గుర్తించారు. 1911-12 సంవత్సరాల్లో చైనాలో తిరుగుబాటు జరిగి క్వింగ్ రాజ వంశం గద్దె దిగింది. దీంతో టిబెట్‌లోని క్వింగ్ రాజవంశ సామంతులు అధికారం వీడాల్సి వచ్చింది. అప్పుడే వారు టిబెట్‌ను పరిపాలించాలని కోరుతూ 13వ దలైలామాకు లేఖ రాశారు. వారి అభ్యర్థన మేరకు ఆయన టిబెట్‌లోని లాసాకు తిరిగివచ్చి ఆధ్యాత్మిక గురువుగానే కాకుండా పాలనా పగ్గాలు తీసుకున్నారు. ఆయన 1933లో మరణించగా... ఆ తర్వాత నాలుగేళ్లకు 14వ దలైలామాను ఎంపిక చేశారు.



వారసుడి ఎంపిక ఇలా..

కొత్త దలైలామాను గుర్తించడానికి చాలా సమయం పడుతుంది. ప్రస్తుత 14వ దలైలామాను గుర్తించేందుకు నాలుగేళ్ల సమయం పట్టింది. దలైలామా ఉన్నవారు శరీరాన్ని విడిచి వెళ్లిన తర్వాత లామా లాత్సో సరస్సు వద్ద తపస్సు చేసే అత్యున్నత స్థాయి బౌద్ధ సన్యాసులకు కొత్త అవతారంలో సాక్షాత్కరిస్తారని నమ్మకం. బౌద్ధ సన్యాసులకు ఆయన కలలో కనిపిస్తారని విశ్వసిస్తారు. దలైలామా చనిపోయిన తర్వాత వారి పార్థివ దేహం భంగిమ ఏ దిక్కువైపుగా తిరిగి ఉంటే ఆ దిక్కు నుంచే కొత్త దలైలామాను వెతకడం ప్రారంభిస్తారు. పార్థివ దేహాన్ని దహనం చేసిన తర్వాత వెలువడే పొగ ఎటువైపు వీస్తుందో ఆ మార్గాన్ని అన్వేషణ జరుగుతుంది. ఎవరైనా బాలుడు దలైలామా పోలికలతో కనిపిస్తే అతడికి దలైలామా వినియోగించిన వస్తువులను చూపిస్తారు. వాటిని అతడు గుర్తిస్తున్నాడా.. లేదా.. అని తెలుసుకుంటారు. 13వ దలైలామా వస్తువులను రెండేళ్ల వయసులో ఉన్న టెంజిన్ గ్యాట్సో గుర్తుపట్టిన వెంటనే ఆయనను దలైలామాగా ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఆయనకు శిక్షణ ఇచ్చారు. అయితే దలైలామా తర్వాతి స్థానం పంచెన్ లామాది. వీరు టిబెట్‌లోని ప్రసిద్ధ బౌద్ధ మఠం తాశీ లున్ పోకి మఠాధిపతిగా ఉంటారు. వీరే దలైలామా వారసుడిని గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

భారత్‌లో జన్మించిన ఆరో దలైలామా

ఇప్పటివరకు ఉన్న 14 మంది దలైలామాల్లో 12 మంది టిబెట్‌లోనే జన్మించారు. నాలుగో, ఆరో దలైలామాలు టిబెట్ బయట జన్మించారు. నాలుగో దలైలామా యాన్‌టెన్ గ్యాట్సో 1589లో మంగోలియాలో జన్మించారు. ఆరో దలైలామా సాంగ్‌త్యాంగ్ అరుణాచల్ ప్రదేశ్‌లోని మాన్ తెవాంగ్ ప్రాంతంలో 1682లో పుట్టారు.



66 ఏళ్లుగా భారత్‌లో ఆశ్రయం

1950లో చైనా కమ్యూనిస్టు పార్టీ.. టిబెట్‌పై సైనిక చర్య మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో 1954లో ప్రస్తుత దలైలామా బీజింగ్ వెళ్లి మావో జెడాంగ్, డెంగ్ జియావోపింగ్, చౌ ఎన్‌లై సహా పలువురు చైనా అగ్ర నేతలతో భేటీ అయ్యారు. అయితే అంతకు ముందు టిబెట్, చైనా మధ్య కుదిరిన 17 పాయింట్ల ఒప్పందాన్ని బీజింగ్ బేఖాతరు చేసింది. తమను వ్యతిరేకంగా తిరుగుబాటు గళం వినిపిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపింది. ఈ క్రమంలోనే 1959లో దలైలామా భారత్‌కు చేరుకుని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను ఆశ్రయం కోరారు. ఆ సమయంలో దలైలామా వయసు 24 ఏళ్లే. ఆయన్ను అనుసరించి దాదాపు 80వేల మంది టిబెటన్లు భారత్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో దాదాపు లక్షమంది టిబెటన్లు నివసిస్తున్నారు. ఇక్కడి నుంచి టిబెట్ అజ్ఞాత ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

వారసుడిపై నిర్ణయం దలైలామాదే: భారత్

దిల్లీ: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోద ముద్ర ఉండాల్సిందేనని చైనా పేర్కొనడాన్ని భారత్ పరోక్షంగా తిప్పికొట్టింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేసింది. 'దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో, ఆ సంస్థ చేతుల్లోనో ఉంటుంది. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది' అని గురువారం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. తన వారసుడి ఎంపికను గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు చేపడుతుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని దలైలామా తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయితే వారసుడిగా ఎవరిని ఎంపిక చేసినా తమ ఆమోదముద్ర ఉండాలని చైనా అంటోంది.

కాంగ్రెస్‌తో పొత్తు లేదు.. ఒంటరిగానే పోటీ చేస్తాం: కేజ్రీవాల్

అహ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీతో తమకు ఎటువంటి పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. గుజరాత్‌లో భాజపాకు హస్తం పార్టీ మద్దతునిస్తోందని ఆరోపించారు. గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుజరాత్‌లో కమలానికి ప్రత్యామ్నాయంగా ఆప్ ఎదుగుతోందని తెలిపారు. ఇక్కడి ప్రజలు ఇప్పుడు భాజపా, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్ వైపే చూస్తున్నారని తెలిపారు. 'మాకు కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు లేదు. విశావదర్ ఉప ఎన్నికలో హస్తం పార్టీ ఎందుకు పోటీ చేసింది.. మమ్మల్ని ఓడించడానికే.. ఓట్లను చీల్చి మమ్మల్ని ఓడించేందుకు భాజపానే కాంగ్రెస్‌ను పోటీకి పంపింది. ఈ పని విఫలమవడంతో కమలం పార్టీ కాంగ్రెస్‌ను మందలించింది. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మావైపు నుంచి ఎటువంటి పొత్తు లేదు. గత 30 ఏళ్లుగా గుజరాత్‌ను భాజపా నాశనం చేసింది. వీరు అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ సాయం చేస్తోంది' అని కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ప్రజలను తమ పార్టీలో చేర్చుకునేందుకు 'గుజరాత్ జోడో' అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో బిహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్ ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు తెలిపారు.

ట్రంప్ రహస్య సైనిక సమావేశంలోకి జుకర్‌బర్గ్!

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన జరుగుతున్న అత్యంత కీలక సమావేశంలో అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. ఈ భేటీ జరుగుతుండగా మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అనుకోకుండా ఓవల్ కార్యాలయం లోపలికి వచ్చేశారు. దీంతో సిబ్బంది ఆయనను బయటకు పంపించారు. అమెరికా ఆరోతరం ఫైటర్ జెట్లు అయిన ఎఫ్-47 స్టెల్త్ యుద్ధ విమానాలపై కొన్ని నెలల క్రితం ట్రంప్ అత్యంత రహస్య సమావేశం నిర్వహించారు. ఓవల్ ఆఫీసులో జరిగిన ఈ భేటీలో సైనిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ యుద్ధ విమానాల సామర్థ్యం గురించి అధికారులు.. అధ్యక్షుడికి వివరిస్తుండగా.. ఉన్నట్టుండి జుకర్‌బర్గ్ లోపలికి వచ్చేశారు. ఆయనను చూసి సైనికాధికారులు షాక్ అయ్యారు. అక్కడున్న భద్రతా సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా బయటకు వెళ్లమని చెప్పారు. దీంతో ఆయన అధ్యక్షుడిని పలకరించి గది నుంచి బయటకు వచ్చేశారు.

దేశంలోనే తొలి సోలార్ బస్‌స్టేషన్

ఇంటర్నెట్ డెస్క్: దేశంలోనే మొదటి సారిగా సోలార్ బస్‌స్టేషన్ గుజరాత్‌లోని సూరత్‌లో ఏర్పాటైంది. ఇందులో రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్, సెకండ్ లైఫ్ బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా బస్సులకు 24 గంటల గ్రీన్ ఛార్జింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ రూ.1.60 కోట్ల వ్యయంతో ఆల్తాన్‌లో కొత్తగా ఈ 'స్మార్ట్ బస్ స్టేషన్'ను నిర్మించింది. ఈ ప్రాజెక్టును జర్మన్ సంస్థ సహకారంతో చేపట్టింది.



19న అఖిలపక్ష సమావేశం

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఈ నెల 19న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు గురువారం ప్రకటించారు. ఈసారి పార్లమెంటులో ప్రభుత్వం ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. అణుఇంధన చట్టంలో మార్పు చేసి అణుశక్తి రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించడం, అణుఇంధనం పరంగా ప్రజలకు కలిగే నష్టాలకు పరిహారం వంటివి ఉంటాయి.



హత్యకు గురైన తల్లీబిడ్డలు.. నిందితుడు ముకేశ్

బహిరంగంగా తిట్టారన్న కోపంతో యజమాని భార్యాబిడ్డల హత్య

దిల్లీ: దేశ రాజధాని నగరంలోని లజపత్ నగర్‌లో తల్లీబిడ్డల జంటహత్యలు కలకలం రేపుతున్నాయి. వస్త్ర వ్యాపారం చేస్తున్న కుల్‌దీప్ సేవాని వద్ద బిహార్‌కు చెందిన ముకేశ్‌కుమార్ (24) సహాయకుడిగా, డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అప్పు కింద తీసుకొన్న రూ.40 వేలు ముకేశ్ తిరిగి కట్టకపోవడంతో యజమాని భార్య అయిన రుచిక (42) ఈ మధ్య అతణ్ని బహిరంగంగా తిట్టారు. ఈ కక్షను మనసులో పెట్టుకొన్న ముకేశ్ బుధవారం రాత్రి యజమాని లేనపుడు ఇంట్లోకి వెళ్లి రుచికను, ఆమె కుమారుణ్ని (14) పదునైన కత్తితో గొంతు కోసి చంపాడు. దుకాణం నుంచి ఇంటికి వచ్చిన కుల్‌దీప్ గేటుకు బయటి నుంచి తాళం వేసి ఉండటం, మెట్లపై రక్తపు మరకలు చూసి కేకలు వేయగా లోపలి నుంచి ఎవరూ స్పందించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా మృతదేహాలు పడున్నట్లు డీసీపీ హేమంత్ తివారీ తెలిపారు. ఈ ఘటన తర్వాత పరారీలో ఉన్న ముకేశ్‌ను ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు రైలులో అరెస్టు చేశారు.

ట్రంప్‌ను వణికిస్తున్న మమ్దానీ!

న్యూయార్క్: భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ అమెరికా రాజకీయాల్లో సరికొత్త సంచలనం. వచ్చే నవంబరులో జరగనున్న న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని చేజిక్కించుకున్న ఆయన ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవరపాటుకు గురి చేస్తున్నారు. ఆయనపై ట్రంప్ చేస్తున్న ఘాటు వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. తన రాజకీయ ప్రత్యర్థులపై తిట్ల పురాణం అందుకునేందుకు ఎన్నడూ వెరవని ట్రంప్.. తాజా రాజకీయ ప్రత్యర్థిని 'కమ్యూనిస్టు పిచ్చోడు'గా అభివర్ణించారు. న్యూయార్క్ ఎన్నికలో విజయం సాధిస్తే ఆయనను అరెస్టు చేసి దేశం నుంచి బహిష్కరిస్తానని, న్యూయార్క్ నగరాన్ని హస్తగతం చేసుకుంటానని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తున్నారంటే మమ్దానీ ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తన ప్రచారంలో భాగంగా మమ్దానీ చేస్తున్న అనర్గళ ఉపన్యాసాలు, నవ్యరీతిలో సాగిస్తున్న ప్రచారం, పేదలను, కార్మిక వర్గాలను ఆకర్షిస్తూ ఆయన ఇస్తున్న హామీలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. తాను మేయర్‌గా ఎన్నికైతే నగర పాలక వ్యవస్థ ఆధ్వర్యంలో తక్కువ ధరకు సరకులందించే నిత్యావసరాల దుకాణాలు నడపడమేగాక, ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తానని, ఇంటి అద్దెల్ని నియంత్రిస్తానని, ధనిక, ఉన్నత వర్గానికి చెందిన తెల్ల జాతీయులపైన పన్నులు పెంచుతానని మమ్దానీ హామీ ఇస్తున్నారు. అభ్యుదయ వాదులు మమ్దానీ రాకను స్వాగతిస్తున్నారు. ఆయనలో డెమోక్రటిక్ పార్టీ భవితవ్యాన్ని చూస్తున్నారు. పార్టీలోని మధ్యేవాదులు ఆయన రాకపై ఆందోళన చెందుతున్నారు.

కాలం చెల్లిన వాహనాలకు ఇంధన నిషేధంపై దిల్లీ వెనకడుగు!

దిల్లీ: పదేళ్లు దాటిన డీజిల్, 15 ఏళ్లు దాటిన పెట్రోలు వాహనాలకు బంకుల్లో ఇంధనం నింపడాన్ని నిషేధించాలని తీసుకున్న నిర్ణయంపై దిల్లీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పాత వాహనాలను గుర్తించి వాటికి ఇంధనం నిలిపివేసే విధానం ప్రస్తుత పరిస్థితుల్లో ఆచరణలో సాధ్యం కాదని పేర్కొంది. ఇందుకు అనేక సాంకేతిక సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రారంభించిన కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలని గాలి నాణ్యత నిర్వహణ కమిషన్‌కు (సీఏక్యూఎం) లేఖ రాసింది. ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఆటోమేటిక్ నంబరు ప్లేట్ల గుర్తింపు వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేవరకూ దీన్ని నిలిపివేయాలని సీఏక్యూఎంకు రాసిన లేఖలో దిల్లీ పర్యావరణశాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. 10 ఏళ్లు పైబడిన డీజిల్, 15 ఏళ్లు పైబడిన పెట్రోల్ వాహనాలకు బంకుల్లో ఇంధనం నిలిపివేయాలన్న నిర్ణయాన్ని జులై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో పునరాలోచనలో పడి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది.

లక్ష్యం సాధించేదాకా కాల్పుల విరమణ కుదరదు

- ట్రంప్‌తో ఫోన్ చర్చల్లో పుతిన్

మాస్కో: అమెరికా, రష్యా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ గురువారం ఫోన్‌లో చర్చలు జరిపారు. ఇరాన్, ఉక్రెయిన్ యుద్ధాలపై వారు చర్చించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఇద్దరు నేతలు ఇలా ఫోన్‌లో సంభాషించడం ఇది ఆరోసారి. లక్ష్యం సాధించేదాకా ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదరదని పుతిన్ స్పష్టం చేశారు. సమస్యలను రాజకీయంగా, దౌత్యపరంగా పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించినట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి.

రష్యా అత్యున్నత సైనికాధికారి మృతి

మాస్కో: ఉక్రెయిన్‌కు సరిహద్దులోని కర్స్క్ ప్రాంతంలో రష్యా అత్యున్నత సైనికాధికారి మృతి చెందారు. రష్యా నౌకాదళ డిప్యూటీ చీఫ్ మేజర్ జనరల్ మైఖేల్ గడ్కోవ్ మృతి చెందినట్లు కర్స్క్ గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌స్టీన్ తెలిపారు. అయితే ఆయన ఎలా మరణించిందీ వెల్లడించలేదు. కర్స్క్ పశ్చిమ ప్రాంతంలో యుద్ధ కార్యకలాపాల్లో ఉండగా ఆయన మరణించినట్లు రక్షణశాఖ వెల్లడించింది.

రెండు రోజుల్లో అమెరికాతో భారత్ మినీ ట్రేడ్ డీల్!

ఇంటర్నెట్ డెస్క్: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. రెండు దేశాల మధ్య మినీ ట్రేడ్ డీల్ (మధ్యంతర వాణిజ్య ఒప్పందం) కుదరనున్నట్లు తెలుస్తోంది. 48 గంటల్లో అది ఖరారు కావొచ్చని, ఆ దిశగా వాషింగ్టన్‌లో చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

27 వారాల గర్భం తొలగింపునకు ఎయిమ్స్ వైద్యుల నిరాకరణ

- అత్యాచార బాధితురాలి కేసులో సింగిల్ జడ్జి ఆదేశాలపై దిల్లీ హైకోర్టులో అప్పీలు
- గర్భం కొనసాగింపునకు ఒప్పుకొన్న బాలిక

దిల్లీ: గర్భవిచ్ఛిత్తి వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందన్న వైద్యుల హెచ్చరికతో అబార్షన్ చేయించుకోవాలనుకున్న అత్యాచార బాధిత బాలిక మనసు మార్చుకుంది. కడుపులో పెరుగుతున్న 27 వారాల పిండాన్ని కాన్పు వరకు కొనసాగించేందుకు అంగీకరించింది. దీంతో ఆ గర్భిణిని ఆసుపత్రిలో చేర్చుకుని ప్రసవం అయ్యే వరకూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కాన్పు అనంతరం తల్లీబిడ్డలకు ఐదేళ్ల పాటు ఉచిత వైద్యం అందించాలని దిల్లీ హైకోర్టు గురువారం ఎయిమ్స్ అధికారులను ఆదేశించింది.

దిల్లీకి చెందిన 16 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురికావడంతో గర్భం దాల్చింది. ఆ విషయం తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియడంతో గర్భవిచ్ఛిత్తికి అనుమతి కోసం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటికే గర్భస్థ శిశువు వయసు 26 వారాలు దాటింది. అరుదైన కేసుగా భావించిన ఏకసభ్య ధర్మాసనం జడ్జి.... ఆ బాలికకు అబార్షన్ చేయాల్సిందిగా ఎయిమ్స్ వైద్యులను ఆదేశించారు. అయితే, ఈ దశలో గర్భవిచ్ఛిత్తి తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిది కాదని, భవిష్యత్తులో ఆ బాలికకు పలు సమస్యలు వస్తాయని వైద్యులు దిల్లీ హైకోర్టుకు తెలిపారు. 27వారాల పిండం తొలగింపు భ్రూణ హత్య కిందకు వస్తుందని వివరించారు. ఎయిమ్స్ వైద్యుల సూచనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ...సింగిల్ జడ్జి ఉత్తర్వును సవరించారు. ఈ విషయాలను బాలికకు, ఆమె తల్లికి వివరించడంతో కాన్పు వరకు గర్భం కొనసాగించడానికి అంగీకరించారు.

జర్మనీ రైల్లో సుత్తితో దుండగుడి దాడి

- నలుగురికి గాయాలు

బెర్లిన్: జర్మనీ రైల్లో ఓ దుండగుడు.. సుత్తితో నలుగురిని గాయపరిచాడు. ఆస్ట్రియా రాజధాని వియెన్నాకు వెళ్తున్న రైల్లో గురువారం ఈ దాడి జరిగింది. స్ట్రాబింగ్ అనే ప్రాంతంలో ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. దుండగుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి జరిగిన సమయంలో రైల్లో 500 మంది ప్రయాణికులున్నారు.

వృద్ధులు, రోగుల కోసం ఈ-గ్లోవ్స్

- ఒక్కసారి క్లిక్ చేస్తే అలారం, కుటుంబానికి సందేశం

ఇంటర్నెట్ డెస్క్: వృద్ధులు, దివ్యాంగులు, రోగుల కోసం ఈ-గ్లోవ్స్‌ను రాజస్థాన్‌కు చెందిన ఓ ప్రొఫెసర్ తయారు చేశారు. వీటి ద్వారా వారు తమకు అవసరమైనప్పుడు కుటుంబ సభ్యులు, సంరక్షకులకు వెంటనే సందేశం పంపవచ్చు. భిల్వాడాలోని సుభాశ్‌నగర్‌కు చెందిన రాకేశ్ కుమార్ జైన్ ఉదయపుర్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కొవిడ్ సమయంలో వృద్ధులు, రోగులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ఆయన ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ-గ్లోవ్స్‌ను రూపొందించారు. ఈ-గ్లోవ్స్‌ను ఆటోమేటిక్ వేరబుల్ అసిస్టెంట్ గ్లోవ్స్ అనీ పిలుస్తారు. ఇవి ఐదు వేళ్లపై వేర్వేరు బటన్లను కలిగి ఉంటాయి. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఈ బటన్లను బొటన వేలుతో నొక్కినప్పుడు 100 మీటర్ల దూరం వరకూ అలారం మోగుతుంది. అప్పటికీ కేర్ టేకర్, కుటుంబ సభ్యులు అలారం శబ్దాన్ని వినకపోతే, వెంటనే వారి మొబైల్‌కు సందేశం వెళ్తుంది. వీటి తయారీకి దాదాపు రూ.700 ఖర్చవుతుందని, సామాన్యులూ సులభంగా కొనుగోలు చేయవచ్చని రాకేశ్ కుమార్ పేర్కొన్నారు.



పెళ్లి కోసం లింగ మార్పిడి

- అయ్యాక చేసుకోనన్న ప్రియుడు
- అత్యాచారం కేసు నమోదు

భోపాల్: వారిద్దరూ యువకులు. 10 ఏళ్లుగా స్వలింగ సంపర్కులుగా కలిసి జీవిస్తున్నారు. చివరకు పెళ్లి చేసుకోవాలని భావించి ఒకరు లింగ మార్పిడి చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో 25 ఏళ్ల వయసులో అందులో ఒకరు లింగ మార్పిడి చేయించుకున్నారు. అయితే అక్కడే కథ అడ్డం తిరిగింది. లింగ మార్పిడి పూర్తయ్యాక అమ్మాయిగా మారిన యువకుడిని పెళ్లాడేందుకు మరో యువకుడు నిరాకరించాడు. దీంతో ఆమె అత్యాచారం కేసు పెట్టింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపయ్యేలా..

- ఘనా అధ్యక్షుడితో మోదీ చర్చలు

అక్రా: ఘనా పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షుడు జాన్ డ్రామనీ మహామాతో మోదీ భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం 300 కోట్ల డాలర్లుగా ఉన్న వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేసుకోవాలని నిర్ణయించారు. సంస్కృతి, సంప్రదాయ ఔషధాలు సహా పలు రంగాల్లో సహకారాన్ని పెంచుకునేందుకు వీలుగా ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు వీరి చర్చల్లో కుదిరాయి.

భారత్‌లో దాదాపు 2,500 రాజకీయ పార్టీలు

భారత్‌లో దాదాపు 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయని మోదీ ఘనా పార్లమెంటులో ప్రసంగం సందర్భంగా ప్రస్తావించడంతో.. ఆ దేశ ఎంపీలు ఆశ్చర్యపోయారు. అది చూసి ప్రధాని చిరునవ్వు చిందించారు. ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ఘనాలో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటుచేస్తామని మోదీ ప్రకటించారు. 'యూపీఐ' సేవలను ఆ దేశంలో ప్రారంభించి, ఫిన్‌టెక్ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఘనాలో మోదీ పర్యటన చారిత్రక బంధానికి నిదర్శనమని ఆ దేశాధ్యక్షుడు మహామా పేర్కొన్నారు. ఘనా తొలి అధ్యక్షుడు క్వామే నక్రూమా స్మారక పార్కును మోదీ సందర్శించి నివాళులర్పించారు. ఘనా పర్యటనను ముగించుకున్న ప్రధాని.. అక్కణ్నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు బయలుదేరి వెళ్లారు.

మాలిలో ముగ్గురు భారతీయుల అపహరణ

దిల్లీ: పశ్చిమాఫ్రికా దేశమైన మాలిలో ముగ్గురు భారతీయులు అపహరణకు గురయ్యారు. సాయుధులైన కొందరు ముష్కరులు ఆ దేశంలోని కయెస్ నగరంలో ఉన్న డైమండ్ సిమెంట్ కర్మాగారంపై ఈ నెల 1న ఆకస్మిక దాడి చేశారు. అందులో పనిచేస్తున్న ముగ్గురు భారతీయులను బలవంతంగా తీసుకెళ్లిపోయారు. మాలి వ్యాప్తంగా మంగళవారం చోటుచేసుకున్న దాడులకు తామే బాధ్యులమని అల్‌ఖైదా అనుబంధ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వల్ ముస్లిమిన్ (జేఎన్ఐఎం) ప్రకటించుకుంది. కిడ్నాప్‌పై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మాలి ప్రభుత్వంతో విదేశీ వ్యవహారాల శాఖ మాట్లాడింది. అపహరణకు గురైన వారిని సురక్షితంగా, వెంటనే విడుదల చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది.



ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ జిల్లాలో కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లే దారిలో సోన్‌ప్రయాగ్ వద్ద కురిసిన భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో గురువారం యాత్రికులు ఆ ప్రాంతాన్ని దాటేందుకు సహకరిస్తున్న భద్రతా సిబ్బంది

బోయింగ్ విమానం నుంచి నేలరాలిన రెక్క భాగం

ఇంటర్నెట్‌డెస్క్: విమానం గాల్లో ఉండగానే దాని రెక్కలోని ఓ భాగం ఊడిపోయి రోడ్డుపై పడిన ఘటన అమెరికాలోని నార్త్ కరోలినాలో చోటుచేసుకొంది. మంగళవారం రాత్రి అట్లాంటా విమానాశ్రయం నుంచి డెల్టా ఫ్లైట్ నంబర్ 3247 బోయింగ్ 737-900 విమానం నార్త్ కరోలీనాలోని రెలీ-డర్హంకు బయల్దేరింది. ప్రయాణం మొత్తం సాఫీగానే సాగింది. ల్యాండింగ్ సమయంలో అత్యంత కీలకమైన విమానం రెక్కలోని ఫ్లాప్‌నకు సంబంధించిన విడిభాగం పడిపోయిందని తర్వాత తెలిసింది. అదృష్టవశాత్తు విమానం సురక్షితంగా దిగింది. ఆ సమయంలో 109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దానిలో ఉన్నారు. విమానం ఎడమ రెక్క వెనుక ఫ్లాప్‌లో కొంత భాగం కనిపించకపోవడంపై పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయానికి దారితీసే రహదారి మార్గంలో విడిభాగం దొరికింది. ప్రయాణ సమయంలోనే ఆ భాగం ఊడిపోయి పడిపోయినట్లు గుర్తించారు.



వియెన్నాలో నిలిచిపోయిన దిల్లీ-వాషింగ్టన్ ఎయిరిండియా విమానం

ముంబయి: దేశ రాజధాని నుంచి వాషింగ్టన్ డీసీకి బుధవారం బయల్దేరిన ఏఐ103 బోయింగ్ విమానం ప్రయాణాన్ని పూర్తిచేయలేకపోయింది. ఇంధనం నింపేందుకు వియెన్నాలో దీనిని నిలిపినప్పుడు తనిఖీలు నిర్వహించగా సాంకేతిక అవాంతరం ఒకటి బయటపడింది. భారత్ విమానాలకు పాక్ గగనతలాన్ని మూసివేయడంతో పాశ్చాత్య దేశాలకు వెళ్లాల్సిన లోహవిహంగాలు ఎక్కువ దూరం తిరగాల్సి వస్తోంది. అందుకే మధ్యలో ఆస్ట్రియా రాజధాని వియెన్నాలో ఇంధనం నింపుతున్నారు.

సోమాలియాలో హెలికాప్టర్ దుర్ఘటన.. ఐదుగురు సైనికుల మృతి

మొగదిషు: ఆఫ్రికన్ యూనియన్ శాంతి పరిరక్షణ మిషన్ కోసం సేవలందిస్తున్నవారిలో ఉగాండాకు చెందిన ఐదుగురు సైనికులు దుర్మరణం పాలయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ఎంఐ-24 హెలికాప్టర్ బుధవారం సోమాలియా రాజధాని మొగదిషులో కూలిపోయింది. ఆ సమయంలో అందులో ఎనిమిదిమంది ఉన్నారు. పైలట్, కోపైలట్, ఫ్లైట్ ఇంజినీర్ తీవ్ర గాయాలతో బయటపడ్డారు.

తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన రష్యా

మాస్కో: అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశంగా రష్యా నిలిచింది. రష్యా విదేశాంగ శాఖ గురువారం ఈ మేరకు ప్రకటన చేసింది. నిషేధిత గ్రూపుల జాబితా నుంచి తాలిబన్లను తొలగించినట్లు పేర్కొంది. 2021లో తాలిబన్లు నాటి ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఈనాడు సినిమా

ఇక డేట్ మారదు... రికార్డులే మారతాయి!

● 'హరి హర వీర మల్లు' ట్రైలర్ వేడుకలో దర్శకుడు జ్యోతికృష్ణ


నిధి అగర్వాల్, జ్యోతి కృష్ణ, అనుదీప్, ఎ.ఎం రత్నం


పవన్ కల్యాణ్

"ఇప్పటిదాకా మేకల్ని తినే పులిని చూసి ఉంటారు. ఇప్పుడు పులుల్ని వేటాడే బెబ్బులిని చూస్తారు' అంటున్నారు పవన్ కల్యాణ్. వీరమల్లు అనే యోధుడిగా ఆయన చేసిన సాహసాలు, పోరాటాలు ఎలాంటివో తెలియాలంటే 'హరి హర వీర మల్లు' చూడాల్సిందే. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్ ముఖ్యభూమిక పోషించారు. ఎ.ఎం.జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. ఎ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎం.రత్నం సమర్పకులు. ఈ నెల 24న ఈ చిత్రం తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కోహినూర్ వజ్రం కోసం సాగే పోరాటం, మొఘలులతో వీరమల్లు తలపడటం లాంటి సన్నివేశాలతో ట్రైలర్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించింది. ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్ చేసిన పూర్తిస్థాయి పాన్ ఇండియా చిత్రమిది. చరిత్రని గుర్తు చేస్తుంది. పవన్ కల్యాణ్ సినిమా జీవితంలోనే కాదు, నిజ జీవితంలోనూ హీరోనే. ఆయనలోని రియల్ స్టార్‌ని ఈ సినిమాతో చూస్తార"న్నారు. నిర్మాత ఎ.దయాకర్‌రావు మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్ హృదయం నుంచి వచ్చే మాటల్ని ప్రతిబింబిస్తూ, మన చరిత్రని మనకు గుర్తు చేస్తుందీ చిత్రం" అన్నారు. దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ "ఈసారి ఈ సినిమా విడుదల తేదీ మారదు, పరిశ్రమలోని రికార్డులే మారతాయి. దేశం మొత్తం తిరిగి చూసేలా ఈ సినిమా ఉంటుంది. కొంతమంది సినిమా గురించి అసత్య ప్రచారాలు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మా పని మేము చేసుకుంటూ వచ్చాం. నిర్మాత ఎ.ఎం.రత్నం భారీ బడ్జెట్ సినిమాలే చేస్తారు. దేశం మొత్తం తిరిగి చూసే సినిమాలే చేశారు. అలాగే ఉంటుందీ చిత్రం. పవన్‌కల్యాణ్ ఇమేజ్‌కి ఎంత బడ్జెట్ పెట్టినా తక్కువే అనిపిస్తుంది. ఈ సినిమాతో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో మరో భారీ విజయం సాధించబోతున్నాం. ఈ సినిమాని నేను ఒక్కడినే చేశానంటే తప్పు, ఈ సినిమాకి మంచి పునాది వేశారు దర్శకుడు క్రిష్. విలువైన సమయాన్ని కేటాయించి, ఈ సినిమా ప్రయాణంలో మాకు అండగా నిలిచారు త్రివిక్రమ్. మంచి సినిమా అందించేందుకు సమయం తీసుకున్నాం" అన్నారు. "ఈ సినిమాతో కచ్చితంగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోబోతున్నాం" అన్నారు నిధి అగర్వాల్. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనుదీప్, గీత రచయిత రాంబాబు గోసాల, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గ్లింప్స్ ఆరోజే!

సూర్య కథానాయకుడిగా ఆర్.జె. బాలాజీ తెరకెక్కిస్తున్న చిత్రం 'కరుప్పు'. డ్రీమ్ వారియర్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర తొలి గ్లింప్స్‌ను సూర్య పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న విడుదల చేయనున్నట్లు సమాచారం. అంతే కాదు దీని విడుదల తేదీపైనా అప్పుడే స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇది ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోంది. సూర్య ఇందులో రెండు పాత్రల్లో అలరించనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. దీన్ని దీపావళి సందర్భంగా థియేటర్లలోకి తీసుకొచ్చే అవకాశముంది. ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, ఛాయాగ్రహణం: జి.కె.విష్ణు.


సూర్య

తొలి భారతీయ నటిగా దీపికకు అరుదైన గౌరవం

తెరపై హీరోలకు దీటుగా యాక్షన్ సన్నివేశాలు చేస్తూ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంటుంది బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె. ప్రస్తుతం వరుస అవకాశాలతో జోరు చూపిస్తున్న ఈమె.. అంతర్జాతీయ స్థాయిలో ఓ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికయ్యింది దీపిక. తాజాగా హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకుంది. అంతే కాదు.. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారతీయ నటి కూడా దీపికనే కావడం విశేషం. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఆమెతో పాటు.. హాలీవుడ్ తారలు డెమి మూర్, రాచెల్ మెక్ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ లాంటి 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ తెలిపింది. వినోదరంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను వీరిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం తెలుగులో అట్లీ-అల్లు అర్జున్ కలయికలో రాబోతున్న చిత్రంలో నటిస్తుంది దీపిక.


దీపిక పదుకొణె

అన్ని యుద్ధాల్ని అంతం చేసే యుద్ధం మొదలైంది!



రామాయణం మన సంస్కృతికి ఆత్మలాంటిది. అది మన వాస్తవం.. మన చరిత్ర. ఇప్పుడా అపురూప ఇతిహాసాన్ని 'రామాయణ' సినిమాగా ప్రపంచ సినీప్రియులకు చూపించేందుకు సిద్ధమవుతున్నారు దర్శకుడు నితేశ్ తివారి. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. యశ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతుండగా.. తొలి భాగానికి సంబంధించిన గ్లింప్స్‌ను గురువారం విడుదల చేశారు. "కాలం ఉనికిలో ఉన్నప్పటి నుంచి ముల్లోకాల్ని త్రిమూర్తులు పరిపాలిస్తున్నారు. బ్రహ్మ.. సృష్టించే దేవుడు. విష్ణువు.. రక్షించే దేవుడు. శివుడు.. అంతం చేసే దేవుడు. కానీ, వారు సృష్టించిన మూడు లోకాలపై ఆధిపత్యం కోసం ఎదురు తిరిగినప్పుడు అన్ని యుద్ధాల్ని అంతం చేసే యుద్ధం ప్రారంభమైంది. 5వేల సంవత్సరాల నుంచి 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది. ఇది ఒక అమరమైన ఇతిహాసగాథ. రామాయణం మన వాస్తవం. మన చరిత్ర" అంటూ సాగిన ఆ ప్రచార చిత్రం ఆద్యంతం గ్రాఫిక్స్ హంగులతో అలరించేలా ఉంది. ఆఖర్లో రాముడిగా రణ్‌బీర్‌ను, రావణుడిగా యశ్‌ను పరిచయం చేసిన తీరు ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా దర్శకుడు నితేశ్ తివారి మాట్లాడుతూ.. "రామాయణం మన సంస్కృతికి ఆత్మలాంటిది. ఆ ఆత్మను గౌరవించడమే మా లక్ష్యం. అందుకే ఈ కథను అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా గొప్పగా తెరపై చూపించాలనుకుంటున్నాం" అన్నారు. "ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడికీ సంబంధించిన ఒక సాంస్కృతిక ఉద్యమం. ఈ చిత్రంతో మేము మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. ఇంతకుముందు రామాయణాన్ని ఎన్నోసార్లు చూశాం. కానీ, ఈ వెర్షన్‌లో దాని దృశ్యాలు, యుద్ధాలు అన్నీ నిజమైన వైభవంతో పునస్సృష్టించనున్నాం" అన్నారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ చిత్ర తొలి భాగం 'రామాయణ: ది ఇంట్రడక్షన్' పేరుతో వచ్చే ఏడాది దీపావళికి రానుంది. రెండో భాగం 2027 దీపావళికి విడుదలవుతుంది. ఈ సినిమాలో లక్ష్మణుడిగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ దేవోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్.

'గల్లీ బాయ్' సీక్వెల్ సన్నాహాలు


రణ్‌వీర్, అలియా

'అప్నా టైమ్ ఆయేగా..' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది 'గల్లీ బాయ్' చిత్రం. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్, అలియా భట్ జంటగా నటించిన చిత్రమిది. జోయా అక్తర్ తెరకెక్కించిన ఈ సినిమా ర్యాప్ సింగర్ కావాలని కలలు కనే ముంబయి మురికి వాడల్లో నివసించే మురాద్ అనే అబ్బాయి చుట్టూ తిరుగుతుంది. యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 'గల్లీ బాయ్ 2' స్క్రిప్ట్ దశలో ఉన్నట్లు.. 'ఖో గయే హమ్ కహాఁ' ఫేమ్ అర్జున్ వరైన్ సింగ్ దర్శకత్వం వహించనున్నారని సమాచారం. ఈ రాబోయే ప్రాజెక్టులో కొత్త తారాగణం నటించనుందని.. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాది ఆఖర్లో చిత్రీకరణను ప్రారంభించే అవకాశాలున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఎన్ని సవాళ్లు ఎదురైనా తమ్ముడు చేయాలనుకున్నా!

నా సరదా వ్యక్తిత్వం... నా మాటల్లోని చాతుర్యం అప్పుడప్పుడూ నేను చేసే పాత్రల్లోనూ ప్రతిబింబిస్తూ ఉంటుందని చెబుతున్నారు వర్ష బొల్లమ్మ. 'తమ్ముడు' విషయంలో మాత్రం అలా కుదరలేదని చెప్పుకొచ్చింది. 'విజిల్' తర్వాత.. మళ్లీ 'తమ్ముడు' కోసం ప్రత్యేకంగా సన్నద్ధమై నటించానని ఆమె తెలిపారు. నితిన్ కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు'లో వర్ష బొల్లమ్మ ఓ కథానాయిక. శ్రీరామ్ వేణు దర్శకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా వర్ష గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

'తమ్ముడు'లో చాలా మంది మహిళా నటులు ఉన్నారు. ఈ కథలో మిమ్మల్ని ఆకర్షించిన అంశాలేమిటి?

ఇందులో అమ్మాయిలు నలుగురే, 'విజిల్' సినిమాలో అయితే ఏకంగా ఓ ఫుట్‌బాల్ జట్టు ఉంటుంది కదా. వాళ్ల మధ్యలో నేనొక్కదాన్ని. కానీ ఆ సినిమాలో నేను పోషించిన గాయత్రి పాత్రని ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. 'జాను' సినిమాలో అయితే ఇంకా చిన్న పాత్ర. సినిమాలో ఎంత మంది నటులు ఉన్నారనేది నేను పట్టించుకోను. నేను చేసే పాత్రలో నటించే అవకాశం ఉందా లేదా? ఆ పాత్రకి న్యాయం చేశానా లేదా? అనేదే ముఖ్యం. 'తమ్ముడు'లో నేను చిత్ర అనే యువతిగా కనిపిస్తా. అడవిలో చిత్రీకరణ చేయాల్సి ఉంటుందని, యాక్షన్ ఉంటుందని ముందే చెప్పారు దర్శకనిర్మాతలు. కథ, పాత్రలు నచ్చడంతో ఎన్ని సవాళ్లు ఎదురైనా నటించాల్సిందే అని సిద్ధమై, రంగంలోకి దిగిపోయా.

చిత్రీకరణలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి మరీ?

ఇంకో రెండేళ్లవరకూ మారేడుమిల్లి అడవులవైపు అయితే వెళ్లను (నవ్వుతూ). దట్టమైన ఆ అడవిలో రాత్రిళ్లలో పాములు, తేళ్లు కనిపించేవి. వాటి మధ్య రాత్రిపూట కాగడాలు పట్టుకుని ఆ వెలుతురులోనే నటించాల్సి వచ్చింది. మేమే కాదు, చిన్న పిల్లలు, పెద్దవాళ్లూ సెట్‌లో ఉండేవారు. సెట్‌లో చాలా జాగ్రత్తలు తీసుకుంటూ నటించాల్సి వచ్చేది. వీలైనంత వరకూ ఏ ఇబ్బంది రాకుండా చూసుకున్నారు నిర్మాతలు.

చిత్ర పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధం కావల్సి వచ్చిందా?

'విజిల్' తర్వాత నేను ఓ పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమైందంటే ఈ సినిమాకే. చిత్ర పాత్రలో ఫిట్‌గా కనిపించాలన్నారు దర్శకుడు. అందుకోసం కిక్‌బాక్సింగ్ నేర్చుకున్నా. పాత్రకీ, కిక్‌బాక్సింగ్‌కీ సంబంధం ఏమీ ఉండదు. కేవలం ఫిట్‌గా కనిపించేందుకే! చిత్ర లుక్ కోసమైతే ప్రత్యేకంగా ఏమీ చేయలేదు.

నితిన్‌తో ప్రయాణం గురించి ఏం చెబుతారు?

మారేడుమిల్లి అడవుల్లో సెల్‌ఫోన్‌కి సిగ్నళ్లు అందవు. ఒకరినొకరు కలిసి ముచ్చట్లు చెప్పుకోవల్సిందే. నేను జోక్స్ చెప్పి విసిగించేదాన్ని. తెరపైన నితిన్ ఎలా కనిపిస్తుంటారో, నిజ జీవితంలోనూ అలాగే ఉంటారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరినీ గౌరవిస్తారు ఆయన. లయ కూడా అంతే.

ఒకవైపు హీరోయిన్‌గా.. మరోవైపు కీలక పాత్రల్లోనూ నటిస్తుంటారు. కెరీర్ విషయంలో మీ ప్రణాళికలేమిటి?

వర్ష ఏ పాత్రలో కనిపించిందనేది ముఖ్యం కాదు, ఎంత బాగా నటించిందనేదే ముఖ్యం. వర్ష మంచి నటి, ఏ పాత్ర అయినా చేయగలదనే పేరు వస్తే చాలు నాకు. అందుకే హీరోయిన్ పాత్రా లేక, కీలక పాత్రా అని కాకుండా... నా దగ్గరకు వచ్చిన పాత్ర ఎంత నాణ్యంగా ఉందనేదే చూస్తా. ఆ విషయంలో నిత్యామేనన్ నాకు స్ఫూర్తి.


వర్ష బొల్లమ్మ

మనందరిలో కనిపించే పాత్రే ఇది


సతీశ్


గౌతమ్ కృష్ణ హీరోగా నవీన్ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'సోలో బాయ్'. సెవెన్ హిల్స్ సతీశ్ నిర్మించారు. రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి నాయికలు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సతీశ్ మాట్లాడుతూ.. "సొంత కష్టంతో తన కాళ్లపైన తాను నిల్చోవాలి అనుకునే ఓ మధ్యతరగతి కుర్రాడి కథతో రూపొందిన చిత్రమిది. మనందరిలో కనిపించే పాత్రే సోలో బాయ్. త్వరలో మా బ్యానర్‌లో నార్నె నితిన్‌తో ఒక సినిమా చేయనున్నాం" అన్నారు.

పైరసీ నిర్మూలనకు ప్రత్యేక కమిటీ


దిల్‌రాజు, ప్రియాంక

చిత్ర పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టి.ఎఫ్.డి.సి) ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెలిపారు. టీఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా, చలన చిత్ర వాణిజ్య మండలికి చెందిన సైబర్ సెల్, పోలీసు శాఖ ప్రతినిధులతో ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. గురువారం టీఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంకతో కలిసి హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ "సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, అవసరమైతే కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి పెడతాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే తెలంగాణ ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహించాం. ఆన్‌లైన్ అనుమతుల ప్రక్రియ, వీడియో పైరసీ నిర్మూలనపై త్వరలోనే ఏర్పాటు చేయనున్న కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది" అన్నారు. చిత్ర పరిశ్రమలోని సమస్యల్ని తమ దృష్టికి తీసుకొస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని టీఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్టైలిష్ దాహా వచ్చేశాడు


ఆమిర్ ఖాన్

'కూలీ'గా ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతున్నారు అగ్రకథానాయకుడు రజనీకాంత్. ఆయన ప్రధాన పాత్రలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రమిది. శ్రుతిహాసన్, నాగార్జున, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో మెరుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన పాత్రకు సంబంధించిన లుక్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్. ఇందులో ఆమిర్.. దాహా అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలిపింది. ఈ లుక్‌లో ఆయన స్టైలిష్‌గా కనిపిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నారు. బంగారం, స్మగ్లింగ్ అంశాలతో ముడిపడిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది.

మెల్‌బోర్న్ చిత్రోత్సవాలకి ముఖ్య అతిథిగా ఆమిర్


బాలీవుడ్ అగ్రనటుడు ఆమిర్ ఖాన్‌ను భారతీయ సినీపరిశ్రమలో అరుదైన గౌరవం వరించింది. ఆగస్టు 16న జరిగే 16వ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(ఐఎఫ్ఎఫ్ఎం)కి మన దేశం తరపున ఆమిర్‌ను ముఖ్య అతిథిగా మెల్‌బోర్న్ స్వాగతించింది. ఈ విషయాన్ని ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. "మెల్‌బోర్న్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ 16వ ఎడిషన్‌కు ఆమిర్ ఖాన్‌కు స్వాగతం. భాషలకు అతీతంగా సరిహద్దులు లేకుండా తన సినిమాలతో తరతరాలపై ప్రభావం చూపుతున్న గ్లోబల్ ఐకాన్ ఆమిర్‌ను స్వాగతించడం గర్వంగా ఉంది" అని పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆమిర్ 40ఏళ్ల సినీ ప్రయాణాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఆగస్టు 14నుంచి 24 వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది.

కుటుంబం కోసం కోర్టుకెక్కిన భార్య

సిరీస్: 'గుడ్‌వైఫ్'
నటీనటులు: ప్రియమణి, సంపత్ రాజ్
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: జియో హాట్‌స్టార్




కథాంశం: 16ఏళ్ల అనుబంధం ఆ భార్యాభర్తలది. ఇద్దరు పిల్లలతో సంతోషంగా సాగిపోతున్నాయి వారి జీవితాలు. కానీ ఓ సమస్య ఆ కుటుంబాన్ని తలకిందులు చేసింది. దీంతో అప్పటి వరకూ పిల్లలు, ఫ్యామిలీయే ప్రపంచంగా ఉన్న ఆ భార్య న్యాయవాది అవతారమెత్తింది. మరి ఇంతకీ ఆ కుటుంబానికి వచ్చిన సమస్య ఏంటని అనుకుంటున్నారా? అయితే 'గుడ్‌వైఫ్' సిరీస్ గురించి తెలుసుకోవాల్సిందే. కథానాయిక ప్రియమణి ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ ఇది. ఈ లీగల్ డ్రామాకు రేవతి దర్శకత్వం వహించారు. సంపత్ రాజ్ కీలక పాత్ర పోషించారు. అమెరికన్ సిరీస్ 'ది గుడ్‌వైఫ్' ఆధారంగా దీన్ని రూపొందించారు. ఇందులో తరుణిక పాత్రలో కనిపించనుంది ప్రియమణి. ఓ స్కామ్‌లో తన భర్తను అరెస్టు చేస్తారు పోలీసులు. అప్పటి వరకు గౌరవంగా బతుకుతున్న తన కుటుంబాన్ని ఎంతో మంది వేలెత్తి చూపిస్తుంటారు. దీంతో అరెస్టయిన తన భర్తను నిర్దోషి అని నిరూపించేందుకు లాయర్‌గా మారి కోర్టు మెట్లు ఎక్కుతుంది తరుణిక. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం.



రాజీవ్ హత్య కేసు కథతో!

సిరీస్: 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'
నటీనటులు: అమిత్ సియాల్, భగవతీ పెరుమాళ్
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: సోనీలివ్



ఏదైనా హత్య జరిగిందంటే నిజానిజాలు వెలుగులోకి తీసుకురావడానికి కేసుకి సంబంధించి అనేకమందిని విచారణ చేస్తుంటారు పోలీసులు. ఈ విచారణలో నేరానికి పాల్పడే ముందు నిందితుడు వేసిన ప్రణాళికలు, అమలు చేసిన విధానం లాంటి విస్తుపోయే నిజాలు వారిని ఆశ్చర్యానికి గురిచేస్తుంటాయి. కొంతమంది ప్రముఖుల హత్యలకు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణ చేసి, న్యాయస్థానానికి నివేదిక సమర్పిస్తుంది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కేసుని సిట్ చీఫ్ డీఆర్ కార్తికేయన్(అమిత్ సియాల్) తన బృందం కలిసి దర్యాప్తు చేస్తారు. వ్యూహాత్మకంగా ఈ హత్యకు కారణమైన వారిని తమ పర్యవేక్షణలోనే విచారిస్తారు. రాజీవ్ హత్య స్వదేశీ వ్యక్తుల కుట్రా? లేక అంతర్జాతీయంగా ఎవరైనా పథకం ప్రకారం చేసిన పన్నాగమా? లాంటి ఎన్నో విషయాలతో సాగే సిరీస్ ఇది. ఈ పొలిటికల్ థ్రిల్లర్ సిరీస్‌ని నగేశ్ కుకునూర్ రూపొందించారు. ఉత్కంఠభరితమైన ట్విస్ట్‌లతో దాగే ఈ హత్య వెనుక రహస్యాన్ని సిట్ బృందం ఎలా ఛేదించిందో ఈ సిరీస్ చూస్తే తెలుస్తుంది.

siri@eenadu.net



ఐటీఆర్ తొలిసారి దాఖలు చేస్తుంటే

గత ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగంలో చేరారా? మీకు వచ్చిన ఆదాయం ఆధారంగా పన్ను రిటర్నులు దాఖలు చేయాలని తెలుసా? ఇది చట్టబద్ధమైన బాధ్యత. ఉద్యోగం లేదా వృత్తి, వ్యాపారం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న వారు రిటర్నులు దాఖలు చేయడం వల్ల భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలుంటాయి. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్జించిన ఆదాయానికి సంబంధించి ప్రస్తుత మదింపు సంవత్సరం (2025-26)లో తొలిసారి ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే వారు ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

పన్ను రిటర్నులు అనగానే చాలామందిలో ఆందోళన సహజమే. ఎలా చేయాలి? ఎవరిని సంప్రదించాలి? ఏమైనా ఇబ్బందులు వస్తాయా? ఇలాగే ఆలోచిస్తుంటారు. ఒకప్పుడు ఇది చాలా కష్టమైన పనే. కానీ, సాంకేతికత మారుతూ వస్తోంది. ఎంతో సులభంగా, క్షణాల్లోనే ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు ఇప్పుడు వీలవుతోంది. కొంత అవగాహన పెంచుకుంటే చాలు. ఎవరికి వారు సొంతంగానే రిటర్నులు దాఖలు చేసేందుకు వీలుంది. దీనికోసం ఆదాయపు పన్ను విభాగమూ వీడియోలు, పీపీటీల రూపంలో సమాచారాన్ని అందిస్తోంది. మరోవైపు ఆదాయపు పన్ను రిటర్నులలో మీ ఆదాయం, ఇతర మినహాయింపులు ముందుగానే భర్తీ చేసి ఉంటాయి.

పాన్-ఆధార్ అనుసంధానం..

తొలిసారి రిటర్నులు దాఖలు చేసేవారు ముందుగా తనిఖీ చేసుకోవాల్సిన విషయం.. పాన్-ఆధార్ అనుసంధానం అయ్యాయా లేదా చూసుకోవాలి. ఆదాయపు పన్ను పోర్టల్‌లో దీన్ని చూసుకోవచ్చు. ఈ రెండింటినీ జత చేస్తేనే ఐటీఆర్ (ఆదాయపు పన్ను రిటర్నులు) సమర్పించేందుకు వీలవుతుంది.

మరో విషయం.. ఆధార్‌కు సంబంధించిన ఓటీపీ మీ మొబైల్ నంబరుకు వస్తుందా? తెలుసుకోండి. లేకపోతే, వెంటనే ఆధార్‌కు మొబైల్ నంబరును జత చేయించండి. ఈ రెండు పనులూ పూర్తి చేశాకే రిటర్నులు ప్రారంభించాలి.

నమోదు చేసుకోవాలి

కొత్తగా రిటర్నులు దాఖలు చేయాలనుకుంటున్న వారు ముందుగా ఆదాయపు పన్ను పోర్టల్‌లో పాన్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇ-మెయిల్, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, చిరునామాలాంటివన్నీ పేర్కొనాలి. అప్పుడే మీరు ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు వీలవుతుంది.

పత్రాలన్నీ సిద్ధంగా..

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు ప్రధానంగా కావాల్సింది ఫారం-16. మీ ఆదాయం గురించిన వివరాలన్నీ ఇందులోనే ఉంటాయి. ఒకవేళ మీరు పాత పన్ను విధానం ఎంచుకున్నారనుకోండి. వర్తించే మినహాయింపులూ ఇందులో పేర్కొంటారు. దీంతోపాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఫారం 26ఏఎస్, వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)ను తీసుకోండి. రిటర్నులను కచ్చితంగా దాఖలు చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.

- ✦ మీ వేతనం కాకుండా ఇతర ఆదాయాలు ఉంటే, వాటికి సంబంధించిన ఆధారాలనూ తీసుకోవాలి.
- ✦ గత ఆర్థిక సంవత్సరంలో రెండు చోట్ల ఉద్యోగం చేశారనుకోండి. రెండు సంస్థల నుంచీ ఫారం-16 తీసుకోవాలి. అప్పుడే పూర్తి ఆదాయాన్ని గణించడం సాధ్యమవుతుంది.

శ్లాబులను అర్థం చేసుకోండి..

మీకు వర్తించే పన్ను శ్లాబుల గురించి తెలుసుకోండి. కొత్త ఆదాయపు పన్ను విధానం ఎంచుకున్న వారికి గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7,75,000 (ప్రామాణిక తగ్గింపు రూ.75,000 కలిపి) పన్ను వర్తించదు. ఈ మొత్తం దాటింది అనుకోండి. అప్పుడు రూ.3,00,000 నుంచి పన్ను శ్లాబులు ప్రారంభమవుతాయి. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారు, ఎలాంటి మినహాయింపులూ చూపించాల్సిన అవసరం లేదు. పాత పన్ను విధానం ఎంచుకుంటే, వర్తించే మినహాయింపులు క్లెయిం చేసుకోవచ్చు. రెండింటిలో దేన్ని ఎంచుకోవాలి అనేది తెలుసుకోవడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు... మీ ఆదాయం రూ.7,75,000 లోపు ఉందనుకోండి. మరోమాట లేకుండా కొత్త పన్ను విధానమే ఎంచుకోవాలి. అంతకన్నా ఎక్కువగా ఉంటే, మీకు వర్తించే మినహాయింపులను బట్టి, ఏ విధానం మేలన్నది గణించాలి. ఇందుకోసం ఆదాయపు పన్ను పోర్టల్‌లో ఉన్న పన్ను కాలిక్యులేటర్‌ను వినియోగించుకోవచ్చు.

టీడీఎస్ ఉందా?

మీ యాజమాన్యం మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధించిందా చూసుకోండి. ఫారం16, ఫారం26ఏఎస్‌లను పోల్చి చూసుకోండి. టీడీఎస్ రెండింటిలోనూ ఒకే విధంగా ఉండాలి. ఒకవేళ తప్పులుంటే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లండి.

సరైన పత్రంలో..

ఆదాయ వనరులను బట్టి, సరైన రిటర్ను ఫారాన్ని ఎంచుకోవాలి. వేతనం, ఒక ఇంటి ద్వారా ఆదాయం, వడ్డీ తదితరాలు ఉన్నప్పుడు ఐటీఆర్-1 వర్తిస్తుంది. ఈ మధ్య కాలంలో చాలామంది షేర్లలోనూ, ఇతర పెట్టుబడి పథకాల్లోనూ మదుపు చేస్తుండటం సాధారణ విషయమే. ఇలా షేర్లలో స్వల్పకాలిక క్రయవిక్రయాలు చేసిన వారూ, ఎఫ్అండ్ఓ పెట్టుబడులు ఉన్నప్పుడు ఐటీఆర్-2 లేదా ఐటీఆర్-3 వర్తించే అవకాశం ఉంటుంది. సరైన ఫారం ఏది అని తెలుసుకునేందుకు నిపుణుల సలహా తీసుకోండి.

గడువుకు ముందే..

సాధారణంగా జులై 31లోపు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈసారి ఐటీఆర్ ఫారాల్లో కొన్ని మార్పుల నేపథ్యంలో సెప్టెంబరు 15 వరకూ గడువును ప్రభుత్వం పెంచింది. ఈలోపు రిటర్నులు దాఖలు చేయకపోతే జరిమానా చెల్లించాల్సి వస్తుంది.

ఎఫ్‌డీని మించి రాబడి

వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీ 5–6 శాతానికి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీల తరహాలో సురక్షితంగా ఉంటూ, అంతకు మించిన రాబడి అందించే పథకాలపై ఆసక్తి పెరుగుతోంది. ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తే మూడు ప్రభుత్వ పథకాలను ఎంచుకునే అవకాశం ఉంది.

1 **ఆర్‌బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్:** సురక్షితమైన పెట్టుబడి పథకాన్ని చూస్తున్న వారు దీన్ని ఎంచుకోవచ్చు. ప్రస్తుతం ఇందులో 8.05 శాతం వడ్డీ లభిస్తోంది. వచ్చిన వడ్డీకి పన్ను ఉంటుంది. ప్రతి ఆరు నెలలకోసారి వడ్డీని మీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ వెబ్‌సైట్ లేదా యాప్‌లోనూ ఖాతాను ప్రారంభించి, ఇందులో జమ చేయొచ్చు. రూ.1,000 నుంచి ఈ బాండ్లలో మదుపు చేయొచ్చు.

2 **నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ):** ప్రస్తుతం ఎన్ఎస్‌సీలో 7.7 శాతం వడ్డీ రేటు అందిస్తున్నారు. దీని వ్యవధి 5 ఏళ్లు. వడ్డీని ప్రతి సంవత్సరం అసలులో కలిపి, మెచ్యూరిటీ సమయంలో చెల్లిస్తారు. వచ్చిన వడ్డీ ఆదాయానికి నిబంధనల మేరకు పన్ను వర్తిస్తుంది. రూ.1,000 నుంచి ఇందులో జమ చేయొచ్చు. మీ దగ్గర్లో ఉన్న ఏ పోస్టాఫీసులోనైనా దీన్ని తీసుకోవచ్చు.

3 **పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం:** పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కం స్కీం మంచి ఆదరణ ఉన్న పథకం. ఇందులో 7.4 శాతం వడ్డీ అందుతోంది. ఒకేసారి కొంత మొత్తాన్ని జమ చేసి, నెలనెలా వడ్డీ తీసుకోవాలనుకున్నప్పుడు ఇది అనుకూలం. దీన్ని స్థిరమైన ఆదాయ వనరుగా చెప్పొచ్చు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన వారికి ఇది ఎంతో అనుకూలం. విద్యార్థుల నెలవారీ ఖర్చుల కోసమూ ఈ పథకం మంచి ఎంపికే. వ్యక్తిగతంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.9లక్షల వరకూ జమ చేయొచ్చు. ఉమ్మడిగా ఖాతా తీసుకుంటే.. రూ.15 లక్షల వరకూ ఇందులో జమ చేయొచ్చు.

ముందుగా చెల్లిస్తే రుసుములు ఉండవు



చలన వడ్డీ విధానం (ఫ్లోటింగ్ రేట్)లో రుణాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. వచ్చే జనవరి 1, 2026 నుంచి తీసుకున్న లేదా పునరుద్ధరించిన అన్ని చలన వడ్డీ రుణాలను ముందస్తుగా చెల్లించినా ఎలాంటి రుసుములూ విధించకూడదని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు స్పష్టం చేసింది. వ్యక్తులు తమ వ్యాపార అవసరాలు, వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈలు తీసుకున్న రుణాలన్నింటికీ ఇది వర్తించనుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం వ్యాపారేతర ప్రయోజనాల కోసం వ్యక్తులకు ఇచ్చిన చలన వడ్డీ రేటు రుణాలను గడువుకు ముందే చెల్లించినా ఎలాంటి రుసుములూ లేవు. దీన్ని మరింత విస్తృతం చేసింది. రుణం తీర్చేందుకు నిధులు ఎక్కడి నుంచి సేకరించారనే అంశంతోనూ సంబంధం లేదని ఆర్‌బీఐ తెలిపింది. లాకిన్ వ్యవధి ఉండదు. పాక్షికంగానూ, పూర్తిగానూ రుణాన్ని తీర్చేయొచ్చు. ఈ రుసుముల వర్తింపు లేదా వర్తించని విషయాన్ని రుణ మంజూరు పత్రంలోనే స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో గృహ, వ్యక్తిగత రుణ గ్రహీతలతోపాటు, ఎంఎస్ఎంఈలకూ ప్రయోజనం చేకూర్చనుంది.

సేవా రంగంలో

సేవల రంగానికి చెందిన కంపెనీల్లో పెట్టుబడి పెట్టి, లాభాలు ఆర్జించే లక్ష్యంతో ఒక పథకాన్ని యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ రూపొందించింది. **యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చునిటీస్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 18 వరకూ ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. మన ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా 55శాతం. ఉద్యోగాల కల్పనలో 41 శాతం వాటా ఈ రంగానిదే. బ్యాంకింగ్, బీమా, సరకు రవాణా, ఆరోగ్య సేవలు, వినోదం ఇందులో కీలకం. ఇ-కామర్స్, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్.. తదితర నూతన రంగాలపైనా ఈ పథకం దృష్టి సారిస్తుంది. నాణ్యమైన, మూలధనాన్ని సమర్థంగా వినియోగించే వ్యాపారాలు, అందులోని కంపెనీలను గుర్తించి పోర్ట్‌ఫోలియో తయారు చేస్తుంది. దీర్ఘకాలిక దృష్టితో మదుపు చేసేవారికి అనుకూలం.

బహుళ జాతి సంస్థల్లో

నిపాన్ మ్యూచువల్ ఫండ్ ఒక ఎంఎన్‌సీ ఫండ్‌ను తీసుకొచ్చింది. **నిపాన్ ఇండియా ఎంఎన్‌సీ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 16న ముగుస్తుంది. కనీస పెట్టుబడి రూ.500. ఈ పథకం మనదేశంలో కార్యకలాపాలు సాగిస్తున్న బహుళ జాతి కంపెనీలపై పెట్టుబడి పెడుతుంది. హిందుస్థాన్ యునిలీవర్, కోల్గేట్-పామోలివ్, అబాట్ ఇండియా, బాష్, నెస్లే, సీమెన్స్, ఏబీబీ... వంటి కంపెనీలు ఈ కోవలోకి వస్తాయి. ఇదే కాకుండా వివిధ దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న మనదేశానికి చెందిన కంపెనీలనూ ఈ పథకం పరిగణనలోకి తీసుకుంటుంది. ఎంఎన్‌సీ కంపెనీలు స్థిరమైన వృద్ధి సాధిస్తూ ఉంటాయి. డివిడెండ్ చెల్లింపులూ అధికమే. అందువల్ల ఈ పథకం స్థిరమైన ఆదాయాలు ఇచ్చే అవకాశం ఉంది. అదే సమయంలో అత్యంత ఆకర్షణీయమైన లాభాలు వస్తాయనే హామీ లేదు.

దీర్ఘకాలిక దృష్టితో

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్, ఒక మల్టీక్యాప్ తరగతికి చెందిన పథకాన్ని తీసుకొచ్చింది. **ట్రస్ట్ మల్టీ క్యాప్ ఫండ్** అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 14. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. ఈ పథకం లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన కంపెనీలపై పెట్టుబడి పెడుతుంది. మంచి పనితీరు కనబరుస్తున్న 40 నుంచి 60 కంపెనీలను ఎంపిక చేసి పెట్టుబడి పెట్టాలనేది ఈ పథకం వ్యూహం. దీర్ఘకాలిక సంపద సృష్టి ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతుంది.

వాహనం

వరదల్లో మునిగితే


వానాకాలం ప్రారంభమయ్యింది. ఇప్పటికే కొన్నిచోట్ల వరదలు వస్తున్న వార్తలు వింటున్నాం. ఈ నేపథ్యంలో కారు వరదలో చిక్కుకున్నప్పుడు ఏం చేయాలి? వాహనం పాడైనప్పుడు బీమా పాలసీని ఎలా క్లెయిం చేసుకోవాలనే విషయాల్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

గతేడాది తెలుగు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఎంతో మంది తమ విలువైన ఆస్తులను కోల్పోయారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రావొద్దు అని కోరుకుందాం. అయినప్పటికీ మన జాగ్రత్తలో మనం ఉండటం ఎంతైనా శ్రేయస్కరం. కారు వరదల్లో చిక్కుకుపోయినప్పుడు లేదా కారులోకి నీరు చేరినప్పుడు ఇంజిన్ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించకూడదు. దీనివల్ల కారుకు మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. దీనికి బీమా సంస్థ పరిహారం ఇవ్వకపోవచ్చు. కాబట్టి, నీటిలో చిక్కుకుపోయిన కారును అన్ని రకాలుగా ఫొటోలు తీయండి.

కారులోకి నీరు చేరినప్పుడు వెంటనే ఆ విషయాన్ని బీమా సంస్థకు తెలియజేయండి. ఇప్పుడు బీమా సంస్థలు వాట్సాప్‌లోనే సమాచారాన్ని స్వీకరిస్తున్నాయి. అవసరమైన ఫొటోలు, ఇతర ఆధారాలు పంపిస్తే చాలు. బీమా సంస్థ సేవా కేంద్రాన్ని ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా సంప్రదించండి. ఏం జరిగిందన్నది పూర్తిగా తెలియజేయండి. కొన్ని సంస్థలు ఆన్‌లైన్, యాప్‌లలోనూ క్లెయిం దాఖలు చేసే అవకాశాన్ని ఇస్తున్నాయి. మార్గం ఏదైనా సరే.. వీలైనంత తొందరగా బీమా సంస్థకు సమాచారం చేరడమే ముఖ్యం. మీరు క్లెయిం దాఖలు చేసినప్పటి నుంచీ ప్రతి అంశాన్నీ జాగ్రత్తగా నమోదు చేసుకోండి. మీరు ఎవరిని సంప్రదించారు, వారి వివరాలేమిటన్నదీ తెలుసుకోండి.

బీమా కంపెనీకి సమాచారం అందిన తర్వాత నష్టాన్ని అంచనా వేసేందుకు సర్వేయర్‌ను నియమించి, జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేసుకుంటుంది. ఆ తర్వాతే పరిహారం అందిస్తుంది. ఇప్పుడు కొన్ని బీమా సంస్థలు సర్వేయర్లకు బదులుగా తాము ఒప్పందం కుదుర్చుకున్న మరమ్మతు కేంద్రాలకు కారును తీసుకెళ్తే చాలు అని చెబుతున్నాయి.

వాహనం కొట్టుకుపోయి, ఆచూకీ గల్లంతైన సందర్భంలో తప్పనిసరిగా పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయించాల్సి ఉంటుంది. దీన్ని బీమా సంస్థకు సమర్పించాలి.



అనుబంధ పాలసీలతో..

ఇంజిన్ ప్రొటెక్షన్ కవర్: నీటిలో మునిగినప్పుడు ఇంజిన్‌కు జరిగిన నష్టానికి ఈ అనుబంధ పాలసీ పరిహారాన్ని అందిస్తుంది.

రిటర్న్ టు ఇన్వాయిస్: వాహనం పూర్తిగా చేతికి రాదు అనుకున్నప్పుడు, కొత్త వాహనం తీసుకునేందుకు వీలుగా రిటర్న్ టు ఇన్వాయిస్ ఉపయోగపడుతుంది.

రోడ్ సైడ్ అసిస్టెన్స్: వాహనం రోడ్డు మధ్యలో ఆగిపోయినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు ఇది సహాయం చేస్తుంది.

విద్యుత్ వాహనం ఉన్నప్పుడు బీమా అవసరాలు కొన్ని ప్రత్యేకంగా ఉంటాయి. వాహనం కొనుగోలు చేసేటప్పుడే వీటి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ముఖ్యంగా వరదల్లో వాహనం మునిగితే.. కీలకమైన బ్యాటరీ, ఇతర సెన్సర్లు పాడయ్యే అవకాశాలు ఎక్కువ. వీటికి రక్షణ కల్పించేలా వాహన బీమా ఉండాలి.



ఉద్యోగానికీ కావాలి క్రెడిట్ స్కోరు

ఆర్థిక రంగంలోని సంస్థల్లో ఉద్యోగం చేయాలనుకుంటున్నారా? విద్యార్హతలు, నైపుణ్యాలు ఉంటేనే సరిపోదు. ఆర్థిక క్రమశిక్షణా అత్యంత ముఖ్యం. ఇటీవలి సంఘటనే ఇందుకు ఉదాహరణ.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేలవమైన క్రెడిట్ స్కోరు కారణంగా ఒక సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీఓ) నియామకాన్ని రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. ఆర్థిక సేవల రంగంలో ఉద్యోగులకు ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొంది. ఈ తీర్పు నేపథ్యంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి క్రెడిట్ స్కోరు ఎంత ముఖ్యమో తెలుస్తోంది.

క్రెడిట్ స్కోరు మీ ఆర్థిక బాధ్యతను సూచించే మూడు అంకెల సంఖ్య. ఇది 300-900 వరకూ ఉంటుంది. మీ రుణ చెల్లింపుల చరిత్ర, రుణ వినియోగం, క్రెడిట్ చరిత్ర ఆధారంగా ఈ స్కోరును క్రెడిట్ బ్యూరోలు నిర్ణయిస్తాయి. 750కి మించి స్కోరున్నప్పుడే ఆ వ్యక్తికి ఆర్థిక క్రమశిక్షణ ఉన్నట్లు భావిస్తారు.

ఆర్థిక సంస్థల్లో ప్రజల డబ్బును నిర్వహించే వారికి ఆర్థిక విషయాల్లో మంచి పరిజ్ఞానం ఉండాలి. స్వీయ క్రమశిక్షణా అవసరం. కాబట్టి, ఈ రంగంలోని బ్యాంకులు, బీమా తదితర సంస్థల్లో చేరాలంటే తక్కువ క్రెడిట్ స్కోరు లేకుండా చూసుకోవాలి. లేకపోతే మీ భవిష్యత్తుకు ఇది అడ్డంకిగా మారుతుంది.

ఏం చేయాలి?

- ◆ ఉద్యోగ దరఖాస్తు చేసేందుకు కనీసం 6 నెలల ముందు నుంచి మీ క్రెడిట్ స్కోరును క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలి. తక్కువగా ఉంటే, దాన్ని పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలి. క్రెడిట్ వినియోగ నిష్పత్తి తగ్గించుకోవడం, ఏదైనా చెల్లింపులు ఉంటే తీర్చేయడంలాంటివి చేయాలి.
- ◆ క్రెడిట్ చరిత్ర లేని వారు హామీతో కూడిన రుణాలు తీసుకొని, వాటిని సకాలంలో తీర్చేయాలి. దీనివల్ల క్రెడిట్ స్కోరును నిర్మించుకోవచ్చు.
- ◆ రుణ వాయిదాలు, క్రెడిట్ కార్డు బిల్లును సకాలంలో చెల్లించండి. ఒక్క నెల వాయిదా, కార్డు బిల్లు చెల్లించకపోయినా, స్కోరుపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- ◆ మీ క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వాడొద్దు. అనవసర రుణాల కోసం దరఖాస్తు చేయొద్దు. వీలైతే అధిక వడ్డీ రుణాలను తీర్చేయడం మంచిది.

పదేళ్లు సిప్ చేస్తే..

మా అమ్మాయి వయసు 4 ఏళ్లు. తన అవసరాల కోసం వీలైనప్పుడల్లా కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలని ఆలోచన. మరో 15 ఏళ్ల తర్వాత ఈ డబ్బు అవసరం. రెండుమూడు మంచి షేర్లను ఎంచుకొని, డబ్బు ఉన్నప్పుడల్లా కొంటే మంచిదని అంటున్నారు. నిజమేనా? ఏం చేయాలి? -వినయ్

స్టాక్ మార్కెట్ ఆధారిత పెట్టుబడులు పెట్టాలనుకున్న మీ ఆలోచన మంచిదే. మీ పెట్టుబడి ఎప్పుడూ ద్రవ్యోల్బణాన్ని మించి రాబడి ఇచ్చేలా చూసుకోవాలి. నేరుగా షేర్లలో మదుపు చేయాలని అనుకుంటే, మంచి షేర్లను ఎంచుకునే నైపుణ్యం ఉండాలి. దీంతోపాటు, క్రమం తప్పకుండా సమీక్షించుకునే సమయం ఉండాలి. ఇది కొత్త మదుపరులకు సాధ్యం కాకపోవచ్చు. ప్రత్యామ్నాయంగా, మీరు మదుపు చేయాలనుకుంటున్న మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయండి. వీలైనప్పుడు అని అనుకోకుండా.. క్రమం తప్పకుండా నెలకు నిర్ణీత మొత్తాన్ని మదుపు చేసేందుకు ప్రయత్నించండి. మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ తీసుకునేందుకు ప్రయత్నించండి.

నా వయసు 36. ఇప్పటి వరకూ ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోలేదు. కుటుంబంలో అందరికీ కలిపి రూ.5లక్షల పాలసీ తీసుకోవడం మంచిదా? ముగ్గురికీ విడివిడిగా రూ.5లక్షల పాలసీ తీసుకోవాలా? - రాము

మీ ముగ్గురికీ విడివిడిగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటే.. ప్రీమియం చాలా అధికంగా ఉంటుంది. కాబట్టి, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీని తీసుకోవడమే మేలు. ఇప్పుడు చాలా బీమా కంపెనీలు ఫ్యామిలీ ఫ్లోటర్ తీసుకున్నప్పటికీ, వ్యక్తిగతంగా కవరేజీ ఇచ్చే పాలసీలూ ఇస్తున్నాయి. మంచి క్లెయిం చెల్లింపుల చరిత్ర ఉన్న సంస్థ నుంచి పాలసీని ఎంచుకోండి.

నెలకు రూ.25వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. కనీసం 10 ఏళ్లపాటు మదుపు చేస్తే ఎంత మొత్తం వస్తుంది? ఎలాంటి పథకాలు ఎంచుకోవాలి? - ప్రసాద్

పదేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, ఈక్విటీ ఆధారిత పెట్టుబడులే మీకు మంచి రాబడి వచ్చేందుకు తోడ్పడతాయి. డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి. నెలకు రూ.25వేల చొప్పున, పదేళ్లపాటు మదుపు చేస్తే సగటు వార్షిక రాబడి 12 శాతం అంచనాతో.. రూ.52,64,640 అయ్యేందుకు వీలుంది.

మా అబ్బాయి వయసు 13. తన పేరుమీద మనీ బ్యాక్ పాలసీలాంటివి తీసుకోవచ్చా? ఏడాదికి రూ.1లక్ష వరకూ ప్రీమియం చెల్లించగలను. ఏం చేయాలి? - సుధాకర్

బీమా పాలసీలు ఎప్పుడూ కుటుంబ పెద్ద పేరుపైనే తీసుకోవాలి. పిల్లల పేరుమీద తీసుకోవడం అంత మంచిది కాదు. ముందుగా మీకు తగినంత బీమా పాలసీ ఉందా లేదా చూసుకోండి. లేకపోతే ముందుగా అవసరమైన మేరకు టర్మ్ పాలసీని తీసుకోండి. మనీ బ్యాక్ పాలసీపై 4-5 శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. ఇది ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేటుతో పోల్చినా తక్కువే. మీరు నెలకు రూ.8,500లను క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)ద్వారా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేసేందుకు ప్రయత్నించండి. కనీసం 10 ఏళ్లపాటు మదుపు చేసేలా చూసుకోండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.net కు మెయిల్ చేయండి)

చిన్న మొత్తంతోనూ బంగారం

ఏడాది కాలంగా బంగారం మంచి లాభాలను ఇస్తున్న సంగతిని చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో బీమా సంస్థలూ తమ యూనిట్ ఆధారిత బీమా పాలసీల (యులిప్) పెట్టుబడికి బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (గోల్డ్ ఈటీఎఫ్) ఎంచుకునేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా నియంత్రణ సంస్థను కోరాయి. ఈ నేపథ్యంలో ఇవి ఇప్పుడు చర్చల్లోకి వచ్చాయి.



ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి, స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులు.. ఇలాంటి పరిణామాలు ఎన్ని వచ్చినా, నిలదొక్కుకునే సామర్థ్యం బంగారం సొంతం. లాభాల పరంగా ఈక్విటీలతో పోలిస్తే కాస్త అటూ ఇటూగా ఉన్నా, ఇటీవలి కాలంలో మార్కెట్‌కన్నా అధిక రాబడినే అందించింది. మరోవైపు 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు పైగానే ఉంది. ఇలాంటప్పుడు చిన్న మొత్తంతో బంగారంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అవకాశం గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఫండ్లు.

బంగారానికి ఏడాదంతా గిరాకీ ఉంటుంది. ఈక్విటీ మార్కెట్లు, బంగారానికీ విలోమ సంబంధం ఉందని అనేవారు. కానీ, ఇప్పుడు ఇవి రెండూ పెరుగుతూనే ఉన్నాయి. కాకపోతే, అనిశ్చితి అధికంగా ఉన్నప్పుడు బంగారాన్ని ఆకర్షణీయమైన పెట్టుబడి పథకంగా చూడొచ్చు. పోర్ట్‌ఫోలియో కోణంలో చూసినా మొత్తం పెట్టుబడిలో కనీసం 10-15 శాతం పసిడికి కేటాయించాలి. ఒకేసారి పెద్ద మొత్తంలో మదుపు చేయాల్సిన అవసరం లేకుండా గోల్డ్ ఈటీఎఫ్‌లను ఉపయోగించుకోవాలి.

గోల్డ్ ఈటీఎఫ్‌లు ఒక రకంగా నిష్క్రియా పెట్టుబడి సాధనాలు. భౌతిక బంగారం ధర ఆధారంగా ఇవి పని చేస్తాయి. పెట్టుబడిదారులు గోల్డ్ ఈటీఎఫ్‌లను కొనుగోలు చేస్తున్నప్పుడు డీమ్యాట్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో మదుపు చేయాల్సి ఉంటుంది. వీటిలో పెట్టుబడి పెడుతున్నామంటే.. 99 శాతం అంతకంటే ఎక్కువ స్వచ్ఛతతో ఉన్న భౌతిక బంగారాన్ని కొంటున్నట్లే లెక్క. కేవలం బంగారం మన కంటికి కనిపించదు. యూనిట్ల రూపంలో మన డీమ్యాట్ ఖాతాలో అంకెల రూపంలో ఉంటుంది. ఈ యూనిట్లను ఎక్స్ఛేంజీలలో ఎప్పుడు కావాలంటే అప్పుడు కొనొచ్చు. లేదా విక్రయించేందుకు వీలుంటుంది. ధరల విషయంలో పూర్తి పారదర్శకత ఉంటుంది. ఖర్చులూ తక్కువే. ఒకవేళ డీమ్యాట్ ఖాతా లేకపోతే.. ఫండ్ ఆఫ్ ఫండ్ మార్గంలో మదుపు చేయొచ్చు.

ఈ ఫండ్లలో మదుపు చేసినప్పుడు బంగారం స్వచ్ఛత, దాని నిల్వ, భద్రత తదితరాల గురించి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. బంగారాన్ని కొనేందుకు వేచి చూడాల్సిన అవసరమూ లేదు. మీ దగ్గర ఉన్న డబ్బును బట్టి, కావాల్సినన్ని యూనిట్లు కొనుగోలు చేయొచ్చు. కొన్ని గోల్డ్ ఈటీఎఫ్‌ల ఒక యూనిట్ ధర రూ.100 లోపే ఉన్నాయి. డీమ్యాట్ ఖాతా ఉంటే, ఒక యూనిట్‌ను కొనేందుకూ అవకాశం ఉంది. కాబట్టి, తక్కువ ఖర్చు, పెట్టుబడితో బంగారంలో మదుపు చేసేందుకు పారదర్శకమైన, సౌకర్యవంతమైన మార్గంగా గోల్డ్ ఈటీఎఫ్‌లను చెప్పొచ్చు.

సాధారణంగా పెట్టుబడులు ఎప్పుడూ వైవిధ్యంగా ఉండాలి. అదే సమయంలో దీర్ఘకాలంలో నష్టభయాన్ని పరిమితం చేస్తూ, మంచి రాబడిని అందించాలి. మార్కెట్లో అనిశ్చితి అధికంగా ఉన్నప్పుడు బంగారంలో పెట్టుబడిని పెంచుకోవచ్చు.



కరెంట్ అఫైర్స్

■ భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఏ రోజున ప్రమాణ స్వీకారం చేశారు? (జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక పదవి చేపట్టిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన రెండో వ్యక్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ వార్తల్లో నిలిచారు.) **జ:** 2025, మే 14



మాదిరి ప్రశ్నలు

■ ఐక్యరాజ్యసమితి ఇటీవల విడుదల చేసిన ప్రపంచ సామాజిక నివేదిక-2025 ప్రకారం ప్రపంచంలో ఎంత శాతం మంది ఆర్థిక అభద్రతను ఎదుర్కొంటున్నారు? (69 కోట్లకు పైగా ప్రజలు ఇప్పటికీ తీవ్ర పేదరికంలో జీవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది.) **జ:** 60 శాతం

■ రెండో ఆసియా యోగాసన స్పోర్ట్ ఛాంపియన్‌షిప్‌ను ఇటీవల ఎక్కడ నిర్వహించారు? **జ:** న్యూదిల్లీ

■ స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) నివేదిక ప్రకారం 2024లో ప్రపంచ సైనిక వ్యయం ఎంత మొత్తానికి చేరుకుంది? (ప్రపంచంలో అతిపెద్ద సైనిక వ్యయాలు చేసే దేశాల జాబితాలో అమెరికా, చైనా, రష్యా, జర్మనీ, భారత్‌లు వరుసగా తొలి ఐదు స్థానాల్లో నిలిచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది.) **జ:** 2,718 బిలియన్ డాలర్లు

మరింత సమాచారం

పరస్పరం పంచుకుంటే ముడిపడే బంధం!

జనరల్ స్టడీస్ – రసాయన శాస్త్రం

సృష్టిలోని ప్రతి పదార్థం పరమాణువుల నిర్మితమే. పరమాణువులో ప్రోటాన్లు, న్యూట్రాన్లతో కూడిన కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్‌లు తిరుగుతుంటాయి. ఒకే మూలకం లేదా వేర్వేరు మూలకాలకు చెందిన రెండు పరమాణువులు కలిస్తే వాటి మధ్య ఉండే ఆకర్షణ, వికర్షణ బలాలతో అవి ఎలక్ట్రాన్‌లను పంచుకుంటాయి. ఆ విధంగా జరిగే రసాయన బంధమే సంయోజనీయ బంధం. చుట్టూ ఉన్న అనేక పదార్థాల నిర్మాణం, లక్షణాలను అర్థం చేసుకోవడానికి ఈ బంధం ఉపయోగపడుతుంది. నీరు, ఆక్సిజన్ లాంటి సాధారణ పదార్థాలే కాకుండా ప్రొటీన్లు, డీఎన్ఏ వరకు ఎన్నోరకాల సమ్మేళనాల్లో ఈ బంధం ఉంటుంది. జీవశాస్త్రంలో అణువుల నిర్మాణానికి కారకాలను గుర్తించడం నుంచి పరిశ్రమల్లో రసాయనాలు, ప్లాస్టిక్, ఇతర పదార్థాల ఉత్పత్తికి కావాల్సిన సమ్మేళనాల తయారీ వరకూ అన్నింటిలో కీలకమైన ఈ ప్రాథమిక పరిజ్ఞానం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉండాలి. సంయోజనీయ బంధంలోని రకాలు, వివిధ అణువులు ఏర్పడే సమీకరణాలు, పదార్థ లక్షణాలను తెలుసుకోవాలి.



సంయోజనీయ బంధం

పరమాణువుల మధ్య ఎలక్ట్రాన్‌ల మార్పిడి జరగకుండానే వాటి బాహ్యకక్ష్యలో అష్టక విన్యాసం పొందుతాయని 1916 లో జి.ఎన్.లూయిస్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు. పరమాణువులు.. వాటి వేలన్సీ ఎలక్ట్రాన్‌లను ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పరమాణువులతో పంచుకోవడం వల్ల అష్టక విన్యాసాన్ని ప్రదర్శిస్తాయి.

* రెండు పరమాణువుల మధ్య పంచుకున్న ఎలక్ట్రాన్‌లు ఆ రెండు పరమాణువులకు చెందినవిగా ఉంటాయి. ఇవి రెండు పరమాణు కేంద్రకాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. రెండు పరమాణువులు ఒకదానికొకటి దగ్గరగా వచ్చినప్పుడు ఎలక్ట్రాన్‌లను పరస్పరం పంచుకోవడంవల్ల ఏర్పడే బంధమే 'సంయోజనీయ బంధం' అవుతుంది.

ఉదా:




1) ఫ్లోరిన్ అణువు ఏర్పడటం (F_2): రెండు ఫ్లోరిన్ పరమాణువులు కలిసి F_2 అనే స్థిర అణువును ఏర్పరుస్తాయి. ఇక్కడ బంధం ఏర్పడటానికి ఒక్కో ఫ్లోరిన్ ఒక ఎలక్ట్రాన్‌ను ఇస్తుంది. ఇలా ఏర్పడిన ఎలక్ట్రాన్ జంటను రెండు ఫ్లోరిన్ పరమాణువులు పరస్పరం పంచుకోవడంతో ప్రతి ఫ్లోరిన్ పరమాణువు బాహ్యకక్ష్యలో అష్టక విన్యాసం ఏర్పడుతుంది.


$$:\ddot{F}\cdot + \cdot\ddot{F}: \rightarrow :\ddot{F}:\ddot{F}: \text{ లేదా } :\ddot{F}-\ddot{F}:$$

2) ఆక్సిజన్ అణువు ఏర్పడటం (O_2): ఆక్సిజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 2, 6. దీని చివరి కక్ష్యలో 6 ఎలక్ట్రాన్‌లున్నాయి. అష్టక విన్యాసం పొందడానికి దీనికి మరో రెండు ఎలక్ట్రాన్‌లు అవసరం. ఇలాంటి రెండు ఆక్సిజన్ పరమాణువులు దగ్గరగా వచ్చినప్పుడు అవి పరస్పరం ఎలక్ట్రాన్ జంటలను పంచుకోవడం వల్ల వాటి మధ్య రెండు సంయోజనీయ బంధాలు ఏర్పడి O_2 అణువు ఏర్పడుతుంది. అందువల్ల ఆక్సిజన్ అణువులో పరమాణువుల మధ్య ద్విబంధం ఏర్పడుతుంది.

$$:\ddot{O}\cdot + \cdot\ddot{O}: \rightarrow \ddot{O}::\ddot{O} \text{ లేదా } \ddot{O}=\ddot{O}$$



3) నైట్రోజన్ అణువు ఏర్పడటం (N_2): నైట్రోజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 2, 5. దీని వేలన్సీ కక్ష్యల్లో అష్టక విన్యాసం పొందడానికి నైట్రోజన్‌కు మూడు ఎలక్ట్రాన్‌లు అవసరం. రెండు నైట్రోజన్ పరమాణువులు దగ్గరగా వచ్చి బంధంలో పాల్గొనేటప్పుడు అవి మూడు ఎలక్ట్రాన్ జంటలను పంచుకుంటాయి. అందుకే రెండు నైట్రోజన్ పరమాణువుల మధ్య త్రిబంధం ఏర్పడి నైట్రోజన్ అణువు ఏర్పడుతుంది.



$$:\dot{N}\cdot + \cdot\dot{N}: \rightarrow :N\vdots\vdots N: \text{ లేదా } :N\equiv N:$$

4) మీథేన్ అణువు ఏర్పడటం (CH_4): మీథేన్ అణువు ఏర్పడటానికి, బంధానికి కావాల్సిన కార్బన్ పరమాణువు 4 ఎలక్ట్రాన్‌లను ఇస్తుంది. అదేవిధంగా ఒక్కో హైడ్రోజన్ పరమాణువు ఒక ఎలక్ట్రాన్ చొప్పున ఇస్తాయి. అందుకే CH_4 అణువులో నాలుగు C - H సంయోజనీయ బంధాలు ఏర్పడతాయి.



$$\cdot\dot{\underset{\cdot}{C}}\cdot + \dot{H} + \dot{H} + \dot{H} + \dot{H} \rightarrow H:\overset{H}{\underset{H}{\ddot{\underset{..}{C}}}}:H \text{ లేదా } H-\overset{H}{\underset{H}{\overset{|}{\underset{|}{C}}}}-H$$

5) అమ్మోనియా అణువు ఏర్పడటం (NH_3): అమ్మోనియా అణువులో మూడు ఏక సంయోజనీయ బంధాలు ఉంటాయి. నైట్రోజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 2, 5. హైడ్రోజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 1. నైట్రోజన్ పరమాణువు తన వేలన్సీ కక్ష్యలో అష్టక విన్యాసం పొందడానికి దానికి 3 ఎలక్ట్రాన్‌లు అవసరం. ప్రతి హైడ్రోజన్ వేలన్సీ కక్ష్యలో ఒక ఎలక్ట్రాన్ ఉంటుంది. అందువల్ల నైట్రోజన్‌లోని మూడు ఎలక్ట్రాన్‌లు ఒక్కో హైడ్రోజన్‌లో ఉన్న ఎలక్ట్రాన్‌తో కలిపి మూడు జతల ఎలక్ట్రాన్‌లను పంచుకోవడం వల్ల మూడు N - H సంయోజనీయ బంధాలతో అమ్మోనియా అణువు ఏర్పడుతుంది.

$$\cdot\ddot{N}\cdot + \dot{H} + \dot{H} + \dot{H} \rightarrow H:\overset{H}{\ddot{N}}: \text{ లేదా } \underset{H\ \ H\ \ H}{\ddot{N}}$$

6) నీటిఅణువు ఏర్పడటం (H_2O): నీటి అణువులో రెండు O - H ఏక సంయోజనీయ బంధాలు ఉంటాయి. ఆక్సిజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 2, 6. హైడ్రోజన్ ఎలక్ట్రాన్ విన్యాసం 1. ఆక్సిజన్ పరమాణువు అష్టక విన్యాసం పొందాలంటే దానికి మరో రెండు ఎలక్ట్రాన్‌లు అవసరం. ఆక్సిజన్ పరమాణువు దాని చివరి కక్ష్యలో ఉన్న ఎలక్ట్రాన్‌లను రెండు హైడ్రోజన్ పరమాణువుల్లో ఉన్న ఒక్కో ఎలక్ట్రాన్‌ను పంచుకోవడం వల్ల H_2O అణువు ఏర్పడుతుంది.

$$:\ddot{O}\cdot + \dot{H} + \dot{H} \rightarrow :\ddot{\underset{H}{O}}:H \text{ లేదా } :\ddot{O}\underset{H\ \ H}{}$$

ఈ ఉదాహరణలను పరిశీలిస్తే సంయోజనీయ బంధం ఏర్పడి పరమాణువుల నుంచి అణువులు ఏర్పడేటప్పుడు రెండు పరమాణువుల మధ్య ఒక జత ఎలక్ట్రాన్‌లు లేదా రెండు జతలు లేదా మూడు జతల ఎలక్ట్రాన్‌లను పంచుకోవడం గమనించవచ్చు.

రెండు పరమాణువుల మధ్య పంచుకునే ప్రతి ఎలక్ట్రాన్ జంట ఒక సంయోజనీయ బంధాన్ని సూచిస్తుంది. సంయోగం చెందే పరమాణువుల మధ్య రెండు ఎలక్ట్రాన్ జంటలు పంచుకుంటే ఆ బంధాన్ని ద్విబంధం అంటారు. అదేవిధంగా సంయోగం చెందే రెండు పరమాణువుల మధ్య మూడు ఎలక్ట్రాన్ జంటలు పంచుకుంటే ఆ బంధాన్ని 'త్రిబంధం' అంటారు. ఒక మూలక పరమాణువు ఎన్ని సంయోజనీయ బంధాలను ఏర్పరచగలదో తెలిపే సంఖ్యనే ఆ మూలకం 'సంయోజనీయత' అంటారు.

* సంయోజనీయ బంధంతో కలిపిన రెండు పరమాణువుల కేంద్రకాల మధ్య సమతాస్థితి వద్ద ఉన్న దూరాన్ని 'బంధ దూరం' లేదా 'బంధ దైర్ఘ్యం' అంటారు. దీన్ని సాధారణంగా నానో మీటర్ల(NM)లో లేదా ఆంగ్‌స్ట్రామ్ (A°)ల్లో తెలియజేస్తారు.

* 1 ఆంగ్‌స్ట్రామ్ = 10^{-10} మీ., ఆంగ్‌స్ట్రామ్ అనేది పొడవుకు ప్రమాణం. దీని విలువ 0.1 నానోమీటర్లు లేదా 100 పికో మీటర్లకు సమానం.

* 1 నానో మీటర్ = 10^{-9} మీ.

సంయోజనీయ పదార్థాల లక్షణాలు

1) ఇవి ద్రవ, వాయు స్థితుల్లో ఉంటాయి. 2) వీటికి అతి తక్కువ ద్రవీభవన, బాష్పీభవన స్థానాలు ఉంటాయి. 3) ఉష్ణ బంధకాలు, విద్యుత్తు బంధకాలుగా ఉంటాయి. 4) నీరు లాంటి ధ్రువ ద్రావణాల్లో కరగవు. అధ్రువ ద్రావణాల్లో కరుగుతాయి. 5) వీటిలో రసాయనిక చర్యలు గది ఉష్ణోగ్రత వద్ద నెమ్మదిగా లేదా అతి నెమ్మదిగా జరుగుతాయి. 6) ఇవి రసాయన చర్యలో పాల్గొన్నప్పుడు పదార్థాల మధ్య బంధం ఏర్పడటం లేదా బంధ విచ్ఛిత్తి జరిగి కొత్త పదార్థాలు ఏర్పడతాయి.



రచయిత: చంటి రాజుపాలెం

మాదిరి ప్రశ్నలు

1. సంయోజనీయ బంధాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
   1) కోసిల్ 2) గెలెస్పి 3) జి.ఎన్. లూయిస్ 4) లైనస్ పౌలింగ్
2. సంయోజనీయ బంధంలో పాల్గొన్న ఫ్లోరిన్ అణువులో ఏర్పడే బంధం?
   1) ద్విబంధం 2) ఏకబంధం 3) త్రిబంధం 4) ఏదీకాదు
3. కింది వాటిలో ద్విబంధాన్ని ఏర్పరిచే అణువును గుర్తించండి.
   1) ఆక్సిజన్ అణువు 2) నైట్రోజన్ అణువు 3) మీథేన్ అణువు 4) నీటి అణువు
4. కింది వాటిలో ఏ అణువులో రెండు O - H ఏక సంయోజనీయ బంధాలు ఏర్పడతాయో గుర్తించండి.
   1) N_2 2) CH_4 3) H_2O 4) H_2
5. అమ్మోనియా అణువులో ఎన్ని ఏక సంయోజనీయ బంధాలు ఏర్పడతాయి?
   1) ఒకటి 2) మూడు 3) రెండు 4) నాలుగు
6. నైట్రోజన్ అణువు ఎలక్ట్రాన్ విన్యాసాన్ని గుర్తించండి.
   1) 2, 5 2) 2, 6 3) 2, 8 4) 2, 4
7. మీథేన్ అణువు ఏర్పడటానికి బంధానికి కావాల్సిన కార్బన్ పరమాణువు ఎన్ని ఎలక్ట్రాన్‌లను ఇస్తుంది?
   1) రెండు 2) నాలుగు 3) మూడు 4) ఒకటి
8. 1 ఆంగ్‌స్ట్రామ్ అనేది ఎన్ని మీటర్లకు సమానంగా ఉంటుంది?
   1) 10^{-8} మీ. 2) 10^{-6} మీ. 3) 10^{-3} మీ. 4) 10^{-10} మీ.

సమాధానాలు: 1-3; 2-2; 3-1; 4-3; 5-2; 6-1; 7-2; 8-4.

అది విభజన సంతానం ఓడరేవు!

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

రవాణా వ్యవస్థ

వేగవంతమైన ఆధునిక అభివృద్ధికి కావాల్సిన మౌలిక వసతుల్లో రవాణా సదుపాయాలు కీలకం. విశాల భూభాగం, విస్తృత భౌగోళిక వైవిధ్యం, అధిక జనాభా, ఆర్థిక కార్యకలాపాల పరిమాణం ఉన్న భారతదేశ ప్రగతికి సమర్థ రవాణా వ్యవస్థ అవసరం. అది వస్తుసేవలు, ప్రజా రవాణాను సులభతరం చేయడమే కాకుండా అసమానతలను తగ్గించి, ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని పెంచి మొత్తంగా ఆర్థిక, సామాజిక ప్రగతికి బాటలు వేస్తుంది. దేశంలో ప్రస్తుతం ఉన్న రోడ్డు, రైలు, జల, వాయు రవాణా వ్యవస్థల స్వరూపం, వాటి అభివృద్ధి పరిణామక్రమం, నిర్వహణ వ్యవస్థల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. ప్రధాన జాతీయ రహదారులు, కీలక నౌకాశ్రయాలు, ముఖ్యమైన రైల్వే కూడళ్లు, ప్రాధాన్య విమానాశ్రయాలు, ప్రాచుర్యంలోకి వస్తున్న జాతీయ జలమార్గాలతో పాటు దేశ రవాణా వ్యవస్థ ప్రగతికి సూచికలుగా నిలిచే నిర్మాణాలు, అందుబాటులోకి వచ్చిన సంవత్సరాలు, వాటి విశేషాలను తెలుసుకోవాలి.

1. రైల్వే రవాణాకు సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) భారతదేశంలో మొదటి ప్రయాణికుల రైలును 1853, ఏప్రిల్ 16న ప్రారంభించారు.
   బి) మన దేశంలో రెండో రైలును 1854, ఆగస్టు 15న పశ్చిమ బెంగాల్‌లోని హౌరా - హుగ్లీ మధ్య ప్రారంభించారు.
   సి) 2017లో బిబేక్ దేబ్రాయ్ కమిటీ సూచనల మేరకు రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో కలిపారు.
   డి) భారతదేశంలో ప్రస్తుతం 18 రైల్వే మండలాలు ఉన్నాయి.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరైనవి.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
2. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) ఈశాన్య సరిహద్దు రైల్వే	1) విశాఖపట్నం
బి) తూర్పు మధ్య రైల్వే	2) బిలాస్‌పుర్
సి) ఆగ్నేయ మధ్య రైల్వే	3) హాజీపుర్
డి) దక్షిణ కోస్తా రైల్వే	4) మాలెగాన్ (గువాహటి)

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4 3) ఎ-4, బి-1, సి-2, డి-3 4) ఎ-1, బి-4, సి-2, డి-3
3. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) నేషనల్ హైవే డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి 7 దశలున్నాయి.
   బి) మొదటి దశలో భాగంగా స్వర్ణ చతుర్భుజి పథకాన్ని అమలు చేశారు.
   సి) రెండో దశలో తూర్పు - పడమర, ఉత్తర - దక్షిణ కారిడార్‌లు ఉన్నాయి.
   డి) రెండో దశలో రహదారుల అభివృద్ధిలో భాగంగా 7,300 కి.మీ.ల జాతీయ రహదారుల్ని అభివృద్ధి చేశారు.
   1) ఎ, బి, సి, డి లు సరైనవి.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
4. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) ఇంటర్నేషనల్ గేజ్	1) 1.676 మీ.
బి) లైట్ న్యారో గేజ్	2) 0.762 మీ.
సి) న్యారో గేజ్	3) 0.610 మీ.
డి) బ్రాడ్ గేజ్	4) 1.435 మీ.


   1) ఎ-1, బి-4, సి-3, డి-2
   2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-4, బి-3, సి-2, డి-1
   4) ఎ-1, బి-3, సి-2, డి-4
5. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) మన దేశంలో మొదటి ఎలక్ట్రిక్ రైలు మహారాష్ట్రలో పుణె-ముంబయి మధ్య ప్రారంభమైంది. దీన్నే 'దక్కన్ క్వీన్' అంటారు.



   బి) ప్రపంచంలోనే మొదటి సంచార వైద్యశాల ఉన్న రైలు 'జీవన రేఖ'.
   సి) పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం ప్రారంభించిన ఎ.సి. రైలు గరీబ్‌రథ్.
   డి) మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన పర్యాటక రైలు 'టైగర్ ఎక్స్‌ప్రెస్'.
   1) ఎ, బి, సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.
6. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్	1) 1985
బి) ఫాస్టాగ్	2) 1995
సి) కొంకణ్ రైల్వే	3) 2014
డి) పవన్‌హన్స్ లిమిటెడ్	4) 1960

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1 3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-2, డి-4
7. కింది వాటిలో వాయు రవాణాకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) మన దేశంలో మొదటి విమానాన్ని 1911, ఫిబ్రవరి 12న ప్రారంభించారు.



జె.ఆర్.డి. టాటా

   బి) మన దేశంలో సరకు రవాణా కోసం వాయుదూత్ సర్వీస్‌ను 1981లో ప్రారంభించారు.
   సి) భారత వాయుసేన పితామహుడిగా జె.ఆర్.డి.టాటాను పిలుస్తారు.
   డి) భారతదేశంలో న్యూదిల్లీ కేంద్రంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను 1995లో ప్రారంభించారు.
   1) ఎ, బి, సి, డి లు సరైనవి.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి, డి లు సరికావు.
   4) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
8. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.
   ఎ) పశ్చిమ రైల్వే - ముంబయి (ఛత్రపతి శివాజీ టెర్మినల్)
   బి) మధ్య రైల్వే - ముంబయి (చర్చి గేట్)
   సి) ఈశాన్య రైల్వే - గోరఖ్‌పుర్
   డి) ఆగ్నేయ రైల్వే - కోల్‌కతా
   1) ఎ, డి 2) ఎ, బి 3) ఎ, సి 4) సి, డి
9. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) గుజరాత్‌లోని కాండ్లా పోర్ట్‌ను దీన్‌దయాల్ పోర్ట్ అని పిలుస్తారు.



   బి) కాండ్లా ఓడరేవునే 'విభజన సంతానం' అని పిలుస్తారు.
   సి) మంగళూరు ఓడరేవును 'గేట్‌వే ఆఫ్ కర్ణాటక' అని పిలుస్తారు.
   డి) తూర్పు తీరంలోని ఏకైక సహజ ఓడరేవు విశాఖపట్నం.
   1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి, డి లు సరైనవి.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
10. కింది వాటిని జతపరచండి.

బీఆర్ఓ ప్రాజెక్టులు	ప్రాంతాలు /రాష్ట్రాలు
ఎ) దీపక్	1) మిజోరాం, త్రిపుర
బి) దంతక్	2) జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్
సి) బీకాన్	3) భూటాన్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్
డి) పుష్పక్	4) హిమాచల్ ప్రదేశ్

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1 3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-4, బి-3, సి-2, డి-1
11. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) మన దేశంలో మొదటి రైల్వే మండలం దక్షిణ రైల్వే.
   బి) అతి పెద్ద రైల్వే మండలం ఉత్తర రైల్వే.
   సి) అత్యధికంగా మూడు రైల్వే మండలాలు పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి.
   డి) అత్యధిక పొడవైన రైల్వే మార్గం ఉన్న రైల్వే మండలం ఉత్తర రైల్వే.
   1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   2) ఎ, బి, సి, డి లు సరికావు.
   3) ఎ, బి లు సరికావు; సి, డి లు సరైనవి.
   4) ఎ, బి, సి, డి లు సరైనవి.
12. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా	1) 2017
బి) బోగిబీల్ బ్రిడ్జ్	2) 1999
సి) ఐఆర్‌సీటీసీ	3) 2018
డి) ఉడాన్	4) 1988

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-1, బి-3, సి-2, డి-4
   4) ఎ-4, బి-1, సి-3, డి-2
13. భారతదేశంలో ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన చీనాబ్ రైల్వే వంతెనకు సంబంధించి సరైనవి?
   ఎ) ఈ వంతెన పొడవు సరాసరిగా 1,315 మీటర్లు.
   బి) ఇది నదీ భూగర్భం నుంచి దాదాపుగా 359 మీటర్ల ఎత్తు ఉంటుంది.
   సి) ఈ వంతెన మీద రైలు గంటకు 100 కి.మీ. వేగంతో ప్రయాణించవచ్చు.
   డి) ఈ వంతెన నిర్మాణానికి దాదాపు రూ. 1,486 కోట్లు ఖర్చు అయింది.
   1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి, డి లు సరైనవి.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
14. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా –2
ఎ) జాతీయ జలమార్గం-1	1) పశ్చిమతీర కాలువ
బి) జాతీయ జలమార్గం-2	2) బకింగ్‌హామ్ కాలువ
సి) జాతీయ జలమార్గం-3	3) గంగానది
డి) జాతీయ జలమార్గం-4	4) బ్రహ్మపుత్ర నది

   1) ఎ-1, బి-2, సి-3, డి-4
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-3, డి-2
   4) ఎ-3, బి-4, సి-1, డి-2
15. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) 2024-25 ఆర్థిక సంవత్సరానికి పౌర విమానయాన మంత్రిత్వశాఖకు దాదాపుగా రూ. 2,400 కోట్లు కేటాయించారు.
   బి) ఉడాన్ పథకానికి దాదాపుగా రూ. 5.4 కోట్లు కేటాయించారు.
   సి) సముద్ర వ్యాపార అభివృద్ధి నిధి కింద దాదాపుగా రూ. 25,000 కోట్లు కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.
   డి) 2025-26 కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు దాదాపుగా రూ. 2.65 లక్షల కోట్లు కేటాయించారు.
   1) ఎ, బి, సి, డి లు సరైనవి.
   2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
   3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
16. కింది వాటిని జతపరచండి.

యునెస్కో గుర్తించిన రైల్వేలు	సంవత్సరాలు
ఎ) సిమ్లా-కల్కా రైల్వే	1)1999
బి) నీలగిరి మౌంటైన్ రైల్వే	2) 2004
సి) ఛత్రపతి శివాజీ టెర్మినల్	3) 2005
డి) డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే	4) 2008

   1) ఎ-3, బి-4, సి-1, డి-2 2) ఎ-1, బి-4, సి-3, డి-2 3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4
17. కింది వాటిని జతపరచండి.



అంతర్జాతీయ విమానాశ్రయం	ప్రాంతం
ఎ) తులిహల్	1) ఇండోర్
బి) లోన్‌ప్రియ గోపీనాథ్ బర్దోలై	2) లఖ్‌నవూ
సి) చౌదరీ చరణ్ సింగ్	3) గువహటి
డి) దేవి అహల్యా హోల్కర్	4) ఇంఫాల్

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-1, బి-2, సి-4, డి-3
   3) ఎ-1, బి-2, సి-3, డి-4
   4) ఎ-1, బి-4, సి-3, డి-2



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-1; 3-1; 4-3; 5-4; 6-2; 7-1; 8-2; 9-3; 10-4; 11-4; 12-1; 13-3; 14-4; 15-1; 16-3; 17-1.

రసాయన చర్య జరిగేకొద్దీ క్రియాజనకాల గాఢతలు తగ్గుతూ, క్రియాజన్యాల గాఢతలు పెరుగుతూ ఉంటాయి. క్రియాజనకాల గాఢత తగ్గుదల రేటు లేదా క్రియాజన్యాల గాఢత పెరుగుదల రేటును 'చర్యారేటు' లేదా 'చర్యా వేగం' అంటారు. చర్యలో పాల్గొనకుండా చర్యావేగాన్ని పెంచేదే ఉత్ప్రేరకం. క్రియాజనకాల గాఢతలకు చర్యారేటు అనులోమానుపాతంలో ఉంటుంది. పోటీపరీక్షార్థులు చర్యారేటు, రేటు సమీకరణం, వీటిని ప్రభావితం చేసే అంశాలు తదితరాలపై అవగాహన కలిగి ఉండాలి.



ఉత్ప్రేరకం సమక్షంలో చర్యారేటు అధికం

పోటీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ

రసాయన గతికశాస్త్రం

చర్యారేటు

రసాయన చర్యలో ఎంత వేగంగా క్రియాజనకాల వినియోగం జరుగుతుందో లేదా క్రియాజన్యాలు ఏర్పడుతున్నాయో తెలిపే ప్రక్రియ. రసాయన చర్య జరిగేకొద్దీ క్రియాజనకాల గాఢతలు తగ్గితే, క్రియాజన్యాల గాఢతలు పెరుగుతాయి.

- క్రియాజనకం గాఢతలో తగ్గుదలను అనుసరించి చర్యారేటును కింది విధంగా తెలియజేయవచ్చు. అత్యల్ప కాలం dtలో క్రియాజనకం గాఢతలో మార్పు dc అయితే,

$$\text{చర్యారేటు} = \frac{-dc}{dt}$$

- చర్యారేటును క్రియాజన్యం గాఢతలో పెరుగుదలను అనుసరించి కూడా సూచించవచ్చు. అత్యల్ప కాలం dtలో క్రియాజన్యం గాఢతలో మార్పు dx అయితే,

$$\text{చర్యారేటు} = \frac{dx}{dt}$$

ఉదా-1: $A \longrightarrow B$ అనే చర్యారేటును కింది విధంగా తెలియజేయవచ్చు.

$$\text{చర్యారేటు} = \frac{-d[A]}{dt} = \frac{d[B]}{dt}$$

ఉదా-2: $A \longrightarrow B + C$ అనే చర్యారేటును కింది విధంగా సూచించవచ్చు.

$$\text{చర్యారేటు} = \frac{-d[A]}{dt} = \frac{d[B]}{dt} = \frac{d[C]}{dt}$$

రేటు సమీకరణం (Rate Equation)

ద్రవ్యరాశి క్రియా నియమం ప్రకారం చర్యారేటు క్రియాజనకాల గాఢతకు అనులోమానుపాతంలో ఉంటుంది.

- చర్య జరిగేకొద్దీ క్రియాజనకాలు వినియోగం అవుతుండటంతో క్రియాజనకాల గాఢత తగ్గి చర్యారేటు కూడా తగ్గిపోతుంది.

ఉదా: $A + B + C \longrightarrow$ క్రియజన్యాలు అనే చర్యలో,

$$\text{చర్యారేటు} = K \times [A]\,[B]\,[C].$$

ఈ సమీకరణాన్నే అవకలన రూపంలో రేటు సమీకరణం అంటారు.

- రేటు సమీకరణంలో ఉండే స్థిరాంకం Kను రేటు స్థిరాంకం లేదా విశిష్ట రేటు అంటారు.
- రేటు స్థిరాంకం విలువ, ఉష్ణోగ్రత, క్రియాజనకాల స్వభావంపై ఆధారపడుతుంది కానీ గాఢతపై ఆధారపడదు.

చర్యారేటు - ప్రభావితం చేసే అంశాలు

i. క్రియాజనకాల స్వభావం: అయానిక పదార్థాలు పాల్గొనే చర్యలు వేగంగా జరుగుతాయి.

- సమయోజనీయ అణువులు పాల్గొనే చర్యలు నెమ్మదిగా జరుగుతాయి.
- సమయోజనీయ చర్యల్లో కూడా అధిక సంఖ్యలో బంధ విచ్ఛేదనం ఉన్న చర్యలు గది ఉష్ణోగ్రత వద్ద నెమ్మదిగా జరుగుతాయి.

ఉదా: పర్మాంగనేట్ (MnO^{-4}) అయాన్ ఫెర్రస్ (Fe^{+2}) అయాన్‌లను వేగంగా ఆక్సీకరిస్తుంది. కానీ ఆక్సలేట్ అయాన్‌లను నెమ్మదిగా ఆక్సీకరిస్తుంది.

ii. క్రియాజనకాల గాఢతలు: చర్యారేటు క్రియాజనకాల గాఢతకు అనులోమానుపాతంలో ఉంటుంది. గాఢత పెరిగితే క్రియాజనక అణువుల సంఖ్య పెరిగి అణువుల మధ్య దూరం తగ్గుతుంది. ఫలితంగా అణుతాడనాల సంఖ్యతో పాటు ఫలప్రద తాడనాల సంఖ్య పెరుగుతుంది. కాబట్టి క్రియాజనకాల గాఢత పెరగటం వల్ల చర్యారేటు పెరుగుతుంది.

ఉదా: మండుతున్న పుల్లను ఆక్సిజన్ ఉన్న జాడీలో పెడితే అది ప్రకాశవంతంగా మండుతుంది.

iii. ఉష్ణోగ్రత ప్రభావం: ఉష్ణోగ్రత పెరిగితే అణువుల గతిజశక్తి పెరిగి ఫలప్రద తాడనాల సంఖ్య కూడా పెరుగుతుంది. ఉష్ణోగ్రతలో పెరుగుదల ఫలితంగా చర్యారేటు అధికమవుతుంది.

- ప్రతి $10^{\circ}C$ పెరుగుదలకు అనేక రసాయన చర్యల చర్యారేటు దాదాపుగా రెట్టింపు అవుతుంది.

ఉదా: పర్మాంగనేట్ (MnO^{-4}) అయాన్ గది ఉష్ణోగ్రత వద్ద ఆక్సలేట్ అయాన్‌లను చాలా నెమ్మదిగా ఆక్సీకరిస్తుంది. అయితే $70^{\circ}C$ ఉష్ణోగ్రత వద్ద వేగంగా ఆక్సీకరిస్తుంది.

iv. ఉత్ప్రేరకం: ఉత్ప్రేరకం చర్యా వేగాన్ని పెంచుతుంది.

- ఉత్ప్రేరకం ఉత్తేజిత శక్తి తక్కువ ఉన్న మార్గంలో చర్య జరిగేటట్లు చేస్తుంది. ఫలితంగా ఉత్ప్రేరకం సమక్షంలో చర్యారేటు అధికంగా ఉంటుంది.
- ద్విగత చర్యల్లో ఉత్ప్రేరకం పురోగామి, తిరోగామి చర్యల వేగాలను పెంచుతుంది.

ఉదా: హైడ్రోజన్ పెరాక్సైడ్ (H_2O_2) వియోగ చర్యకు మాంగనీస్ డైఆక్సైడ్ (MnO_2)ను ఉత్ప్రేరకంగా చేర్చినప్పుడు చర్యావేగం గణనీయంగా పెరుగుతుంది.

v. ఉపరితల వైశాల్యం: ఘన క్రియాజనకం పాల్గొనే చర్యలో దాని ఉపరితల పరిమాణంతో చర్యారేటు పెరుగుతుంది.

- చూర్ణస్థితిలో ఉపరితల పరిమాణం అత్యధికంగా ఉంటుంది. దీంతో ఘన క్రియాజనకాన్ని ముక్కలుగా కంటే చూర్ణంగా వినియోగించినప్పుడు చర్య వేగంగా జరుగుతుంది.

ఉదా: కాల్షియం కార్బోనేట్ (చాక్) హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్యలో ఎక్కువ ఉపరితల విస్తీర్ణం కారణంగా పొడిగా ఉన్న చాక్, పెద్ద ముక్కల చాక్ కంటే వేగంగా చర్యలో పాల్గొంటుంది.

చర్యావేగాలు

రసాయనిక చర్యలు వేర్వేరు వేగాల్లో జరుగుతాయి. కొన్ని రసాయనిక చర్యలు క్షణాల్లోనే పూర్తవుతాయి, మరికొన్ని చర్యలు పూర్తయ్యేందుకు నిమిషాలు, గంటలు, రోజులు లేదా సంవత్సరాలు పట్టొచ్చు. చర్యావేగం ఆధారంగా రసాయనిక చర్యలను సాధారణంగా మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

వేగంగా జరిగే చర్యలు

ఈ చర్యలు చాలా వేగంగా జరుగుతాయి. క్రియాజనకాలు కలిసిన సెకను కాలంలోనే ఈ చర్యలు పూర్తవుతాయి. సాధారణంగా ఈ చర్యలు ఉష్ణాన్ని విడుదల చేస్తాయి.

ఉదా: ఆమ్ల-క్షార మధ్య చర్యలు: హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని (HCl) సోడియం హైడ్రాక్సైడ్ $(NaOH)$తో కలిపితే వెంటనే నీరు, ఉప్పు ఏర్పడతాయి.

$$HCl + NaOH \longrightarrow NaCl + H_2O$$

అవక్షేపణ చర్యలు: సిల్వర్ నైట్రేట్ $(AgNO_3)$ను సోడియం క్లోరైడ్ $(NaCl)$తో కలిపితే వెంటనే తెల్లటి అవక్షేపం ఏర్పడుతుంది.

$$AgNO_3 + NaCl \longrightarrow AgCl \downarrow + NaNO_3$$

- వివిధ దహన చర్యలు వేగంగా జరుగుతాయి.

మితవేగ చర్యలు

ఈ చర్యలు కొన్ని సెకన్లు లేదా నిమిషాల్లో జరుగుతాయి. వీటి వేగాన్ని సులభంగా కొలవచ్చు, నియంత్రించవచ్చు.

ఉదా: మెగ్నీషియం లోహాన్ని సజల హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో కలిపితే హైడ్రోజన్ వాయువు బయటకు వస్తుంది. బుడగలు మోస్తరు వేగంగా వస్తాయి.

$$Mg + 2HCl \longrightarrow MgCl_2 + H_2 \uparrow$$

- మాంగనీస్ డైఆక్సైడ్ (MnO_2) సమక్షంలో హైడ్రోజన్ పెరాక్సైడ్ నీరు, ఆక్సిజన్‌గా వియోగం చెందడం. $2H_2O_2 \longrightarrow 2H_2O + O_2$

నెమ్మదిగా జరిగే చర్యలు

ఈ చర్యలు పూర్తయ్యేందుకు కొన్ని గంటలు, రోజులు, సంవత్సరాలూ పట్టొచ్చు. ఇవి చాలా నెమ్మదిగా జరుగుతాయి. వాతావరణ పరిస్థితులపై ఆధారపడతాయి.

ఉదా: ఇనుము తుప్పు పట్టడం: సాధారణ వాతావరణంలో ఇనుము తుప్పు పట్టడానికి వారాలు, నెలలు పడుతుంది.

$$4Fe + 3O_2 + 6H_2O \longrightarrow 4Fes(OH)_3$$

పెట్రోలియం ఏర్పడటం: ఉష్ణం, పీడనాల ప్రభావంతో భూభాగంలో జీవ అవశేషాలు లక్షల, కోట్ల సంవత్సరాల్లో పెట్రోల్‌గా మారతాయి.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

Word of the Day 700

Aesthetic

Telugu meaning: సౌందర్యం, కళాత్మకత

English meaning: The word aesthetic (ఎస్తెటిక్) is an adjective that describes something concerned with beauty or the appreciation of beauty. As a noun, it refers to a set of principles guiding the work of an artist or artistic movement.

Synonyms: Artistic, Elegant

Antonyms: Unattractive, Ugly

Usage: **1. (As a Noun):** The minimalist design of the house reflects a modern aesthetic that appeals to many people.

2. (As an Adjective): Her paintings are not only technically skillful but also deeply aesthetic in their composition and colour choice.

1956 తర్వాత దేశంలో ఏర్పడిన కొత్త రాష్ట్రాలు



స్టడీ జోన్


భారత రాజ్యాంగ నిర్మాతలు దేశాన్ని 'రాష్ట్రాల సముదాయం'గా పేర్కొన్నారు. వీరు దేశాన్ని పాలనాపరమైన సమాఖ్యగా ఏర్పాటు చేశారు కానీ సిద్ధాంతపరమైన సమాఖ్యగా పేర్కొనలేదు. దీనివల్ల దేశం నుంచి రాష్ట్రాలు విడిపోయే అవకాశం లేదు. ఒకే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధి విషయంలో అసమానతలకు గురైనవారు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ, దేశంలోనే అంతర్భాగంగానే కొనసాగుతున్నారు. ఇది మన దేశ విశిష్టతను తెలుపుతుంది.

- ఫజల్ అలీ కమిషన్ సిఫార్సుల ప్రకారం 1956లో 7వ రాజ్యాంగ సవరణ చట్టం చేశారు. దీంతో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం ఏర్పడి, మన దేశంలో 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు ఆవిర్భవించాయి.
- 1956 తర్వాతి కాలంలో భారత రాజకీయ చిత్రపటంలో అనేక మార్పులు వచ్చాయి. భాషాప్రాతిపదికన లేదా సాంస్కృతిక సజాతీయత కారణాలపై ఏర్పడిన డిమాండ్ల వల్ల రాష్ట్రాలను తిరిగి విభజించాల్సి వచ్చింది. అలా ఏర్పడిన రాష్ట్రాలను పరిశీలిస్తే..

సంఖ్య	పేరు	ప్రస్తుత రాజధాని	మాతృక ప్రాంతం
15	గుజరాత్	గాంధీనగర్	బొంబాయి
16	నాగాలాండ్	కొహిమా	అస్సాం
17	హరియాణా	పంజాబ్	చండీగఢ్
18	హిమాచల్‌ప్రదేశ్	శిమ్లా (వేసవికాలం) ధర్మశాల (శీతాకాలం)	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
19	మణిపూర్	ఇంఫాల్	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
20	త్రిపుర	అగర్తల	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
21	మేఘాలయ	షిల్లాంగ్	అస్సాం
22	సిక్కిం	గాంగ్‌టక్	గతంలో 'సహరాష్ట్ర హోదా'తో ఉండేది
23	మిజోరం	ఐజ్వాల్	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
24	అరుణాచల్‌ప్రదేశ్	ఇటానగర్	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
25	గోవా	పనాజీ	గతంలో కేంద్రపాలిత ప్రాంతంగా ఉండేది
26	ఛత్తీస్‌గఢ్	రాయ్‌పూర్	మధ్యప్రదేశ్
27	ఉత్తరాంచల్/ ఉత్తరాఖండ్	డెహ్రాడూన్ (శీతాకాలం) భారరిసేన్ (వేసవికాలం)	ఉత్తర్‌ప్రదేశ్
28	ఝార్ఖండ్	రాంచీ	బిహార్
29	తెలంగాణ	హైదరాబాద్	ఆంధ్రప్రదేశ్

ప్రస్తుతం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్న ప్రాంతాలు: మహారాష్ట్ర - విదర్భ; అసోం - బోడోలాండ్; కర్ణాటక - కొడగు; ఉత్తర్‌ప్రదేశ్ - హరితప్రదేశ్, బుందేల్‌ఖండ్; పశ్చిమ్ బంగ - గూర్ఖాలాండ్; గుజరాత్ - సౌరాష్ట్ర.

ముఖ్యమైన విషయాలు.. మీ కోసం సిద్ధం!



వివిధ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ విభాగంలో మన చుట్టూ జరిగే ముఖ్య సంఘటనలపై ప్రశ్నలు అడుగుతారు. మీ ప్రిపరేషన్‌కు సాయపడేలా అన్ని ముఖ్యమైన విషయాలను అంశాల వారీగా ఎప్పటికప్పుడు ఈప్రతిభ వెబ్‌సైట్, యాప్ ద్వారా అందించడంతోపాటు సమాచారాన్ని మరింత విశ్లేషణాత్మకంగా మంత్లీ ఈ-బుక్ రూపంలోనూ మీ ముందుకు తెస్తోంది 'ఈనాడు ఈప్రతిభ'. యాప్, డెస్క్‌టాప్ రెండింటిలోనూ వీటిని చదవొచ్చు. 2025, జూన్‌లో జరిగిన ముఖ్య సంఘటనలను గమనిస్తే..

వార్తల్లో ప్రదేశాలు

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వే వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.

- ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దేశంలోనే అత్యంత పొడవైన కేబుల్ ఆధారిత రైల్వే ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు.

ఆర్థిక రంగం

సింగపూర్ నుంచి భారత్‌కు 2024-25లో అత్యధికంగా 15 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి.

అంతర్జాతీయం

పోలండ్ అధ్యక్ష ఎన్నికల్లో కన్సర్వేటివ్ నేత కరోల్ నౌరోకీ విజయం సాధించారు.

- దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, ఉదారవాది లీ జే - మ్యుంగ్ విజయం సాధించారు.

క్రీడలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) - 18 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది.

- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్ విజేతగా దక్షిణాఫ్రికా నిలిచింది.

వార్తల్లో వ్యక్తులు

ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభకు కొత్త అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేబాక్ అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు.

జాతీయం

దేశ 16వ జనగణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నియామకాలు

భారత నిఘా సంస్థ 'రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)' నూతన చీఫ్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు.

పురస్కారాలు

భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రకు ప్రతిష్ఠాత్మక 'ససాకవా' పురస్కారం దక్కింది.

సదస్సులు - సమావేశాలు

మహాసముద్రాల రక్షణకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మూడో మహాసభ ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో జరిగింది.

ఇతర అంశాలు, పూర్తి సమాచారంతోపాటు మాదిరి ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఇంటర్న్‌షిప్ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) పరిధిలోని డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (డీఎల్‌ఆర్‌ఎల్) హైదరాబాద్ 2025-26 సంవత్సరానికి వివిధ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 75. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 జులై 2025.

ఈసీఐఎల్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని అటామిక్ ఎనర్జీ విభాగానికి చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 125. అర్హులైన అభ్యర్థులు 2025, జులై 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (జులై 4) చివరి తేదీ

- 14,582 పోస్టులతో ఎస్‌ఎస్‌సీ - సీజీఎల్ నోటిఫికేషన్. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- సీడబ్ల్యూసీలో 52 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు. డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.
- డీఆర్‌డీఓ - ఆర్‌ఏసీలో 152 సైంటిస్ట్-బి పోస్టులు. ఇంజినీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఐపీఆర్‌సీఎల్‌లో 30 అప్రెంటిస్ పోస్టులు. డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mount Jopuno is situated in...

Current Affairs

1. Which new one-stop app was recently launched by the Railways Minister to provide comprehensive passenger services?
A) RailConnect B) PassengerX
C) TrainMate D) RailOne

2. According to recent data, which Indian state reported the highest number of new plant species discoveries?
A) Kerala B) Maharashtra
C) Tamil Nadu D) Arunachal Pradesh

3. The Wandan mud volcano, known for periodic eruptions spewing mud and sometimes flames, is located in which country?
A) Indonesia B) Malaysia
C) Taiwan D) Philippines

4. Who inaugurated the Mahayogi Guru Gorakhnath AYUSH University in Gorakhpur?
A) President Droupadi Murmu
B) Governor Anandiben Patel
C) Prime Minister Narendra Modi
D) Union AYUSH Minister

5. Which airline was named the World's Best Airline 2025 by Skytrax for a record ninth time?
A) Emirates B) Singapore Airlines
C) ANA All Nippon Airways
D) Qatar Airways

General Knowledge

6. The Naknyulum festival, celebrated with traditional dances like Changai, is primarily observed in which Indian state?
A) Arunachal Pradesh B) Mizoram
C) Nagaland D) Tripura

7. Sattriya, one of the classical dance forms of India, was developed in the 15th-16th century by which spiritual reformer?
A) Tansen B) Chaitanya Mahaprabhu
C) Tyagaraja D) Srimanta Sankardeva

8. Where was the first edition of the Commonwealth Youth Games held in 2000?
A) Melbourne, Australia
B) Edinburgh, Scotland
C) Birmingham, England
D) Wellington, New Zealand

SSC Exams Special

General Awareness

Geography

9. Which of the following is the highest peak in the Eastern Ghats?
A) Arma Konda B) Mahendragiri
C) Deomali D) Nallamala

10. What does the term "dry farming" refer to?
A) Cultivation in wetlands using traditional methods
B) Farming using only groundwater resources
C) Cultivation without irrigation in areas with low rainfall
D) Intensive farming in desert regions with artificial rain

11. Mount Jopuno, located at an elevation of 5603 meters, is situated in which Indian state?
A) Sikkim B) Arunachal Pradesh
C) Uttarakhand D) Himachal Pradesh

Polity

12. What does a "Code of Conduct" primarily define?
A) Government policies on taxation
B) Scientific principles and experiments
C) Norms and responsibilities for ethical behavior
D) Economic guidelines for trade

13. The provisions for administration of tribal areas in Assam, Meghalaya, Tripura, and Mizoram are contained in which Schedule of the Indian Constitution?
A) Fifth Schedule
B) Seventh Schedule
C) Sixth Schedule
D) Ninth Schedule

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

ఎండీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేట్ నాన్ మైనారిటీ దంత వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఎండీఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్-ఎండీఎస్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి చెప్పారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 7 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం వర్సిటీ వెబ్‌సైట్ https://drntr.uhsap.in ను సంప్రదించాలని సూచించారు.

బడి మానేసిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చదువును మధ్యలో మానేసిన 2,833 మంది పిల్లలకు నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఈ నెల 16 నుంచి శిక్షణ ఇచ్చేందుకు సమగ్ర శిక్షా అభియాన్ నిర్ణయించింది. ఇందుకోసం రూ.1.01 కోట్ల నిధులు విడుదల చేస్తూ.. గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి విద్యార్థులకు మూడు, ఆరు, తొమ్మిది నెలలు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత వీరిని రెగ్యులర్ విధానంలో బడిలో చేర్పిస్తారు. 293 మందికి మూడు, 1,155 మందికి ఆరు, 1,385 మందికి తొమ్మిది నెలలు శిక్షణ అవసరం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఏపీఏడీసీఎల్‌కు రూ.6.88 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్)కు రూ.6.88 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో కేటాయించిన రూ.361.25 కోట్ల నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఈ మొత్తాన్ని పలు విమానయాన సంస్థలకు వినియోగించనున్నట్లు తెలిపింది.

ఫిర్యాదుల కమిటీ పునర్నియామకం

ఈనాడు, అమరావతి: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం కింద ఉన్నత విద్యాశాఖలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రిసైడింగ్ అధికారి అదనపు కార్యదర్శి రాధ, సహాయ కార్యదర్శి చంద్రమౌళిక, సెక్షన్ అధికారి షేక్ కౌసర్ జాన్, సహాయ అధికారి వసంతలక్ష్మిని సభ్యులుగా నియమించింది.

గుంటూరు జేసీకి బ్రెయిలీ ప్రెస్ నిర్వహణ బాధ్యత

ఈనాడు, అమరావతి: గుంటూరులోని బ్రెయిలీ ప్రెస్ నిర్వహణ బాధ్యతను గుంటూరు జిల్లా జేసీ/ఈడీకి అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సిబ్బంది నిర్వహణ, బ్రెయిలీ పుస్తకాలు అందించడంలో జాప్యం అవుతుండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల కలకలం

- డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు 100 శాతం బదిలీ జాబితాలోనా?
- ఏడాది పాటు పనిచేసిన వారినీ మినహాయించరా?
- ర్యాంకింగ్ విధానంలో లోపాలపైనా అసంతృప్తి

ఈనాడు, అమరావతి: ఆర్థికశాఖ విడుదల చేసిన బదిలీ మార్గదర్శకాలకు భిన్నంగా వాణిజ్య పన్నుల శాఖ సొంత మార్గదర్శకాలతో ఉద్యోగుల బదిలీ చేపడుతుండటంతో ప్రభుత్వంలో కలకలం రేగింది. ఈ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలోని అందరు డిప్యూటీ కమిషనర్లు (డీసీ), అసిస్టెంట్ కమిషనర్లు (ఏసీ) బదిలీ జాబితాలోకి వస్తారు. వీరిలో ఒక ఏడాదే సర్వీసు పూర్తిచేసినవారు ఉన్నారు. ప్రభుత్వం ఐదేళ్లు ఒకచోట పనిచేసినవారికి తప్పనిసరి బదిలీ అంటుంటే ఈ శాఖలో అందరినీ బదిలీ చేసేలా మార్గదర్శకాలు రూపొందించారని ఉద్యోగులు వాపోతున్నారు.

✦ ఈ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలోని 109 సర్కిల్ కార్యాలయాల్లోని 96 మంది ఏసీల బదిలీకి ప్రతిపాదించే పరిస్థితులు ఉన్నాయి. వీరిలో ఆరుగురికొక్కరే ఏడాదే పూర్తయినవాళ్లు ఉన్నారు. ఎవరైనా అధికారులపై ఫిర్యాదులుంటే వారిని పాలనా సౌలభ్యం కోసం బదిలీ చేసే వెసులుబాటు సమర్థనీయమైనా ఇప్పుడు అందరినీ బదిలీ చేసేందుకు ఇలా చేయడమేంటనే ప్రశ్న వినిపిస్తోంది.

✦ రాష్ట్రంలో 16 డివిజన్లు పనిచేస్తున్నాయి. తాజా మార్గదర్శకాల వల్ల వీటిలో డీసీలందరినీ బదిలీ చేసే ఆస్కారం ఏర్పడుతోంది.

✦ తిరుపతి, విజయవాడ, విశాఖల్లో ఉన్న ప్రాంతీయ జీఎస్టీ, ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల్లో పని చేసే ఏసీలు, డీసీలకు.. తిరుపతి, విజయవాడల్లో ఉన్న రెండు అప్పిలేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి ఏడేళ్ల నిబంధన వర్తింపజేస్తున్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కార్యాలయంలోని సిబ్బందికి అసలు బదిలీలే లేవు. ర్యాంకింగ్ విధానంలో ఏకరూపకత ఆస్కారం లేదని ఉద్యోగసంఘాలు పేర్కొంటున్నాయి.

✦ ఈ అంశాలపై ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడు రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ బదిలీ విధానాలు మార్చాలని కోరారు. రెవెన్యూ సాధనలో పురోగతి చూపలేకపోవడానికి సంస్థలో అధికారులు, ఉద్యోగులే కారణం కాదని, ఇతర అంశాలను పరిష్కరించాలని ఆయన ఆ లేఖలో ప్రస్తావించారు. విశాఖ శాసనసభ్యుడు, రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి సమస్య ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు పురుషోత్తమనాయుడు పేర్కొన్నారు.



మాజీ సైనికుల పునరావాసం, ప్రత్యేక నిధి రాష్ట్ర నిర్వహణ కమిటీ ఛైర్మన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో రాష్ట్ర సైనిక సంక్షేమ సంచాలకుడు బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు

మాజీ సైనికులు, వితంతువులకు పింఛన్

- అమరవీరులకు వారి సొంత ప్రాంతాల్లో కాంస్య విగ్రహాలు
- అనాథ బాలల చదువుకు ఏటా రూ.30 వేల సాయం
- గవర్నర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ భేటీలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: నిర్ణీత సర్వీసును పూర్తి చేయకుండా అనివార్య కారణాల వల్ల సైన్యంలో నుంచి బయటికొచ్చేసిన మాజీ సైనికులు, ఏవైనా కారణాలతో ఇప్పటివరకూ పింఛన్ అందని మాజీ సైనికుల కుటుంబాలకు సంబంధించిన వితంతువులకు ఇకపై ప్రతి నెలా రూ.3,000 నుంచి రూ.5,000 వరకు పింఛన్ ఇవ్వాలని మాజీ సైనికుల ప్రత్యేక నిధి రాష్ట్ర నిర్వహణ కమిటీ నిర్ణయించింది. కమిటీ ఛైర్మన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన రాజ్‌భవన్‌లో గురువారం ఈ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర సైనిక సంక్షేమ సంచాలకుడు బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి గవర్నర్‌కు పలు ప్రతిపాదనలను నివేదించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కమిటీ ఆమోదించిన కొన్ని ప్రతిపాదనలు..

■ ఇప్పటివరకూ 100 శాతం వైకల్యం ఉన్న మాజీ సైనికులకే భత్యం కింద రూ.10,000 చొప్పున ఇస్తున్నారు. అంతకంటే తక్కువ వైకల్యం ఉన్నవారికి ఈ సాయం అందడం లేదు. దాన్ని సవరించి 50 శాతం వరకు వైకల్యం ఉంటే రూ.5,000, 50-75 శాతం ఉంటే రూ.7,500, 75-100 శాతం ఉంటే రూ.10,000 చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు.

■ మాజీ సైనికుల పిల్లల్లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన వారికి ఖర్చుల నిమిత్తం నెలకు రూ.2,500 చొప్పున సంరక్షకులకు ఇస్తున్నారు. ఇప్పుడు వారి చదువు నిమిత్తం ఏడాదికి రూ.30,000 చొప్పున ఇవ్వాలన్న ప్రతిపాదనకు కమిటీ ఆమోదం తెలిపింది.

■ యుద్ధం/ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరవీరుల కాంస్య విగ్రహాలను వారి సొంత గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు రూ.15 లక్షల వరకు (ఒక్కో విగ్రహానికి) వెచ్చించేందుకు కమిటీ అంగీకారం.

■ మిలిటరీ పోలీసు పోస్టులకు దరఖాస్తు చేసుకునే మాజీ సైనికుల భార్యలకు వయోపరిమితిని 30 ఏళ్ల వరకు పెంచేలా ఇప్పటికే కేంద్రం నుంచి అనుమతి వచ్చింది. ఇకపై ఈ కోటాలో పరీక్షకు సిద్ధమయ్యే వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయం. ఈ నెల 7న జరగనున్న పరీక్షకు రాష్ట్రం నుంచి 13 మంది మహిళలు ఈ కోటాలో హాజరవనున్నారు.

■ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన్‌లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తే.. వాటి నిర్మాణానికి రూ.5 కోట్ల వరకు గ్రాంట్ ఇవ్వడానికి కేంద్ర సైనిక్ బోర్డు సిద్ధమని సమావేశానికి హాజరైన బోర్డు ప్రతినిధులు కమిటీకి తెలిపారు.

ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీ కేడర్‌కు కేటాయించాల్సిందే

- క్యాట్ తీర్పును సమర్థించిన హైకోర్టు
- డీవోపీటీ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: ఐఏఎస్ లోతేటి శివశంకర్‌ను ఏపీ కేడర్‌కు కేటాయించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు కేంద్రానికి తేల్చి చెప్పింది. ఆయన్ను ఏపీకి కేటాయించాలంటూ ఫిబ్రవరి 28న కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కేంద్ర డీవోపీటీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఇ.తిరుమలాదేవిలతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. రాష్ట్ర విభజన సందర్భంగా శివశంకర్‌ను తెలంగాణకు కేటాయించగా ఆయన క్యాట్‌ను ఆశ్రయించి ఏపీలో విధులు నిర్వహిస్తూ వచ్చారు. అయితే హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కేటాయింపులను పునస్సమీక్షించిన కేంద్రం.. ఎవరికి కేటాయించిన కేడర్‌లకు వాళ్లు వెళ్లాల్సిందేనంటూ 2024 అక్టోబరులో ఉత్తర్వులు జారీ చేసింది. అందులో శివశంకర్ తెలంగాణ కేడర్‌కు వచ్చారు. కేంద్రం ఉత్తర్వులను సవాలు చేస్తూ శివశంకర్ క్యాట్‌ను ఆశ్రయించగా.. ఏపీకి కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీని అమలు చేయకపోవడంతో శివశంకర్ క్యాట్‌లో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయడంతో కేంద్రం హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శివశంకర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలకు విరుద్ధంగా డీవోపీటీ నిర్ణయం తీసుకుందన్నారు. అధికారి పుట్టిన, చదువుకున్న, నివాస ప్రాంతాలు పట్టించుకోకుండా కేవలం ఉత్తర ప్రత్యుత్తరాల కోసం ఇచ్చిన చిరునామాను ప్రాతిపదికగా తీసుకుని శివశంకర్‌ను తెలంగాణకు కేటాయించారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీని ఎంపిక చేసుకున్నప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం డీవోపీటీ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ ఉత్తర్వుల ప్రతి అందిన 4 వారాల్లో శివశంకర్‌ను ఏపీకి కేటాయించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

మీకు ఏ రకమైన భద్రత కావాలి?

జగన్‌ను ప్రశ్నించిన హోం మంత్రి అనిత



విలేకర్లతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత. చిత్రంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, విజయనగరం: భద్రత ఇవ్వలేదు.. రోప్ పార్టీల్లేవు.. అంటూ వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని, అసలు మీకు ఏ రకమైన భద్రత కావాలో చెప్పాలని హోం మంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. విజయనగరంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడిగా కాదు, మాజీ సీఎంగా ఆయనకు జడ్ ప్లస్ భద్రత కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి మృతి చెందితే వారింటికి వెళ్లి, ఆ కుటుంబ సభ్యులను ఓదార్చాలని.. జగన్ వారినే తమ ఇంటికి పిలిపించుకుని పరామర్శించడమేంటో అర్థం కావడం లేదన్నారు. ఓదార్పు ఫ్రం హోంలా ఇది కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. వైకాపా హయాంలో రాష్ట్రమంతటా గంజాయి గుప్పుమనేదని, అప్పట్లో పదివేల ఎకరాల్లో సాగైతే.. కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ప్రస్తుతానికి 90 ఎకరాల్లో మాత్రమే ఉందని చెప్పారు. ఐదేళ్ల పాలనలో గంజాయి సాగు, కేసుల నమోదుపై ఒక్కసారి కూడా జగన్ సమీక్షించలేదని గుర్తుచేశారు. మద్యం సొమ్మును ఎన్నికల్లో ఖర్చు పెడతారని తాము ఆనాడే చెప్పామని, అదే ఇప్పుడు రుజువవుతోందని వెల్లడించారు. గజపతినగరం నియోజకవర్గంలో 264 కుటుంబాలను దత్తత తీసుకుంటానన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంత్రి అనిత అభినందించారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నామని, ఇప్పటికే 1.20 కోట్ల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను గాడిలో పెడుతున్నాం

- వారం రోజుల్లో సీఎం సమక్షంలో మళ్లీ సమీక్ష
- మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

ఈనాడు, అమరావతి: 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతున్నాం. సాగు, తాగునీరందించే లక్ష్యంతో పని చేస్తున్నాం. వచ్చే వారంలో ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షిస్తారు' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో గురువారం ఆయన ఈ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. '2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు ఎంతో ప్రాధాన్యమిచ్చి అధిక నిధులు ఖర్చు చేసింది. కొన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసింది. 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది' అని మంత్రి అన్నారు. వంశధార రెండో దశ 90శాతం పూర్తయినా, తోటపల్లి బ్యారేజీ దాదాపు పూర్తయినా మిగిలిన పనులను జగన్ సర్కారు గాలికి వదిలేసిందన్నారు. వంశధార, నాగావళి అనుసంధానం, నాగావళి, చంపావతి అనుసంధానం పనుల తాజా స్థితిని మంత్రి తెలుసుకున్నారు. హిరమండలం ఎత్తిపోతల, మడ్డువలస రెండో దశ, జంఝావతి రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలన్నారు. జైకా నిధులతో చేపట్టిన ఆండ్ర రిజర్వాయర్, రైవాడ, పెదంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ పూర్తి చేయడానికి ఉన్న అవాంతరాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుల కబ్జాయత్నానికి అధికారుల సహకారం

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన భూమిని వైకాపా నాయకులు కబ్జా చేయాలని చూస్తున్నారని, వారికి అధికారులూ సహకరిస్తూ ఇబ్బంది పెడుతున్నారని అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన చిన్నయ్య తెదేపా నేతల వద్ద ఆవేదన వ్యక్తం చెందారు. న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం మంగళగిరిలోని తెదేపా కార్యాలయానికి వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి నేతలు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. తిరుమలలో పూలు విక్రయించి బతికే తమను విజిలెన్స్ సిబ్బంది అలిపిరి టోల్‌గేట్ వద్దే అడ్డుకుంటున్నారని తిరుపతి పూలవీధికి చెందిన పలువురు మహిళలు వాపోయారు. తమ భూమిని కబ్జా చేసి వారు తమను చంపుతామని బెదిరిస్తున్నారని ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన పొట్లూరి పద్మజారాణి ఫిర్యాదు చేశారు.

● తన ఇంటిని కొందరు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని, దాన్ని రద్దు చేసి న్యాయం చేయాలని తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన విజయమ్మ కోరారు.

● తమకు టిడ్కో గృహాలు అప్పగించకుండానే రుణాలు చెల్లించాలని బ్యాంకు నోటీసులు వస్తున్నాయని విజయవాడ జక్కంపూడి కాలనీకి చెందిన పలువురు మహిళలు వాపోయారు.

ఆ తొమ్మిది మంది ఏమయ్యారు?

● స్పష్టతకు ఇంకెన్ని రోజులని బంధువుల ఆందోళన ● సిగాచీ శిథిలాల తొలగింపు వేగవంతం

ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఆచూకీ లభించని 9 మంది కార్మికులు ఏమయ్యారో తెలియని పరిస్థితి. రెస్క్యూ బృందాలు కర్మాగారంలో భవనాల శిథిలాల తొలగింపు వేగవంతం చేసినా ఫలితం దక్కడం లేదు. ఓవైపు ఆచూకీ లభించని కార్మికుల కుటుంబాలు తమవారు ఎక్కడంటూ గురువారం ఆందోళనకు దిగాయి.

లాకర్లలో మరో మూడు సెల్‌ఫోన్‌లు

పేలుడు జరిగినప్పుడు 143 మంది కార్మికులు విధుల్లో ఉండగా.. 38 మంది కార్మికులు మృతిచెందినట్లు అధికారులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు సంయుక్తంగా నిర్ధారించారు. 9 మంది ఆచూకీ తెలియడంలేదు. 23 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 12 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లారు. 61 మంది సురక్షితంగా బయటపడ్డారు. కర్మాగారంలో రోజువారీ వేతనంపై పనిచేసే కార్మికులున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు కర్మాగారం సెక్యూరిటీ విభాగంలో లాకర్లను పగులగొట్టి చూడగా.. అందులో మూడు సెల్‌ఫోన్‌లు లభ్యమయ్యాయి.

21 మృతదేహాల అప్పగింత

పేలుడు ఘటనలో లభ్యమైన 13 మృతదేహాలను కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించడంతో వారికి అధికారులు అప్పజెప్పారు. మిగతా మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షల కోసం శాంపిల్స్ పంపారు. ఇప్పటికే 8 మృతదేహాల డీఎన్ఏ వారి కుటుంబ సభ్యులతో సరిపోలడంతో వారికి అప్పజెప్పారు.

★ ఈఘటనపై దర్యాప్తునకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ బృందం గురువారం 3 గంటల పాటు సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో పర్యటించింది. అందుబాటులో ఉన్న కంపెనీ అధికారులతో పాటు పరిశ్రమల శాఖల అధికారులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టింది.

★ హైడ్రా.. శిథిలాలను తొలగిస్తుండగా.. అందులో సెల్‌ఫోన్‌లతో పాటు తెగిపోయిన చేతివేళ్లు, శరీర భాగాలు బయటపడుతున్నాయి.

★ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నారు. వారి కుటుంబాలకు సహాయపడేందుకు ఆయా రాష్ట్రాల కార్మికశాఖ అధికారులు ఇక్కడికి వచ్చారు.

★ క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యసేవలందేలా చూస్తున్నామని సిగాచీ పరిశ్రమ యజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీకి సహకారం అందిస్తామంది. ప్రమాదానికి గల కారణాలపై ప్రాథమిక నివేదిక 7 రోజుల్లో వస్తుందని భావిస్తున్నట్లు పేర్కొంది. ప్రమాదంలో గల్లంతైన వారిని గుర్తించేందుకు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఐలా భవనం ఆవరణలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి బంధువుల ఆధారాలు స్వీకరించారు.



జస్టిన్ కోసం బంధువుల ఆందోళన

సిగాచీ ప్రమాదంలో గల్లంతైన జస్టిన్(19) ఆచూకీ ఎక్కడంటూ అతని కుటుంబసభ్యులు కర్మాగారం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. నాలుగు రోజులు గడుస్తున్నా వివరాలు చెప్పడంలేదని అతని తండ్రి రామదాస్ తలను రాయికి కొట్టుకుని నిరసన తెలిపారు.

నా భర్త జాడ ఎక్కడ?



సిగాచీ పరిశ్రమలో పనిచేసే తన భర్త జాడ తెలియలేదంటూ ఓ మహిళ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన చోటేలాల్ మూడేళ్లుగా ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి తన భర్త కనిపించడం లేదని భార్య సంజు తెలిపారు. చోటేలాల్ ఫొటో చూపిస్తూ ఆసుపత్రుల్లో అధికారులను, వైద్యులను ఆయన ఆచూకీ తెలపాలని కోరుతున్నారు.

ఉత్తీర్ణత వ్యత్యాసాన్ని తగ్గించేందుకు 'మోడల్' ప్రశ్నపత్రాలు రూపొందించండి

రాష్ట్రాలకు కేంద్ర విద్యాశాఖ సూచన

ఈనాడు, అమరావతి: దేశంలోని రాష్ట్రాలన్నీ పది, ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాల రూపకల్పనలో ఒకే విధానాన్ని పాటించాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. కొన్ని రాష్ట్రాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత 99% ఉంటే మరి కొన్ని రాష్ట్రాల్లో 60% ఉంటోందని, అందువల్ల ప్రశ్నపత్రాల రూపకల్పనకు ఒక 'మోడల్' విధానం పాటించాలని పేర్కొంది. ఆ ప్రశ్నపత్రాల మోడల్‌ను తామే రూపొందించి ఇస్తామని చెప్పింది. ఈ మేరకు దిల్లీలో రెండు రోజుల పాటు అన్ని రాష్ట్రాల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన కార్యశాలలో ఈ విషయాలను వెల్లడించింది. "ఉత్తీర్ణత శాతాల వ్యత్యాసాలపై మేం అధ్యయనం చేశాం. అందులో వెల్లడైన అంశాల ఆధారంగా సూచనలు చేస్తున్నాం. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లను కలిపేసి సెకండరీ బోర్డు ఒక్కదాన్నే ఏర్పాటు చేయాలి. దేశ వ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో మినహా మిగతా అన్ని చోట్ల రెండింటికి కలిపి ఒకే బోర్డు ఉంది. పరీక్షల నిర్వహణ, విశ్లేషణకు ప్రత్యేకంగా రాష్ట్ర పాఠశాల ప్రామాణిక నిర్ధారిత అథారిటీ(ఎస్ఎస్ఎస్ఏ)ను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండళ్లు పూర్తిగా అకడమిక్ వ్యవహారాలకే పరిమితం కావాలి. పరీక్షల నిర్వహణ, విశ్లేషణకు ఎస్ఎస్ఎస్ఏలను ఏర్పాటు చేయాలి" అని పేర్కొంది.

ఖరీఫ్ డిజిటల్ క్రాప్ సర్వే మార్గదర్శకాలివీ..

ఈనాడు, అమరావతి: 2025 ఖరీఫ్ డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించిన మార్గదర్శకాలను వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు గురువారం విడుదల చేశారు. మార్గదర్శకాలివీ..

- ❒ అరటి, కొబ్బరి, మామిడి తదితర బహువార్షిక పంటలను.. గత ఏడాది నమోదు చేసినా మళ్లీ ఈ సంవత్సరం కూడా జియో ఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీయాలి. పొలం గట్లమీద ఉన్న చెట్లు, సాగు చేసే పంటను కూడా నమోదు చేయాలి.
- ❒ వెబ్‌ల్యాండ్ ఆధారంగా ప్రభుత్వ, లీజు, అభ్యంతరకర స్థలాల్లో సాగును పరిశీలించాలి. పంట ఉన్నా, లేకున్నా భూకమతాలను జియో ట్యాగ్ చేసి ఫొటో తీయాలి.
- ❒ సచివాలయాల పునర్విభజనకు అనుగుణంగా మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందిని రెవెన్యూ గ్రామానికి మ్యాపింగ్ చేయాలి.
- ❒ వ్యవసాయ పంటలకు వ్యవసాయ అధికారి, ఉద్యాన పంటలకు ఉద్యాన అధికారి, ఇతర ప్రభుత్వ/ వ్యవసాయ యోగ్యం కాని భూముల విషయంలో తహసీల్దార్ పరిశీలించి ఆమోదించాలి. ఒకవేళ తిరస్కరిస్తే.. క్షేత్రస్థాయి సిబ్బంది రీసర్వే చేయాలి. సమీక్ష, ఆమోదం కోసం సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లాల ఉద్యాన అధికారులకు పంపాలి.
- ❒ రైతుల సాగు సమాచార డేటా, ఆధార్, మొబైల్ నంబరును కచ్చితంగా నమోదు చేయాలి. రైతులు ముందుకొచ్చి 100% ఈ-పంట నమోదు చేయించుకోవాలి.

ఓఎంసీ కేసులో సబితపై అప్పీలు చేస్తాం

- హైకోర్టుకు నివేదించిన సీబీఐ
- శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులుగా ఉన్న అప్పటి ఉమ్మడి రాష్ట్ర గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి కృపానందంలను నిర్దోషులుగా పేర్కొంటూ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు దాఖలు చేయనున్నట్లు సీబీఐ గురువారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. డిశ్చార్జి పిటిషన్ సీబీఐ కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఐఏఎస్ శ్రీలక్ష్మి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టగా సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ సీబీఐ కోర్టు తీర్పును సవాలు చేస్తూ అప్పీలు దాఖలు చేయనున్నామని తెలిపారు. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. లీజు మంజూరులో ఓఎంసీకి అనుకూలంగా వ్యవహరించారని, క్యాప్టివ్ మైనింగ్ అన్న పదాన్ని జీవోలో విస్మరించారని పిటిషనర్‌పై సీబీఐ ఆరోపణలు చేసిందన్నారు. కానీ, పిటిషనర్ గనులశాఖ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకునే నాటికే ఓఎంసీకి ప్రొవిజనల్ లీజు కేటాయింపు సహా అన్నీ జరిగిపోయాయన్నారు. క్యాప్టివ్ మైనింగ్ అన్న పదం జీవోలో లేనందున నిందితురాలిగా చేర్చారని, అలాంటి నిబంధన ఎంఎండీఆర్ చట్టంలోనే లేదన్నారు. కేంద్రం ఈ నిబంధనను అమలు చేయరాదని స్పష్టం చేసిందన్నారు. వాదనలు పూర్తికాకపోవడంతో న్యాయమూర్తి విచారణను ఈనెల పదికి వాయిదా వేశారు.

హరిత పన్ను తగ్గింపుపై ఎదురుచూపులు

● ఇంకా వెలువడని జీఓ

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే- విజయవాడ సిటీ: గత వైకాపా ప్రభుత్వం రవాణా రంగంపై భారీగా మోపిన హరిత పన్నును.. గణనీయంగా తగ్గిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది మే చివరి వారంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నా ఇంకా ఉత్తర్వులు వెలువడకపోవడంతో అమల్లోకి రాలేదు. రాష్ట్రంలో దాదాపు 5లక్షల వరకు రవాణా వాహనాలు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 లక్షల మంది ఆధారపడ్డారు. డీజిల్ భారం, హరిత పన్ను, త్రైమాసిక పన్ను పెంపు కారణంగా రవాణా రంగం ఒడుదొడుకులకు గురైంది. ఫలితంగా లక్షల మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. హరిత పన్ను పెంచక ముందు.. ఏడేళ్లు దాటిన ట్రక్కులు, లారీలకు ఏడాదికి రూ.200, పన్నెండేళ్లు దాటిన వాటికి రూ.వెయ్యి వసూలు చేసేవాళ్లు. కేంద్రం నిబంధనలను ఆసరాగా చేసుకుని మన రాష్ట్రంలో హరిత పన్నును జగన్ ప్రభుత్వం 2022లో భారీగా పెంచేసింది. పలు శ్లాబులుగా మార్చింది. గరిష్ఠంగా ఏడాదికి రూ.20 వేలు చెల్లించాల్సి రావడంతో లారీల యజమానులు గగ్గోలు పెట్టారు. ప్రజా రవాణా వాహనాల (బస్సులు, క్యాబ్స్)కు గతంలో హరిత పన్ను రూ.200 ఉండగా, వీటికి కూడా రూ.4వేల నుంచి రూ.6వేల వరకు వైకాపా ప్రభుత్వం పెంచేసింది. దీంతో లారీలు, ట్రక్కులు, క్యాబ్‌ల యజమానులు.. ఈ పన్నులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతా హరితపన్ను తగ్గింపు కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయులు ఎస్వీ రంగారావు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సినీ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న మహానటుడు ఎస్వీ రంగారావు అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఎస్వీఆర్ జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా గురువారం నివాళి అర్పించారు. "మూడు దశాబ్దాల పాటు వెండితెరపై విభిన్న పాత్రలు పోషించి తన అద్భుత నటనతో అశేష ప్రజానీకాన్ని ఆకట్టుకున్న ఆ విశ్వనట చక్రవర్తి కళాసేవను స్మరించుకుందాం" అని సీఎం పేర్కొన్నారు.

✦ తనదైన నటనతో ఎస్వీ రంగారావు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సినీరంగానికి ఎస్వీఆర్ చేసిన సేవల్ని స్మరించుకుంటూ 'ఎక్స్' వేదికగా నివాళి అర్పించారు.

కారు కింద పడింది దళితుడని లెక్కలేనితనమా?

జగన్‌పై బండారు శ్రావణిశ్రీ మండిపాటు

ఈనాడు, అమరావతి: దళితులను అణగదొక్కడమే వైకాపా అధ్యక్షుడు జగన్ పనిగా మారిందని తెదేపా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. నేరాలు చేయడం వాటిని పక్కదారి పట్టించడం ఆయనకు అలవాటని గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. కారు కింద పడింది దళితుడనే అంత లెక్కలేనితనమా? అని ధ్వజమెత్తారు. "సింగయ్య తన కారు కింద పడ్డాడని తెలిసి కూడా జగన్.. వాహనశ్రేణిని ముందుకు కదిపారు. సింగయ్య సతీమణితో అసత్యాలు చెప్పించారు" అని మండిపడ్డారు.

బదిలీలపై విచారణ చేయించండి

సచివాలయ ఉద్యోగుల సంఘం నేతల వినతి

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి విచారణ చేయించాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు షేక్ అబ్దుల్ రజాక్, పార్థా మధు తదితరులు గురువారం ఆ శాఖ సంచాలకుడు శివప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. జీవోకు విరుద్ధంగా పలుచోట్ల బదిలీలు చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యమివ్వడంతో సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థలో కౌన్సెలింగ్ నిర్వహించకుండా ఉద్యోగులను అన్యాయంగా బదిలీ చేశారని తెలిపారు. అనంతపురం, ధర్మవరంలలో మహిళా ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా కదిరి మున్సిపాలిటీకి బదిలీ చేశారని వివరించారు. మొత్తం బదిలీలపై విచారణ చేయించి, రీకౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

మామిడి ధరలపై కేంద్రాన్ని సీఎం సంప్రదించరెందుకు?

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 'కర్ణాటక ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసి, వారి రాష్ట్రంలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంది. కానీ, కూటమిలో భాగస్వామిగా ఉంటూ ఏపీలోని మామిడి రైతుల కోసం కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సంప్రదించరెందుకు?' అని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కర్ణాటకలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కింద కేజీకి రూ.16.16 ఇస్తున్నట్టే ఏపీ రైతులకూ ఇవ్వాలని కోరుతూ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రామచంద్ర యాదవ్ లేఖ రాశారు.



కేంద్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవట్లేదు: రాహుల్

దిల్లీ: కోట్లల్లో రుణం తీసుకుని మోసం చేసేవారికి రుణమాఫీ చేస్తున్న మోదీ ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని గురువారం రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. "ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ఒక్క మహారాష్ట్రలోనే మొత్తం 767 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విత్తనాలు, ఇంధనం, ఎరువులు ఖరీదైనందంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణ మాఫీ, పంటలకు కనీస మద్దతు ధర కోసం రైతులు చేసే డిమాండ్లను ప్రభుత్వం విస్మరిస్తోంది. మోదీ గారు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పారు. కానీ నేడు రైతులు బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడింది" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

■ డోక్లాం, గల్వాన్ ఘటనలను మరిచిపోయి చైనా కంపెనీలకు మోదీ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరచడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. "ఆటో మొబైల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, అధిక భద్రతా కరెన్సీ ముద్రణకు అత్యంత అవసరమైన అరుదైన భూ అయస్కాంతాలు, ఖనిజాలను భారత్‌కు ఎగుమతి చేయడంపై చైనా కఠిన ఆంక్షలు విధించింది. మోదీ ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదు. గత రెండు నెలలుగా చైనా భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేసి, ఇతర దేశాలకు సరఫరా కొనసాగిస్తోంది. భారత్ 80 శాతం ఎరువులను చైనా నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఇప్పటికే యూరియా, డీఏపీ ఎరువుల కొరత ఎదుర్కొంటున్న మన రైతులకు ఇది హాని కలిగించదా" అని గురువారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు.

గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్

- 94 మంది మృతి

టెల్ అవీవ్: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరవచ్చని సంకేతాలు వెలువడుతున్న వేళ.. గాజాపై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. ఇజ్రాయెల్ దాడులవల్ల గడిచిన 24 గంటల్లో 94 మంది మృతి చెందారని గాజా ఆరోగ్యశాఖ గురువారం తెలిపింది. ఇందులో మానవతా సాయం అందిస్తున్న పంపిణీ కేంద్రాల దగ్గర జరిగిన కాల్పుల్లోనే 45 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. గాజాపై బుధవారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమాస్‌కు చెందిన ముగ్గురు మిలిటెంట్లు చనిపోయారు. ఈ విషయాన్ని హమాస్ ధ్రువీకరించింది.

■ గాజాలో అమెరికా, ఇజ్రాయెల్ పంపిణీ చేస్తున్న సాయం పస్తులుంచేలా చేసి మానవ హననానికి దారి తీస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది. గాజా మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగుతున్న సాయాన్ని గురువారం ఆ సంస్థ తప్పుబట్టింది. గత నెలలో 500 మంది గాజావాసులు ఈ సాయం పంపిణీ కేంద్రాలవద్ద మరణించారని తెలిపింది.



ఇజ్రాయెల్ దాడిలో గాజాలో మృతిచెందిన పాలస్తీనియుల భౌతికకాయాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పౌరులు

ఉగ్రదాడుల్ని సహించబోమని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టం చేశాం



- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్య

వాషింగ్టన్: ఉగ్రదాడులకు పాల్పడిన వారిని భారత్ వదిలిపెట్టబోదన్న సందేశాన్ని 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి స్పష్టంగా తెలియజేశామని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. క్వాడ్ సమావేశంలో పాల్గొనడానికి వాషింగ్టన్ వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఉగ్రవాదులు, వారి మద్దతుదారులను శిక్షించడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం. ఆ విషయం ప్రపంచానికి స్పష్టంగా అర్థమైంది. పహల్గాం ఉగ్రదాడిని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలితో పాటు క్వాడ్ దేశాలూ తీవ్రంగా ఖండించాయి. ఆలస్యం చేయకుండా ఈ హింసాత్మక దాడికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చాయి" అని చెప్పుకొచ్చారు.

మా ఆందోళనను అమెరికాకు తెలిపాం

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామన్న అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వ్యాఖ్యలపై జైశంకర్ స్పందించారు. ఈ విషయంలో భారత్ ఆందోళనను ఆ సెనెటర్‌తో ఇప్పటికే పంచుకొన్నామని తెలిపారు.



దిల్లీతో ఆయిజోల్‌కు రైల్వే అనుసంధానం

రూ.8,000 కోట్ల మార్గాన్ని ప్రారంభించనున్న మోదీ

ఆయిజోల్: ఈశాన్యాన ఉన్న మరో రాష్ట్ర రాజధానికి దేశ రాజధానితో రైల్వే అనుసంధానం లభించబోతోంది. రూ. 8,000 కోట్ల వ్యయంతో భైరబి నుంచి మిజోరం రాజధాని ఆయిజోల్ సమీపానికి నిర్మించిన 52 కి.మీ. మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ప్రారంభించనున్నారు. గువాహటి నుంచి ఆయిజోల్‌కు ఉన్న రెండు మార్గాలు తరచూ ఏదోఒక కారణం వల్ల మూతపడుతుంటాయి. ఈ పరిస్థితుల్లో క్రేన్లనూ ముక్కలుగా విభజించి రైలుమార్గ నిర్మాణ స్థలానికి తరలించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. 12.85 కి.మీ. మేర 48 సొరంగాలు ఉన్న ఈ మార్గంలో 55 భారీ, 87 చిన్న వంతెనల్ని నిర్మించారు. ఒక వంతెన కుతుబ్ మినార్ కంటే ఎత్తైనది.

డాబర్ వ్యతిరేక ప్రకటనలు తొలగించండి

పతంజలికి దిల్లీ హైకోర్టు ఆదేశాలు

దిల్లీ: డాబర్ చ్యవన్‌ప్రాశ్‌ను అగౌరవపరిచేలా పతంజలి ఆయుర్వేద సంస్థ జారీ చేస్తోన్న వాణిజ్య ప్రకటనలను వెంటనే తొలగించాలని దిల్లీ హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. డాబర్ సంస్థ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ ఎం.పుష్కర్ణ గురువారం ఈ ఆదేశాలిచ్చారు. ఆయుర్వేద గ్రంథాల్లో చెప్పినట్లు తాము మాత్రమే చ్యవన్‌ప్రాశ్‌ను తయారుచేస్తామని, ఇతరులు సరైన పరిజ్ఞానంతో ఉత్పత్తులు చేయడంలేదంటూ ఆ ప్రకటనల్లో పతంజలి అపవాదులు మోపుతోందని డాబర్ సంస్థ ఆరోపించింది. ఈ ప్రకటనలను నిలిపివేయడంతో పాటు తమ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు గాను నష్టపరిహారంగా రూ.2 కోట్లను ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఇతర సంస్థల ఉత్పత్తుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న వ్యాఖ్యలను, పదాలను టీవీలు, పత్రికల్లో ఇస్తున్న వాణిజ్య ప్రకటనల నుంచి తొలగించాలని, ఆ మేరకు సవరణలు చేయాలని పతంజలి సంస్థను జడ్జి ఆదేశించారు. తదుపరి విచారణ ఈ నెల 14వ తేదీకి వాయిదా పడింది.

బ్రహ్మోస్‌తో భారత్ దాడి సమయంలో..

మా వద్ద ఉన్నది 30 సెకన్ల సమయమే!



రాణా సనావుల్లా

ఇంటర్నెట్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు వెన్నులో వణుకు పుట్టించాయి. నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై భారత్ బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించినప్పుడు దానికి అణు వార్‌హెడ్ ఉందా?.. లేదా? అని గుర్తించేందుకు తమ సైన్యం వద్ద కేవలం 30 - 45 సెకన్ల సమయం మాత్రమే ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సలహాదారు రాణా సనావుల్లా వెల్లడించారు. అది చాలా ప్రమాదకర పరిస్థితి అని ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. "ఆ స్వల్ప వ్యవధిలోనే దీనిపై ఒక నిర్ధారణకు రావడం ఎంత ప్రమాదకర పరిస్థితి అనేది అర్థం చేసుకోవచ్చు. అణు వార్‌హెడ్‌ను వినియోగించకుండా వారు (భారత్) మంచిపని చేశారని నేను అనడం లేదు. కానీ, అదే సమయంలో ఇటువైపు (పాక్) తప్పుగా అర్థం చేసుకుంటే.. తదనంతర పరిణామాలు ప్రపంచ అణ్వాయుధ యుద్ధానికి దారి తీసేవి. ఆ పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకొని, ప్రపంచాన్ని విపత్తు నుంచి కాపాడారు. అందుకే ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆయన్ను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు" అని సనావుల్లా తెలిపారు.

మనీలాండరింగ్‌కు అసలైన ఉదాహరణ నేషనల్ హెరాల్డ్ కేసు: ఈడీ

దిల్లీ: నిందితులందరిపైనా అక్రమ నగదు చలామణీ అభియోగం ఉన్నందున మనీలాండరింగ్‌కు అసలైన ఉదాహరణగా నేషనల్ హెరాల్డ్ కేసు నిలుస్తుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలు 'యంగ్ ఇండియన్'కు లబ్ధిదారులైన యజమానులని, ఇతర వాటాదారులు చనిపోయాక 100% నియంత్రణను వీరిద్దరే తీసుకున్నారని ఆరోపించింది. ఈ మేరకు గురువారం ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి విశాల్ గోగ్నె ఎదుట అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు కొనసాగించారు. ".. ఈ ఇద్దరు నేతలు ఏజేఎల్‌ను నియంత్రించారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్తగా ఉన్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు రూ.2,000 కోట్ల ఆస్తులున్నాయి. సోనియా, రాహుల్ ఈ కంపెనీకి రూ.90 కోట్ల రుణాన్ని ఏఐసీసీ ద్వారా మంజూరు చేయించారు. తద్వారా రూ.2 వేల కోట్ల ఆస్తులపై వాళ్లు కన్నేశారు. వారి సమ్మతి లేకుండా ఈ మోసకారి లావాదేవీ జరిగేదే కాదు. డైరెక్టర్లలో ఒకరైన సుమన్ దుబె 550 షేర్లను సోనియాకు బదలాయించారు. గాంధీల చేతిలో ఆయనొక కీలుబొమ్మ" అని తెలిపారు. తదుపరి విచారణ శుక్రవారం కొనసాగనుంది.

అమెరికా సైన్యం.. అతి పెద్ద కాలుష్య కారకం!

వాషింగ్టన్: అమెరికా సైన్యం ప్రపంచంలోనే అత్యధికంగా వాతావరణ కాలుష్యాన్ని వ్యాప్తి చేస్తున్న వ్యవస్థని 'పీఎల్ఓఎస్ క్లైమేట్' అనే శాస్త్రీయ జర్నల్ తాజా సంచిక ప్రచురించిన అధ్యయన నివేదిక వెల్లడించింది. పెన్ స్టేట్ విశ్వవిద్యాలయానికి చెందిన ర్యాన్ థాంబ్స్ ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. భూతాపాన్ని పెంచే గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో అమెరికా సైన్యాన్ని మించిన వ్యవస్థ ప్రపంచంలోనే మరొకటి లేదని ఈ అధ్యయనం తేల్చింది. అమెరికా చేపడుతున్న సైనిక స్థావరాల నిర్వహణ, శిక్షణకు సంబంధించిన కసరత్తులు, కవాతులు, ఆయుధ పరిశోధన అభివృద్ధి, సిబ్బంది, ఆయుధ రవాణా వంటి కార్యకలాపాలు కాలుష్య వృద్ధికి కారణమవుతున్నాయని పేర్కొంది. ఈ కార్యకలాపాల్లో అత్యధిక ఇంధనాన్ని వినియోగిస్తున్నందున కర్బన ఉద్గారాలు అధికంగా ఉంటున్నాయి. అమెరికా రక్షణ వ్యయాన్ని తగ్గిస్తే అక్కడి సైన్యం కలిగించే కాలుష్యమూ తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది.



అమెరికాలోని గ్రాంటన్‌వుడ్‌లో ఇటీవల వెలుగులోకి వచ్చిన 178 సంవత్సరాలనాటి బానిసత్వ వ్యతిరేక స్క్రోల్‌తో చరిత్రకారుడు జెన్నిఫర్ క్రోమక్, డైనె బాడ్జెర్

సామూహిక అత్యాచారంపై దర్యాప్తు నివేదిక సమర్పించండి

బెంగాల్ ప్రభుత్వానికి కలకత్తా హైకోర్టు ఆదేశం

కోల్‌కతా: న్యాయ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార కేసులో దర్యాప్తు ఎంత వరకు వచ్చిందో తెలియజేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కలకత్తా హైకోర్టు కోరింది. తదుపరి విచారణ జరిగే ఈ నెల 10వ తేదీలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సౌమెన్ సేన్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. సౌత్ కలకత్తా న్యాయ కళాశాలలో విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటనకు సంబంధించి దాఖలైన మూడు పిటిషన్లలో లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

గ్రీస్, తుర్కియేల్లో కార్చిచ్చు

ఏథెన్స్, అంకారా: గ్రీస్, తుర్కియేల్లో కార్చిచ్చు చెలరేగింది. గ్రీస్ దక్షిణ ద్వీపంలో ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం క్రీట్‌లో కార్చిచ్చుకు ఈదురు గాలులు తోడు కావడంతో పరిస్థితి భయానకంగా మారింది. ఈ కారణంగా దాదాపు 1500 మందిని హోటళ్లు, ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. క్రీట్‌లోని ఇరాపెట్రా ప్రాంతంలోని అటవీ, వ్యవసాయ భూములను దగ్ధం చేసిన మంటలను అదుపు చేయడానికి 10 విమానాలతో నీళ్లు గుమ్మరించడంతోపాటు 230 మంది అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారు.

■ తుర్కియే పశ్చిమ ప్రాంతంలో కార్చిచ్చు అంటుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. 37 మంది సమీప గ్రామస్థులను ఖాళీ చేయించారు.

బాల్టాల్ నుంచి అమర్‌నాథ్ యాత్ర

యాత్రికుల్లో శోభా కరాంద్లజే

శ్రీనగర్: హిమాలయాల్లో మంచు లింగం ఆకృతిలో ఉన్న పరమేశ్వరుని దర్శనానికి గాను మొదటి బ్యాచ్ భక్తులు గురువారం తెల్లవారుజామున అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరారు. అనంతనాగ్ పహల్గాంలోని నున్వాన్ బేస్ క్యాంపు, గాందర్బల్ సోనా మార్గంలోని బాల్టాల్ బేస్ క్యాంపు నుంచి పురుషులు, మహిళలు, సాధువులు నినాదాలు చేసుకుంటూ బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. ఈ యాత్రికుల్లో కేంద్ర మంత్రి శోభా కరాంద్లజే కూడా ఉన్నారు. 38 రోజుల పాటు జరిగే అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 9న ముగియనుంది.

కేదార్‌నాథ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

రుద్రప్రయాగ్: భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడడంతో సోన్‌ప్రయాగ్ మార్గంలో కేదార్‌నాథ్ యాత్రను గురువారం తాత్కాలికంగా నిలిపివేశారు. రాళ్లు, మట్టి రహదారిని పూర్తిగా కప్పివేయడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు.

ట్యూషనుకు వెళ్లడంపై వాగ్వాదం..

టీవీ నటి కుమారుడి ఆత్మహత్య

ముంబయి: ట్యూషనుకు వెళ్లమని తల్లి కోరగా, అయిష్టంగా ఉన్నందున వెళ్లనంటూ ఆమెతో వాగ్వాదానికి దిగిన కుమారుడు.. ఈ చిన్న విషయానికే బహుళ అంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ముంబయి శివారులోని కాందివలీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. బాలుడి తల్లి పాపులర్ గుజరాతీ, హిందీ సీరియళ్ల నటి. భర్త నుంచి విడాకులు తీసుకొని, 9వ తరగతి చదువుతున్న కుమారుడి (14)తో కలిసి ఓ అపార్టుమెంటులో ఆమె నివసిస్తోంది. "51వ అంతస్తులో వీరి కుటుంబం ఉంటోంది. తల్లితో వాదులాడి ఒకట్రెండు అంతస్తులు కిందికి దిగిన బాలుడు ఆ తర్వాత అమాంతం కిందికి దూకాడు. దీన్ని చూసిన అపార్టుమెంటులోని ఓ వ్యక్తి పరుగున వెళ్లి తల్లికి ఈ విషయం చెప్పాడు. ఇప్పటి దాకా ఇందులో అనుమానాస్పదం అంటూ ఏమీ కనిపించలేదు. దర్యాప్తు కొనసాగిస్తాం" అని కాందివలీ పోలీసు అధికారి గురువారం వెల్లడించారు.

14 ఏళ్ల బాలుడి దారుణహత్య

- నిందితుల్లో నలుగురు మైనర్లు

దిల్లీ: దేశ రాజధాని నగరంలో 14 ఏళ్ల బాలుడిని ఎనిమిదిమంది నిందితుల బృందం దారుణంగా కత్తులతో పొడిచి చంపింది. వీరిలో నలుగురు మైనర్లు కావడం గమనార్హం. హత్యానంతరం బాలుడి మృతదేహాన్ని దిల్లీ శివారులోని హైదర్‌పుర్ ప్రాంతంలో గల కాలువలో పడేసినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. స్థానిక సిరస్‌పుర్ ప్రాంతంలోని జీవన్ పార్కు వద్ద నివాసం ఉంటున్న బాధిత బాలుణ్ని అపహరించి, వివస్త్రగా చేసి ప్రతీకార దాడి తరహాలో హత్య చేశారు. సాంకేతిక నిఘా సాయంతో పోలీసులు ఇద్దరు కీలక నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ హరేశ్వర్ వి. స్వామి తెలిపారు. అరెస్టయిన ఇద్దరిలో ఒకడైన కృష్ణపై గతేడాది ఇద్దరు నేరస్థులు దాడి చేశారు. ఈ వ్యవహారం వెనుక ప్రస్తుతం హత్యకు గురైన బాలుడు ఇన్‌ఫార్మరుగా పనిచేశాడన్నది నిందితుల అనుమానం. మిగతా నిందితుల అరెస్టుకు పోలీసులు గాలిస్తున్నారు.

ప్రధానిగా సస్పెండై మంత్రిగా ప్రమాణ స్వీకారం

- థాయ్‌లాండ్ క్యాబినెట్‌లోకి షినవత్ర

బ్యాంకాక్: సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా.. కాంబోడియాకు చెందిన సీనియర్ నేతతో ఫోన్‌లో మాట్లాడి ప్రధాని పదవిని పోగొట్టుకున్న థాయ్‌లాండ్ నేత పిటోంగ్టార్న్ షినవత్ర కొత్త క్యాబినెట్‌లో మంత్రిగా చేరారు. థాయ్‌లాండ్ రాజు మహా వజ్రలాంగ్‌కోర్న్ ఆమోదంతో గురువారం ప్రమాణ స్వీకారం చేసిన క్యాబినెట్‌లో ఆమెకు చోటు దక్కింది. ఆమెకు సాంస్కృతికశాఖను అప్పగించారు. తాత్కాలిక ప్రధానిగా సూరియ జంగ్‌రుంగ్‌రియాంగ్‌కిట్ బాధ్యతలు చేపట్టారు. అయితే పిటోంగ్టార్న్ హయాంలో రక్షణశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా.. ప్రస్తుతం హోం మంత్రిగా, ఉప ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఫామ్తామ్ వెచాయచాయ్‌కి తాత్కాలిక ప్రధాన మంత్రి బాధ్యతలను సూరియా అప్పగించే అవకాశాలున్నాయి.

పట్టణ స్థానిక సంస్థలూ పార్లమెంటులా పనిచేయాలి

- అక్కడా ప్రశ్నోత్తరాలు, శూన్యగంట ఉండాలి: ఓం బిర్లా



గురుగ్రామ్: పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లు కూడా పార్లమెంటు తరహాలో పనిచేసి, పౌర సమస్యలను పరిష్కరించాలని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అభిప్రాయపడ్డారు. వాటి సర్వసభ్య సమావేశాల్లోనూ ప్రశ్నోత్తరాలు, శూన్యగంట ఉండాలని సూచించారు. బడ్జెట్‌కు ఆమోదం తెలపడం వంటి కీలకాంశాల్లోనూ ఎలాంటి చర్చలేకుండా స్థానికసంస్థల సమావేశాల్లో గందరగోళం నెలకొంటుండటం బాధాకరమన్నారు. గురువారం గురుగ్రాంలో జరిగిన యూఎల్‌బీల జాతీయ సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పాత పద్ధతుల్ని విడనాడి చట్టసభల్లో అవాంతరాలను తగ్గించాల్సిన అవసరం ఉందని స్పీకర్ చెప్పారు. సభా కార్యకలాపాలను అడ్డుకునే రాజకీయపార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని స్పష్టంచేశారు.

సభల్లో అవాంతరాలు తగ్గుతున్నాయి

"2014లో మొదటిసారి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచి సభాకార్యకలాపాలు చూస్తున్నాను. సభలోకి సభ్యులు నినాద ఫలకాలతో వచ్చేవారు. 17వ లోక్‌సభలో అదే పరిస్థితి. 18వ (ప్రస్తుత) లోక్‌సభలో మాత్రం మార్పును చూస్తున్నాం. అవాంతరాలు కొంత తగ్గాయి. సభ జరిగితేనే ప్రజా సమస్యల్ని ప్రభావవంతంగా ప్రస్తావించవచ్చని సభ్యులు భావిస్తున్నారు. ప్రజాస్వామ్య సంస్థలను జవాబుదారీగా నిలబెట్టడానికి సభలు సజావుగా సాగాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా అన్ని పార్టీలూ పనిచేస్తున్నాయి. యూఎల్‌బీలూ ఇలాగే రోజంతా సమావేశమవ్వాలి. 8 గంటలపాటు వాటి సమావేశాలు కొనసాగాలి" అని స్పీకర్ ఆకాంక్షించారు. యూఎల్‌బీల నుంచే దేశ నేతలు ఆవిర్భవిస్తారని చెప్పడానికి సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ ఒక ఉదాహరణ అని చెప్పారు.

డెలివరీ ఏజెంట్‌లా వచ్చి టెకీపై అత్యాచారం

పుణె: మహారాష్ట్రలోని పుణెలో ఓ అపార్ట్‌మెంటు ఫ్లాటులోకి డెలివరీ ఏజెంటులా వచ్చిన యువకుడు అందులో ఉంటున్న ఐటీ ఉద్యోగురాలి (22)పై అత్యాచారం చేశాడు. నగరంలోని కొంధవా ప్రాంతంలో బుధవారం రాత్రి 7.30 సమయంలో ఈ దారుణం జరిగినట్లు డీసీపీ రాజ్‌కుమార్ శిందే తెలిపారు. సోదరుడు బయటకు వెళ్లడంతో ఆ సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉందన్నారు. బ్యాంకు డాక్యుమెంటు లాంటిది చూపిన నిందితుడు సంతకం చేయాలని ఆమెను కోరాడు. బాధితురాలు పెన్ను కోసం ఇంట్లోకి వెళ్లగానే వెనుకగా వచ్చి తలుపు గడియ వేసి అకృత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత స్పృహ కోల్పోయిన బాధితురాలి ఫోనుతో నిందితుడు దిగిన సెల్ఫీలో సాక్షికంగా అతడు కనిపిస్తున్నాడు. ఆమె ఫొటోలు తీశానని, పోలీసులకు చెబితే వైరల్ చేస్తానని హెచ్చరిస్తూ "నేను మళ్లీ వస్తా" అని ఓ సందేశం పెట్టి వెళ్లాడు. దాదాపు గంట తర్వాత స్పృహలోకి వచ్చిన బాధితురాలు బంధువులకు ఫోను చేసి విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం నేర స్థలాన్ని పరిశీలించిన పుణె కమిషనర్ అమితేశ్ కుమార్ నిందితుడి పట్టివేతకు డజను బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

తల్లిపై అత్తమామల వేధింపులు

- 13 కి.మీ. నడిచి వెళ్లి ఫిర్యాదు చేసిన 13ఏళ్ల కుమార్తె

ఇంటర్నెట్ డెస్క్: మంత్రగత్తె అంటూ లేనిపోని అభాండాలు మోపి తమ తల్లిని, తమను హింసిస్తున్నారని ఓ 13 ఏళ్ల బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందుకోసం ఆ బాలిక ఏకంగా 13 కిలోమీటర్ల దూరాన ఉన్న పోలీస్ స్టేషన్‌కు కాలినడకన చేరుకుంది. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో జరిగింది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆ బాలిక మూఢనమ్మకాల పేరుతో తమ తల్లిని హింసిస్తున్నారని దుద్ధి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తండ్రి ఇంట్లో లేని సమయంలో తమ తల్లిని నానమ్మ, తాతయ్య హింసిస్తున్నారని పేర్కొంది.

ఇండోనేసియాలో నీట మునిగిన ఫెర్రీ

ఐదుగురి మృతి, 29 మంది గల్లంతు

జకార్తా: ఇండోనేసియాలోని బాలి సమీపంలో గురువారం 65 మందితో ప్రయాణిస్తున్న ఓ ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఐదుగురి మృతి చెందగా, 29 మంది గల్లంతయ్యారు. 31 మందిని అధికారులు సురక్షితంగా తీరానికి తీసుకువచ్చారు. తూర్పు జావాలోని కేటాపాంగ్ పోర్టు నుంచి బాలిలోని గిలిమనుక్‌కు బయలుదేరిన 30 నిమిషాలకే ఫెర్రీ ప్రమాదానికి గురైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 22 వాహనాలు, 14 ట్రక్కులు కూడా ఉన్నట్లు తెలిపారు.

సజీవ పురుగుల్ని వాంతి చేసుకుంటున్న చైనా బాలిక

బీజింగ్: గత నెల రోజులుగా సజీవంగా ఉన్న పురుగుల్ని వాంతి చేసుకుంటున్న ఎనిమిదేళ్ల బాలిక చైనాలో వార్తలకెక్కింది. తూర్పు చైనాలోని జియాంగ్సు రాష్ట్రంలో యాంగ్జూ నగరానికి చెందిన ఈ బాలిక ఎదుర్కొంటున్న విచిత్ర ఆరోగ్య పరిస్థితిపై పలువురు డాక్టర్లను సంప్రదించినా ఫలితం లేకపోయింది. సజీవ పురుగులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఏ డాక్టరూ కచ్చితంగా చెప్పలేకపోయారు. యాంగ్జూలోని సూచౌ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక డాక్టరు మాత్రం అసలు సమస్య ఎక్కడుందో కనుగొన్నారు. బాలిక వాంతి చేసుకున్న పురుగుల్ని స్థానిక వ్యాధి నియంత్రణ, నివారణ విభాగానికి చూపాల్సిందిగా డాక్టర్ జాంగ్ బింగ్ బింగ్ తల్లిదండ్రులకు సలహా ఇచ్చారు. ఆ విభాగానికి చెందిన సిబ్బంది పురుగుల్ని గుర్తించారు. ఈ పురుగులు మురుగునీటి ఈగల లార్వాలని, ఇవి గతంలో ఒక 60 ఏళ్ల మహిళలోనూ చూశామని ఆ విభాగం సిబ్బంది తెలిపారు. ఈ ఈగలు టాయిలెట్‌లో తడిగా ఉండే లోపలి భాగాల్లో ఉంటాయి. తమ ఇంట్లో అలాంటి ఈగల్ని చూశామని బాలిక తల్లిదండ్రులు గుర్తించారు. వీటి లార్వాలు భూగర్భ జలాలను కలుషితం చేశాయని, బాలిక పళ్లు తోముకునే సమయంలోగానీ, ఫ్లష్ కొట్టే సమయంలో కానీ ఆమె శరీరంలోకి ప్రవేశించి ఉండవచ్చని వ్యాధి నియంత్రణ విభాగానికి చెందిన జు యుహుయి తెలిపారు.



కేరళ రాజధాని తిరువనంతపురంలో గురువారం రాజ్‌భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తను అదిమిపట్టి అదుపులోకి తీసుకుంటున్న ఓ పోలీసు. కేరళ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ మోహనన్ కున్నుమల్ వర్సిటీ రిజిస్ట్రార్ కె.ఎస్.అనిల్‌కుమార్‌ను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఈ నిరసనకు దిగింది

బెంగాల్‌లో మంత్రి కాన్వాయ్‌పై దాడి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మంత్రి, జమియత్ ఉలేమా-ఇ-హింద్ అధ్యక్షుడు సిద్దిఖుల్లా చౌదరి కాన్వాయ్‌పై గురువారం పూర్వ బర్ధమాన్ జిల్లాలో దాడి జరిగింది. అయితే ఆయన క్షేమంగా బయటపడ్డారు. తమ పార్టీకే చెందిన ప్రత్యర్థులు తనను చంపడానికి ప్రయత్నించారని, ఇందులో గ్రామ ప్రధాన్‌తోపాటు పార్టీ నాయకులు ఉన్నారని మంత్రి ఆరోపించారు. రాళ్లు విసరడంతోపాటు కారు ముందు అద్దాన్ని ధ్వంసం చేయడంతో తన చేతికి గాయమైందని తెలిపారు.

పశ్చిమ బెంగాల్ భాజపా అధ్యక్షుడిగా సమిక్ భట్టాచార్య

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ భాజపా అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడు సమిక్ భట్టాచార్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోనే కాషాయ పార్టీ ఎన్నికలకు వెళ్లనుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అవినీతి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి తాను పోరాడతానని అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం భట్టాచార్య పేర్కొన్నారు.

దక్షిణ చైనా సముద్ర ప్రాంత పరిణామాలపై క్వాడ్ ఆందోళన

- డ్రాగన్ తీరుపై మండిపాటు

వాషింగ్టన్: దక్షిణ చైనా సముద్రంలో జరుగుతున్న పరిణామాలు క్వాడ్ దేశాలకు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో భౌగోళికంగా, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాంతాల్లో దక్షిణ చైనా సముద్రం ఒకటి. ఇక్కడ చైనా ఆక్రమణలకు పాల్పడడంతో పాటు ఇతర దేశాల నౌకాయాన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోంది. దీంతో చైనా చర్యలపై భారత్ సహా క్వాడ్ దేశాలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్ సభ్యులుగా ఉన్న క్వాడ్... ఈ సముద్ర మార్గాన్ని శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా ఉంచేందుకు కృషి చేస్తుందని జైశంకర్ స్పష్టం చేశారు.

ప్రమాదకర పరిస్థితులపై ఆగ్రహం

దక్షిణ, తూర్పు చైనా సముద్రాల్లో జరుగుతున్న ఆక్రమణలపై క్వాడ్ సభ్య దేశాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రస్తుత స్థితిని మార్చే చైనా ఏకపక్ష చర్యలపై మండిపడ్డాయి. నేవీ, విమానాల స్వేచ్ఛకు అడ్డుపడటం, కోస్ట్ గార్డ్ నౌకలు, సైనిక విమానాల ద్వారా ప్రమాదకర పరిస్థితులను సృష్టించడాన్ని వ్యతిరేకించాయి. ఇవన్నీ ఈ ప్రాంతంలో శాంతి, భద్రతకు ముప్పుగా మారుతున్నాయని చెప్పాయి. వివాదాస్పద ద్వీపాల మిలిటరైజేషన్ పట్ల కూడా క్వాడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

నెలలు నిండకముందే 13%.. తక్కువ బరువుతో 17%

- భారత్‌లో జననాల గురించి తేల్చిన సర్వే

దిల్లీ: భారత్‌లో 13% చిన్నారులు నెలలు నిండక ముందే జన్మిస్తున్నారని ఓ సర్వే తేల్చింది. 17% పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని నిర్ధారించింది. ఈ పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటిగా వాయు కాలుష్యాన్ని పేర్కొంది. గర్భిణులు వాయు కాలుష్యం బారిన పడితే.. పుట్టబోయే పిల్లల్లో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉంటున్నాయో తెలుసుకునేందుకు ఐఐటీ దిల్లీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్-ముంబయిలతోపాటు బ్రిటన్, ఐర్లాండ్‌లోని కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన పరిశోధకులు ఈ సర్వేను నిర్వహించారు. 2019-21 మధ్య భారత్‌లో జరిగిన కాన్పులను ఇందులో భాగంగా విశ్లేషించారు. గర్భిణులు పీఎం 2.5 ధూళికణాలను ఎక్కువగా పీలిస్తే- పిల్లలు తక్కువ బరువుతో పుట్టే అవకాశాలు 40%, నెలలు నిండక ముందే జన్మించే ముప్పు 70% అధికంగా ఉంటున్నట్లు నిర్ధారించారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, దిల్లీ, పంజాబ్, హరియాణా వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో పీఎం 2.5 ధూళికణాల కాలుష్యం ఎక్కువ స్థాయిలో ఉందని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో 39%, ఉత్తరాఖండ్‌లో 27%, రాజస్థాన్‌లో 18%, దిల్లీలో 17% కాన్పులు నెలల నిండక ముందే జరిగినట్లు వెల్లడించారు. పంజాబ్‌లో అత్యధికంగా 22% మంది పిల్లలు తక్కువ బరువుతో జన్మించారని చెప్పారు. దాని తర్వాతి స్థానాల్లో దిల్లీ, దాద్రానగర్ హవేలీ, మధ్యప్రదేశ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ ఉన్నాయని పేర్కొన్నారు.

170 కేజీల బరువుతో జిమ్‌లో కసరత్తు.. అకస్మాత్తుగా గుండెపోటు

ఇంటర్నెట్ డెస్క్: హరియాణాలోని ఫరీదాబాద్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జిమ్‌లో కసరత్తు చేస్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. పంకజ్ శర్మ (37) దాదాపు 170 కిలోల బరువున్నారు. 4 నెలల క్రితం జిమ్‌లో చేరారు. మంగళవారం బ్లాక్ కాఫీ తాగి పుల్‌అప్స్ చేశారు. ఈ క్రమంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలారు. దీన్ని గమనించిన ఆయన స్నేహితులు నీళ్లు తాగించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత రెండుసార్లు సీపీఆర్ చేశారు. అయినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో ఆసుపత్రికి తరలించారు. పంకజ్ అప్పటికే ప్రాణాలు కోల్పోయారని వైద్యులు ధ్రువీకరించారు.